ఈనాడు కర్నూలు

గురువారం 4 జనవరి 2018 16 పేజీలు





**స్ఫూర్తి తరంగం.. క్రికెట్‌లో వీరంగం:** 'స్ప్రైట్ ఈనాడు ఛాంపియన్ క్రికెట్(ఈసీసీ) కప్ - 2017 పోటీలు ముగిశాయి. బుధవారం తుదిపోటీల్లో కోడుమూరు, ఆదోని జట్లు సత్తా చాటి విజేతలుగా నిలిచాయి. బహుమతుల ప్రదానోత్సవంలో ఆర్ఐవో పరమేశ్వరరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సాయికృష్ణ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ రోశిరెడ్డి, గౌరవ సలహాదారు గోవర్ధన్ రెడ్డి, నారాయణ విద్యాసంస్థల ఎగ్జిక్యూటివ్ డీన్ లింగేశ్వర్‌రెడ్డి, 'ఈనాడు' యూనిట్ ఇన్‌ఛార్జి రాజేందర్ పాల్గొన్నారు. 3లో

# సుగ్గి.. ప్రాణాలాగ్గి..



వాహనం టైరు పేలి ప్రమాదం

ఏడుగురు మృత్యువాత

11 మందికి తీవ్ర గాయాలు

కొత్తపల్లిలో విషాదం

సంఘటనా స్థలం..

సేవల్లో పోలీసులు



**ప్రయాణం :** నల్గొండ జిల్లా డోర్‌పల్లి నుంచి హొళగుంద మండలం కొత్తపేట గ్రామానికి
**ప్రయాణ దూరం:** 500 కి.మీ.
**బయలుదేరిన సమయం:** మంగళవారం సాయంత్రం 5 గంటలకు
**ప్రయాణికుల సంఖ్య:** 18
**వాహన నెంబరు:** ఏపీ21 వై 5669
**రాత్రి భోజనాలు:** జడ్చర్ల సమీపంలో 9 గంటలకు (అదే సమయంలో టైరు పంక్చర్ అయింది)
**తేనీరు తీసుకున్నది:** బుధవారం తెల్లవారు జామున 4 గంటల సమయంలో కర్నూలు చెక్‌పోస్టు వద్ద
**కాసేపు విశ్రాంతి :** 5 గంటల సమయంలో కోడుమూరు వద్ద
**ప్రమాదం:** 7.30 గంటల సమయంలో ఆస్పరి మండలం చిన్నహోతూరు గ్రామం వద్ద
**స్వగ్రామానికి ఉన్న దూరం:** 38 కి.మీ.
**కారణం:** ఉదయం నుంచి విశ్రాంతి లేకపోవడమూ ప్రమాదానికి ఓ కారణమని అధికారులు పేర్కొంటున్నారు. మరోవైపు వాహన టైర్లు రీబటన్ టైర్లుగా గుర్తించారు. టైర్లు నాణ్యత లేకపోవడమూ ప్రమాదానికి మరో కారణమని చెబుతున్నారు.

పొట్టకూటికి ఊరు విడిచి వలస బాట పట్టారు
ఊరుకాని ఊర్లో అయిన వారికి దూరంగా తలదాచుకున్నారు
ఎముకలు కొరికే చలిలో రహదారుల పక్కన నిద్రించారు
పగలు, రాత్రి అన్న తేడా లేకుండా రెక్కలు ముక్కలు చేసుకుని కష్టపడ్డారు
రూపాయి రూపాయి పోగుచేసుకున్నారు
తిండిగింజలు ఉంటే గొడ్డు కారం తిని బతకొచ్చని ఆశపడ్డారు
సంపాదించిన దాంట్లో కొంత సొమ్ముతో బియ్యం కొన్నారు
పనులు ముగించుకుని సంతోషంగా ఊరి బాట పట్టారు
కుమార్తెకు పెళ్లి చేయాలని ఒకరు..
కుమారుడికి సంపాదించిన సొమ్ము ఇవ్వాలని మరొకరు
కుటుంబ అవసరాలు తీర్చాలని ఇంకొకరు
ఇలా ఎవరికి వారు కలలు కంటూ ప్రయాణం సాగించారు
అంతలోనే అనుకోని ప్రమాదం.. వారి పాలిట మృత్యు పాశమైంది.
ఒకరు కాదు.. ఇద్దరు కాదు.. ఏకంగా ఏడుగురు అనంతలోకాలకు వెళ్లిపోయారు.

మరిన్ని వివరాలు 2, 7లో




హనుమంతమ్మ, బళ్లారి శేకమ్మ, కోసిగి నర్సమ్మ, కోసిగి ఈరమ్మ, గోవిందమ్మ, నారాయణప్ప, మంగమ్మ (మృతుల పాతచిత్రాలు)

# నెరవేరిన ఆళ్లగడ్డవాసుల కల

ఐదో అదనపు జిల్లా న్యాయస్థానం ఏర్పాటుకు హైకోర్టు ఉత్తర్వులు

పెద్ద కేసుల విచారణ ఇక్కడే



ఆళ్లగడ్డ న్యాయస్థానం

**ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే:** ఆళ్లగడ్డలో అదనపు జిల్లా న్యాయస్థానం ఏర్పాటుకు రాష్ట్ర హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. నంద్యాలలో ఉన్న ఐదో అదనపు జిల్లా న్యాయస్థానాన్ని ఆళ్లగడ్డకు కేటాయించారు. జిల్లాలో ఇంతవరకు అదనపు జిల్లా న్యాయస్థానాలు కర్నూలు, ఆదోని, నంద్యాలలో మాత్రమే ఉన్నాయి. ఇక ఆళ్లగడ్డలోనూ జిల్లా అదనపు న్యాయస్థానం అందుబాటులోకి వస్తుండడం విశేషం. దీంతో ఆళ్లగడ్డలోనే పెద్ద కేసుల విచారణ జరగబోతోంది. ఆళ్లగడ్డ న్యాయచరిత్రలో ఇది ఓ నూతనాధ్యాయంగా భావించవచ్చు. అదనపు జిల్లా న్యాయస్థానం ఏర్పాటుకు కావాల్సిన ముందస్తు చర్యలను బుధవారం నంద్యాల 3వ అదనపు జిల్లా న్యాయమూర్తి షేక్ ఇంతియాజ్ అహ్మద్ పర్యవేక్షించారు. ఆళ్లగడ్డ న్యాయమూర్తులు నరేష్, దివాకర్‌తో కలిసి (మిగతా 10లో)

# కాసులకు కార్పొరేట్ వల

ప్రభుత్వాస్పత్రికి వచ్చిన రోగులను దారి మళ్లిస్తున్న వైనం


కమీషన్ల కక్కుర్తితో పెద్దాస్పత్రి సిబ్బంది సహకారం

*ఈనాడు డిజిటల్ - కర్నూలు:* వైద్యం వ్యాపారంగా మారింది. రోగులను కార్పొరేట్ ఆసుపత్రి గడపతొక్కేలా విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనిచేసే సిబ్బందికి కమీషన్ల వల విసిరి మాయమాటలతో అక్కడ చేరిన రోగులను దారి మళ్లిస్తున్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'ఎన్టీఆర్ వైద్య సేవ' పథకం ద్వారా వచ్చే నిధులు అధిక సంఖ్యలో మెక్కేస్తున్నారు. గతంలో ఆరోపణలు వచ్చినప్పుడు యంత్రాంగం స్పందించినా మళ్లీ పరిస్థితి మామూలైపోయింది.

## ఎన్నో ఆరోపణలు.. చర్యలు శూన్యం

ఈ వ్యవహారం అంతా పూర్తిగా పరిశీలిస్తే.. రోగి షేక్‌షావలి ప్రభుత్వాసుపత్రికి వచ్చిన సమయంలో అక్కడున్న క్వాలిఫైడ్ సహాయ ప్రొఫెసర్ ఒకరు యాంజియోగ్రామ్ చేశారు. కార్పొరేట్ ఆసుపత్రిలో అదే రోగికి స్టంట్లు వేసింది (మిగతా 10లో)




గత అక్టోబరు 6న కర్నూలుకు చెందిన షేక్ షావలి(70) గుండె సమస్యతో కర్నూలు సర్వజన ఆసుపత్రిలో చేరారు. 7వ తేదీ ఎంఐ తోపాటు యాంజియోగ్రామ్ చేసి రెండు స్టంట్లు వేయాల్సి ఉందని సంబంధిత వైద్యులు నిర్ధరించారు. రేషన్‌కార్డు డబ్ల్యూఏపీ 138206700174/01 కింద తొలి ప్యాకేజీకి ఎన్టీఆర్ వైద్యసేవ రోగికి వర్తించింది. ఇలా ప్రభుత్వ పెద్దాసుపత్రిలో చేరిన రోగిని నగరంలోని ఓ కార్పొరేట్ ఆసుపత్రిలో చేర్పించి 25న రెండు స్టంట్లు వేసి ఎన్టీఆర్ వైద్యసేవ నుంచి వచ్చే నిధులు రూ.85 వేల వరకు లాగేసుకున్నారు.

# ప్రమాద సంఘటన బాధాకరం

-కేఈ కృష్ణమూర్తి, ఉప ముఖ్యమంత్రి


**ఆస్పరి, న్యూస్‌టుడే :** చిన్నహోతూరు సమీపంలో జరిగిన ఘోర రహదారి ప్రమాద ఘటన చాలా బాధాకరమని ఉపముఖ్యమంత్రి కేఈ కృష్ణమూర్తి ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన ఆలూరు నుంచి కర్నూలుకు వెళ్తూ ప్రమాద ఘటన వద్ద ఉన్న ఎస్పీ గోపినాథ్ జెట్టితో కాసేపు మాట్లాడారు. ఈ సందర్భంగా ఎస్పీ ప్రమాద వివరాలను ఉప ముఖ్యమంత్రికి వివరించారు. గత రెండు రోజుల్లో జరిగిన రెండు ప్రమాదాల్లో 11 మంది మృత్యువాత పడటం బాధాకరమన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉంటూ సురక్షితమైన ప్రయాణాలు చేయాలని సుచించారు. ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించరాదన్నారు. రహదారి ప్రమాదాలను అరికట్టడానికి చర్యలు చేపట్టామని ఉపముఖ్యమంత్రికి చెప్పారు.



ఉపముఖ్యమంత్రి కేఈ కృష్ణమూర్తికి ఘటన గురించి చెబుతున్న ఎస్పీ గోపినాథ్ జెట్టి

### ప్రజలు చైతన్యవంతం కావాలి: ఎస్పీ

**ఆస్పరి, న్యూస్‌టుడే :** ప్రమాదాలు జరగకుండా ఉండటానికి ప్రజలు చైతన్యవంతం కావాలని ఎస్పీ గోపినాథ్ జెట్టి పిలుపు నిచ్చారు. బుధవారం ఆస్పరి సమీపంలో జరిగిన రహదారి ప్రమాద ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ ప్రమాదం జరగడం చాలా బాధాకరమన్నారు. ప్రజలు సరకులు తీసుకెళ్లే వాహనాల్లో ప్రయాణాలు చేయడం మంచి కాదన్నారు. అంతేకాక సరైన శిక్షణ లేని డ్రైవర్లు, విశ్రాంతి తీసుకోకుండా వాహనాలను నడపడం వల్ల ప్రమాదాలకు అవకాశం ఏర్పడుతోందన్నారు. గత రెండు రోజులుగా జరిగిన ప్రమాదాలను గమనిస్తే అధికలోడుతో వెళ్లడం కూడా ప్రమాదానికి మరో కారణంగా చెప్పుకోవచ్చు. ఇప్పటికే రహదారి ప్రమాదాలపై అవగాహన సదస్సులు పెట్టి ప్రజలను అప్రమత్తం చేస్తున్నామని తెలిపారు. కండిషన్‌లేని వాహనాలను తిరగడం వల్ల ఇలాంటి చిన్న ప్రమాదాలే పెద్ద ప్రాణనష్టాన్ని మిగిలిస్తున్నాయన్నారు. తొందరగా గమ్యస్థానం చేరుకోవాలని ఆటోలు, లారీలు వంటి వాహనాలను ఆశ్రయించి ప్రాణం మీదికి తెచ్చుకుంటున్నారన్నారు. ఇప్పటికైనా ప్రజలు చైతన్యవంతం అయి సురక్షిత ప్రయాణం చేయాలని కోరారు. ఈ సందర్భంగా డీఎస్పీ ప్రసాద్ మాట్లాడారు. ఈరోజు 194 వాహనాలను సీజ్ చేసినట్లు తెలిపారు. ఆలూరు సీఐ అబ్దుల్‌గౌస్, ఎస్సై ధనుంజయ పోలీసులు తదితరులు పాల్గొన్నారు.



కొత్తకోట గ్రామం విహంగ వీక్షణం

## ఊరు ఖాళీ.. బతుకు ఎగతాళి

**హొళగుంద, న్యూస్‌టుడే :** మండలంలోని కొత్తపేట గ్రామంలో సుమారు 80 కుటుంబాలు, 425 జనాభా ఉంది. ఈ గ్రామానికి సరైన రవాణా సౌకర్యం సైతం లేదు. ఈ గ్రామాలు నేటికీ బస్సు ముఖం చూడలేదంటే అతిశయోక్తి కాదు. ఇప్పుడు జరిగిన ప్రమాదంలో మృతి చెందిన వారంతా నిరుపేద కుటుంబాలకు చెందిన వారే కావడం గమనార్హం. వీరిలో ఎవరికీ ఎకరాకు మించి పొలం లేదు. అంతేకాక నీటి లభ్యత లేని కొండ ప్రాంతం కావడంతో ఆ పొలాల్లో సైతం వర్షం పడితేనే పంటలు పడేది. కొన్నేళ్లుగా అతివృష్టి, అనావృష్టి వల్ల గ్రామానికి చెందిన రైతులు ఆర్థికంగా నష్టపోయారు. స్థానికంగా పొట్టనింపే ఉపాధి దొరకక పోవడంతో వలసలు తప్పడం లేదు. గ్రామంలో నిరక్షరాస్యత అధికంగా ఉండటంతో కూలి పనులు తప్ప వేరేది ఏదీ తెలియదు. అలా బతుకు దెరువు కోసం వెళ్లి మృత్యువాత పడ్డారు.

### స్థానికంగా ఉపాధి బరువు



మృతులు నారాయణ, స్రవంతి పూరిళ్లు వద్ద ఆందోళనలో బంధువులు

గ్రామంలో గత రెండు నెలల నుంచి ఉపాధి పనులు జరగడం లేదని మృతుల బంధువులు ఆరోపిస్తున్నారు. అంతేకాక పనులకు వెళ్లినా.. గిట్టుబాటు కాని కూలీతో సంసారాన్ని నెట్టుకురాలేక కుంటుంబాలకు కుంటుంబాలే వలస వెళ్లినట్లు గ్రామస్థులు తెలిపారు. వీరు తెలంగాణలోని నల్గొండకు వలస వెళ్లడం గమనార్హం. అక్కడ పత్తి పొలంలో ఉపాధి దొరుకుతుండటంతో పాటు ఒక్కొక్కరి రోజుకు రూ. 350 నుంచి రూ. 500 వరకు కూలీ పడుతోందని కూలీలు తెలిపారు. స్థానికంగా ఉపాధి లభిస్తే కొందరైనా ఇంటిపట్టునే ఉండి పనులు చేసుకునే వారని.. ఇంతటి ఘోరం జరిగేది కాదని మృతుల బంధువులు, గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### డబ్బులు సకాలంలో రాక పనులపై అనాసక్తి

కొత్తపేట గ్రామం ఉపాధి పనుల పరంగా నెరణికి పంచాయతీ పరిధిలోకి వస్తుందని ఏపీవో శ్రీనివాసులు తెలిపారు. ఆ పంచాయతీ పరిధిలో రెండు గ్రామాలకు కలిపి సుమారు రూ. 2.75 కోట్ల విలువ గల పనులు, 1,12,919 పని దినాలు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. కూలీలు ఉపాధి పనులపై ఆసక్తి చూపడం లేదు. అంతేకాక కొలతల ప్రకారం కూలీలు ఇస్తుండటంతో తమకు గిట్టుబాటు కావడం లేదన్న భావన వారిలో నెలకొంది. అంతేకాక ఉపాధి పనులు పూర్తి చేసిన తర్వాత వారాలైనా వేతనాలు అందకపోవడంతో విసిగిపోయిన కూలీలు వలసబాట పడుతుండటం గమనార్హం. జిల్లా అధికారులు ఈ విషయాలపై దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

# రహదారులపై రక్తాశ్రువులు

**కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే:**

☛ 2014, జులై 17న ఆదోని సమీపంలో కర్ణాటక బస్సు, ఆటోను ఢీకొన్న ప్రమాదంలో ఐదుగురు మృతి చెందగా, ముగ్గురికి గాయాలయ్యాయి.

☛ 2015, మే 26న హెబ్బహళ్లి వద్ద తుపాను వాహనం రహదారి ప్రమాదాని గురై ఒక కుటుంబానికి చెందిన ఆరుగురు మృత్యువాత పడగా, ఆరుగురు గాయపడ్డారు.

☛ 2015లోనే చాగలమర్రి వద్ద బొలెరో వాహనం ఇంట్లోకి దూసుకెళ్లిన దుర్ఘటనలో మహారాష్ట్రకు చెందిన ఆరుగురు దుర్మరణం పాలయ్యారు.

☛ 2016, జనవరి 16న వెల్దుర్తి పరిధిలో మల్లేపల్లి స్టేజీ వద్ద ఇన్నోవా వాహనం డివైడర్‌ను ఢీకొన్న ప్రమాదంలో ఆరుగురు మృతి చెందారు. ఒకే కుటుంబానికి చెందిన వ్యక్తులు ఐదుగురు కాగా, ఒకరు డ్రైవర్ ఉన్నారు.

☛ 2016, అక్టోబర్ 14న చాగలమర్రి వద్ద ఆదుపు తప్పి వాహనం బోల్తా పడి నలుగురు మృతి చెందగా, ఇద్దరు గాయపడ్డారు.

☛ 2017, అక్టోబర్ 18న బత్తలూరు వద్ద మట్టికుప్పను కారు ఢీకొని ముగ్గురు దుర్మరణం చెందారు.

☛ 2017, జులై 11న కర్నూలు నగర శివారులో వెంకటరమణ కాలనీ హైవేపై జరిగిన రహదారి ప్రమాదంలో ముగ్గురు మృతి చెందారు.

| తేదీ | మృతులు | క్షతగాత్రులు |
|---|---|---|
| జనవరి 1న | 06 | 00 |
| 2న | 05 | 12 |
| 3న | 07 | 11 |

ఇలా ఏటా జిల్లాలో భారీ రోడ్డు ప్రమాదాలు జరుగుతుండగా ఎంతోమంది ప్రాణాలు కోల్పోతున్నారు. దాదాపు అన్ని దుర్ఘటనలకు ప్రధాన కారణం అతివేగమే. ఈ తీవ్ర తప్పిదం వల్ల ఎన్నో కుటుంబాలు నష్టపోతున్నా వాహన చోదకుల్లో మార్పు రావటం లేదు.

### కూలీలు, పెళ్లి బంధువులకు శాపం

జిల్లాలో నిరుపేద కూలీలు సకాలంలో పనికి వెళ్లేందుకు ఆటోలు, ట్రాక్టర్లలో ఎక్కువగా ప్రయాణం చేస్తున్నారు. సామర్థ్యానికి మించి ఎక్కువ మంది ప్రయాణం చేయటం, డ్రైవర్లు అర్హులు కాకపోవటం వల్ల రహదారి ప్రమాదాల్లో ఎక్కువమంది మృత్యువాత పడుతున్నారు. జిల్లాలో జరిగిన ఇలాంటి ఈ ప్రమాద ఘటనలతో ఎంతోమంది చిన్నారులు అనాథలుగా మారారు. గ్రామాల్లో, ఇతర ప్రాంతాల్లో పెళ్లిళ్లకు వెళ్లేందుకు పెళ్లి పెద్దలు ఇప్పటికీ ట్రాక్టర్లు, లారీలను ఏర్పాటు చేస్తున్నారు. తక్కువ ఖర్చు, ఎక్కువ మంది ప్రయాణించేందుకు అనువుగా ఉంటుందని వీటిని ఎంచుకుంటున్నారు. శుభకార్యం కావటంతో డ్రైవర్ మద్యం తాగటం వల్ల రోడ్డు ప్రమాదాలు జరిగి అధిక సంఖ్యలో మృత్యువాత పడుతున్నారు. పోలీసులు ఇలాంటి ప్రయాణాలు నివారిస్తే భారీ ప్రమాదాలు అరికట్టేందుకు అవకాశం ఉంటుంది.

### వాహనాల నిర్వహణ అధ్వానం

వాహనాల్లో ఏ చిన్న లోపం ఉన్నా దాని పరిణామం తీవ్రంగా ఉంటుంది. ప్రధానంగా రహదారి ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువ. వాహనాల నిర్వహణకు సంబంధించి తనిఖీ చేసే దిక్కులేదు. కనీసం అధిక సంఖ్యలో ప్రయాణించే ఆటోలనుగాని, భారీ వాహనాలనుగాని తనిఖీ చేయటం లేదు. తనిఖీ చేయని కారణంగానే వాహన నిర్వాహకులు అవకాశంగా చేసుకుని టైర్లు అరిగిపోయినా, సామర్థ్యం లేకపోయినా వాహనాలను రోడ్లపై తిప్పుతున్నారు. కర్నూలు నగరంలో కాలం చెల్లిన లారీలతో రేషన్ బియ్యం రవాణా చేయిస్తున్నారు. గతంలో సామర్థ్యం లేని లారీలు ఢీకొని ఇద్దరు మృత్యువాత పడ్డారు. మృతుల్లో ఓ కానిస్టేబుల్ తల్లి ఉన్నారు. జిల్లా కేంద్రంలోనే పరిస్థితి ఈవిధంగా ఉంటే ఇతర ప్రాంతాల్లో ఏవిధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

## రెండేళ్ల బాలుడి అపహరణకు యత్నం

-చిన్నారి ఏడుపుతో గుర్తించిన స్థానికులు

**వెల్దుర్తి, న్యూస్‌టుడే:** స్థానిక బజీ నగర్‌లో బుధవారం రాత్రి రెండేళ్ల బాలుడు మహమ్మద్ షఫిక్‌ను అపహరించేందుకు గుర్తుతెలియని వ్యక్తులు ప్రయత్నించారు. వివరాల్లోకి వెళితే.. ఖాశిం, హసీనాలకు ముగ్గురు సంతానం. ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు. అతను ఆటో చోదకునిగా జీవనం సాగిస్తున్నారు. బుధవారం ఇంటి సమీపంలో ఆడుకొంటున్న చిన్నారి మహమ్మద్ షఫిక్ ఉన్నట్టుండి కనిపించకపోయాడు. వెంటనే పలు ప్రాంతాల్లో తల్లిదండ్రులు, ఇరుగు పొరుగు వెతికారు. జనసంచారంలేని ఓ ప్రాంతంలో ఆ బాలుడు ఏడుస్తూ ఉండటాన్ని స్థానికురాలు ఎల్లమ్మ గుర్తించింది. ఆ చిన్నారిని తీసుకొచ్చి ఆ తల్లిదండ్రులకు అప్పగించింది. జనసంచారంలేని ఆ ప్రాంతానికి బాలుడు ఏవిధంగా వెళ్లి ఉంటాడని అందరూ అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఉద్దేశపూర్వకంగానే ఎవరైనా తీసుకెళ్లి ఉండవచ్చని అనుకొంటున్నారు. ఈ విషయంపై కాలనీ వాసులు పోలీసు స్టేషన్‌ను ఆశ్రయించి ఇదే విషయమై సమాచారం ఇచ్చారు.



కుటుంబసభ్యుల చెంతకు చేరిన మహమ్మద్‌షఫిక్

## ప్రమాదవశాత్తు వలసకూలీ మృతి

**వెల్దుర్తి, న్యూస్‌టుడే:** వెల్దుర్తికి చెందిన శివుడు కూలి పనులకు వలస వెళ్లి ప్రమాదవశాత్తు మృతిచెందాడు. వివరాల్లోకి వెళితే.. ఇతను గ్రామంలో పనులు దొరకకపోవడంతో గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం మంగళగిరి గ్రామానికి పనిచేసేందుకు వెళ్లాడు. అక్కడ ప్రమాదవశాత్తు మెట్ల నుంచి కిందపడ్డాడు. గాయపడిన అతనిని చికిత్స నిమిత్తం వైద్యశాలకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు. ఈ విషయం తెలిసి ఆ కుటుంబసభ్యులు తీవ్ర మనోవేదనకు గురయ్యారు. దహన సంస్కారాల నిమిత్తం అతని మృతదేహాన్ని బుధవారం వెల్దుర్తికి తీసుకొచ్చారు. మృతునికి భార్య లక్ష్మీదేవి, కుమార్తె వైష్ణవి, కుమారులు సతీష్, హర్షవర్ధన్ ఉన్నారు.



శివుడు (పాతచిత్రం)



| Name of the Scheme | Amrut Grant | General Fund |
|---|---|---|
| No. of Works | 01 | 05 |
| Bid Document download Starting date | 05/01/2018 at 5:30 P.M | |
| Bid Document download end date | 12/01/2018 at 4:00 P.M | |
| Last Date & Time for receipt of Bids | 12/01/2018 at 5:00 P.M | |
| Commercial Bid Opening Date | 12/01/2018 at 6:00 P.M | |
| Name & Address of the Concerned Officer | Commissioner, Kurnool Municipal Corporation, Kurnool. Ph.No.08518-221847, Fax: 08518-221764 | |




రన్నర్స్ ట్రోఫీతో కేవీఆర్ఎం కళాశాల, ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ డిగ్రీ కళాశాల జట్లు




విన్నర్స్ ట్రోఫీతో ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ జూనియర్ కళాశాల, కేవీఆర్ఎం డిగ్రీ కళాశాల(కోడుమూరు) జట్లు

# పోరు ముగిసింది.. స్ఫూర్తి గెలిచింది

- విజేతలుగా కోడుమూరు.. ఆదోని జట్లు
- ఉత్కంఠగా "స్ప్రైట్ ఈసీసీ కప్ -2017" తుదిపోటీలు

క్రీడా స్ఫూర్తి వెల్లివిరిసింది.. యువ నైపుణ్యం వెలుగుచూసింది.. ఉత్కంఠకు వేదికగా క్రికెట్ అభిమానులకు పండగలా సాగిన 'స్ప్రైట్ ఈనాడు ఛాంపియన్ క్రికెట్ (ఈసీసీ) కప్ - 2017 పోటీలు ముగిశాయి. బుధవారం సెమీఫైనల్స్, ఫైనల్స్ పోటీలు జరగ్గా గెలుపు కోసం ఇరు జట్ల క్రీడాకారులు నువ్వానేనా అన్నట్లు తలపడ్డాయి. బ్యాట్స్‌మెన్ పరుగుల ప్రవాహం సృష్టిస్తే.. బౌలర్లు కీలక సమయంలో వికెట్లు పడగొడుతూ పోటీలను రసవత్తరంగా మార్చారు. చివరకు అన్నిరంగాల్లో రాణించిన కోడుమూరు, ఆదోని జట్లు విజేతలుగా ఆవిర్భవించాయి. పోటీలకు ప్రధాన స్పాన్సర్‌గా స్ప్రైట్, నారాయణ విద్యాసంస్థలు వ్యవహరిస్తుండగా, జిల్లా స్పాన్సర్‌గా శ్రీ సాయి కృష్ణ డిగ్రీ కళాశాల వ్యవహరించింది. క్రీడాకారులకు అత్యవసర సేవలను ఎస్‌జే ఆసుపత్రి అందించింది.





ఫైనల్ పోటీ సందర్భంగా క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న కర్నూలు వైద్య కళాశాల ప్రిన్సిపల్ డా.రామప్రసాద్

## రసవత్తరంగా సీనియర్స్ పోటీ

**కర్నూలు వైద్య కశాశాల మైదానం :** ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ డిగ్రీ కళాశాల, కోడుమూరు శ్రీవివేకానంద డిగ్రీ కళాశాల జట్ల మధ్య జరిగిన తుదిపోరు నరాలు తెగే ఉత్కంఠత రేపింది. మొదట ఆదోని జట్టు 15 ఓవర్లలో 114 పరుగులు చేసింది. ఇందులో పృథ్వీ 19 బంతుల్లో 6 ఫోర్లతో 30 చేశారు. ప్రత్యర్థి జట్టులో అలీ 13 పరుగులకు 4, వెంకటేష్, శేషులు చెరో రెండు వికెట్లు తీశారు. అనంతరం బరిలోకి దిగిన కోడుమూరు జట్టు 14.2 ఓవర్లలో ఆరు వికెట్లు కోల్పోయి విజయాన్ని అందుకుంది. ఓ దశలో విజయం రెండు జట్ల మధ్య దోబూచులాడింది. ఐదు ఓవర్లకు కోడుమూరు సాధించాల్సిన రన్‌రేట్ 10 వరకు వచ్చింది. చివరి వరకు నిలిచిన వలి 21 బంతుల్లో నాలుగు ఫోర్లతో 30 పరుగులు సాధించి జట్టుకు విజయాన్ని అందించాడు. రామకృష్ణ 20 బంతుల్లో 4 ఫోర్లతో 32 పరుగులు సాధించారు. ప్రత్యర్థి జట్టులో సాగర్ 3, పృథ్వీరాజ్ 2 వికెట్లు తీశారు. సీనియర్స్ ట్రోఫీని దక్కించుకోవాలన్న కోడుమూరు కల 11 సంవత్సరాల తరువాత నెరవేరింది.



పోటీల్లో సేవలందించిన అంపైర్లు

## జూనియర్స్ ట్రోఫీ విజేత ఆదోని

**ఎస్టీబీసీ కళాశాల మైదానం :** కోడుమూరు కేవీఆర్ఎం జూనియర్ కశాశాల, ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ జూనియర్ కళాశాల జట్ల మధ్య తుదిపోరు జరిగింది. సమష్టిగా రాణించిన ఆదోని జట్టునే విజయం వరించింది. మొదట బ్యాటింగ్ చేసిన ఆదోని నిర్ణీత ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 79 పరుగులు చేసింది. రాముడు 20, యువరాజు 14 పరుగులు చేశారు. కోడుమూరు జట్టు పరుగుల వేటలో వెనుకబడి 69 పరుగులకే కుప్పకూలింది. మనోహర్ 14, హరి 10 పరుగులు చేశారు. ఆదోని జట్టులో ఈరన్న 3 వికెట్లు తీశాడు.

## సెమీఫైనల్స్ పోరు ఇలా..

★ ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్, నంద్యాల ఎస్వీఆర్ ఇంజినీరింగ్ కళాశాల జట్లు తలపడగా ఆదోని 6 వికెట్ల నష్టానికి 82 పరుగులు చేయగా నంద్యాల జట్టు 45 పరుగులే చేసింది. మరోమ్యాచ్‌లో కేవీఆర్ఎం జూనియర్ కళాశాల కోడుమూరు ఐదు వికెట్ల నష్టానికి 82 పరుగులు చేయగా ఈఎస్‌సీ ప్రభుత్వ పాలిటెక్నిక్ నంద్యాల జట్టు 72 పరుగులే చేసింది.

★ **ఎస్టీబీసీ కళాశాల మైదానం :** శ్రీ వైష్ణవి డిగ్రీ కళాశాల డోన్ ఐదు వికెట్ల నష్టానికి 52 పరుగులు చేయగా కేవీఆర్ఎం డిగ్రీ కళాశాల కోడుమూరు జట్టు వికెట్ నష్టపోకుండా 53 పరుగులు చేసింది. మారో మ్యాచ్‌లో ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ జూనియర్ కశాశాల జట్టు 56 పరుగులు చేయగా కేవీ సుబ్బారెడ్డి కాలేజ్ ఆఫ్ పాలిటెక్నిక్ కర్నూలు జట్టు 55 పరుగులు చేసి ఒక్క పరుగు తేడాతో ఓటమి చవిచూసింది.

## చదువుతోపాటు క్రీడలకు ప్రాధాన్యం

**- ఆర్ఐవో పరమేశ్వరరెడ్డి**

క్రీడల్లో రాణించిన క్రీడాకారులు చదువుల్లో సైతం రాణిస్తున్నారని ఆర్ఐవో పరమేశ్వరరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. కేఎంసీ మైదానంలో బహుమతి ప్రదానోత్సవం ఈనాడు కర్నూలు యూనిట్ ఇన్‌ఛార్జి రాజేందర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి చదువు, క్రీడలకు సమప్రాధాన్యం ఇవ్వాలన్నారు. రాజేందర్ మాట్లాడుతూ 2006లో యువ క్రీడాకారులను వెలుగులోకి తీసుకురావడం కోసం ఈసీసీ కప్పు ప్రారంభమైందని, ప్రతి ఏడాది పోటీల్లో పాల్గొనే కళాశాలల సంఖ్య పెరుగుతోందన్నారు. పది రోజులపాటు జరిగిన ఈ పోటీల్లో 91 జట్లు 1,365 మంది క్రీడాకారులు పాల్గొన్నారని వెల్లడించారు. ఇక్కడ గెలుపొందిన క్రీడాకారులు అనంతపురంలో జరిగే ప్రాంతీయ పోటీల్లో పాల్గొంటారన్నారు. సాయికృష్ణ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ రోసిరెడ్డి మాట్లాడుతూ ఈసీసీ కప్ 2017 కర్నూలునే వరించాలని అకాంక్షించారు. ఆ కళాశాల గౌరవ సలహాదారుడు గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ పోటీల్లో పాల్గొన్న ప్రతి క్రీడాకారుడి స్ఫూర్తిని అభినందించారు. నారాయణ విద్యాసంస్థల ప్రతినిధి లింగేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ ఓటమితో ఏఒక్కరూ కుంగిపోవాల్సిన అవసరం లేదన్నారు. పోటీలకు వ్యాఖ్యాతగా సిల్వర్‌జూబ్లీ కళాశాల ఆంగ్ల అధ్యాపకుడు డా. కన్నా వ్యవహరించారు. అంపైర్లుగా అరుణ్, ప్రకాష్, ఖలీల్, యూసుఫ్, భాస్కర్, సుభాన్, రాజశేఖర్, వీర, సాహిద్, శ్రావణ్, పీరు, లూయిద్ వ్యవహరించారు.



### ప్రాంతీయ పోటీలపై దృష్టి

**- రామకృష్ణ, కేవీఆర్ఎం డిగ్రీ క్రీడాకారుడు**

ఏ మ్యాచ్‌నూ తేలికగా తీసుకోలేదు. ప్రణాళికతో ఆడి కప్పు సాధించాం. ప్రాంతీయ స్థాయి పోటీల్లో సత్తాచాటడమే మా ముందున్న లక్ష్యం. కప్ అందుకున్న క్షణం మాకు పండగే! మొత్తం మూడు మ్యాచ్‌లో 114 పరుగు సాధించి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించినందుకు ఆనందంగా ఉంది.



### ప్రణాళిక అమలు చేశాం

**- అలీబాషా, కోడుమూరు జట్టు నాయకుడు**

ఈనాడు సీనియర్స్ ట్రోఫీ సాధించాలన్నదే కళాశాల కల. ఇందుకు 11 సంవత్సరాల పాటు సుదీర్ఘంగా నిరీక్షించాం. ప్రతి మ్యాచ్‌కు ప్రణాళికలు రుపొందించాం. వాటిని పక్కగా అమలు చేయడం.. ఫలితం రావడంతో ట్రోఫీ అందుకోవడం సులభతరమైంది.. ఇదే ప్రణాళికలు వచ్చే ప్రాంతీయ పోటీల్లో అమలుచేస్తాం.



### యువ క్రీడాకారులకు వరం

**- నాగరాజు, క్రీడాకారుడు**

ఈనాడు ఛాంపియన్ ట్రోఫీ యువ క్రీడాకారులకు వరం లాంటింది. ప్రతిభ ఉన్న క్రీడాకారులు వెలుగులోకి రావడానికి ఈ పోటీలే వేదికగా నిలుస్తున్నాయి. గ్రామీణ క్రీడాకారులు సత్తా చాటడానికి ఇదే అవకాశం. జిల్లా స్థాయిలో విజేత జట్టు ప్రాంతీయ, రాష్ట్రస్థాయి పోటీల్లో రాణిస్తే రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యే అవకాశాలు ఉంటాయి.

# ప్రజా సేవకులమన్న విషయం మరవొద్దు

**ముత్యాలపాడు (చాగలమర్రి), న్యూస్‌టుడే:** ప్రజాసేవకులమన్న విషయాన్ని మరవకూడదని మంత్రి అఖిలప్రియ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం మండలంలోని ముత్యాలపాడు గ్రామంలో జరిగిన జన్మభూమి మాఊరు కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. గ్రామ తెదేపా నాయకులు, మండల నాయకులు ఆమెకు ముందుగా స్వాగతం పలికారు. రైతుల సంప్రదాయం ప్రకారం ఎద్దులబండిపై ఉత్సవంలా ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన సభలో గ్రామస్థులు పలు సమస్యలు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. అధికంగా అధికారుల పనితీరుపై ఫిర్యాదు చేశారు. గ్రామంలో గృహనిర్మాణశాఖ అధికారుల పనితీరు, వారు సమాధానం కూడా సరిగా ఇవ్వని తీరుపై మంత్రి ముందు వాపోయారు. స్పందించిన మంత్రి గృహనిర్మాణశాఖ ఏఈ నారాయణ మూర్తిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ అధికారులు ప్రజా సేవకులు అన్న విషయం మరిచిపోకూడదని, మరోసారి ఇలా జరిగితే చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామానికి బస్సు సౌకర్యం లేదని, రాత్రి వేళల్లో చాగలమర్రి కానీ, ఆళ్లగడ్డ కానీ వెళ్లేందుకు బస్సులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్థులు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే స్పందించిన మంత్రి ఆళ్లగడ్డ డీఎంతో చరవాణిలో మాట్లాడారు. మరో రెండ్రోజుల్లో గ్రామానికి బస్సును ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ జన్మభూమి కార్యక్రమాల ద్వారా ప్రజలకు మరింత చేరువై వారి సమస్యలను ప్రస్తుత ప్రభుత్వం పరిష్కరిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో ఆళ్లగడ్డ మార్కెట్‌యార్డు ఛైర్మన్ బీవీరామిరెడ్డి, మండల నోడల్ అధికారి సంజీవరాజు, సర్పంచి స్వప్న, ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



ఎద్దుల బండిపై వస్తున్న మంత్రి భూమా అఖిలప్రియ

# శ్రీగిరిలో శివస్వాముల సందడి



శివదీక్షను స్వీకరించిన భక్తులు

**శ్రీశైలం, న్యూస్‌టుడే:** శ్రీశైలమహాక్షేత్రం శివస్వాములతో సందడిగా మారింది. బుధవారం అధిక సంఖ్యలో భక్తులు తెల్లవారుజామున పాతాళగంగలో పుణ్య స్నానాలు ఆచరించి శివదీక్ష స్వీకరించి శ్రీ స్వామిఅమ్మవార్లను దర్శించుకున్నారు. మహాశివరాత్రి రోజున దీక్ష విరమణ చేసేందుకు వీలుగా మండల దీక్ష స్వీకరిస్తున్నారు. పెద్ద ఎత్తున దీక్షను స్వీకరించిన శివస్వాములతో విభూధి, కుంకుమ, దుకాణాలు ప్రసాద విక్రయ కేంద్రాల వద్ద రద్దీ ఏర్పడింది.

# శ్రీశైలం

## చంద్రన్న ఉచిత వైద్యశిబిరం

**శ్రీశైలం, న్యూస్‌టుడే:** శ్రీశైలమహాక్షేత్రంలోని కొత్తపేట ప్రభుత్వ పాఠశాలలో చంద్రన్న సంచార వైద్యసిబ్బంది ఉచిత సేవలు అందించారు. బుధవారం రోగులకు పరీక్షలు నిర్వహించి నెల రోజులకు సరిపడా మందులను ఉచితంగా అందజేసినట్లు వైద్య సిబ్బంది తెలిపారు.

24 గంటల వైద్య సలహాలకు 104కు ఫోన్ చేయండి

## గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

**సున్నిపెంట సర్కిల్ న్యూస్‌టుడే:** గర్భిణులు సరైన పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యం కాపాడుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ మాల్యాద్రి సూచించారు. బుధవారం సున్నిపెంటలోని రాజీవ్‌గాంధీ కాలనీలో జన్మభూమి మా ఊరు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల విద్యార్థులు- ఆరోగ్యం అన్న అంశంపై విద్యార్థులకు వక్తృత్వ పోటీలను నిర్వహించినట్లు తెలిపారు. జన్మభూమి కోఆర్డినేటర్ బి.శ్రీనివాస్, పాల్‌దయాకర్, ఉస్మాన్ సాహెబ్, రాజన్న విద్యార్థులు పాల్గొన్నారు.

## పందుల సంచారంతో అపరిశుభ్రం



వ్యర్థాల్లో పందులు

నగర పంచాయతీలో పందుల సంచారం అధికంగా ఉంది. ఏకలవ్యనగర్, ఎరుకలిగేరి, దుద్యాల రస్తా, కిషన్‌సింగ్‌వీధి, రహమ్మత్‌నగర్, గరీబ్‌నగర్, ఇందిరానగర్, అక్కిరాజుకాలనీ, పాత బస్టాండు, కప్పలకుంట, తిక్కయ్యస్వామి దర్గా, పోస్టాఫీసు, హుసేన్ సానగర్‌లలో పందులు అధికంగా తిరుగుతున్నాయి. దుద్యాల రస్తాలో పందుల పెంపకం షెడ్లు ఏర్పాటు చేయటంపై స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఏకలవ్యనగర్, ఎరుకలిగేరిలో పందుల పెంపకందారులు వాటిని పట్టణ శివారుకు తీసుకువెళ్లటం లేదు. ఇళ్ల నడుమ, మురుగు కాల్వల్లో పందులు సంచరిస్తూ అపరిశుభ్రతకు కారణమవుతున్నాయి. బహిరంగ ప్రదేశాల్లో వేసిన చెత్తాచెదారం, వ్యర్థాలు, చెత్త దిబ్బలపై పందులు స్వైరవిహారం చేస్తున్నాయి. దీని వల్ల పరిసరాలు అపరిశుభ్రమవుతున్నాయి. పందులు సంచరించే ప్రదేశాల్లో దుర్గంధం వెదజల్లటం వల్ల దోమలు వ్యాపించి రోగాలకు కారణమవుతున్నాయి.

## పని చేయని ప్రచార బోర్డులు



ప్రచార బోర్డుల వద్ద అపరిశుభ్రం

నగర పంచాయతీలో పారిశుద్ధ్యం నెలకొల్పటంలో భాగంగా ఆయా ప్రదేశాల్లో ప్రచార ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఇందిరానగర్, కొత్తపేట, కప్పలకుంట, రహమ్మత్‌నగర్, సంతమార్కెట్, పెద్ద బజారు ప్రదేశాల్లో చెత్తాచెదారం, వ్యర్థాలు వేసే ప్రదేశంలో వీటిని అమర్చారు. చెత్త శీను తోపు శీను పేరుతో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు పురవాసులను ఆకట్టుకున్నాయి. చెత్త వద్ద ఏర్పాటు చేసినా ప్రజలు మాత్రం చెత్తను వేయటం మానలేదు. ఫ్లెక్సీలు అమర్చిన అధికారులు అటువైపు వెళ్లటం లేదు. చెత్తను వేసే ప్రదేశాల వద్దకు వెళ్లి వేయకుండా ప్రజలకు అవగాహన కల్పించాల్సి ఉంది. చెత్త వేసే వారి వివరాలు సేకరించి ఇంటి వద్దకు వెళ్లి ఎందుకు వేస్తున్నారంటూ ప్రశ్నించాల్సి ఉంది. చెత్త వేసేందుకు తోపుడు బండిని వీధుల్లోకి తీసుకువెళ్లే చెత్తను వేయటం మానుకుంటామని ప్రజలు చెబుతున్నారు.



మాట్లాడుతున్న మస్తాన్‌వలి

## వేగ నిరోధకాలను తొలగించండి

**ఆత్మకూరు పట్టణం, న్యూస్‌టుడే:** ఆత్మకూరు నుంచి కర్నూలు వెళ్లే మార్గంలో నిబంధనలకు విరుద్ధంగా 38 వేగ నిరోధకాలు (స్పీడు బ్రేకర్లు) ఉన్నాయనీ, వీటి వల్ల తమ లారీలు, బస్సులతోపాటు ప్రయాణికుల ఆరోగ్యం దెబ్బతింటోందని వాటిని తొలగించి ఆదుకోవాలని లారీ యజమానులు, ఆర్టీసీ అద్దె బస్సుల యజమానులు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం దిలాంగ్‌లారీ ఓనర్స్ అసోషియేషన్ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. ఈ సందర్భంగా లాంగ్‌లారీ ఓనర్స్ అసోషియేషన్ అధ్యక్షుడు మస్తాన్‌వలి, అద్దె బస్సుల సంఘం నాయకులు టప్పాల్ షేక్షావలిలు మాట్లాడుతూ స్పీడు బ్రేకర్లు ఏటవాలుగా లేవనీ, ఒకే చోట ఎత్తుగా నిర్మించారన్నారు. ఈ సమస్యపై కర్నూలులో రహదారులు భవనాలశాఖ అధికారులను కలిస్తే తమకు సంబంధంలేదనీ, పోలీసుశాఖ ఆధ్వర్యంలో వేశారని చెప్పినట్లు వెల్లడించారు. రహదారుల నిబంధనల ప్రకారం జాతీయ రహదారుల్లో స్పీడు బ్రేకర్లు వేయరనీ, వేసినా వాహనాలు, ప్రజలకు ఇబ్బందిలేకుండా నిర్మిస్తారన్నారు. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే గర్భిణులు, రోగులు వేగనిరోధకాలు వల్ల ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా పోలీసులు, రహదారులు భవనాలశాఖ అధికారులు కల్పించుకుని వీటిని తొలగించాల్సిందిగా కోరారు. ఈ సమావేశంలో లారీ యజమానులు ఎస్.ఎస్. ఉమ్మర్, మీరమాబు, సురేష్‌లు పాల్గొన్నారు.

## పోలీసుల నంబర్లు:

### ఆత్మకూరు టౌన్

| | |
|---|---|
| మాధవరెడ్డి-డీఎస్పీ-ఆత్మకూరు- | 9121101180 |
| కృష్ణయ్య-సీఐ-ఆత్మకూరు- | 9121101181 |
| వెంకటసుబ్బయ్య-ఎస్సై-ఆత్మకూరు- | 9121101182 |
| ప్రవీణ్‌కుమార్‌రెడ్డి-ఎస్సై-వెలుగోడు- | 9912213227 |
| శ్రీనివాసమూర్తి-సీఐ-శ్రీశైలం- | 9121101183 |
| వరప్రసాదు-ఎస్సై-శ్రీశైలం- | 9121101192 |
| ఓబులేసు-ఎస్సై-శ్రీశైలం- | 9121101193 |
| అత్యవసర ఫోన్ నంబరు: | 91211011894 |
| | 100 |


# స్వచ్ఛతే సేవ.. నిర్లక్ష్యపు తోవ

**పురపాలికలో కనిపించని స్వచ్ఛభారత్**

**ఆచరణకు దూరంగా తడి, పొడి చెత్త సేకరణ**

**ఆత్మకూరు పట్టణం, న్యూస్‌టుడే:** కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్నాయి. స్వచ్ఛభారత్, స్వచ్ఛసర్వేక్షణ్‌ల అమలుకు రూ.కోట్లు వెచ్చిస్తున్నారు. స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా ఇంటింటి నుంచి తడిపొడి చెత్తను సేకరించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఆత్మకూరులో స్వచ్ఛతే సేవ కార్యక్రమంపై అలసత్వం వహిస్తున్నారు. తడి, పొడి చెత్త సేకరణకు తీసుకువచ్చిన తోపుడు బండ్లు మూలన పడేశారు. పాత తోపుడు బండ్లు పది ఉన్నా ప్రతి రోజూ చెత్తను సేకరించటం వీలుకావటం లేదు. తోపుడు బండ్లకు అవసరమైన కార్మికుల సంఖ్య తక్కువగా ఉండటం వల్ల తడి, పొడి చెత్త సేకరణ సాధ్యం కావటం లేదు.

నగర పంచాయతీలో పందుల సంచారం అధికంగా ఉండటం వల్ల స్వచ్ఛభారత్ కల సాకారం కావటం లేదు. స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా పురపాలికలో పారిశుద్ధ్యం నెలకొల్పటంలో అధికారులు విఫలమవుతున్నారు.



నగర పంచాయతీ కార్యాలయంలో తోపుడు బండ్లు

### తడి పొడి చెత్త సేకరణ గాలికి

నగర పంచాయతీలో తడి, పొడి చెత్త సేకరణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా తోపుడుబండి ఇంటింటికి వెళ్లి చెత్తను సేకరించాల్సి ఉంది. స్వచ్ఛ కార్పొరేషన్ ఆధ్వర్యంలో మొదటి విడతలో పది తోపుడు బండ్లు కొనుగోలు చేశారు. తోపుడు బండ్ల సంఖ్య తక్కువగా ఉండటంతో రెండు వార్డులకు ఒక బండిని కేటాయించారు. ఒక రోజు రెండు వార్డులు తిరగటం సాధ్యం కావటం లేదు. మూడు లేదా నాలుగు రోజులకొక పర్యాయం బండి తీసుకువెళ్తున్నారు. ప్రజలు ఇళ్లల్లో చెత్తను నిల్వ చేసుకోలేక బహిరంగ ప్రదేశాలు, చెత్త దిబ్బల్లో వ్యర్థాలు పడేస్తున్నారు. గత నెల మరో 20 తోపుడు బండ్లు తీసుకువచ్చారు. ఇంత వరకు వాటిని ప్రారంభించలేదు. నగర పంచాయతీ కార్యాలయంలో మూలనపడి ఉన్నాయి. తోపుడు బండ్లకు వెళ్లటానికి సరిపడా కార్మికుల సంఖ్య లేకపోవటంతో తడి, పొడి చెత్త సేకరణ సాధ్యం కావటం లేదు.



## మహిళా చైతన్యంతోనే సమాజాభివృద్ధి

**ఆత్మకూరు గ్రామీణ, న్యూస్‌టుడే:** మహిళా చైతన్యంతోనే సమాజాభివృద్ధి సాధ్యమవుతుందని ఆర్యవైశ్య సంఘం మహిళా అధ్యక్ష కార్యదర్శులు నరహరి విజయలక్ష్మి, జీవరత్నమ్మలు అన్నారు. స్థానిక కన్యకాపరమేశ్వరీ దేవి ఆలయంలో కేక్ కోసి బుధవారం ఆర్యవైశ్య మహిళా సంఘం 10 వ వార్షికోత్సవాలు నిర్వహించారు. మహిళా సంఘం ఏర్పడి 9 ఏళ్లు పూర్తై 10 ఏడాదిలోకి అడుగిడిందన్నారు. మహిళలు ఐకమత్యంగా అన్ని కార్యక్రమాల్లో పాల్గొంటున్నారని అన్నారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



కేక్ కట్ చేస్తున్న మహిళా సంఘం అధ్యక్షురాలు నరహరి విజయలక్ష్మి



మహిళా ఉపాధ్యాయినులకు సన్మానం

**ఆత్మకూరు గ్రామీణ, న్యూస్‌టుడే:** ప్రాచీన కాలంలోనే మహిళా విద్యాభివృద్ధికి కృషిచేసిన సావిత్రిబాయి పూలే జీవితం ఆదర్శనీయమని వెంకటాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు హనుమంతరావ్, ఉపాధ్యాయ సంఘాల నాయకులు జవహర్‌నాయక్‌లు అన్నారు. పాఠశాలలో బుధవారం పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. పూలే జయంతి సందర్భంగా మహిళా ఉపాధ్యాయినిలను సన్మానించారు.

● సావిత్రీబాయి పూలే మహిళా విద్యా ఉద్యమ కర్త అని పట్టణంలోని సెంట్రల్ స్కూల్ ప్రధానోపాధ్యాయులు బాలస్వామి, ఉపాధ్యాయులు జనార్దన్‌రావ్‌లు అన్నారు. పాఠశాలలో బుధవారం పూలే జయంతి వేడుకలు నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.

# సావిత్రిబాయి పూలే జీవితం ఆదర్శం

### తిమ్మాపురంలో..

**తిమ్మాపురం, (మహానంది), న్యూస్‌టుడే:** ఏమనిషీ పుట్టుకతో గొప్పవారు కాలేరని, వారు చేసే పనులను, నడతలను బట్టి గొప్పతనం లభిస్తుందని ప్రధానాచార్యిణి పర్వానాబేగం పేర్కొన్నారు. ఎం.తిమ్మాపురం ఆదర్శ పాఠశాలలో బుధవారం సావిత్రిబాయిపూలే జయంతిని పురస్కరించుకొని సీనియర్ అధ్యాపకురాలు మల్లేశ్వరనళినిని సహచర అధ్యాపకులు ఘనంగా సత్కరించారు. ఈ సమావేశంలో ఉప ప్రధానాచార్యులు టీఎం.దాస్, ఇతర అధ్యాపకులు ఘనంగా సత్కరించారు.

### పూలే అడుగుజాడల్లో నడవాలి

**వెలుగోడు, న్యూస్‌టుడే:** ప్రతి ఒక్కరూ సావిత్రిబాయి పూలే అడుగుజాడల్లో నడిచి ప్రతి ఒక్కరికి విద్య అందించాలని మహిళా సాధికారిక సెల్ సమన్వయకర్త పద్మావతిబాయి పేర్కొన్నారు. తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే జయంతిని పురస్కరించుకొని బుధవారం పట్టణంలోని నీలం సంజీవరెడ్డి డిగ్రీ కళాశాలలో జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ రాంభూపాల్‌రెడ్డి, అధ్యాపకులు హేమలత, మద్దమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు



తిమ్మాపురం ఆదర్శ పాఠశాలలో సీనియర్ అధ్యాపకురాలు నళినిని సన్మానించి అభినందనలు తెలుపుతున్న సహచర అధ్యాపకులు

# శ్రీశైలం

## 5న కలెక్టరేట్ ముట్టడి

**గాజులపల్లెఆర్.ఎస్, (మహానంది), న్యూస్‌టుడే:** బోయ, వాల్మీకి కులాలను ఎస్టీల్లో చేర్చ రాదని ఏపీ జిల్లా గిరిజన సమాఖ్య ప్రధాన కార్యదర్శి మోటా రాముడు డిమాండు చేశారు. మండలంలో బుధవారం ఆయన అబ్బీపురం, మహానంది, గోపవరం, గాజులపల్లె గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఇదే డిమాండ్‌తో ఈనెల 5న ఉదయం కర్నూలులో కలెక్టరేట్ ముట్టడి, నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

24 గంటల అత్యవసర వైద్య సేవలకు 108కు ఫోన్ చేయండి



## ప్రభుత్వ పథకాల సద్వినియోగంతోనే

# సంతృప్తి- సంక్షేమం

**- శ్రీశైలం నియోజకవర్గం ప్రత్యేకాధికారి, గుంటూరు రేంజీ డీఐజీ**

**తమడపల్లె/బొల్లవరం, (మహానంది), న్యూస్‌టుడే:** ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సంక్షేమ పథకాల విజయవంతమయితేనే సంతృప్తి లభిస్తుందని గుంటూరు రేంజీ డీఐజీ, శ్రీశైలం నియోజకవర్గం ప్రత్యేకాధికారి గోపాలరావు పేర్కొన్నారు. మహానంది మండలంలోని తమడపల్లె, బొల్లవరం గ్రామాల్లో బుధవారం జరిగిన జన్మభూమి- మాఊరు కార్యక్రమాలను, సాంస్కృతిక కార్యక్రమాలను పరిశీలించారు. తమడపల్లెలో వ్యవసాయశాఖ తరపున మంజూరైన రైతు రథం ట్రాక్టర్‌ను వెంకటేశ్వర్లు అనే రైతుకు డీఐజీ అందజేశారు. ప్రభుత్వం విడుదల చేసిన కొత్త బియ్యంకార్డులను అర్హులకు అందజేశారు. ఈ కార్యక్రమాల్లో నోడల్ అధికారి బ్రహ్మం, తహసీల్దార్ ఏసీ సుబ్బరాయుడు, ఎంపీడీఓ నరసింహులు, డాక్టర్ చంద్రశేఖర్, ఎంఈఓ రామసుబ్బయ్య, సర్పంచులు హైమావతి, శెట్టివెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు. బొల్లవరం, తమడపల్లె గ్రామాల్లోనూ ఆయన జన్మభూమి, సాంస్కృతిక



రేషన్‌కార్డులు పంపిణీ చేస్తున్న నగర పంచాయతీ ఛైర్మన్ నూర్‌మహమ్మద్, ఏపీ హజ్‌కమిటీ ఛైర్మన్ అహమ్మద్‌హుస్సేన్

కార్యక్రమాలను పరిశీలించి అక్కడి ప్రత్యేకాధికారులు సుబ్బారెడ్డి, శ్రీవిద్య, ఇతర అధికార బృందాన్ని అభినందించారు. గాజులపల్లెలో ఉపతసీల్దార్ హసీనాబీ, గ్రామ ఉపసర్పంచి బత్తుల చిన్నకోటేశ్వరయ్య, ఎంపీటీసీలు వెంకటరమణ, సాలమ్మలు, మండల కేంద్రం ఎం.తిమ్మాపురం ప్రత్యేకాధికారి శ్రీనివాసనాయుడు, మహానంది ప్రత్యేకాధికారి వీరప్రతాప్‌ల ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు.

**ఆత్మకూరు గ్రామీణ, న్యూస్‌టుడే:** పేదల సంక్షేమమే తెదేపా ధ్యేయమని ఏపీ హజ్‌కమిటీ ఛైర్మన్ అహమ్మద్ హుస్సేన్, నగర పంచాయతీ ఛైర్మన్ నూర్‌మహమ్మద్‌లు అన్నారు. పట్టణంలోని 3, 4 వ వార్డుల్లో బుధవారం జన్మభూమి మన ఊరు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతోందని వాటిని అర్హులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ రమేష్‌బాబు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

### కుటుంబ వికాసంతో సమాజాభివృద్ధి

**ఆత్మకూరు గ్రామీణ, న్యూస్‌టుడే:** కుటుంబ వికాసంతోనే సమాజాభివృద్ధి సాధ్యమవుతుందని నియోజకవర్గ ప్రత్యేక అధికారి శ్రీనివాసులు, ఎంపీపీ సత్తెనపల్లి సౌజన్యలు అన్నారు. మండలంలోని కురుకుంద, వడ్లరామాపురం గ్రామాల్లో బుధవారం జన్మభూమి మన ఊరు కార్యక్రమాలు నిర్వహించారు. ముందుగా జన్మభూమిపై ఎంపీడీఓ శశికళ, నోడల్ అధికారి సత్యరాజు ప్రతిజ్ఞ చేయించారు. సంక్షేమ పథకాలు అర్హులైన పేదలకు చేరినపుడే ఆశించిన ప్రయోజనం ఉంటుందన్నారు. 10 రోజుల జన్మభూమి మా ఊరు కార్యక్రమాల్లో ప్రభుత్వం చేపడుతున్న పథకాల గురించి వివరించారు. ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. కొత్త రేషన్‌కార్డులు, చంద్రన్న సంక్రాంతి కానుక సరకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ కర్నాటి వెంకటరాముడు, తహసీల్దారు రాజశేఖర్‌బాబు, పాల్గొన్నారు.

**ఆత్మకూరు పట్టణం:** ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి జన్మభూమి మా ఊరు చక్కని వేదిక అని, ప్రభుత్వ సంక్షేమ పథకాలకు ప్రజలు దరఖాస్తు చేసుకోవాలని నగర పంచాయతీ ఛైర్మన్ నూర్‌మహమ్మద్ సూచించారు. జన్మభూమి మా ఊరు కార్యక్రమం బుధవారం మూడు, నాలుగు వార్డుల్లో నిర్వహించారు. ఈ కార్యక్రమ నియోజకవర్గ ప్రత్యేకాధికారిగా నియమితులయిన గుంటూరు రేంజ్ డీఐజీ కె.వి.వి.గోపాల్‌రావు సమావేశానికి హాజరై ప్రసంగించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, వైద్య పథకాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అంగన్‌వాడీ సిబ్బంది ఆధ్వర్యంలో గర్భిణులకు సామూహిక సీమంతం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమిషనరు రమేష్‌బాబు, ఉప తహసీల్దారు లోకేష్, కౌన్సిలర్లు సుగుణమ్మ, సలాంబాషతోపాటు సింగిల్‌విండో ఛైర్మన్ జడ్.శ్రీనివాసరెడ్డి, తెదేపా నాయకులు



బొల్లవరంలో ఉపాధ్యాయులతో నియోజకవర్గం ప్రత్యేకాధికారి, గుంటూరు రేంజీ డీఐజీ వేణుగోపాల్‌రావు

వంగాల శివరామిరెడ్డి, సుందరంలు పాల్గొన్నారు.

### సామాజిక సేవా కార్యక్రమాల్లో యువత భాగస్వాములు కావాలి

**వెంకటాపురం (ఆత్మకూరు గ్రామీణ) న్యూస్‌టుడే:** సామాజిక, సంఘ సేవా కార్యక్రమాల్లో యువత భాగస్వాములు కావాలని రాయలసీమ విశ్వవిద్యాలయం కళాశాల డీన్ ఆర్.సంజీవరావ్ అన్నారు. మండలంలోని వెంకటాపురంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు జన్మభూమి మన ఊరు కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఆరోగ్యంగా ఉన్నప్పుడే ఆనందంగా ఉండగలరని అన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రధానాచార్యులు లత, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామింగ్ అధికారి అనిల్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### అనవసర ఖర్చులను తగ్గించుకోవాలి -డీఐజీ

**మోతుకూరు(వెలుగోడు), న్యూస్‌టుడే:** రోజురోజుకు పెరుగుతున్న అనవసర ఖర్చులను తగ్గించుకుంటూ తమ చిన్నారులను బాగా చదివించుకోవాలని గుంటూరు రేంజ్ డీఐజీ, శ్రీశైల నియోజకవర్గ జన్మభూమి-మా ఊరు ప్రత్యేకాధికారి గోపాలరావు పేర్కొన్నారు. బుధవారం మండలంలోని మోతుకూరు లో నిర్వహించిన జన్మభూమి-మాఊరు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నూతన రేషన్‌కార్డులు, ఉపకారవేతనాలు, వ్యవసాయ పరికరాలను పంపిణీ చేశారు. మండల ప్రత్యేకాధికారి లాలాలజపతిరావు, ఎంపీపీ అన్నారపు సీతమ్మ, ఎంపీడీఓ శివనాగప్రసాద్, జెడ్పీటీసీ లాలిస్వామి, సర్పంచి భాగ్యమ్మ, తహసీల్దారు శ్రీనివాసగౌడు, స్థానిక నాయకులు, రామానాయుడు, సుధాకర్‌రెడ్డి, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.



ఆరోగ్య కేంద్రం సందర్శనలో డిగ్రీ విద్యార్థులు



మాట్లాడుతున్న నియోజకవర్గ ప్రత్యేక అధికారి శ్రీనివాసులు



పౌష్టికాహార స్టాల్‌ను ఏర్పాటు చేసిన అంగన్‌వాడీ కార్యకర్తలు

## సమస్యలు తీరేనా..

- లింగాలగట్టు ప్రజల మొర
- తాండవిస్తున్న మంచినీటి సమస్య

**సున్నిపెంట సర్కిల్ న్యూస్‌టుడే:** శ్రీశైలం ఆనకట్ట సమీపంలోని లింగాలగట్టు, బోయకాలనీల్లో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. స్థానిక ప్రజా ప్రతినిధులు అధికారులు పట్టించుకోకపోవటంతో జన్మభూమి మా ఊరు కార్యక్రమంతోనయినా సమస్యలు పరిష్కారమవుతాయా? అన్ని ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారు. ఈకాలనీల్లో దాదాపు 560 కుటుంబాలు జీవనం సాగిస్తున్నారు. కనీస సౌకర్యాలైన తాగునీరు, వ్యక్తిగత మరుగుదొడ్లు మట్టి రోడ్లు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాత్రిళ్లు వీధి దీపాలు వెలగక విష సర్పాల భయానికి బయటికి రాలేకపోతున్నారు. వ్యక్తిగత మరుగుదొడ్లు లేక మహిళలు ఆరుబయటకు వెళ్లాల్సి వస్తోంది. పక్కనే భారీ జలాశయం ఉన్నా తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. గుంతల మయంగా మారిన మట్టిరోడ్లే వీరికి దిక్కు. సమస్య పరిష్కారానికి ఏళ్లతరబడి అధికారులు, కార్యాలయాల చుట్టూ తిరిగినా స్పందన ఉండడం లేదని కాలనీలవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జన్మభూమి మా ఊరు కార్యక్రమంలో భాగంగా గ్రామానికి వస్తున్న అధికారులు తమ సమస్యలను గుర్తించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



గుంతలమయంగా ఉన్న రహదారి

**వీధి దీపాలు లేవు - శ్రీనువాసులు**



మా కాలనీలో వీధి దీపాలు లేక ఇబ్బందులు పడుతున్నాం. ఎవరికి ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. అధికారులు మా కాలనీలో పర్యటించాలి.

## తెరపై ఈనాడు

**లక్ష్మీరంగ:** హలో, **రంగమహల్:** మిడిల్ క్లాస్ అబ్బాయి, **షిర్డీసాయి:** 2 కంట్రీస్

### కూరగాయల ధరలు (బుధవారం, కిలో రూ.లలో):

టమోటా 06, పచ్చిమిర్చి 30, వంకాయ 20, బెండకాయ 30, ఉల్లిగడ్డ 50, క్యారెట్ 40, బీట్‌రూట్ 50, చౌళికాయ 40, కాలిఫ్లవర్ 40, బీన్స్ 30, బీరకాయ 40, కాకరకాయ 40, నిమ్మకాయలు వంద 80, అల్లం 50, చిక్కుడు 50, ముల్లంగి 40, దొండకాయ 40.

### మాంసం ధరలు (కిలో రూ.లలో)

కోడిమాంసం 180, తోలుతీసిన కోడి మాంసం 200, పొట్టేలు మాంసం 480, చేపలు 100, కోడిగుడ్లు వంద రూ. 420.

### నిత్యావసర వస్తువుల ధరలు (కిలో రూ.లలో)

సోనమసూరి బియ్యం 48, జొన్నలు 24, పామాయిల్ 70, వేరుశనగ నూనె 110, చక్కెర 38, కందిబేడలు 60, తాండూరు బేడలు 70, శనగబేడలు 90, ఉప్మారవ్వ 38, బొంబేరవ్వ 36, మైదాపిండి 32, గోధుమపిండి 28, పప్పులు 80, వేరుశనగ విత్తనాలు 100, బెల్లం 45, కొబ్బెర 200, ధనియాలు 120, చింతపండు 220, వెల్లుల్లి 80, మినప బేడలు 90.

## క్రీడాకారులకు చేయూతనిస్తా - ఎమ్మెల్యే

**వెలుగోడు, న్యూస్‌టుడే:** . స్క్వే ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఇటీవల గోవాలో నిర్వహించిన జాతీయస్థాయి కరాటే పోటీల్లో పతకాలు సాధించిన వెలుగోడు బృందావన్, ఆదర్శ పాఠశాలల విద్యార్థులను బుధవారం స్థానిక తెలుగుగంగ అతిథి గృహంలో ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి అభినందించారు. పతకాలు సాధించిన నీలవేణి, రేష్మా, త్రిలింగేశ్వరగౌడులతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. తాను ముఖ్యమంత్రితో మాట్లాడి అంతర్జాతీయ క్రీడల్లో పాల్గొనే విషయమై చర్చిస్తానన్నారు. సహకార సంఘం అధ్యక్షుడు వంగాల వెంకట్రామిరెడ్డి, అన్నారపు శేషిరెడ్డి, మాస్టర్ జ్యోత్స్న, బృందావన్ పాఠశాల నిర్వాహకులు ఫయాజ్, ఆదర్శ పాఠశాల ఉపాధ్యాయుడు కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న ఎమ్మెల్యే బుడ్డా

## రేషన్ కోసం బాలింతల నిరీక్షణ

### మొరాయిస్తున్న సర్వర్

**సున్నిపెంట సర్కిల్ న్యూస్‌టుడే:** తరచూ సర్వరు సమస్య ఎదురవుతుండడం, ఈ పోస్ యంత్రం మొరాయిస్తుండడం వల్ల రేషన్ పంపిణీలో జాప్యం జరుగుతోంది. చౌకదుకాణాల వల్ల బాలింతలు, చిన్న పిల్లల తల్లులు, రేషన్ కోసం గంటల తరబడి క్యూలో నిల్చోవాల్సి వస్తుంది. బుధవారం సున్నిపెంటలోని ఆరో వార్డు చౌకదుకాణంలో పదేపదే సర్వర్ మొరాయించడం వల్ల వరుసలో నిల్చున్న చంటి పిల్లలతో వచ్చిన మహిళలు బాగా ఇబ్బంది పడ్డారు. దీంతో బాలింతలు గర్భిణులను క్యూలో నిల్చోబెట్టకుండా వెంటనే రేషన్ ఇచ్చి పంపేలా అధికారులు చర్యలు తీసుకోవాలని తోటి మహిళలు కోరడం గమనార్హం.



రేషన్ దుకాణం వద్ద గుంపులుగా ఉన్న కార్డుదారులు

# స్వల్పంగా తగ్గిన నీటిమట్టం

**సున్నిపెంట సర్కిల్:** శ్రీశైలం జలాశయం నీటిమట్టం బుధవారం సాయంత్రం స్వల్పంగా తగ్గి 869.70 అడుగులకు చేరుకోగా నిల్వ సామర్థ్యం 140.3100 టీఎంసీలుగా నమోదైంది. పోతిరెడ్డిపాడుకు 2 వేలు, హంద్రీనీవాకు 2,363, కల్వకుర్తి ఎత్తిపోతల పథకానికి 1,600, ముచ్చుమర్రి 440 క్యూసెక్కులు విడుదల చేశారు. కుడిగట్టు జల విద్యుత్తు, భూగర్భ జల విద్యుత్తు కేంద్రంలో విద్యుత్తు ఉత్పత్తి చేయలేదు. గత 24 గంటల వ్యవధిలో ఎడమగట్టు విద్యుత్తు కేంద్రం నుంచి పంప్‌మోడ్ పద్ధతిలో 2.212 మిలియన్ యూనిట్ల విద్యుత్తును ఉత్పత్తి చేశారు. దీనికోసం 3,358 క్యూసెక్కులు వినియోగించుకుని విడుదల చేశారు.



# తొందర 'పడితే'.. ప్రమాదం







సమయం విలువైనది. ప్రాణం దానికన్నా విలువైనది. ప్రయాణంలో ఏమాత్రం అప్రమత్తంగా లేకున్నా అపాయం ముంచుకొచ్చినట్లే. అయినా నేటి యువత తగు జాగ్రత్తలు తీసుకోవడం లేదు. చదువులు, వృత్తి, వ్యాపకాల కోసం తరచూ ప్రయాణించే యువతీయువకులు బస్సులు ఎక్కేటప్పుడు, దిగేటప్పుడు సురక్షిత పద్ధతులు పాటించకుంటే చేజేతులా జీవితాన్ని చేజార్చుకున్నట్లే అవుతుంది. తమపై కన్నవారు, అయినవారు పెట్టుకున్న ఆశలనైనా అనుక్షణం మననం చేసుకుని భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉంది. బుధవారం కర్నూలులోని బస్టాండు మార్గంలో ట్రాఫిక్ మధ్యలోనే తొందరపడి ప్రమాదకరంగా బస్సు దిగుతున్న దృశ్యాలను 'ఈనాడు' క్లిక్‌మనిపించింది.

- ఈనాడు, కర్నూలు



లెక్కిస్తున్న హుండీ ఆదాయం

## శ్రీమఠం హుండీ ఆదాయం రూ.1.67 కోట్లు

**మంత్రాలయం, న్యూస్‌టుడే:** పుణ్యక్షేత్రమైన మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠం డిసెంబరు నెల హుండీ ఆదాయం రూ. 1,67,26,590 నగదు సమకూరినట్లు శ్రీమఠం ఏఏఓ మాధవ శెట్టి బుధవారం పేర్కొన్నారు. బంగారం 140 గ్రాములు, వెండి రెండు కిలోల 670 గ్రాములు, 381(యూఎస్ఏ), 189(సింగపూర్), 23(మలేషియా) తదితర విదేశీ నగదు లభించినట్లు తెలిపారు.

## మహానందీశునికి రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ కమిషన్ సభ్యుల పూజలు

**మహానంది, న్యూస్‌టుడే:** మహానంది పుణ్యక్షేత్రానికి బుధవారం రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ కమిషన్ సభ్యులు కొండా నరహరిప్రసాద్ వచ్చారు. ఆయనకు ఆలయ ప్రొటోకాల్ ఇన్‌స్పెక్టర్ శశిధరరెడ్డి, వేదపండితులు నాగేశ్వరశర్మలు స్వాగతం పలికారు. అనంతరం శ్రీకామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకొని పూజించారు. స్వామి చరిత్రను తెలుసుకున్నారు. దర్శనానంతరం ఆయనను దేవస్థానం వారు సత్కరించి తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. ఆయన వెంట గిరిజన స్టూడెంట్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు చంద్రప్ప, ఏటీడబ్ల్యు ఎస్టీ సెల్ అధ్యక్షుడు చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



మహానందిలో దర్శనానికి వెళుతున్న రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు కొండా నరహరిప్రసాద్

# మహానంది వ్యవసాయ కళాశాలకు 43 పతకాలు

**మహానందిఫారం, (మహానంది), న్యూస్‌టుడే:** ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలోని అంతర్ కళాశాలల క్రీడాపోటీల్లో మహానందిఫారంలోని వ్యవసాయ కళాశాల విద్యార్థులు 43 పతకాలను సాధించారు. ఈ సందర్భంగా బుధవారం అసోసియేట్ డీన్, ప్రధానాచార్యులు డాక్టర్ బాలగురయ్య ఆధ్వర్యంలో పతకాలు సాధించిన క్రీడా విద్యార్థులకు అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ఓఎస్‌డీ సతీష్‌రాహుల్ వివరించిన క్రీడాపతకాలు, విజేతల వివరాలు ఇలా ఉన్నాయి. తిరుపతిలో మొదటి దఫా జరిగిన బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో అజయ్‌భార్గవ్, అశోక్, జి.శ్రీకాంత్‌రెడ్డి, వై.సందీప్‌కుమార్, బి.సుదర్శన్, జే.మల్లేష్‌లు విజయం సాధించారు. టేబుల్ టెన్నిస్‌లోనూ ఎం.రాజు, టీవీ సాయిఆదిత్య, పి.మహేష్‌లు ఉన్నారు. క్యారమ్స్ పోటీల్లో సాయినాథ్, వై.నితిన్‌కుమార్‌లు రన్నర్లుగా నిలిచారు. రెండో విడత గుంటూరు జిల్లా నైరాలో జరిగిన పరుగు పందెంలో 100, 200, 400లో ఓ.సాయితేజ, రాము ద్వితీయ స్థానాల్లో నిలిచారు. 800, 1500, 3000 మీటర్ల పరుగుపందెంలో బి.అనంద్‌నాయక్ ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారు. షాట్‌పుట్, డిస్కస్‌త్రో పోటీల్లో జి.శ్రీకాంతరెడ్డి, లాంగ్‌జంప్, ట్రిపుల్ జంప్‌లో ఓ.సాయితేజ తృతీయ స్థానాల్లో, లాంగ్‌జంప్‌లో రెండో స్థానంలో దివ్య ఉన్నారు. మూడో విడతలో బాపట్ల కళాశాలలో జరిగిన సాంస్కృతిక కార్యక్రమాల పోటీల్లో స్పాట్ పెయింటింగ్‌లో సాయిసువర్చల రెండో స్థానం, కాటన్ మేకింగ్‌లో జయభార్గవి తృతీయస్థానం, స్కిట్‌లో యామిని బృందం, సోలో ఇన్‌స్ట్రుమెంట్‌లో ప్రథమస్థానంలో మహేష్, ఆంగ్లంలో వ్యాసరచన పోటీల్లో పృథ్వి మూడో స్థానంలో నిలిచారు. ఈ కార్యక్రమంలో విజేతలైన విద్యార్థులను అధ్యాపకులు అభినందించారు.



బాపట్లలో మహానంది విద్యార్థులను అభినందించి ధ్రువీకరణ పత్రాలను అందజేసిన ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ దామోదరనాయుడు (కుడి నుంచి మూడో వ్యక్తి)



మహానందిఫారంలోని వ్యవసాయ కళాశాలలో పతకాలు, పత్రాలు సాధించిన విద్యార్థులతో అసోసియేట్ డీన్ డాక్టర్ బాలగురువయ్య, ఇతర సిబ్బంది



క్షతగాత్రులను ఆస్పత్రికి తీసుకొస్తున్న పోలీసు

వలస కూలీల బతుకులు తెల్లారిపోయాయి. ఉన్న ఊళ్లో పని లేక సుదూర ప్రాంతాలకు బతుకుదెరువు కోసం వెళ్లి.. తిరిగి స్వగ్రామాలకు వస్తుండగా అనుకోకుండా జరిగిన ప్రమాదంలో మృత్యుఒడికి చేరారు. ఒకరు కాదు ఇద్దరు కాదు ఏకంగా ఏడుగురు మృత్యువాత పడ్డారు. అందరివీ నిరుపేద కుటుంబాలు. ఏపూటకు ఆపూట కష్టపడితేనే నాలుగు మెతుకులు నోట్లోకి వెళ్లేది. ఇలాంటి పరిస్థితుల్లో వలస వెళ్లి సంపాదించడం తప్ప వేరే మార్గం లేదు. అంతా సాఫీగా జరిగి తిండి గింజలతో ఇళ్లకు బయలుదేరిన వారంతా.. రహదారి ప్రమాదంలో తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయారు. ఆ కుటుంబాల్లో అంతులేని విషాదం అలుముకుంది.

–న్యూస్‌టుడే, ఆదోని నేరవార్తలు, ఆస్పరి, హొళగుంద

# తెల్లారిన బతుకులు

వలస కూలీలతో వస్తున్న డీసీఎం వాహనం టైరు పగిలి బోల్తా పడటంతో ఏడుగురు మృత్యువాత పడ్డారు. మరో 11 మందికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన ఆలూరు మండలం చిన్నహోతూరు గ్రామ సమీపంలో బుధవారం ఉదయం 7.30 గంటలకు జరిగింది. హొళగుంద మండలం కొత్తపేట గ్రామానికి చెందిన 18 మంది నల్గొండ జిల్లా డోర్ పల్లి గ్రామంలో పత్తికోత పనుల కోసం రెండు నెలల క్రితం వెళ్లారు. అక్కడ పనులు ముగియడం.. మరోపక్క గ్రామానికి చెందిన బంధువులు కొందరు శివమాల వేసుకుంటుండటంతో పనులకు వెళ్లిన వారంతా మంగళవారం రాత్రి డీసీఎం వాహనంలో బయలు దేరారు. అదే వాహనంలో బియ్యం బస్తాలను వేసుకున్నారు. జడ్చర్ల వద్ద వాహనానికి పంక్చర్ కావడంతో వేయించుకొని తిరుగు ప్రయాణమయ్యారు. బుధవారం ఉదయం అరగంటలో స్వగ్రామానికి చేరుకుంటామన్న సమయంలో వాహనం టైరు పగిలిపోవడంతో అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో వెనుక కూర్చున్న వారిలో ఏడుగురు మృతిచెందారు. మిగిలిన వారందరికీ తీవ్రగాయాలయ్యాయి. డ్రైవరు అతివేగంగా వాహనం నడపడం వల్లే ప్రమాదం జరిగిందని బాధితులు ఆరోపిస్తున్నారు.

## ఘటనా స్థలంలోనే ఇద్దరు మృతి

హొళగుంద మండలం కొత్తకోట గ్రామానికి చెందిన నర్సమ్మ(45), శేకమ్మ(45) ఘటనా స్థలంలోనే మృతి చెందగా. . హనుమంతమ్మ(16), గోవిందమ్మ(55) ఆదోని ప్రాంతీయ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూశారు. తీవ్రంగా గాయపడిన ఈరమ్మ, నారాయణ, మంగమ్మను మెరుగైన వైద్యం కోసం కర్నూలు తరలించారు. అక్కడ కోలుకోలేక ప్రాణాలు విడిచారు. ఇదే ప్రమాదంలో లక్ష్మి, స్రవంతి, బాలరాజు, దుర్గమ్మ, శేఖన్న, వెంకటేశు, నీలమ్మ, గంగమ్మ, వెంకటేశు, సుంకమ్మ, వెంకటేశులు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను మెరుగైన చికిత్స కోసం కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఘటనా స్థలానికి ఆదోని డీఎస్పీ ప్రసాద్, ఆలూరు సీఐ అబ్బుల్‌గౌస్, ఆస్పరి ఎస్సై శంకరయ్యలు చేరుకొని వివరాలు అడిగి తెలుసుకున్నారు.

## అధిక భారం వల్లే... ప్రమాదం

కూలీలు ప్రయాణిస్తున్న వాహనంలో దాదాపు 2 టన్నులకు పైగా బరువున్న బియ్యం బస్తాలు ఉన్నాయి. ఒక్కసారిగా వాహనం టైరు పగిలిపోవడంతో బోల్తాపడి.. బస్తాలన్నీ మనుషులపై పడటంతో ప్రమాద తీవ్రత పెరిగింది.

☛ నల్గొండ నుంచి దాదాపు 500 కి.మీ. ప్రయాణం చేయడంతో టైరు వేడెక్కి పగిలిపోయిందని ప్రాథమిక సమాచారం. దీనికితోడు వేగంగా రావడం వల్ల ఒక్కసారిగా అదుపు తప్పి పల్టీ కొట్టింది. టైరు ఘటనా స్థలానికి యాభై అడుగుల దూరంలో పడటాన్ని బట్టి చూస్తే.. ప్రమాద తీవ్రత అర్థమవుతుంది. వాహనంలో బియ్యం బస్తాల మధ్యలో కూర్చున వారంతా వాటిమధ్య నలిగిపోయి మృత్యువాత పడ్డారు. మరి కొందరు తీవ్రంగా గాయపడ్డారు.

## బువ్వ గింజలే నలిపేశాయ్

నల్గొండలో చౌక బియ్యం కిలో రూ.5లకు దొరకడంతో వలస వెళ్లిన వారంతా పెద్దఎత్తున బస్తాలు కొనుగోలు చేశారు. గ్రామానికి వస్తున్న సమయంలో వాటిని తీసుకొస్తూ. . జరిగిన ప్రమాదంలో వాటి మధ్య చిక్కుకుని ప్రమాద తీవ్రత పెరిగి నలిగిపోవడం అందర్నీ కంటతడి పెట్టించింది.

## డ్రైవరు నిర్లక్ష్యమే కారణమా..?

డ్రైవర్ నిర్లక్ష్య వైఖరి, అతివేగంగా, అజాగ్రత్తగా నడపడం వల్ల ఈ ప్రమాదం జరిగిందని బాధితులు వెంకటేష్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఒకే గ్రామంలో ఏడుగురు మృతిచెందడంతో విషాదం అలుముకుంది.

## మిన్నంటిన రోదనలు

మృతుల బంధువుల రాకతో ఆదోని ఆస్పత్రి ఆర్తనాదాలతో మారుమోగింది. ఆస్పత్రి ప్రాంగణమంతా క్షతగాత్రులు, వారి బంధువులతో నిండిపోయింది. తమ వారి పరిస్థితి ఎలా ఉందోనంటూ బంధువులు, గ్రామస్థులు ఆస్పత్రికి పెద్దఎత్తున తరలివచ్చారు.

## పోలీసు సేవలు భేష్

రహదారి ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ క్షతగాత్రులను చికిత్స అందించేందుకు ఆస్పరి పోలీసుస్టేషన్ పోలీసు సిబ్బంది సేవలు అందించారు. ఆలూరు సీఐ గౌస్, ఎస్సై శంకరయ్య ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులకు వైద్యం అందించేందుకు ఆటోల్లో ఎక్కించుకుని ఆదోని ప్రాంతీయ ఆస్పత్రికి తరలించారు. ఆటోలో ఉన్న క్షతగాత్రులను హెడ్‌కానిస్టేబుల్ కిష్టప్పనాయక్, హోంగార్డు నజీర్ తమ చేతులపై మోసి ఆస్పత్రిలో చేర్పించారు. ఆస్పత్రి వైద్యులు డాక్టర్ విజయకృష్ణ, డాక్టర్ పద్మకుమార్, సిబ్బంది క్షతగాత్రులను చికిత్స అందించారు. సీఐ, ఎస్సైలు అంబులెన్స్‌లను పిలిపించి వెంటనే క్షతగాత్రులను చికిత్స కోసం కర్నూలు తరలించారు.

## బాధితులకు పరామర్శ

తీవ్రగాయాలకు గురైె చికిత్స కోసం ఆలూరు ప్రాంతీయ ఆస్పత్రిలో చేరిన కొత్తకోట వాసులను ఎస్పీ గోపీనాథ్‌జెట్టి, ఆలూరు తెదేపా బాధ్యులు వీరభద్రగౌడు పరామర్శించారు. వీరభద్రగౌడ్ తీవ్రంగా గాయపడిన బాధితులను చికిత్స కోసం ప్రైవేటు అంబులెన్స్‌లను తెప్పించి తరలించారు. మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించి అండగా ఉంటానని, భయపడవద్దని భరోసా కల్పించారు.

## వాహన టైర్ల పరిస్థితిని డ్రైవరు చూసుకోవాలి

**– కుసుమ, మోటర్ వెహికల్ అధికారిణి, ఆదోని**

ప్రధానంగా టిప్పరు వంటి రవాణా వాహనంలో ప్రయాణికులను నిబంధనల ప్రకారం ఎక్కించుకోరాదు. ప్రధానంగా వాహనాలు నడిపే డ్రైవరు టైర్ల పరిస్థితిని ఎప్పటికప్పుడు గమనిస్తుండాలి. ప్రధానంగా వాహన సామర్థ్యం ఎంత ఉంటే అంతే లోడు వేసుకోవాలి. అధిక లోడు వేసుకోవడం వల్ల, టైరులో ఎక్కువగా గాలి ఎక్కించడం వల్ల టైరు పగిలిపోయే ప్రమాదం ఉంది.



ప్రస్తుత ప్రమాదాన్ని పరిశీలిస్తే.. వాహనం వెనుకభాగంలో బియ్యం బస్తాల లోడు, కూలీలను ఎక్కించుకోవడం లేక టైరులో ఉండాల్సిన గాలి కంటే ఎక్కువగా ఉండటం.. లేక వాహనం వెళ్లే సమయంలో టైరుకు పంక్చర్ కావడం వల్లే ప్రమాదం చోటు చేసుకుని ఉండవచ్చు. ప్రమాద ఘటనపై పూర్తిస్థాయిలో నివేదికలు తయారు చేసి కారణాలు తెలుసుకుంటాం.

## దాడులు ఉద్ధృతం చేస్తాం

**– అంకినీడు ప్రసాద్, డీఎస్పీ, ఆదోని**

ఆదోని పోలీసు సబ్ డివిజన్ ప్రాంతంలో సామర్థ్యానికి మించి ప్రయాణికులను ఎక్కించుకెళ్లే వాహనాలపై దాడులు ఉద్ధృతం చేశాం. గత రెండు రోజులు నుంచి డివిజన్‌లోని అన్ని ప్రాంతాల్లో లైసెన్సులు లేకుండా వాహనాలు నడుపుతున్న వారిపై కేసులు నమోదు చేస్తున్నాం.



ఆటో చోదకులు వారి పక్కన ప్రయాణికులను ఎక్కించుకున్నా.. అధిక లోడుతో వెళుతున్నా.. రవాణా వాహనాల్లో ప్రయాణికులను ఎక్కించుకున్నా వాహనాలను సీజ్ చేస్తాం.

# నిరుపేదల ఆశలు ఆవిరి



ప్రమాదంలో మృతిచెందిన వారంతా అత్యంత నిరుపేదలు. రెక్కాడితేగాని డొక్కాడని కుటుంబాలు. స్వగ్రామాల్లో ఉపాధి లేకపోవడంతో వలస బాట పట్టి మృత్యుఒడికి చేరారు. ఒక్కొక్కరి ఒక్కో రకమైన విషాదగీతిక.

## హనుమంతమ్మకు మరో నెలలో నిశ్చితార్థం



గ్రామానికి చెందిన గంగమ్మకు ముగ్గురు సంతానం. ఆమె భర్త మల్లేష్ గతంలోనే మృతి చెందారు. దీంతో బతుకుదెరువు కోసం కుటుంబ సభ్యులంతా కలిసి తెలంగాణాకు వలస వెళ్లారు. మరో నెలలో హనుమంతమ్మకు (16) నిశ్చితార్థం చేద్దామని ఆ కుంటుంబం ఎంతో ఆనందంగా గ్రామానికి బయలుదేరింది. అనుకోకుండా జరిగిన ప్రమాదంలో ప్రాణాలు విడిచింది. ఈఘటన గ్రామస్థులను కంట తడిపెట్టిస్తోంది. కూతురును ఒక ఇంటిదాన్ని చేయాలన్న తల్లి కోరిక నెరవేరకుండానే హనుమంతమ్మ మృత్యుఒడి చేరడం విచారకరం. వీరికి ఊర్లో సెంటు పొలం లేదు.

## పిల్లలకు ఆసరాగా ఉందామని.. తిరిగిరాని లోకాలకు


బళ్లారి శేకమ్మ(50)కు ఐదుగురు సంతానం. ఇద్దరు కుమారుల్లో ఒకరు ఆటోడ్రైవర్‌గా స్థిరపడ్డారు. మరో



కుమారుడు టైలరింగ్ వృత్తిలో ఉన్నట్లు గ్రామస్థులు తెలిపారు. ముగ్గురు అమ్మాయిలకు వివాహం జరిపించి మెట్టినింటికి పంపారు. భర్త లింగప్ప కొన్నేళ్ల క్రితం మృతి చెందడంతో తాను సైతం కూలీ పని చేసి పిల్లలకు ఆసరాగా ఉందామన్న ఉద్దేశంతో వలస వెళ్లారు. తొందరగా వెళ్లి కుమారులను చూడాలనుకుంటున్న సమయంలో ప్రమాదం కబళించింది.

## ఒకే ఇంట్లో ఇద్దరు

కొత్తకోట గ్రామానికి చెందిన భీమలింగప్పకు ఇద్దరు భార్యలు. కోసిగి నర్సమ్మ(48), కోసిగి ఈరమ్మ(45). వీరికి ఆరుగురు సంతానం. కాగా భీమలింగప్ప కొన్నేళ్ల కిందట మృతి చెందారు. ఇద్దరు భార్యలు ఎలాగొలా నలుగురు అమ్మాయిలు, కుమారుడికి పెళ్లిళ్లు చేశారు. మిగిలిన చిన్నమ్మాయికి పెళ్లి చేయడానికి వలస వెళ్లి సంపాదించాలని వారిద్దరు నిర్ణయించుకున్నారు. అక్కడ కూలీ పని చేసి వచ్చిన డబ్బుతో ఇంటికి వస్తున్న సమయంలో ప్రమాదం జరగడంతో ఇద్దరూ మృత్యువాత పడ్డారు. సంక్రాంతి పండగ బాగా చేసుకుందామని తన అత్త చెప్పిందని కోడలు లలిత కన్నీటి పర్యంతమయ్యారు.





మృతులు కోసిగి నర్సమ్మ, ఈరమ్మ

## కొడుకు శివమాల వేస్తున్నాడన్న ఆనందంతో వస్తూ

ఊళ్లో ఉన్న కుమారుడు శివమాల వేస్తున్నాడు.. తాను వెళ్లి కళ్లారా చూసి ఆనందిద్దామనుకున్న ఆ తల్లి కోరిక నెరవేరకుండానే మృత్యుఒడికి చేరింది. గ్రామానికి చెందిన గోవిందమ్మ(50) రెండు నెలల కిందట నల్గొండకు కూలీ పని కోసం వలస వెళ్లారు. ఆమెకు ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు. భర్త సిద్ధప్ప గతంలోనే మృతి చెందారు. దీంతో కొడుకు కొత్తపేటలోనే ఉంటూ ఏదో చిన్నచిన్న పనులు చేసుకున్నా.. ఒంటిరి దాన్ని నేను వలసవెళ్లి బాగా సంపాదిస్తానని తెలంగాణ వెళ్లినట్లు గ్రామస్థులు తెలిపారు.

## మృత్యువుతో పోరాడి..

గ్రామంలో చాలీచాలని సంపాదన.. ఇలా ఉంటే తమ పిల్లలకు మంచి తిండి, గుడ్డలు ఇవ్వలేం. ఇక మంచి చదువు ఎలా చదివించగలమని నారాయణప్ప(35) తన భార్య సుంకమ్మ, మరో ముగ్గురు కూతుళ్లతో కలిసి నల్గొండకు పనుల నిమిత్తం వలస వెళ్లారు. కొడుకును ఆదోనిలోని ఓ వసతిగృహంలో ఉంచి చదివిస్తున్నారు. తమ గ్రామానికి చెందిన వారంతా సొంతూరుకు వెళుతుండటంతో ఆయన తన కుంటుంబంతో కలిసి ప్రయాణమయ్యారు. అనుకోకుండా జరిగిన ప్రమాదంలో నారాయణప్ప తీవ్రంగా గాయపడి కోలుకోలేక కర్నూలులో మృతి చెందారు. కూతురు స్రవంతి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

## కుటుంబమంతా వలస

గ్రామానికి చెందిన గిరిమల్లయ్య, మంగమ్మ(40)లకు ఒక కుమారుడు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ఇంటి పోషణ కోసం కుటుంబ సభ్యులంతా వలస వెళ్లారు.



గ్రామస్థులందరితో కలిసి వస్తుండగా జరిగిన ప్రమాదంలో మంగమ్మ తీవ్రగాయాలకు గురయ్యారు. చికిత్స కోసం కర్నూలు తరలించగా.. కోలుకోలేక మృత్యుఒడి చేరింది. ఈ ఘటన ఆ కుటుంబాన్ని విషాదంలోకి నెట్టింది.

# శభాష్.. ధనుష్..



ట్రోఫీతో ధనుష్

## - జాతీయస్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో విజయం

ఒక ఆటలో ప్రతిభ చూపడం సర్వసాధారణం. రెండు, మూడు ఆటల్లో ప్రతిభ చూపే వారు బహుశా అరుదనే చెప్పవచ్చు. అలాంటి కోవకు చెందిన వాడే ధనుష్. ఆళ్లగడ్డ మండలంలోని అహోబిలం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న ధనుష్ మూడురకాల ఆటల్లో రాణిస్తూ సత్తా చాటుతున్నాడు. బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో జాతీయ స్థాయిలో రాణించి పలువురితో ప్రశంసలు అందుకొన్నాడు. చిన్నప్పటి నుంచి ఆటలపై ఉన్న అమితాసక్తే విజయానికి దోహదపడిందని ధనుష్ అంటున్నారు.

- న్యూస్‌టుడే, ఆళ్లగడ్డ గ్రామీణ



సాధన చేస్తున్న ధనుష్

అహోబిలం గ్రామానికి చెందిన నాగలక్ష్మి, వెంకటేశ్వర్లు ధనుష్ తల్లిదండ్రులు. తండ్రి ప్రమాదంలో మరణించడంతో తల్లి కూలిపనులకు వెళ్లి కుటుంబాన్ని పోషిస్తున్నారు. ఆటలపై ఉన్న మక్కువతో పాఠశాలలో ఆటల సమయాల్లో పలు రకాల ఆటలాడేవాడు. ఈ క్రమంలోనే ఆరోతరగతిలో మొదట ఖోఖో ఆడటం ఆరంభించాడు. చాగలమర్రి ముత్యాలపాడులో జోనల్ స్థాయి పోటీల్లో పాల్గొని ఖోఖోలో మొదటి బహుమతి సాధించాడు. పైగా క్రీడల్లో సత్తాచాటి కర్నూలు జిల్లా జట్టులో స్థానం సంపాదించాడు. ఎనిమిదవ తరగతి వచ్చేసరికి పరుగుపై ఆసక్తి పెంచుకొని సాధన చేశాడు. ఇందులో రెండు మార్లు జోనల్ స్థాయిలో మొదటి బహుమతి పొందాడు. తొమ్మిదో తరగతి వచ్చేసరికి బదిలీపై వచ్చిన వ్యాయామ ఉపాధ్యాయుడు బాబు ధనుష్‌లో ప్రతిభను గుర్తించి ఒక్క ఆటపైన దృష్టి సారించేలా కృషి చేశాడు. ఇలా బాల్‌బ్యాడ్మింటన్ పై ప్రత్యేక శ్రద్ధతో శిక్షణ తీసుకొని విజయం దిశగా ముందుకు నడిచాడు.

### విజయాలు ఇలా..

★ నంద్యాలలో సెప్టెంబర్‌లో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో విజయం సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత పొందాడు.

★ రాష్ట్రస్థాయి అండర్-14 విభాగంలో నెల్లూరు జిల్లా గూడూరులో జరిగిన పోటీల్లో మంచి ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీల జట్టుకు ఎంపికయ్యాడు.

★ ఛండీఘర్‌లో నవంబర్‌లో జరిగిన అండర్-14 బాలుర విభాగం జాతీయ స్థాయి పోటీల్లో తన చురుకైన ఆటతో ఆంధ్రప్రదేశ్ జట్టును గెలిపించాడు. అహోబిలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థికి జాతీయస్థాయిలో గుర్తింపు పొందడమే గాక బంగారు పతకం సాధించాడు.

★ ఇదే ఉత్సాహంతో పరుగు పోటీల్లోనూ రాణించాలని లక్ష్యంగా పెట్టుకున్నాడు. దీనికి సాధన చేస్తున్నాడు.



### పరుగు పందెంలో రాణించాలి

- ధనుష్, విద్యార్థి

వ్యాయామ ఉపాధ్యాయుడు బాబు ఇచ్చిన శిక్షణతోనే ఇన్ని విజయం సాధించగలిగాను. దాతల సహకారం తోడవడంతో పోటీల్లో పాల్గొన్నాను. పరుగు పందెంలో జాతీయస్థాయిలో రాణించాలని ఉంది. ఇందుకు తగిన శిక్షణ తీసుకొంటున్నారు. ఉపాధ్యాయుల ప్రోత్సాహం ఉంటే విద్యార్థులు క్రీడల్లో రాణించగలమనేది నా నమ్మకం.



### అభిరుచికి తగినట్లు శిక్షణ

- బాబు, వ్యాయామ ఉపాధ్యాయుడు

విద్యార్థులకు ఆటలపై ఉన్న ఆసక్తికి తగినట్లు శిక్షణ ఇవ్వాలి. అప్పుడే విజయాలు సాధించేందుకు దోహదపడుతుంది. ధనుష్‌కు బాల్‌బ్యాడ్మింటన్‌పై ఉన్న ఆసక్తిని గుర్తించి జాతీయ స్థాయిలో రాణించేలా శిక్షణ ఇచ్చాను. ఈ ఉత్సాహంతో మరిన్ని విజయాలు సాధించేందుకు నా వంతుగా సహకరిస్తాను.

# శిరస్త్రాణం.. ప్రాణాలకు అభయం



రహదారి ప్రమాదాలు రోజురోజుకీ ఎక్కువవుతున్నాయి. చిన్నపాటి నిర్లక్ష్యంతో ప్రాణాలు పోగొట్టుకుంటున్న వారు ఎందరో ఉన్నారు. ప్రధానంగా జరుగుతున్న ప్రమాదాల్లో ద్విచక్రవాహనదారుల సంఖ్య ఎక్కువగా ఉంటోంది. ముఖ్యంగా యువత అర్ధంతరంగా విలువైన జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. శిరస్త్రాణం ధరించాలని పదే పదే సూచిస్తున్నా.. మార్పు రావడం లేదు. ప్రజల్లో మార్పు తీసుకురావడానికి ఆదోని మండలం ఇస్వీ పోలీస్టేషన్ పరిధిలో ఎస్.ఐ రాజ్‌కుమార్, పోలీసులు ప్రయత్నిస్తున్నారు. రదారులపైకి వచ్చి శిరస్త్రాణాలు ఇస్తూ.. వాటిపై అవగాహన కల్పిస్తున్నారు. దాని వల్ల కలిగే ప్రయోజనాలున వివరింగా చెబుతున్నారు. మీరు మారి.. అందర్నీ మార్చాలని ప్రతిజ్ఞ చేయిస్తున్నారు. అందరూ మారాలని ఆశిద్దాం. - న్యూస్‌టుడే, ఆదోని గ్రామీణ

# భక్తజనంలోకి భక్తసులభుడు

● నేడు శ్రీనీలకంఠుడి మహారథోత్సవం


● ఎమ్మిగనూరుకు తరలిరానున్న లక్షల మంది



స్వామి గుడి...

ఎమ్మిగనూరు పట్టణంలో వెలసిన శ్రీనీలకంఠేశ్వరుడి బ్రహ్మోత్సవాలు నయనానందకరంగా సాగుతున్నాయి. పుష్యమాసంలో పౌర్ణమి రాత్రి నుంచి మొదలై ఐదురోజులు ఈ వేడుకలు నిర్వహిస్తారు. ఆద్యంతం భక్తి శ్రద్ధల మధ్య పూజా క్రతువులు కొనసాగుతున్నాయి. కోరిన కోరికలు తీర్చే భక్తసులభుడు అమ్మవారితో సహా నేడు లక్షలాది భక్తజనం మధ్యకు రానున్నారు. మహారథంపై ఆశీనులై ఆశీర్వదించనున్నారు. తేరుపై ఊరేగే త్రినేత్రుడిని చూడ చేనేతపురికి వెళ్తున్నారు పరిసర ప్రాంత జనం...

- న్యూస్‌టుడే, ఎమ్మిగనూరు, ఎమ్మిగనూరు వ్యవసాయం



సిద్ధంగా ఉన్న రథం (దాచిన చిత్రం)

శ్రీ నీలకంఠేశ్వరుడి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఎమ్మిగనూరు తేరుబజార్‌లో మహారథం ఊరేగిస్తారు. గురువారం ఉదయం స్వామికి వెండి ఆభరణాలతో అలంకరణ చేస్తారు. రుద్రాభిషేకం, కుంకుమార్చనలు తదితర పూజలుంటాయి. స్వామికి మొక్కులు తీర్చేందుకు వేలాది భక్తులు తరలి వస్తారు. సాయంత్రం నాలుగు గంటలకు ఆదిదంపతుల ఉత్సవ విగ్రహాలను పల్లకిలో ఊరేగిస్తారు. కోలాటాలు, గొరవయ్యల నృత్యాల మధ్య ఇది సాగుతుంది. అనంతరం గడిగ వంశీయులు పూర్ణకుంభంతో స్వామి వారికి ప్రసాదాన్ని ఊరేగింపుగా తీసుకొస్తారు. దేవాదాయ శాఖ, వంశపారంపర్య ధర్మకర్త మాచాని నీలకంఠప్ప వంశస్తులు హోమం జరుపుతారు. తర్వాత స్వామి అమ్మవార్లను రథంపై చేర్చి పూజలు చేస్తారు. ఆపై ఆరు గంటలకు రథం లక్షల మంది భక్తజనం మధ్య కదులుతుంది. స్థానిక బసవన్న గుడి వరకు ఓం నమః శివాయ అంటూ భక్తులు జయజయ ధ్వానాల మధ్య రథం లాగుతారు. తిరిగి రథం యథాస్థానం చేరుకొన్న తర్వాత స్వామి, అమ్మవార్లకు పూజలు నిర్వహించి, పల్లకిలో ప్రధాన దేవాలయం చేర్చుతారు. ఈ వేడుకలు కనులరా చూసేందుకు వివిధ రాష్ట్రాల నుంచి భక్తులు తరలివస్తారు.

### స్థలపురాణం

ఎమ్మిగనూరు పట్టణం ఒకనాడు గుడేకల్లు పంచాయతీకి మజరా గ్రామంగా ఉండేది. ఆ సమయంలో మల్లార వీధిలో (ప్రస్తుతం ఉండే నీలకంఠేశ్వరస్వామి గుడి) కాశీ నుంచి శివలింగాన్ని తీసుకొచ్చి ప్రతిష్ఠించారని కొందరు చెబుతుంటారు. ఇక్కడ ఓ రోజు కొందరు చేనేత కార్మికులు పొలం దున్నుతుండగా శివలింగం బయటపడిందని అంటుంటారు. లింగాన్ని ఇక్కడ ప్రతిష్ఠించి అప్పటి నుంచి ప్రత్యేక పూజలు చేస్తున్నట్లు మరికొందరు అంటుంటారు. అలా పట్టణంలో అందరి ఇలవేల్పుగా నీలకంఠేశ్వరుడు చేనేతపురిలో కొలువుదీరారు.

### ఆడపడుచుల దీవెనలు...

ఉత్సవాల సందర్భంగా ప్రతి ఇంట్లో ఆడపడుచులను పిలిచి వారికి చీర, పసుపు, కుంకుమ, విభూతి, మిఠాయిలు ఇవ్వడం ఆచారం. బ్రహ్మోత్సవాల్లో కులమాతలకు అతీతంగా ప్రతి ఒక్కరు పాల్గొంటారు. నుంచి ఈశ్వరుడి నామ స్మరణతో పట్టణం పులకించి పోతుంది.



శ్రీ నీలకంఠేశ్వర స్వామి



స్వామి అమ్మవార్లు

### జాతర ఎంతో ప్రత్యేకత

ఈ ప్రాంతాన్ని పూర్వం ఎనుములూరుగా పిలిచేవారు. పూర్వం ఊరి సంతలో ఏనుముల(గేదె) క్రయవిక్రయాలు పెద్దఎత్తున జరిగేవి. ఈ ఊరి సంతకు కర్నూలు, గద్వాల, వనపర్తి, కంప్లీ తదితర ప్రాంతాల నుంచి పశువులు తీసుకొచ్చి అమ్మేవారు. గేదెను కన్నడంలో యనుము అంటారు. ఆ పదం నుంచే ఎనమూలూరు అని ప్రచారంలోకి వచ్చిందని కొందరు అంటున్నారు. మరికొందరు హెమ్మె అంటే కన్నడంలో గర్వం అని అర్థం. గజపతులను ఓడించిన శ్రీకృష్ణదేవరాయలులో అహం పెరిగిందని అంటుంటారు. దీన్ని వల్ల అనర్థాలు వస్తాయని కొందరు పెద్దల సూచన మేరకు ఆయన యజ్ఞ హోమాలు చేయించినట్లు చెబుతారు. వారు నీలకంఠేశ్వరుడిని ఉద్దేశించి ఇక్కడే యాగం నిర్వహించడంతో రాయల అహాన్ని తొలగించిన ఊరు గనుక ఇది హెమ్మగనూరుగా... అనంతరం కాల క్రమంలో ఎమ్మిగనూరుగా మారిందని మరికొందరు చెబుతుంటారు. ఇలా పేరుపై విభిన్న నేపథ్యాలు ఉన్నాయి.

### నెలరోజుల జాతర కనులరా చూడాల్సిందే

దాదాపు నెలరోజుల పాటు ఎంతో ఘనంగా సాగే జాతరను కనులారా చూడాల్సిందే. స్వామికి పూజలు జరిపేందుకు చుట్టుపక్కల ప్రాంతాలతో పాటు తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, కేరళ, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, ఒడిశా రాష్ట్రాల నుంచి భక్తులు తరలివస్తారు. విదేశాల్లో ఉన్న ఎమ్మిగనూరు ప్రాంతం వారు సైతం స్వామి బ్రహ్మోత్సవాలకు తప్పకుండా హాజరవుతారు. ఇలా స్వామి భక్తులు ఎక్కడ ఉన్నా బ్రహ్మోత్సవాలకు ఎమ్మిగనూరు చేరుకొంటారు. అలాగే జాతర అంగళ్లలో రైతులకు అవసరమైన సామగ్రి, తీపి పదార్థాలు, నిప్పులపై కాల్చిన కడ్డీల మాంసం ప్రసిద్ధి.

# అంధుల జీవితాల్లో 'వెలుగు'

★ ఆరుచుక్కల చదువు.. బ్రెయిలీ లిపిలో విద్యాభ్యాసం

★ నేడు లూయిస్ బ్రెయిలీ జయంతి



తెలుగు, ఆంగ్లం నేర్చుకునేందుకు అక్షరమాల

**పత్తికొండ పట్టణం, న్యూస్‌టుడే:** వారు పుట్టుకతోనే అంధులు. అందరిలాగా వారు చూడలేరు.. చదువలేరు. సాధారణ వ్యక్తుల్లా సమాజంలో కలసి మెలసి తిరిగేలా వారి జీవితాలను చక్కదిద్దేందుకు ఫ్రాన్సు దేశానికి చెందిన లూయిస్ బ్రెయిలీ ఓ లిపికి రూపకల్పన చేశారు. ఓ ప్రమాదంలో చూపును కోల్పోయిన ఆయన చదువుపై ఉన్న ఆసక్తితో తనలా ఇతరులు చదువుకు దూరం కాకూడదన్న భావనతో ఆ లిపిని రూపొందించారు. ఆయన పేరు మీదనే 'బ్రెయిలీ లిపి' ప్రపంచవ్యాప్తంగా కొనసాగుతోంది. గురువారం ఆయన జయంతిని పురస్కరించుకుని ప్రత్యేక కథనం.

ఆరు చుక్కల చదువుగా వ్యవహారికంలో ఉన్న బ్రెయిలీ లిపి పూర్తిగా అంధత్వం ఉన్న వారికి ఉపయోగపడుతుంది. సాధారణ చూపు 180 డిగ్రీల కోణం.. కాగా 10 శాతం కన్నా తక్కువ ఉన్న వారికి ఈ లిపి బాగా ఉపయోగపడుతుంది. కుడినుంచి ఎడమకు రాయాలి. ఆరు చుక్కలు ఉంటాయి. చదివేటప్పుడు ఎడమ నుంచి కుడికి చదవాలి. ఒక అక్షరానికి ఉన్న చుక్కలు మరొక్క అక్షరానికి ఉండవు. జిల్లాలోని భవిత కేంద్రాల్లో 14 ఏళ్లలోపు 36 మంది అంధ విద్యార్థులు బ్రెయిలీ లిపి నేర్చుకొంటున్నారని పత్తికొండ భవిత కేంద్ర సహిత విద్య ఉపాధ్యాయుడు జి.బాబు పేర్కొన్నారు. పత్తికొండ కేంద్రంలో ఇద్దరు విద్యార్థులున్నారు. వీరికి బ్రెయిలీలిపిలో చదువుకునేందుకు అవసరమైన సరంజామాను భవిత కేంద్రాలకు సమకూర్చారు. అన్ని పాఠ్యాంశాలు వీరికి ఉంటాయి.


### పిల్లలు బ్రెయిలీ లిపికి అలవాటు పడ్డారు

- విద్యార్థుల తల్లిదండ్రులు మహబూబ్ భాషా, సారాబి



పత్తికొండ గ్రామ పంచాయతీలో నీటి విభాగంలో పని చేస్తున్న మహబూబ్ భాషా, సారాబీల దంపతులకు పుట్టిన ఇద్దరు పిల్లలు అంధులే. ఎనిమిదేళ్ల ఉస్మాన్‌ఘని, ఐదేళ్ల హసీనా స్థానిక భవిత కేంద్రంలో చేరారు. బ్రెయిలీ లిపికి అలవాటు పడ్డారు. కాగా ఒకరికి మాత్రమే ప్రభుత్వ పింఛను వస్తోంది. అమ్మాయికీ వస్తే కొంతమేర మనసు కుదుటపడుతుంది. ప్రభుత్వం కనికరించాలి.

# శ్రీగిరి.. పచ్చందాల లోగిలి!!



పచ్చదనంతో కళకళలాడుతున్న శంకరవనం



ఆలయ మాడవీధుల పక్కన పెంచుతున్న పచ్చదనం



రాక్ గార్డెన్‌లో పూలసోయగం

ప్రముఖ శైవక్షేత్రమైన శ్రీశైలం పచ్చందాలతో ఆకట్టుకుంటోంది. దేవస్థానం అధికారులు శ్రీశైలాన్ని సుందరీకరించే పనులకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. ఇందులో భాగంగా నూతనంగా ఉద్యానవనాలను సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. అంతర్గత రహదారుల మధ్యన అలంకరణ మొక్కలు పెంచుతున్నారు. పరిశుభ్రంగా పచ్చదనంతో శ్రీగిరి వీధులు భక్తులు, స్థానికులను ఆకట్టుకుంటున్నాయి. వీఐపీ కాటేజీల వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన శంకరవనం (రాక్‌గార్డెన్)లో చామంతి, గులాబి మొక్కలు విశేషంగా ఆకర్షిస్తున్నాయి. స్థానికంగా ఉండే రాళ్ల వరుసల మధ్యన పూలను పెంచుతున్నారు. ఆలయం మాడవీధుల చుట్టూ పచ్చదనాన్ని పెంచుతున్నారు.

- న్యూస్‌టుడే, శ్రీశైలం ఆలయం






నంద్యాల మాతా, శిశు సంరక్షణశాల

# కాయకల్ప్ స్వచ్ఛత సంకల్ప్

★ పరిశుభ్రత పాటించిన ఆసుపత్రులకు మార్కులు

★ ప్రథమ స్థానానికి రూ.15 లక్షల బహుమతి

★ జిల్లాలో 8, 9, 10 తేదీల్లో ప్రత్యేక బృందం తనిఖీలు





ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రవేశ పెట్టిన స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ ఆసుపత్రులను శుభ్రంగా ఉంచడానికి స్వచ్ఛ ఆసుపత్రిగా మార్చడానికి 'కాయకల్ప్' అనే కార్యక్రమాన్ని ప్రవేశ పెట్టారు. ఇందులో భాగంగా రాష్ట్రంలో 13 జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రులల్లో పరిశుభ్రతను పరిశీలించి మార్కులు కేటాయిస్తారు. మంచి మార్కులు వచ్చిన ఆసుపత్రి సిబ్బంది కేంద్ర ప్రభుత్వం నుంచి బహుమతిని అందుకోనున్నారు. దీంతో ఆసుపత్రులల్లో పరిశుభ్రతతోపాటు రోగులకు మెరుగైన వైద్యం అందనుంది.

- న్యూస్‌టుడే, నంద్యాల పాతపట్టణం

### ఈ అంశాలపై మార్కులు

జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రులల్లో కింది మౌలిక వసతులను పరిశీలిస్తారు

★ బయో మెడికల్ వ్యర్థాల నిర్వహణ

★ రోగులకు ఇన్ఫెక్షన్ రాకుండా నియంత్రణ

★ ఆసుపత్రి ఆవరణలో పందులు, ఎలుకలు వంటి కనిపించకుండా తీసుకునే జాగ్రత్తలు

★ ఆసుపత్రిలో భద్రతాపరమైన చర్యలు

★ బ్లీచింగ్ సొల్యూషన్‌పై శుభ్రత పరిశీలన

★ పరిసరాల పరిశుభ్రతపై పరిశీలన.. వంటి అంశాలను వైద్యాధికారులు, నాణ్యతా నియంత్రణ అధికారి పరిశీలించి మార్కులు ప్రకటిస్తారు.

### జిల్లాలో ఏడు ఆసుపత్రుల్లో పరిశీలన

జిల్లాలోని నంద్యాల, ఆదోని ప్రాంతీయ, ఆదోని ఎంసీహెచ్‌లతోపాటు బనగానపల్లె, డోన్, సున్నిపెంట, నందికొట్కూరు సీహెచ్‌సీ ఆసుపత్రుల్లో స్వచ్ఛతపై ఈ నెల 8, 9, 10వ తేదీల్లో ఇతర ఆసుపత్రుల నుంచి వచ్చిన బృందం పరిశీలించనుంది. వారు కేటాయించిన అంశాల్లో స్వచ్ఛతను గుర్తించి మార్కులు అందజేస్తారు.

### 2004లో ప్రవేశపెట్టి..

కేంద్ర ప్రభుత్వం 'కాయకల్ప్' కార్యక్రమాన్ని 2014లో ప్రవేశపెట్టింది. అప్పటి నుంచి 2015, 2016 సంవత్సరాల్లో విజయనగరం జిల్లాకు ప్రథమ బహుమతిగా రూ.15 లక్షలు ఆసుపత్రి అభివృద్ధి కోసం అందజేశారు. ద్వితీయ స్థానంలో నిలిచిన ఆసుపత్రికి రూ.10 లక్షల బహుమతిని కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి చేతుల మీదుగా అందజేయనున్నారు. వాటి ద్వారా రోగులకు మౌలిక వసతులు కల్పించనున్నారు.

### రోజూ ఆరుసార్లు శుభ్రత

ఆసుపత్రిలో వైద్యం చేయడం ఎంత ముఖ్యమో, వారికి ఎలాంటి ఇన్ఫెక్షన్లు రాకుండా చూసుకోవడంతో పాటు మౌలిక వసతులు కల్పించడం కూడా అంతే ముఖ్యం. ఈ కార్యక్రమం ద్వారా ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోజుకు ఆరుసార్లు శుభ్రం చేయాల్సి ఉంది. దీనివల్ల రోగులకు మెరుగైన వైద్యం అందుతుంది. ఒకరి నుంచి మరొకరికి వ్యాధులు వ్యాప్తి చెందకుండా ఉంటాయి. దాంతో రోగులకు వ్యాధులు త్వరగా నయమవుతాయి. దీనివల్ల ఆసుపత్రి కూడా అభివృద్ధి చెందుతుంది.

### ఆసుపత్రి శుభ్రంగా ఉంటుంది

- డా.విజయ్‌కుమార్, జిల్లా ఆసుపత్రి పర్యవేక్షకుడు



కేంద్ర ప్రభుత్వం పరిశుభ్రతను ప్రోత్సహించడం వల్ల రోగులకు మౌలిక వసతులు ఏర్పాటవుతాయి. వచ్చే రోగులు కూడా శుభ్రతను పాటించి ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన చెత్తకుండీల్లోనే చెత్తను వేసి సహకరిస్తే పరిశుభ్రత మెరుగుపడుతుంది. ఆసుపత్రిలో కూడా వివిధ గోడ ప్రతులను అతికించి రోగులకు అవగాహన కల్పిస్తున్నాం. అంతేకాకుండా మైక్ ద్వారా చెబుతూ రోగులు శుభ్రతను పాటించేలా చర్యలు తీసుకుంటున్నాం.

### పోటీగా శుభ్రతను పాటిస్తారు

- రూప్‌కుమార్, జిల్లా నాణ్యత నియంత్రణ మేనేజర్

కాయకల్ప్ ద్వారా ఆసుపత్రుల్లో శుభ్రత చేపట్టడంలో పోటీ పడనున్నారు. అన్ని ప్రాంతాల్లో మెరుగైన శుభ్రతను పాటిస్తారు. ఈ బహుమతి అందుకోవాలంటే భద్రత, ఇన్ఫెక్షన్ అదుపు వంటివి పరిశీలిస్తారు. ఇందుకు కార్మికులు కూడా నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటి పని అప్పుడే చేస్తారు. దీంతో ఆసుపత్రి అంతా శుభ్రంగా ఉంటుంది. అలాంటి ఆసుపత్రులే బహుమతులకు ఎంపికవుతున్నాయి.

# నెరవేరిన.. ఆళ్లగడ్డవాసుల కల



న్యాయవాదులతో సమావేశమైన న్యాయమూర్తులు

**(మొదటిపేజీ తరువాయి)** వారు బార్ అసోసియేషన్ సభ్యులతో సమావేశం నిర్వహించారు. అదనపు జిల్లా న్యాయ స్థానం ఏర్పాటుతో ప్రయోజనాలు వివరించారు. ఆళ్లగడ్డలో ఇంతవరకు అసిస్టెంటు సెషన్సు జడ్జి కోర్టు, జ్యుడీషియల్ ఫస్టు క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులు ఉన్నాయి. ఇక్కడ తీవ్రనేరాల కంటే తక్కువ స్థాయి వాటిని విచారణకు స్వీకరిస్తారు. హత్యానేరాలకు సంబంధించిన కేసుల విచారణ నంద్యాలలోని జిల్లా కోర్టులో జరుగుతుంది. దీంతో పాటు రహదారి ప్రమాదాలకు సంబంధించిన బీమా కేసుల విచారణ సైతం జిల్లా కోర్టులోనే జరుగుతున్నాయి. ఆళ్లగడ్డకు అదనపు జిల్లా కోర్టు అందుబాటులోకి రానుండడంతో ఇకనుంచి ఇటువంటి అన్ని కేసుల విచారణ ఇక్కడే జరుగుతుంది.

☛ ఆళ్లగడ్డ, కోవెలకుంట్ల అసిస్టెంటు సెషన్సు న్యాయస్థానాల్లో తిరస్కరణకు గురైన బెయిళ్లపై అప్పీలుకు నంద్యాలలోని అదనపు జిల్లా కోర్టుకు వెళ్లాల్సిన అవసరం లేకుండా ఇక్కడే అప్పీలు చేసుకోవచ్చు.

☛ సెషన్సు కోర్టుకు సంబంధించిన కేసుల్లోని బెయిళ్ల విచారణ కర్నూలులోని జిల్లా కోర్టు ఆదేశాల మేరకు నంద్యాలలోని అదనపు జిల్లా కోర్టులో విచారణ జరుగుతుంది. ఆళ్లగడ్డలోనే అదనపు జిల్లా కోర్టు అందుబాటులోకి రానుండడంతో ఇకనుంచి బెయిళ్లపై విచారణ ఇక్కడే జరుగుతుంది.

☛ కక్షిదారులు కేసుల విచారణకు నంద్యాలకు వెళ్లాల్సిన అవసరం ఉండదు.

☛ ఆళ్లగడ్డ, కోవెలకుంట్లకు చెందిన న్యాయవాదులు జిల్లా అదనపు కోర్టులో విచారణలకు ఇకనుంచి నంద్యాలకు రాకపోకలు సాగించాల్సిన అవసరం ఉండదు.

☛ రూ.15 లక్షల విలువ దాటిన సివిల్ కేసుల విచారణ సైతం ఇక్కడే జరుగుతుంది.

☛ నేరస్థులకు సత్వర శిక్ష పడడంతో పాటు బాధితులకు సత్వర న్యాయం అందుతుంది.

### అందరికీ ఎంతో మేలు

– రమణయ్య, న్యాయవాది



ఆళ్లగడ్డకు అదనపు జిల్లా న్యాయస్థానం రావడం శుభపరిణామం. కక్షిదారులకు, న్యాయవాదులకు ఎంతో మేలు చేస్తుంది. కేసుల విచారణ సైతం వేగవంతమవుతుంది. కేసు విచారణ ఇక్కడే జరుగుతూ ఉండడంతో కక్షిదారులకు సమయం, డబ్బులు ఆదా అవుతాయి.

### సత్వర విచారణకు అవకాశం

– బాలునాయక్, ఏపీపీ, ఆళ్లగడ్డ



ఇక్కడ ఏర్పడే 5వ అదనపు జిల్లా న్యాయస్థానంలో ఆళ్లగడ్డ, కోవెలకుంట్లలకు సంబంధించిన కేసుల విచారణే జరుగుతుంది. కేసుల విచారణ వేగంగా సాగుతుంది. పెడింగు కేసులకు త్వరగా పరిష్కారం లభిస్తుంది. నిందితులకు వేగంగా శిక్షలు పడతాయి.

# నల్లమల ఘాట్‌లో బస్సు లారీ ఢీ



రోడ్డు ప్రమాదంలో ఢీ కొన్న లారీ, బస్సు

**ఆత్మకూరు గ్రామీణ, న్యూస్‌టుడే:** నల్లమల అటవీ పరిధిలోని రోళ్లపెంట ఘాట్ వద్ద ఆర్టీసీ బస్సు, తిరుమల పాల డయిరీ లారీ ఢీ కొన్నాయి. లారీ డ్రైవర్ శ్రీనివాసరావు తీవ్రంగా గాయపడ్డారు. ఎమ్మిగనూరు డిపోనకు చెందిన బస్సు శ్రీశైలం నుంచి మంత్రాలయానికి వెళ్తుండగా శ్రీశైలానికి పాల ప్యాకెట్‌లు పాల పదార్థాలు తరలిస్తున్న లారీ ఘాట్‌లోని రోళ్లపెంట వద్ద ఎదురెదురుగా ఢీ కొన్నాయి. లారీ డ్రైవర్‌కు కాలు విరిగిపోయింది. ఎస్సై వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో పోలీస్ రక్షణ వాహనంలో తీసుకువచ్చారు. మార్గ మధ్యలో వెంకటాపురం వద్ద 108 వాహనం రావడంతో దానిలో ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్సల అనంతరం వైద్యుల సూచన మేరకు కర్నూలుకు తరలించారు. మిగిలిన వారికి స్వల్ప గాయాలైనట్లు ఎస్సై తెలిపారు.

# నంద్యాల రైల్వేస్టేషన్‌పై ప్రత్యేక శ్రద్ధ




నంద్యాల రైల్వేస్టేషన్‌ను తనిఖీ చేస్తున్న డీఆర్‌ఎం వీజీ భూమ, పక్కన ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందారెడ్డి

**నంద్యాల, న్యూస్‌టుడే:** గుంటూరు రైల్వే డివిజన్‌లో నంద్యాల రైల్వేస్టేషన్‌కు ఎంతో ప్రాముఖ్యత నిస్తున్నామని గుంటూరు రైల్వే డివిజన్ మేనేజర్ వీజీ భూమ పేర్కొన్నారు. నంద్యాల రైల్వేస్టేషన్‌ను బుధవారం ఆమె తనిఖీ చేశారు. ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందారెడ్డి, కౌన్సిలర్ కొండారెడ్డి డీఆర్‌ఎంను కలసి నంద్యాల రైల్వేస్టేషన్ సమీపంలో వ్యాపారులకు వాణిజ్య సముదాయాల నిర్మాణం, ఇతర అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. అనంతరం ఆమె ఎమ్మెల్యేతో కలసి స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఆర్‌ఎం మాట్లాడుతూ... నంద్యాల రైల్వేస్టేషన్ అభివృద్ధిపై పూర్తి శ్రద్ధ చూపుతున్నామన్నారు. త్వరలోనే రైల్వేస్టేషన్ సమీపంలో పిల్లల కోసం రామాలయం ప్రాంతంలో ఉద్యానవనాన్ని నిర్మించబోతున్నామన్నారు. దక్షిణం వైపున మరో టిక్కెట్ మంజూరు యంత్రాన్ని ఏర్పాటు చేయబోతున్నామని పేర్కొన్నారు. ఈ నెల 17న దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ నంద్యాలకు రానున్నారన్నారు. పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఆయన ద్వారా శంకుస్థాపన చేయిస్తామన్నారు. మరికొద్ది రోజుల్లో నంద్యాల రైల్వేస్టేషన్ పూర్తి స్థాయిలో అభివృద్ధితోపాటు సుందరంగా తీర్చిదిద్దుతామన్నారు.

# కాసులకు కార్పొరేట్ వల

**(మొదటిపేజీ తరువాయి)** ఈయనే కావడం గమనార్హం. రోగికి 7వ తేదీ ప్రభుత్వాసుపత్రిలో యాంజియోగ్రామ్ చేసిన రిపోర్టునే(సీడీ) మూడోకంటికి తెలియకుండా కార్పొరేట్ ఆసుపత్రి చెంతకు చేర్చినట్లు తెలుస్తోంది. అంటే ఇలా ప్రభుత్వాస్పత్రికి వచ్చే రోగులకు మాయమాటలు చెప్పి, ఒత్తిడి పెట్టి కార్పొరేట్, ప్రైవేటు ఆసుపత్రులకు మళ్లిస్తున్నారని ఆ ప్రొఫెసర్‌పై ఎన్నో ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పెద్దాస్పత్రి నుంచి ఇలా ఇప్పటికే 200 మంది రోగులను కార్పొరేట్‌కు పంపినట్లు ఆరోపణలున్నాయి. రోగుల రిపోర్టులు బయటకు వెళుతున్నా, ప్రభుత్వాస్పత్రిలో చేరి ఆ తర్వాత ప్రైవేటు, కార్పొరేట్ ఆసుపత్రుల్లో శస్త్రచికిత్సలు చేయించుకుంటుంటే.. ఇంత తతంగం జరుగుతున్నా సంబంధిత హెచ్‌వోడీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.

### రోగులతో కాసుల వేట...

జిల్లా సర్వజన ఆస్పత్రికి కర్నూలుతోపాటు ఇతర జిల్లాల నుంచి సైతం రోగులు వేల సంఖ్యలో వస్తుంటారు. ఎన్టీఆర్ వైద్యసేవ పథకం ద్వారా ఏటా రూ.కోట్లలో నిధులు ప్రభుత్వం వెచ్చిస్తోంది. పథకంలో ఒక్క గుండె విభాగం తీసుకుంటే రోగి గుండెపోటుతో ఆస్పత్రిలో చేరి పరీక్షలు జరిపితే రూ.30 వేల ప్యాకేజీ ప్రభుత్వం అందజేస్తుంది. ఆ తర్వాత పరీక్షలను బట్టి ఒక వాల్వు(స్టంట్) వేస్తే రూ.65 వేలు, రెండు స్టంట్లు వేస్తే రూ.85 వేలు, బైపాస్ సర్జరీ చేస్తే రూ.1.15 లక్షలు ప్రభుత్వ రోగి తరపున ఆయా ఆస్పత్రులకు చెల్లిస్తుంది. ఇలా మిగిలిన అన్ని శస్త్రచికిత్సలకు వివిధ ప్యాకేజీల్లో నిధులు ఎన్టీఆర్ వైద్యసేవ ద్వారా ఇస్తారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో అడ్మిట్(చేరిన) రోగులను సైతం కార్పొరేట్ ఆసుపత్రులకు లాక్కుంటూ ఈ నిధులు బొక్కేస్తున్నారు. అత్యవసర పరిస్థితుల్లో రోగులను చేరవేసే అంబులెన్స్ డ్రైవర్లు నేరుగా కార్పొరేట్‌కు తీసుకెళ్లినందుకు కమీషన్లు ఇస్తారు. ఇక ప్రభుత్వ ఆస్పత్రిలో పనిచేసే సిబ్బంది, గ్రామాల నుంచి రోగులను తీసుకొచ్చే ఆర్‌ఎంపీలు ఇలా ప్రతి ఒక్కరికి కమీషన్ల వల విసురుతున్నారు. రూ.లక్షకు రూ.పదివేల వరకు కమీషన్లు వెదజల్లుతున్నారు. అలా కార్పొరేట్ గడపతొక్కే చేరు రోగికి ప్రాణభయం పెట్టి అదనంగా రూ.లక్షలు గుంజుతున్నారు.

### ఆర్థో, కార్డియాలజీ విభాగాల్లో...

సర్వజన ప్రభుత్వాస్పత్రిలో ఆర్థో, కార్డియాలజీ విభాగాల నుంచి ఎక్కువగా ప్రైవేటు ఆస్పత్రులకు కేసులు మళ్లిస్తున్నట్లు సమాచారం. కార్డియాలజీ విభాగానికి యాంజియోగ్రామ్, స్టంట్లు వేసేందుకు క్యాపిల్యాబ్‌కై ప్రభుత్వం రూ.4 కోట్లు నిధులు అందజేసింది. ఇంత విలువైన పరికరాలు పేదలకు అందుబాటులో ఉన్నా... అవగాహన కల్పించాల్సింది పోయి అపోహలు సృష్టించి కార్పొరేట్‌కు దారి మళ్లిస్తున్నారు. నెలకు 50 మంది రోగులు యాంజియోగ్రామ్ చేయించుకుంటుండగా... వాటిలో సగం కేసులు బయట కార్పొరేట్‌కు మళ్లుతున్నవే. ఇలా చూస్తే నెలకు ఒక్క విభాగానికే రూ.30 లక్షల వరకు నష్టం జరుగుతోంది. ఇలా ఏటా ఎన్టీఆర్ వైద్యసేవకు విడుదలవుతున్న రూ.40 కోట్లలో అగ్రభాగం లాగేస్తున్నారు.

### 3 నెలలుగా రోగులు పక్కకు వెళుతుంది లేదు

– చంద్రశేఖర్, హెచ్‌వోడీ కార్డియాలజీ, సూపరింటిండెంట్

గత మూడు నెలలుగా రోగులు ప్రభుత్వాసుపత్రి నుంచి కార్పొరేట్ ఆసుపత్రికి వెళుతున్న కేసులు లేవు. గతంలో ఇలాంటివి జరిగినట్లు గుర్తించి వెంటనే స్పందించాం. ఇప్పుడైతే ప్రభుత్వాస్పత్రికి వచ్చే కేసులు పక్కకు వెళ్లడం లేదు. కీలకమైన కేసులు, రోగులు కొందరు నిర్ణయం మార్చుకుని వెళుతుంటారు. గతంతో పోలిస్తే 2017లో జనవరి - డిసెంబరు 1040 కేసులు చేస్తే 750 యాంజియోగ్రామ్‌లు, 250 స్టంట్లు వేశాం.

# అన్నదానానికి రూ.లక్ష విరాళం



దాతకు విరాళం బాండు అందజేస్తున్న పర్యవేక్షకులు

**శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే:** శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి బుధవారం విజయవాడకు చెందిన బి.నవీన్‌కుమార్ రూ.1,00,116 విరాళం అందజేశారు. దాతకు పర్యవేక్షకులు మధుసూదన్‌రెడ్డి శ్రీస్వామిఅమ్మవార్ల శేషవస్త్రం, ప్రసాదాలను అందజేసి సత్కరించారు.

# పీఎఫ్ ప్రాంతీయ కార్యాలయం ఏర్పాటుచేయాలి

## - ఎంపీ బుట్టా రేణుక

**కర్నూలు పాతనగరం, న్యూస్‌టుడే:** కర్నూలులో పీఎఫ్ ప్రాంతీయ కార్యాలయం ఏర్పాటు చేయాలని ఎంపీ బుట్టా రేణుక కేంద్ర ఆర్థిక సహాయ మంత్రి సంతోష్ కుమార్ గంగోవర్‌ను దిల్లీలో కలసి వినతిపత్రం ఇచ్చారు. జిల్లాలోని పీఎఫ్ ఖాతాదారులు పడుతున్న సమస్యలను ఆయనకు వివరించినట్లు పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో 1,10,000 వరకు ఖాతాదారులు, 60,000 మంది పింఛనుదారులు ఉన్నారని.. వీరందరూ తమ సమస్యలను పరిష్కరించుకునేందుకు 200 కి.మీ దూరంలోని కడపలో ఉన్న కార్యాలయాలనికి వెళ్తున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం 1999, 2000, 2006లో మూడుసార్లు కర్నూలు ప్రాంతీయ కార్యాలయం ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపినా ఆమలు చేయలేదన్నారు. తెలంగాణ రాష్ట్రంలోని పది జిల్లాలో 7 పీఎఫ్ కార్యాలయాలు ఉంటే 13 జిల్లాలున్న ఆంధ్రప్రదేశ్‌లో కేవలం నాలుగు మాత్రమే ఉన్నాయని, జిల్లాలో కార్యాలయం ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించాలని కోరారు.





కేంద్ర ఆర్థిక సహాయ మంత్రి సంతోష్ కుమార్ గంగోవర్‌కు వినతిపత్రం ఇస్తున్న బుట్టా రేణుక

☛ కోడుమూరు నియోజకవర్గంలోని 21 గ్రామాల ప్రజలు తాగునీటి సమస్యతో చాలా ఇబ్బందులు పడుతున్నారని, శాశ్వత పరిష్కారం చూపాలని కేంద్ర జలవనరుల శాఖ మంత్రి ఉమాభారతిని బుధవారం దిల్లీలో ఎంపీ బుట్టా రేణుక కలిసి వినతి పత్రం ఇచ్చారు. ఆ గ్రామాలకు ఆధారమైన గాజులదిన్నె ప్రాజెక్టుకు 2015-16లో నిధులు కేటాయించగా తాత్కాలికంగా సమస్య పరిష్కారమైందని, నాబార్డు, ఏఐబీ లేదా ఇతర నిధులతో ప్రజల దాహార్తి తీర్చాలని కోరినట్లు ఆమె వెల్లడించారు.

# కొత్త ఏడాది.. కొత్త ఇంజినీర్లు

● జలవనరుల శాఖలో పదోన్నతులు

**కర్నూలు జలమండలి, న్యూస్‌టుడే:** జలవనరుల శాఖలో కొత్త ఏడాది కొత్త ఇంజినీర్ల నియామకంతో కళకళలాడుతోంది. జిల్లాలో 35 మందికి పైగా ఈఈ లను రెగ్యులర్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు కొందరు జిల్లా నుంచి బదిలీ కాగా మరికొందరు జిల్లాలోని ఇతర విభాగాలకు బదిలీ అయ్యారు. హంద్రీనీవా డివిజన్-2 ఈఈగా జి.విశ్వనాథంను నియమించగా ఈయన బుధవారం కర్నూలులోని కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఈయన గతంలో ఎస్‌ఆర్‌బీసీ బనగానపల్లి, పాణ్యం క్వాలిటీ కంట్రోల్‌లో ఇన్‌ఛార్జి ఈఈగా పనిచేశారు. ఈయనను కృష్ణానదీ యాజమాన్య బోర్డు లో సభ్యునిగా ప్రభుత్వం నియమించిన విషయం తెలిసిందే. ఎస్సార్బీసీ డివిజన్-2 నాణ్యత విభాగం ఈఈగా ఏవీ సురేష్‌బాబు బుధవారం నంద్యాలలో బాధ్యతలు చేపట్టారు. తుంగభద్ర బోర్డులో డీఈఈగా పనిచేస్తున్న ఈయనకు ఈఈగా పదోన్నతి కల్పించి ఇక్కడకు బదిలీ చేశారు.

జి.విశ్వనాథం ఏవీ సురేష్‌బాబు

# మహిళ మృతి

**నల్లగట్ల (ఆళ్లగడ్డ గ్రామీణ), న్యూస్‌టుడే:** నల్లగట్ల గ్రామం వద్ద జాతీయ రహదారిపై బుధవారం జరిగిన ప్రమాదంలో ఓ మహిళ మృత్యువాత పడ్డారు. యర్రగుంట్లకు చెందిన హుసేన్‌బీ(58) పూలు విక్రయించేందుకు నల్లగట్లకు వచ్చారు. బస్సు దిగి రోడ్డు దాటుతుండగా నంద్యాల నుంచి ఆళ్లగడ్డ వైపు వెళ్లే ద్విచక్రవాహనం ఢీకొంది. తీవ్రంగా గాయపడిన ఆమెను స్థానికులు ఆళ్లగడ్డ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం నంద్యాలకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందారు. మృతురాలి కొడుకు అబ్దుల్ గఫార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రామయ్య తెలిపారు.

# మనోనేత్రమే మా బలం..



షాట్‌పుట్ వేస్తున్న మహిళ



మైదానంలో ఒకరికొకరు తోడుగా



తాడు లాగుతూ...



క్రికెట్ ఆడుతూ...

లూయిూ బ్రెయిలీ జయంతి నేపథ్యంలో బుధవారం కర్నూలులో నిర్వహించిన జిల్లా స్థాయి అంధుల క్రీడా పోటీల్లో పలువురు అంధ క్రీడాకారులు పాల్గొన్నారు. తాము ఆటల్లోనూ తీసిపోమని నిరూపించారు. షాట్‌పుట్, తాడు లాగుడు, క్రికెట్ పోటీల్లో మహిళలు, పురుషులు పాల్గొని తమ సత్తా చాటారు.

- ఈనాడు, కర్నూలు

## ఉత్తమ ఉపాధ్యాయినులకు పురస్కారాలు

**ఏయూ ప్రాంగణం:** తొలి మహిళా ఉపాధ్యాయిని సావిత్రిబాయి పూలే జయంతిని మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తోంది. ఈ సందర్భంగా విద్యారంగంలో ఉత్తమ సేవలందించిన ఉపాధ్యాయినులకు ఆంధ్ర విశ్వవిద్యాలయం స్నాతకోత్సవ మందిరంలో బుధవారం మంత్రి గంటా శ్రీనివాసరావు పురస్కారాలను సర్వశిక్ష అభియాన్ ఆధ్వర్యంలో అందించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ మాధవ్, ఎస్ఎస్ఏ రాష్ట్ర ఈడీ శ్రీనివాస్, ఏయూ వీసీ ఆచార్య నాగేశ్వరరావు, రెక్టార్ ఆచార్య గాయత్రిదేవి తదితరులు పాల్గొన్నారు.

**పురస్కారాలు పొందిన వారు వీరే**

- **కస్తూరిబా బాలికా విద్యాలయాలు:** కె.జ్ఞానప్రసూనాంబ, జి.లక్ష్మి(డోన్), జి.జయలక్ష్మి(కల్లూరు).
- **కస్తూరిబా బాలికా విద్యాలయం ప్రత్యేకాధికారులు:** జె.రమాదేవి(నంద్యాల)
- **ప్రధానోపాధ్యాయినులు:** సాజిదాబేగం(ఏపీఆర్ఎస్, బానవాసి, కర్నూలు).
- **స్కూల్ అసిస్టెంట్లు:** ఎస్.రాజేశ్వరి(ఎంపీయూపీఎస్, వేములపాడు).
- **సెకండ్ గ్రేడ్ టీచర్స్ (ఎస్‌జిటి) విభాగం:** వి.రుక్మిణమ్మ(హనుమాన్‌నగర్, బేతంచెర్ల).
- **ఐఈఆర్‌టీ విభాగం:** ఎన్.ఎస్తేరు రాణి(గూడూరు)

## ఎం.ఏ దూర విద్యాకోర్సుల ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

### లలిత కళల కోర్సులకు కూడా ప్రవేశం

**శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే:** శ్రీశైలంలోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయ పీఠంలో 2017-18 విద్యాసంవత్సరానికి గానూ దూర విద్యాకేంద్రం ద్వారా ఎం.ఏ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పీఠాధిపతి పి.చెన్నారెడ్డి బుధవారం తెలిపారు. శ్రీశైలంలో దూర విద్యాకేంద్రం ద్వారా లలిత కళలు, జర్నలిజం కోర్సులు నిలిపి వేయడంపై 'ఈనాడు'లో గత నెలలో కథనం ప్రచురితమైంది. దీంతో అధికారులు స్పందించి జర్నలిజం, లలిత కళల కోర్సులకు సైతం దరఖాస్తులు ఆహ్వానించారు. పోస్టుగ్రాడ్యుయేషన్ కోర్సులైన ఎం.ఏ తెలుగు, సంస్కృతం, టూరిజం, జ్యోతిష్యం, ఇంగ్లీషు ల్యాంగ్వేజ్ టీచింగ్, ఎం.సి.జే (మాస్టర్ ఆఫ్ కంప్యూటర్ అండ్ జర్నలిజం), లలిత కళలు, టెలివిజన్ జర్నలిజం, జ్యోతిర్వాస్తు, సినిమా రచనా డిప్లోమా కోర్సులు, డిగ్రీ (బి.ఏ స్పెషల్ తెలుగు, కర్ణాటక సంగీతం) కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పీఠాధిపతి తెలిపారు. ఈ దరఖాస్తు పత్రాలను పొందడానికి అభ్యర్థులు ఏదైనా జాతీయ బ్యాంకు నుంచి రూ.300 డి.డి.ని రిజిస్ట్రార్, పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, పబ్లిక్ గార్డెన్స్, హైదరాబాద్ పేరున సొంత చిరునామాతో రూ.60 స్టాంపులు అంటించి' డైరెక్టర్, దూర విద్యాకేంద్రం, పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్ ' పేరున కూడా పొందవచ్చన్నారు లేదా శ్రీశైలం ప్రాంగణ పీఠాధిపతి కార్యాలయం ద్వారా కూడా దరఖాస్తులు పొందవచ్చన్నారు. దరఖాస్తులను సమర్పించేందుకు చివరి తేదీ ఈనెల 20 . ఆలస్య రుసుముతో రూ.300తో ఫిబ్రవరి 28 వరకు దరఖాస్తులు సమర్పించవచ్చన్నారు. దరఖాస్తులను విశ్వవిద్యాలయం వెబ్‌సైట్ ద్వారా కూడా పొందచ్చన్నారు. మరింత సమాచారం కోసం 94915 24018, 99892 40806ను సంప్రదించాలని కోరారు.



శ్రీశైలంలో తెలుగు విశ్వవిద్యాలయ పీఠం

# ఉర్దూ బడికి బాటేశారు

**కర్నూలు విద్య, న్యూస్‌టుడే:** ఉర్దూ విద్యాభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాయి. ప్రభుత్వ పరిధిలో ఉర్దూ మాధ్యమ పాఠశాలల సంఖ్య మరింత పెంచాలని నిర్ణయించాయి. అందులో భాగంగానే ముస్లిం మైనార్టీ విద్యార్థుల్లో డ్రాపౌట్ శాతం తగ్గించాలని కేంద్ర మానవవనరుల అభివృద్ధి సంస్థ ప్రాథమిక పాఠశాలల స్థాయి పెంచుతూ కీలక నిర్ణయం తీసుకుంది. మౌలిక వసతులు, తరగతి గదులు, అదనపు ఉపాధ్యాయుల నియామకానికి ఆదేశాలు జారీచేసింది. జిల్లాలో ఉర్దూ మాధ్యమాన్ని మరింత బలోపేతం చేయడం లక్ష్యంగా సర్వశిక్షా అభియాన్ సంస్థ ఆధ్వర్యంలో బుధవారం నిపుణులు, ఉర్దూ మాధ్యమ ప్రధానోపాధ్యాయుల నుంచి అధికారులు సలహాలు, సూచనలు స్వీకరించారు.

జిల్లా వ్యాప్తంగా 36 మండలాల్లో ప్రాథమిక పాఠశాలల్లో హాజరు 30 మందికి పైగా ఉన్నవాటిని ప్రాథమికోన్నత (1-8) పాఠశాలలుగా స్థాయి పెంచారు. అత్యవసరమని గుర్తించిన ప్రాంతంలో వలంటీర్ల ద్వారా బోధన చేయించాలని ఆదేశాలు ఉన్నాయి. 60 పాఠశాలలు ప్రతిపాదనలు పంపగా, అందులో 58 పాఠశాలను స్థాయి పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రాథమిక పాఠశాలలు 1-8వ తరగతి వరకు కొనసాగాలని నిబంధన ఉంది. ప్రభుత్వం చట్టం అమలుదిశగా ప్రయత్నించడం శుభపరిణామమని నిపుణులు భావిస్తున్నారు.

### విద్యార్థులు ఉన్నా ప్రతిపాదనలు కరవు

జిల్లాలో ముస్లిం జనాభా అధికం. ప్రాథమిక పాఠశాల తరువాత ఉర్దూ మాధ్యమం లేకపోవడంతో కొందరు మధ్యలోనే చదువు మానేస్తున్నారు. మరికొందరు ఇతర మాధ్యమాల్లో చదువులు కొనసాగించాల్సి వస్తోంది. నిబంధనల ప్రకారం విద్యార్థుల నమోదు ఎక్కువగా ఉన్న పాఠశాలల స్థాయిపెంపు కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించినప్పటికీ కొందరు ప్రధానోపాధ్యాయులు ముందుకు రానట్లు చెబుతున్నారు. కర్నూలు నగరపాలక పరిధిలోని ఉర్దూ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు ఎక్కువగానే ఉంది. రోజావీధిలోని ప్రాథమిక పాఠశాలలో 60, నరసింగరావు పేటలో 45, శరీన్‌నగర్‌లో 70, ముజఫర్ నగర్‌లో 46 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఈ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ముందుకొస్తే ప్రాథమికోన్నత స్థాయి పాఠశాలలు పెరిగే అవకాశం ఉంది.

### 1986 తరువాత పదోన్నతికి అవకాశం

జిల్లాలో ఉర్దూ మాధ్యమంలో ఉన్నత పాఠశాలలు చాలా తక్కువగా ఉన్నాయి. దీంతో ఎస్జీటీలకు ఎలాంటి పదోన్నతులు దక్కడం లేదు. డీఎస్సీ భర్తీ సమయంలో బాధ్యతలు చేపట్టిన ఉపాధ్యాయుల పదవీ విరమణకు ఏళ్లు పడుతుండగా ఇదే సమయంలో ఆశించిన స్థాయిలో పదోన్నతుల ప్రక్రియ జరగడం లేదు. పాఠశాలల స్థాయిపెంపు నిర్ణయంతో ఎస్జీ ఉపాధ్యాయుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. 1986 నుంచి నేటివరకు ఈ మాధ్యమంలో పదోన్నతులు జరగలేదని, స్థాయి పెరిగిన పాఠశాలలకు పదోన్నతుల ద్వారా ఉపాధ్యాయుల భర్తీ చేపడతామని ప్రకటించడం శుభపరిణామమని వారు అంటున్నారు. 174 మంది పదోన్నతులు పొందే అవకాశం ఉంది.



సమావేశానికి హాజరైన ప్రధానోపాధ్యాయులు

**మార్పు ఇలా..**

- మొత్తం ఉర్దూ మాధ్యమ పాఠశాలలు : 270
- విద్యార్థుల సంఖ్య : 16,982, ఉపాధ్యాయులు : 746
- స్థాయిపెంపు పొందిన పాఠశాలలు : 58
- అదనపు గదుల నిర్మాణం : 174, పెరగనున్న ఉపాధ్యాయులు : 174
- బడిబయట గుర్తించిన విద్యార్థులు : 169 మంది
- ప్రభుత్వ ఆధ్వర్యంలో ఉర్దూ మాధ్యమ బోధన జరుగుతున్న పాఠశాలలు

| | పాఠశాలలు | విద్యార్థులు | ఉపాధ్యాయులు |
|---|---|---|---|
| ప్రాథమిక | 213 | 9391 | 484 |
| ప్రాథమికోన్నత | 27 | 2569 | 99 |
| ఉన్నత | 30 | 5022 | 163 |



**చి**త్రంలో ఉన్నది నంద్యాల మండలంలోని అయ్యలూరు ఆదర్శ ఉర్దూ ప్రాథమిక పాఠశాల. ఇందులో 74 మంది విద్యార్థులు, ఐదుగురు ఉపాధ్యాయులు ఉన్నారు. ఇటీవల పాఠశాల స్థాయి పెరిగింది. పాఠశాలలో ఐదో తరగతి పూర్తయితే ఆరో తరగతికి చదవడానికి ఆస్కారం ఉండేది కాదు. విద్యార్థులు ఆసక్తి ఉన్నప్పటికీ తప్పని పరిస్థితుల్లో బడి మానేస్తున్నారు. పాఠశాలను స్థాయి పెరిగితే ప్రవేశం ఎంతమంది పొందుతారని ఉపాధ్యాయులు సర్వే చేయగా సుమారుగా పదిమంది ఆసక్తి చూపుతున్నట్లు గుర్తించారు.

### మార్చిలోపు పూర్తి చేస్తాం- రాగప్ప, ఈఈ, సర్వశిక్ష అభియాన్



ఉర్దూ మాధ్యమ పాఠశాలల్లో నూతన గదుల నిర్మాణాలు చేపడుతున్నాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇప్పటికే 39 గదుల నిర్మాణం చేపట్టాం. 85 పాఠశాలలకు స్థల సమస్య ఉంది. విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. కొందరు గ్రామస్థులు సొంత స్థలం ఇవ్వడానికి స్వచ్ఛందంగా ముందుకొస్తున్నారు. మార్చిలోపు భవనాలు పూర్తిచేసి పాఠశాలలకు అప్పగిస్తాం.

### ఆనందంగా ఉంది - కేజీ ఖాజా హుసేన్, ఏపీయూటీఏ వ్యవస్థాపకులు



ఉర్దూ మాధ్యమం బలోపేతం చేయాలన్న ప్రభుత్వ ఆలోచన హర్షించదగ్గది. ముస్లిం మైనార్టీ పిల్లల్లో డ్రాపౌట్‌లను తగ్గించడానికి ఇది సరియైన మార్గం. అధిక శాతం చిన్నారులు ప్రాథమిక పాఠశాల తరువాత బడి మానేస్తున్న పరిస్థితి ఉంది. సమీపంలో పాఠశాలలు లేకపోవడంతో తల్లిదండ్రులు వృత్తిల్లోకి తీసుకెళ్తున్నారు. ఇకపై చిన్నారుల్లో ఉన్నత చదువుల వరకు చదువుకోవాలన్న ఆసక్తి పెరుగుతుంది.

### చాలా అవసరం - అజీజ్, ప్రధానోపాధ్యాయుడు, ఉర్దూ మాధ్యమ పాఠశాల



జిల్లాలో ముస్లిం జనాభా అధికంగా ఉంది. అందుకు తగ్గట్టుగానే ప్రాథమిక పాఠశాలలు ఉండగా ప్రాథమికోన్నత పాఠశాలల కొరత తీవ్రంగా ఉంది. కొన్ని మండలాల్లో పాఠశాలల దూరం విషయంలో వ్యత్యాసం ఎక్కువ. చాలామంది బడిమానేసి పనులకు వెళ్తున్నారు. ప్రభుత్వ నిర్ణయంతో చాలామంది ఉన్నతవిద్యను అభ్యసించడానికి అవకాశం లభిస్తుంది. ఉపాధ్యాయుల పదోన్నతులకు మోక్షం లభిస్తుంది.

### గ్రామాల్లో చైతన్యపరచాలి రఫీ, ఏఎంవో, ఉర్దూ విభాగం, సర్వశిక్ష అభియాన్



ఐదో తరగతి తరువాత డ్రాపౌట్ విద్యార్థులు అధికంగా ఉన్నట్లు గుర్తించారు. వీటిని విడతల వారిగా నివారించడానికి ఉర్దూ మాధ్యమ పాఠశాలల స్థాయి పెంచుతున్నారు. జిల్లాలో 36 మండలాల్లోనే ఉర్దూ మాధ్యమంలో 6, 7, 8 తరగతులు చదివే అవకాశం ఉంది. జన్మభూమి-మాఊరులో భాగంగా ఈనెల 5న విద్యాచైతన్య కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అందులో ప్రభుత్వం పథకాలు, విద్యార్థులకు అమలుచేస్తున్న కార్యక్రమాలపై గ్రామస్థులకు అవగాహన కల్పించాలి. స్థాయిపెంపు పాఠశాలల్లో ఇప్పటినుంచే ప్రవేశాలు చేపట్టాలని ప్రధానోపాధ్యాయులకు ఆదేశాలు జారీ చేశాం.




**ప్రపంచ వాణిజ్య సంస్థ అంతర్జాతీయ వాణిజ్యాన్ని నియంత్రించడానికి ఏర్పాటైంది. ఇది ప్రపంచంలోనే అతిపెద్ద అంతర్జాతీయ ఆర్థిక సంస్థ. భాగస్వామ్య దేశాల మధ్య జరిగే వస్తువులు, సేవలు, మేధోసంపత్తి హక్కుల వాణిజ్యాన్ని నియంత్రించడం, వాణిజ్య సంబంధాలను సమర్థంగా నిర్వహించేందుకు అనువైన కార్యాచరణను రూపొందించడం, వివాదాలను పరిష్కరించడం దీని ప్రధాన బాధ్యతలు. తాజాగా జరిగిన ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటీఓ) 11వ మంత్రుల స్థాయి సదస్సు ఎన్నో ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలకు ఏ పరిష్కారం చూపకుండానే ముగిసింది.**

ప్రతిభ

# ఆహారానికి ఏదీ భద్రత...?

## జనరల్ స్టడీస్

### డబ్ల్యూటీవో మంత్రుల స్థాయి సదస్సు - 2017

ప్రపంచ వాణిజ్య సంస్థ 11 వ మంత్రులు స్థాయి సదస్సు అర్జెంటీనా రాజధాని బ్యూనస్ ఎయిర్స్‌లో డిసెంబరు 10 నుంచి 13 వరకు నాలుగురోజుల పాటు జరిగింది. ఈ సదస్సులో 164 సభ్య దేశాలు పాల్గొన్నాయి. సేవా వాణిజ్యాన్ని సులభతరం చేయడం, ఈ-కామర్స్ సేవలు, మార్కెట్ సౌలభ్యం, దేశీయ నియంత్రణలు, ఆహారభద్రత, వాణిజ్యం - మహిళా సాధికారిత తదితర అంశాలపై చర్చ జరిగింది. ఈ సమావేశాల్లో ఆహారధాన్యాల నిల్వ, రాయితీల సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఆశించినా ఎలాంటి పరిష్కారం చూపకుండానే చర్చలు ముగిశాయి. బహుళైచ్ఛిక వాణిజ్య విధానాల విషయంలోనూ ఎలాంటి పురోగతి లేదు. అయితే మత్స్య సంపదపై రాయితీల నిషేధం విషయంలో సభ్యదేశాలకు ఉన్న నిబద్ధతపై 2019 కల్లా పరిష్కారాన్ని చూపుతామనే భరోసా ఇచ్చేందుకు మంత్రుల స్థాయి సమావేశం ప్రయత్నించింది.

- భారత్, చైనా సహా పలు అభివృద్ధి చెందుతున్న దేశాలు ఎలాంటి కఠినతర నిబంధనలు లేకుండా తమ తమ దేశాల్లో ఆహారభద్రతా కార్యక్రమాలను అమలు చేసేందుకు అమెరికా మోకాలడ్డింది. దీంతో చర్చలు విఫలమయ్యాయి. ప్రధాన విషయాలకు సంబంధించి నిర్ణయాలు తీసుకోవడంలో ప్రపంచ వాణిజ్య సంస్థలోని భాగస్వామ్య దేశాలన్నీ మూకుమ్మడిగా ఏకాభిప్రాయానికి రావాల్సి ఉంటుంది. కాబట్టి ఏ ఒక్క దేశమైనా కావాలనుకుంటే ప్రక్రియను ముందుకు సాగనీయకుండా చేయొచ్చు.
- 2001 లో ప్రపంచ వాణిజ్య సంస్థ ఆవిర్భావం నుంచి నేటి వరకు ఎన్నో అపరిష్కృత సమస్యలకు పరిష్కారాలను ప్రతిపాదించకుండానే 'కొత్త అజెండా'ను తెరమీదకు తెచ్చేందుకు యూరోపియన్ సమాఖ్య (ఈయూ) దేశాలు పావులు కదుపుతున్నాయి. ఆహారభద్రత సాధనలో అభివృద్ధి చెందుతున్న దేశాల హక్కులపై 2001 లో దోహాలో జరిగిన చర్చలు ఎటూ తేలకుండా ముగిశాయి. నాటి నుంచి నేటి వరకు ఆహారభద్రత హక్కుల విషయమై ఇతమిద్ధంగా తేలిందేమీ లేదు. సమావేశం అనంతరం వెలువరించాల్సిన మంత్రుల ప్రకటన కూడా రద్దయ్యింది. దీంతో భారత్ సహా పలు అభివృద్ధి చెందుతున్న దేశాలు తీవ్ర నిరాశకు గురయ్యాయి.
- సభ్య దేశాలు నిరాశకు గురవడం కొంత కటువైందైనప్పటికీ అవి ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని డబ్ల్యూటీఓ డైరెక్టర్ జనరల్ రాబెర్టో అజ్వేడో వ్యాఖ్యానించడం గమనార్హం. ఈ సమావేశాలకు భారత్ తరపున కేంద్రమంత్రి సురేశ్ ప్రభు హాజరయ్యారు. ఒక సభ్య దేశం వైఖరి కారణంగా ఎలాంటి నిర్ణయాలు లేకుండానే సమావేశాలు ముగిశాయని భారత్ ప్రకటించింది.

### భద్రతలేని ఆహార హక్కు

ప్రపంచ వాణిజ్య సంస్థ మంత్రులు స్థాయి సమావేశంలో అమెరికా వ్యతిరేకత చూపినా భారత్ మాత్రం ఆహార భద్రత హక్కు విషయంలో అభివృద్ధి చెందుతున్న దేశాల పక్షాన గట్టిగానే వాదించింది. గత దశాబ్ద కాలంగా తమ దేశాల్లోని వ్యవసాయోత్పత్తులకు మద్దతు ధరలను చెల్లిస్తూ రైతులకు అండగా నిలుస్తున్న అమెరికా, యూరోపియన్ సమాఖ్య దేశాలు ఇదే విషయంలో అభివృద్ధి చెందుతున్న దేశాలకు మాత్రం మోకాలడ్డుతున్నాయి.

- సంపన్న దేశాలకు అనుకూలంగా రూపొందించుకున్న డబ్ల్యూటీఓ నిబంధనలను సవరించాలని భారత్, చైనా ప్రతిఘటించినా అడుగు ముందుకు పడలేదు. ఆది నుంచి భారత్ ఈ దిశగా పట్టిన పట్టు విడవకుండా కృషి చేస్తోంది. సన్న, చిన్నకారు, అల్పాదాయవర్గ రైతుల నుంచి సరైన మద్దతు ధరకు ధాన్యాన్ని సేకరించి, తిరిగి దారిద్య్రరేఖకు దిగువనున్న ప్రజలకు ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా సరఫరా చేసే యంత్రాంగాన్ని మెరుగుపరిచి, పటిష్టవంతం చేసే దిశగా భారత్ సుదీర్ఘ కసరత్తు చేస్తోంది.
- డబ్ల్యూటీఓ నిబంధనల ప్రకారం రైతుల నుంచి సేకరించే వ్యవసాయ ఉత్పత్తులకు, ఆహార రాయితీల కింద ఇచ్చే మొత్తం సొమ్ము, ఆ దేశ మొత్తం ఆహార ఉత్పత్తుల విలువలో (1986-88 నాటి ధరల ప్రకారం) 10 శాతానికి మించకూడదు. ఒకవేళ అభివృద్ధి చెందుతున్న దేశాలు రైతులకు అంతకు మించి చెల్లించినట్లయితే దాన్ని వాణిజ్య నిబంధనల ఉల్లంఘనగా పరిగణిస్తారు. ఇలాంటి పరిమితులు తాము అమలు చేస్తున్న 'ఆహారభద్రత' కార్యక్రమానికి విఘాతం కలిగిస్తాయంటూ భారత్ తీవ్ర అభ్యంతరాన్ని వ్యక్తం చేసింది. 2013 లో బాలిలో జరిగిన సమావేశంలో కూడా దీనిపై చర్చించారు. అప్పట్లో ఈ విషయమై ఒక అంగీకారానికి వచ్చి 'శాంతి నిబంధన' ప్రతిపాదించారు. ఇది ఒకరకంగా భారత్ లాంటి అభివృద్ధి చెందుతున్న దేశాలకు రక్షణ కవచం లాంటిది. దీని ప్రకారం ఏ దేశమైనా ఈ 10 శాతానికి మించి చెల్లించరాదనే నిబంధనను ఉల్లంఘిస్తే దాన్ని డబ్ల్యూటీఓలో సవాలు/ ఫిర్యాదు చేయకూడదనేది ప్రధాన సారాంశం. ఈ శాంతి నిబంధన ఉన్నా భారత్ లాంటి అభివృద్ధి చెందుతున్న దేశాల సార్వభౌమ హక్కులను కాలరాసి, రైతులకు ఆహార రాయితీలు ఇవ్వకుండా, కనీస మద్దతు ధర చెల్లించకుండా సంపన్న రాజ్యాలు ఒత్తిడి చేస్తున్నాయి. కాబట్టే భారత్ ఈ బ్యూనస్ ఎయిర్స్ సమావేశంలో 'శాంతి నిబంధన' లోని అంశాలను మరింత మెరుగుపరచి, ఆహార భద్రత సమస్యలకు శాశ్వత పరిష్కారాన్ని కనుక్కునేలా దీన్ని తీర్చిదిద్దాలని డిమాండ్ చేసింది. తృతీయ ప్రపంచ దేశాలు సైతం ఈ విషయంలో భారత్‌లో గొంతు కలిపాయి.
- నిజానికి అమెరికా, యూరోపియన్ దేశాలు ఉమ్మడిగా తమ రైతులకు ఏటా 16 వేల కోట్ల డాలర్లకు పైగా భారీ రాయితీలు ఇస్తున్నాయి. స్థూలదేశీయోత్పత్తిలో వ్యవసాయరంగం నుంచి సమకూరుతున్న వాటాలో అమెరికా తిరిగి సగభాగాన్ని రైతుల సబ్సిడీల కోసమే కేటాయిస్తోంది. అమెరికాతో పోలిస్తే భారత్ రాయితీల రూపంలో రైతులకు చెల్లిస్తున్నది అత్తెసరు మాత్రమే.

> *అమెరికా సేంద్రియ సాగు, పర్యావరణ పరిరక్షణ పేరు చెప్పుకుని వ్యవసాయ స్థూలదేశీయోత్పత్తి వాటాలో 40 శాతం నిధులను 'గ్రీన్ బాక్స్' పేరిట రాయితీల రూపంలో రైతులకు చెల్లిస్తోంది. అయినా ప్రపంచవాణిజ్య సంస్థ వీటిని మార్కెట్ విచ్ఛిన్నకర రాయితీలుగా పరిగణించకపోవడం దారుణం. అమెరికా లాంటి సంపన్న దేశాలు 'గ్రీన్ బాక్స్' పేరుతో డబ్ల్యూటీఓ నిబంధనలకు చిక్కకుండా తప్పించుకుంటున్నాయి.*

- సగానికిపైగా జనాభాకు వ్యవసాయమే జీవనాధారంగా ఉన్న, మూడోవంతు జనం అర్ధాకలితో అలమటిస్తున్న భారత్ లాంటి దేశంలోని పరిస్థితులు అమెరికాకు పూర్తి భిన్నం. రైతులకు మద్దతు ధరలు చెల్లించడంతో పాటు వ్యవసాయ ఉత్పాదకాలపై రాయితీలు ఇవ్వక తప్పదు. ఈ తరహా చర్యలు ప్రపంచ వాణిజ్య సంస్థ నిర్దేశించిన 'మార్కెట్ విచ్ఛిన్నకర' రాయితీల పరిధిలోకి వస్తాయని ఐరోపా, అమెరికా దేశాలు గొంతు చించుకుంటున్నాయి. ఈ రకమైన సంపన్న దేశాల దాష్టీకాన్ని భారత్ మొదటి నుంచీ అనేక వేదికలపై ఎప్పటికప్పుడు ఎండగడుతూనే వస్తోంది.
- 2013 లో బాలిలో, 2015 లో నైరోబీ సదస్సుల్లో వర్ధమాన దేశాలను కూడగట్టుకుని, న్యాయమైన తమ హక్కులు, బడుగు బలహీన వర్గాల ఆహార భద్రత కోసం, రైతులను ఆదుకోవడానికి భారత్ తన వాదనను గట్టిగానే వినిపించింది. ఆహార భద్రత హక్కుల కోసం కృషి చేస్తున్న అభివృద్ధి చెందుతున్న దేశాలపై 10 శాతం పరిమితి నిబంధనను ఎత్తేయాలని గతంలోనే 45 దేశాలను కూడగట్టుకుని డబ్ల్యూటీఓలో వాదించింది. కానీ అమెరికా, యూరోపియన్ సమాఖ్య దేశాలు భారత్ వాదనను తోసిపుచ్చాయి. ఈసారి మాత్రం వర్ధమాన దేశాల గళం మరింత పదునెక్కింది. చైనాతో సహా 100 కు పైగా దేశాలు మద్దతు ఇచ్చాయి. ఎలాంటి నిర్ణయం లేకుండా సమావేశాలు ముగిసినా అమెరికా తీరుపై ధిక్కార స్వరం మరింత పెరగడం ఆ దేశ వైఖరిలో మార్పు తెస్తుందేమో చూడాలి.

### ప్రపంచ వాణిజ్యం - మహిళా సాధికారత

ఆహారభద్రత విషయంలో ఎటూ నిర్ణయం తీసుకోలేకపోయిన డబ్ల్యూటీఓ - 17 సమావేశం 'మహిళా సాధికారత' పట్ల మాత్రం చారిత్రాత్మక నిర్ణయాన్ని ప్రకటించింది. ప్రపంచంలో నాలుగింట మూడోవంతు దేశాలు సభ్యులుగా ఉన్న డబ్ల్యూటీఓ వర్తక, వాణిజ్యాల్లో మహిళల భాగస్వామ్యంపై ఎదురవుతున్న అవరోధాలను తొలగించడానికి సత్వర చర్యలకు ఉపక్రమించాలని నిర్ణయించింది. లింగ సమానత, మహిళా సాధికారత కోసం విశేషంగా మద్దతు ఇస్తున్న భారత్ డబ్ల్యూటీఓలో మైనార్టీ వర్గంలో ఉన్నా, బాగా ప్రభావితం చేసేదిగా ఉండి కూడా ఈ విషయంపై సానుకూలంగా వ్యవహరించలేదు. లింగ భేదం వాణిజ్య సంబంధమైన విషయం కాదని, వాణిజ్య సంబంధిత అంశాలకు - మహిళా సాధికారకతకు లంకె పెట్టడం సమంజసం కాదనే అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది.

- అభివృద్ధి చెందిన దేశాలు అవలంబిస్తున్న లింగపరమైన విధానాల్లో ఉన్నత ప్రమాణాలుగా పేర్కొంటున్నవి అభివృద్ధి చెందుతున్న దేశాల ఎగుమతులకు అడ్డుకట్ట వేయడమేకాక అభివృద్ధి చెందుతున్న దేశాలు తమ మహిళలకు ప్రోత్సాహం కల్పించడాన్ని పరోక్షంగా నియంత్రిస్తున్నాయి. అలాగే లింగసంబంధమైన అంశాలపై చర్యలు చేపట్టడానికి డబ్ల్యూటీఓ వేదికగా, ఒక సరైన వేదిక అవసరమని భారత్ అభిప్రాయపడింది. ఎందుకంటే ప్రపంచ వాణిజ్య సంస్థ అనేది కేవలం వాణిజ్య సంబంధ సంస్థ. వాణిజ్యేతర అంశాలైన కార్మికులు, పర్యావరణం- ప్రమాణాలు మొదలైనవి చర్చించడానికి డబ్ల్యూటీఓలో మరొక విభాగాన్ని ఏర్పాటు చేయడం సమంజసమని భారత్ అభిప్రాయం.
- ప్రపంచ వాణిజ్య సంస్థ చరిత్రలోనే తొలిసారిగా 119 సభ్య దేశాలు 'మహిళలు - వాణిజ్యం' అనే బ్యూనస్ ఎయిర్స్ డిక్లరేషన్‌కు మద్దతు ఇచ్చేందుకు అంగీకరించాయి. మహిళల వాణిజ్య భాగస్వామ్యంలోని ప్రతిబంధకాలను తొలగించేందుకు, ఆర్థిక - వాణిజ్య రంగంలో మహిళా సాధికారతను వేగవంతం చేసేందుకు ఇది దోహదం చేస్తుంది. డిక్లరేషన్‌లో పొందుపర్చిన కార్యాచరణ మహిళలకు మరిన్ని మెరుగైన ఉపాధి అవకాశాలను కల్పిస్తుందని డబ్ల్యూటీఓ పేర్కొంది. లింగ సమానత ద్వారా సాధికారత సాధ్యమవుతుందని, తద్వారా ఐక్య రాజ్య సమితి నిర్దేశించిన సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను సాధించేందుకు ఇవి దోహదం చేస్తాయని పేర్కొంది.
- వాణిజ్యంలో మహిళల భాగస్వామ్యాన్ని పెంచడం ద్వారా మహిళలకు సమానావకాశాలను కల్పించడం సాధ్యమవుతుందని, తద్వారా ప్రపంచ స్థూల దేశీయోత్పత్తికి 2025 నాటికి 28 ట్రిలియన్ డాలర్లు జతకూడతాయని ఇంటర్నేషనల్ ట్రేడ్ సెంటర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అర్చనా గోంజాలెజ్ అభిప్రాయపడ్డారు.
- ఈ డిక్లరేషన్ మహిళల అభ్యున్నతికి ప్రతిబంధకంగా నిలుస్తున్న డబ్ల్యూటీఓ నిబంధనలను గురించి వెల్లడించడంలో విఫలమైందని, దీనికి బదులు అసమానతలు, అణిచివేతలకు దోహదం చేస్తున్న డబ్ల్యూటీఓ విధానాలకు ముసుగువేసి చూపించినట్లు ఉందని 160 దేశాలకు చెందిన మహిళా హక్కుల సంస్థలు ఒక సంయుక్త ప్రకటనలో ఖండించాయి. ప్రపంచంలోని అన్ని మహిళా హక్కుల సంఘాలు ఈ డిక్లరేషన్‌ను తిరస్కరించాయని, డబ్ల్యూటీఓ అనుసరిస్తున్న హానికారక విధానాల నుంచి దృష్టి మళ్లించడానికి చేపపిల్లలకు వేసిన ఎరగా దీన్ని ప్రకటించారని మహిళల న్యాయం, సంక్షేమ విభాగం, ఆసియా ఎకనామిక్ ఫోరం, గ్లోబల్ కో-ఆర్డినేటర్ కేట్‌లాపిన్ అభిప్రాయపడ్డారు.
- డబ్ల్యూటీఓ సభ్య దేశాలు, మద్దతుదారులు మాత్రం వాణిజ్య, ఆర్థిక లావాదేవీల్లో మహిళల వెనుకబాటుతనాన్ని సరిదిద్ది, వారిని ప్రోత్సహించేదిగా ఉందని, మహిళల ఆర్థిక స్వావలంబనకు ఇది దోహదం చేస్తుందని చెబుతున్నాయి. లింగ సమానత్వాన్ని దృష్టిలో ఉంచుకుని సభ్య దేశాలు విధానాలను రూపొందించి, మదింపు చేస్తాయని, దీని ప్రగతి నివేదిక 2019 లో విడుదల చేసే అవకాశం ఉందని ప్రపంచ వాణిజ్య సంస్థ పేర్కొనడం గమనార్హం. భారత్ మాత్రం ఈ చర్యను నిర్ద్వంద్వంగా తోసిపుచ్చింది.

> *ప్రపంచ వ్యవసాయ వాణిజ్య నిబంధనలను ప్రజాస్వామికంగా సంస్కరించాలన్నదే భారత్ ప్రధాన ఆశయం. ఆకలి, దారిద్ర్యం నుంచి ప్రపంచానికి విముక్తి కల్పించాలనేది ఐక్య రాజ్య సమితి సుస్థిరాభివృద్ధి లక్ష్యాల్లో కీలకమైంది. ఆహారభద్రత కల్పనలో అభివృద్ధి చెందుతున్న దేశాల హక్కులను గౌరవించాల్సిన ఆవశ్యకత సుస్పష్టం.*

### ఈ-కామర్స్

ఈ-కామర్స్ సేవలపై ప్రపంచవ్యాప్త నిబంధనలు ఉండకూడదని భారత్ వాదిస్తోంది. ఇలాంటి నిబంధనలకు తాము వ్యతిరేకం కాకపోయినా ఇవి తమకు ఇబ్బందికరంగా ఉంటాయని భారత్ అభిప్రాయం. ఈ-ట్రాన్స్‌మిషన్‌పై సభ్యదేశాలు కస్టమ్ డ్యూటీ విధించడాన్ని నిషేధించేందుకు ఉద్దేశించిన మారటోరియాన్ని విస్తరించడంపై అంగీకారం తెలిపేందుకు భారత్ ముందస్తు షరతులు విధించింది.

- 1998 లో జరిగిన రెండో మంత్రుల స్థాయీ సమావేశంలో 'గ్లోబల్ ఈ-కామర్స్ డిక్లరేషన్'లో ఈ మారటోరియాన్ని అమల్లోకి తెచ్చారు. దీని ప్రకారం సభ్య దేశాలు తమ ఈ-ట్రాన్స్‌మిషన్ కార్యకలాపాలపై కస్టమ్స్ సుంకం విధించడాన్ని కొనసాగించవచ్చని నిర్ణయించారు. ఇది తాత్కాలికమే అయినా ప్రతి రెండేళ్లకోసారి జరిగే మంత్రుల స్థాయీ సమావేశంలో దీన్ని పొడిగించుకుంటూ వస్తున్నారు. అభివృద్ధి చెందిన దేశాలు మాత్రం ఈ-ట్రాన్స్‌మిషన్ కార్యకలాపాలపై కస్టమ్స్ సుంకం విధించేందుకు 'శాశ్వత మారటోరియం' విధించాలని డిమాండ్ చేస్తున్నాయి. ఈ చర్య అభివృద్ధి చెందుతున్న దేశాలు చూపుతున్న చొరవను ప్రభావితం చేసేదిగా ఉందని భారత్ అభిప్రాయపడింది. ఇలాంటి చర్యలు భారత్ సహా పలు దేశాల్లోని దేశీయ ఔషధ తయారీ పారిశ్రామిక రంగానికి హాని కలిగించవచ్చునేది అభివృద్ధి చెందుతున్న దేశాల వాదన. ప్రపంచ వాణిజ్య సంస్థకు చెందిన విభాగాల్లో రూపొందించిన వర్క్ ప్రోగ్రామ్ మార్గదర్శకాలు, ప్రస్తుతం అమల్లో ఉన్న విధానాన్ని అనుసరించి ఈ-కామర్స్‌పై చర్చలు కొనసాగించడానికి ఇతర సభ్యదేశాల అంగీకారాన్ని, మద్దతును బట్టి మారటోరియంపై భారత్ తన నిర్ణయాన్ని వెల్లడిస్తుందని పేర్కొంది.
- మొత్తానికి ఈ-కామర్స్‌పై ప్రతిబంధకంగా పరిణమిస్తున్న నిబంధనలను ఎత్తివేయాలని భారత్ లాంటి అభివృద్ధి చెందుతున్న దేశాలు అభిప్రాయపడుతున్నాయి. అలాగే తమ దేశ సాఫ్ట్‌వేర్, అకౌంటింగ్ నిపుణులు, నర్సులకు ఇతర దేశాల్లో అవకాశాలు కల్పించాలని భారత్ కోరుతోంది.



రచయిత:
డాక్టర్ జి.వి.ఎల్. విజయ్‌కుమార్

# ఏపీ టెట్

**చరిత్ర**

**ఆహార సేకరణ నుంచి ఆహార ఉత్పత్తి వరకు ఆదిమానవుడు**

- భారతదేశంలో నివసించిన ఆదిమానవుడిని రామా పిథికస్ అంటారు.
- ఐరోపాలో నివసించిన ఆదిమానవుడిని నియాండెర్తల్ నరుడు అంటారు.
- మొదటి మేధావి మానవుడిగా హోమో ఎరక్టస్‌ను పేర్కొంటారు.
- ఆధునిక మానవుడి శాస్త్రీయ నామం హోమో సెపియన్
- మానవుడి అభివృద్ధి మొత్తం 5 దశల్లో జరిగింది.
- ఆదిమానవుడి కాలాన్ని మూడు యుగాలుగా విభజించారు. అవి: 1. ప్రాచీన శిలాయుగం, 2. మధ్య శిలాయుగం, 3. నవీన శిలాయుగం
- ప్రాచీన, మధ్య శిలాయుగాల్లో మానవుడు వేటను ప్రధాన వృత్తిగా చేసుకుని సంచార జీవితాన్ని గడిపేవాడు. ఈ యుగాల్లో మానవుడు ఆహార సేకరణ/ ఆహార అన్వేషణ దశలో ఉండేవాడు.
- ప్రాచీన శిలాయుగంలో మానవుడు పెద్ద పెద్ద బండరాళ్లను పెచ్చులుగా కొట్టి ఆయుధాలుగా ఉపయోగించేవాడు. వాటినే ఛేదకాలు, దరకాలు, చేతి గొడ్డళ్లు అనేవారు.
- మానవుడు చేతి గొడ్డలిని వాడిన కాలం ప్రాచీన శిలాయుగం.
- మధ్య శిలాయుగంలో అతిచిన్న రాళ్లను ఆయుధాలుగా ఉపయోగించాడు. కాబట్టి ఈ యుగాన్ని సూక్ష్మ శిలా యుగం అంటారు.
- సూక్ష్మ శిలాయుగంలో మానవుడు నిప్పును కనుక్కున్నాడు. జంతువులను మచ్చిక చేసుకున్నాడు.
- నవీన శిలాయుగంలో మానవుడు వ్యవసాయాన్ని ప్రధాన వృత్తిగా మార్చుకుని, స్థిర నివాసాన్ని ఏర్పాటు చేసుకున్నాడు. ఈ యుగంలో రాతి గొడ్డలి, రాతి కొడవలి, రాతి పారలను ఆయుధాలుగా ఉపయోగించాడు.
- మధ్యప్రదేశ్‌లోని నంద్రా గ్రామంలో రాతి పనిముట్లు లభించాయి.
- జమ్మూ కశ్మీర్‌లో రాతితో చెక్కిన పరికరాలు లభించాయి.
- ఝార్ఖండ్‌లో పురాతన రాతి పనిముట్లు లభించాయి.
- తమిళనాడులోని గుడియం గుహల నుంచి సూక్ష్మరాతి పరికరాలను వెలికితీశారు.
- మహారాష్ట్రలోని నెవాస ప్రాంతంలో నవీన శిలాయుగపు పనిముట్లు లభించాయి.
- ఆదిమానవుడు ఉపయోగించిన రాతి గొడ్డలి ఆంధ్రప్రదేశ్‌లోని పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలోని కాముకూర్‌లో లభించింది.
- కర్నూలు జిల్లాలోని బెలూమ్ గుహలు, బేతంచెర్ల, బనగానపల్లి ప్రాంతాల్లో ఆదిమానవుడి ఆనవాళ్లను కనుక్కున్నారు.
- ఎముకలతో చేసిన పనిముట్లు కర్నూలు జిల్లాలోని ముచ్చట్ల చింతమానులో లభించాయి (ఇవి భారత ఉపఖండంలో ఇంకెక్కడా దొరకలేదు).
- ఆదిమానవుడు గుహల్లో చిత్రాలను గీసేవాడు.
- వై.ఎస్.ఆర్. కడప జిల్లా, ముద్దనూరు మండలంలోని చింతకుంట గ్రామంలో ఆదిమానవుడి పది రాతి చిత్రకళా స్థావరాలు లభించాయి.
- చింతకుంట రాతి చిత్రకళా స్థావరాల్లో మొత్తం 200 చిత్రాలున్నాయి. వీటిలో 10 తెలుపు రంగులో ఉండగా మిగిలినవి ఎరుపు రంగులో ఉన్నాయి.
- ఎరుపు రంగు చిత్రాల్లో ఒకే గుహలోని మూపురం ఉన్న ఎద్దు చిత్రం ప్రసిద్ధి చెందింది. ఈ గుహను స్థానికంగా ఎద్దుల, ఆవుల గుండు అని పిలుస్తారు.

**ఆంధ్రదేశంలో ఉన్న ఇతర రాతి చిత్ర కళా స్థావరాలు**

- బొల్లారం, కాలువబుగ్గ, కేతవరం, ఆథోని - కర్నూలు జిల్లా.
  - శ్రీకాళహస్తి, రేణిగుంట, వెంబ ఖండ్రిగ - చిత్తూరు
  - నాయుడుపల్లె, సింగరాయకొండ - ప్రకాశం
  - వేల్పుమడుగు, భోగదవి తెనగల్ - అనంతపురం
  - చింతకుంట, దాపల్లి - కడప
  - కావలి, నందిపాడు - నెల్లూరు
  - వినుకొండ - గుంటూరు
- 12000 సంవత్సరాల నుంచి మానవులు వ్యవసాయం చేసి, పంటలు పండించడం ద్వారా ఆహారాన్ని పొందుతున్నారు.

---

- సుమారు 100 కోట్ల సంవత్సరాల కిందట భూమి ఏర్పడింది.
- భూమిపై ఆవిర్భవించిన తొలి జీవ పదార్థం లార్వా.
- ప్లాజిల్లేటాను ప్రాథమిక జీవరాశిగా పేర్కొంటారు.
- ఏప్స్ అనే తోకలేని కోతి నుంచి మానవుడు ఆవిర్భవించాడు.
- మానవుడు నివసించిన తొలి ఖండం ఆఫ్రికా. ఆఫ్రికాలోని ఆదిమానవుడిని ఆస్ట్రలో పిథికస్ అంటారు.

# ప్రతిభ

# భారత్‌లో ఆవిర్భవించిన తొలి సామ్రాజ్యం..?



రచయిత
బొత్స నాగరాజు
విషయ నిపుణులు

- **భారతదేశంలో ఆదిమానవుల ప్రారంభ వ్యవసాయ ఆనవాళ్లు లభించిన ప్రాంతాలు**
  బెలూచిస్థాన్ - 9000 సంవత్సరాల కిందటి ఆనవాళ్లు
  కశ్మీర్ - 5000 సంవత్సరాల కిందటి ఆనవాళ్లు
  బిహార్ - 4000 సంవత్సరాల కిందటి ఆనవాళ్లు
- ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాల్లో 5000 సంవత్సరాల కిందటి బూడిద దిబ్బలు బయటపడ్డాయి.
- అనంతపురం జిల్లాలోని పాళ్వాయిలో బూడిద దిబ్బలు/ మసి దిబ్బలు వెలుగు చూశాయి.
- ఆదిమానవులు అటవీ ప్రాంతంలో పోడు వ్యవసాయం చేసేవారు.
- మన రాష్ట్రంలో నేటికీ యానాదులు, చెంచులు సంచార జీవితాన్ని గడుపుతున్నారు.
- ఆదిమానవులు పురుషులు, స్త్రీలు, పిల్లలు అంతా కలిసి గుంపులు, గుంపులుగా వేటకు వెళ్లేవారు.
- వేట బాగా జరగాలని జంతువులు, వృక్షాలు, నదులు, పర్వతాలను పూజించేవారు.
- ఆదిమానవుడు తన ఆహార పదార్థాలను మట్టి పాత్రలు/ కుండల్లో దాచుకునేవాడు.
- చనిపోయిన వారికి రాక్షసగుళ్లు పేరుతో సమాధులు నిర్మించేవారు.

**సామ్రాజ్యాలు, గణతంత్రాల ఆవిర్భావం**

- 2700 సంవత్సరాల కిందట ప్రజలు గంగా, యమునా పరీవాహక ప్రాంతాల్లో స్థిరపడ్డారు.
- సంస్కృత భాషలో జన అంటే తెగ, పదం అంటే స్థిరపడిన ప్రాంతం.
- మహా జనపదాల కాలంలో ఢిల్లీ, ఆత్రంజిఖేర, కౌశాంబి, పట్నా, అయోధ్య, రాజగిర్ లాంటి నగరాలు అభివృద్ధి చెందాయి. (రెండో నగరీకరణ).
- గమనిక: సింధు నాగరికత కాలాన్ని తొలి నగరీకరణగా పేర్కొంటారు.
- 16 మహాజనపదాల్లో 14 జనపదాలు రాచరిక వ్యవస్థను, 2 జనపదాలు గణతంత్రాలను కలిగి ఉండేవి.
- వజ్జి, మల్ల నాటి రెండు గణతంత్రాలు.
- ఎన్నికైన రాజ్యాధినేత ఉన్న రాజ్యాలను గణతంత్రాలుగా పేర్కొంటారు.
- భారతదేశంలో ఆవిర్భవించిన తొలి సామ్రాజ్యం మగధ సామ్రాజ్యం.
- వజ్జి గణరాజ్యం మగధకు ఉత్తర దిక్కులో ఉండేది.
- మహిళలు, బానిసలు, సేవకులకు గణరాజ్య సభల్లో పాల్గొనే హక్కు లేదు.
- బుద్ధుడు, మహావీరుడు గణ రాజ్యాలకు చెందినవారే.
- **మగధ తొలి సామ్రాజ్యంగా ఆవిర్భవించడానికి దోహదపడిన అంశాలు:**
  - శక్తిమంతమైన రాజులు, వంశాల పాలన
  - ఇనుప గనులు విస్తారంగా ఉండటం
  - సారవంతమైన నదీ తీరప్రాంతాలు ఉండటం.
- మగధ రాజ్యం గంగానదికి రెండు వైపులా విస్తరించి ఉంది.
- మగధ దక్షిణ భాగంలో ఇనుప గనులు విస్తారంగా ఉన్నాయి.
- హర్యంక వంశానికి చెందిన బింబిసారుడు, అజాతశత్రువు మగధను బలమైన రాజ్యంగా తీర్చిదిద్దారు.
- మహాపద్మనందుడి కాలంలో మగధ వాయవ్యం నుంచి ఒడిశా వరకూ విస్తరించింది.
- మహాజనపదాల కాలంలో భూయజమానులను గృహపతి/ గాహపతి అనేవారు.
- వ్యవసాయ కూలీలను భర్తుకా అని, బానిసలను దాసులు అని పిలిచేవారు.
- యుద్ధంలో ఓడిపోయిన సైనికులను దాసులుగా మార్చేవారు.
- రాజులు సిరిసంపదలతో ఉండటానికి పన్నులు అధికంగా వసూలు చేయడంతోపాటు నిత్యం ఇతర రాజ్యాలపై దండయాత్రలు చేసేవారు.
- పట్టణాల్లో ఉండే వృత్తిపనివారు ఒకరోజు రాజు పొలంలో ఉచితంగా పని చేయడం ద్వారా వృత్తి పన్ను చెల్లించేవారు.
- రైతులు రాజుకు చెల్లించే భూమి శిస్తును 'భాగ' అనేవారు. ఇది పంటలో 1/6 వంతు.
- గోండుల గ్రామపెద్ద పట్లాను పోలి ఉండేవాడు.
- గ్రామంలో అధిక ధనవంతుడైన వ్యక్తిని గ్రామపెద్దగా నియమించేవారు.
- గ్రామపెద్ద పాలనా, న్యాయ, పోలీస్ విధులు నిర్వహించేవాడు.
- నాణేల ముద్రణ, ఉపయోగం మహాజనపదాల కాలంలోనే ప్రారంభమైంది.

**మొదటి సామ్రాజ్యాలు**

- మౌర్య వంశ, మౌర్య రాజ్య స్థాపకుడు చంద్రగుప్త మౌర్యుడు. గొప్పవాడు అశోకుడు.
- మౌర్యుల పాలనకు ఆధారాలు: అశోకుడి శాసనాలు, అర్థశాస్త్రం, ఇండికా.
- కౌటిల్యుడు సంస్కృత భాషలో రచించిన అర్థశాస్త్రం ఒక పాలనాశాస్త్రం.
- గ్రీకు రాయబారి మెగస్తనీస్ చంద్రగుప్త మౌర్యుడి ఆస్థానంలో ఇండికా గ్రంథాన్ని గ్రీకుభాషలో రాశాడు.
- మౌర్యుల కాలంలో రాజ్యం నేటి అఫ్గనిస్థాన్ నుంచి దక్షిణాన కర్ణాటక వరకు, తూర్పున బెంగాల్ వరకు విస్తరించింది.
- మౌర్యుల రాజధాని పాటలీపుత్రం.
- పాటలీపుత్రం, దాని చుట్టూ ఉన్న ప్రాంతం చక్రవర్తి ప్రత్యక్ష పర్యవేక్షణలో ఉండేది.
- అధికారుల పనితీరును వేగుల ద్వారా రాజులు తెలుసుకునేవారు. దూతల ద్వారా రాజు తన సందేశాలను అధికారులకు పంపేవాడు.
- తక్షశిల, ఉజ్జయిని, సువర్ణగిరి, తోశాలి లాంటి ప్రాదేశిక రాజధానులను రాజకుమారులు పరిపాలించేవారు. వారిని గవర్నర్లు/ కుమారామాత్యులుగా పిలిచేవారు.
- మౌర్యుల కాలంలో సువర్ణగిరి బంగారు గనులకు ఎంతో ప్రసిద్ధి చెందింది.
- తక్షశిలలో విదేశీ వస్తువులు విరివిగా దొరికేవి.
- భారతదేశంలో తొలి శాసనాలు వేయించింది అశోకుడు. అతడి శాసనాలు ఎక్కువగా ప్రాకృత భాషలో, బ్రాహ్మీలిపిలో ఉన్నాయి.
- 'నేను చక్రవర్తి అయిన 8 సంవత్సరాలకు కళింగయుద్ధం (క్రీ.పూ. 261) చేశాను' అని అశోకుడు తన 13 వ శిలాశాసనంలో (ధౌళి/ జౌగాడ శాసనం) పేర్కొన్నాడు.
- కళింగ యుద్ధంలో లక్షమందికి పైగా మరణించడంతో అశోకుడు హృదయ పరివర్తన చెంది, యుద్ధాన్ని త్యజించాడు.
- ఉపగుప్తుడి సలహాతో అశోకుడు బౌద్ధ మతాన్ని స్వీకరించాడు.
- ధమ్మ/ ధర్మ సిద్ధాంతాన్ని ప్రచారం చేయడానికి ధర్మ మహామాత్రులు అనే ఉద్యోగులను నియమించాడు.
- ధమ్మ ప్రాకృత పదం కాగా ధర్మ అనేది సంస్కృత పదం.
- సిరియా, ఈజిప్ట్, గ్రీస్, శ్రీలంక దేశాల్లో ధర్మాన్ని ప్రచారం చేయడానికి రాయబారులను పంపాడు.
- మనుషులకే కాకుండా జంతువులకు కూడా వైద్య సదుపాయాలు కల్పించిన తొలి భారతీయ చక్రవర్తిగా అశోకుడు పేరొందాడు.
- మౌర్యులకు సామంతులుగా ఉన్న శాతవాహనులు దక్కన్‌లో స్వాతంత్య్రాన్ని ప్రకటించుకున్నారు.
- శాతవాహనుల రాజధాని ధాన్యకటకం (అమరావతి).
- గౌతమీపుత్ర శాతకర్ణి, వాశిష్ఠీ పుత్ర పులోమావి, యజ్ఞశ్రీ శాతకర్ణి లాంటి రాజులు గొప్పవారు.
- అమరావతి, భట్టిప్రోలు, వడ్డమానుకొండ లాంటి ప్రాంతాల్లో బౌద్ధ ఆలయాలు, స్థూపాలను నిర్మించారు.
- రోమ్, బెంగాల్‌తో సముద్ర వ్యాపారం చేశారు.
- రోమన్ నాణేలు, రోమ్ శైలి కుండలు వీరి రాజ్య భాగాల్లో లభించాయి.
- పులోమావి పాలనాకాలం నాటి మ్యాకదోని శాసనం కర్ణాటక రాష్ట్రంలోని బళ్లారి జిల్లాలో దొరికింది.
- పులోమావి 8 వ పాలనా సంవత్సరంలో మ్యాకదోని శాసనం వేశారు.
- పులోమావి మహాసేనాపతి స్కందనాగుని శాతవాహన ఆహారంలో కుమారదత్త అధిపతిగా ఉన్న వేపుర గ్రామంలో కాంత తెగ నాయకుడు సమ్మ ఒక చెరువును తవ్వించినట్లు మ్యాకదోని శాసనం పేర్కొంటోంది.
- వేపుర గ్రామాధిపతి - కుమారదత్త. కాంత తెగ నాయకుడు - సమ్మ
- శాతవాహనులను ఓడించి క్షాంతమూలుడు ఇక్ష్వాక రాజ్యాన్ని స్థాపించాడు.
- ఇక్ష్వాకుల రాజధాని విజయపురి (కృష్ణానది తీరం, నాగార్జున కొండ ప్రాంతం)
- వీరు రాముడి వంశానికి చెందినవారుగా చెప్పుకున్నారు.
- క్షాంతమూలుడు, వీరపురుషదత్తుడు లాంటి రాజులు అశ్వమేధ, రాజసూయ యాగాలు చేశారు.
- నాగార్జున కొండవద్ద అతిపెద్ద ఆరామం, స్థూపం నిర్మించారు. (స్థూపం, చైత్యం, విహారం ఈ మూడూ ఉన్న ప్రాంతాన్ని ఆరామం అంటారు.)

**భారత ఉపఖండంలో కొన్ని ముఖ్యమైన సామ్రాజ్యాలు**

**కుషాణులు**

- కుషాణులు రెండువేల సంవత్సరాలకు పూర్వమే చైనా ప్రాంతం నుంచి వలస వచ్చి అఫ్గనిస్థాన్ కేంద్రంగా తమ సామ్రాజ్యాన్ని స్థాపించారు.
- కుషాణుల్లో గొప్పవాడు కనిష్కుడు.
- కనిష్కుడు క్రీ.శ. 78 లో సింహాసనాన్ని అధిష్ఠించి, శక యుగాన్ని ప్రారంభించాడు.
- శక యుగాన్నే శాలివాహన శకం లేదా శతాబ్దంగా పేర్కొంటున్నారు.
- భారతదేశం శక క్యాలెండర్‌ను అనుసరిస్తోంది. శక యుగం సాధారణ యుగానికి 78 సంవత్సరాల తర్వాత ఉంటుంది.
- భారత్‌లో కుషాణుల కాలంలో ఇరాన్, చైనా, రోమ్ దేశాలతో వ్యాపారం బాగా జరిగేది.

**గుప్తులు**

- గుప్తులు బిహార్‌లోని పాటలీపుత్రాన్ని రాజధానిగా చేసుకుని సామ్రాజ్యాన్ని స్థాపించారు.
- గుప్త వంశ మూలపురుషుడు శ్రీగుప్తుడు. (క్రీ.శ. 320 లో శ్రీగుప్తుడు గుప్త సామ్రాజ్యాన్ని స్థాపించినట్లు చెబుతారు)
- గుప్త రాజ్య స్థాపకుడు మొదటి చంద్రగుప్తుడు.
- గుప్త రాజుల్లో గొప్పవాడు రెండో చంద్రగుప్తుడు. ఇతడి బిరుదు విక్రమార్కుడు.
- రెండో చంద్రగుప్తుడి కాలాన్ని స్వర్ణయుగంగా పేర్కొంటారు.
- రెండో చంద్రగుప్తుడి ఆస్థానంలో నవరత్నాలు అనే కవులు ఉండేవారు. నవరత్నాల్లో కాళిదాసు గొప్పకవి.
- **ముఖ్యమైన గుప్తరాజులు:** మొదటి చంద్రగుప్తుడు, సముద్రగుప్తుడు, రెండో చంద్రగుప్తుడు, కుమారగుప్తుడు, స్కందగుప్తుడు.

# హాయ్! బుజ్జీ!!



రంగు రంగుల పేపర్ వెయిట్‌లు...
వాటి లోపల్లోపల చిత్రమైన ఆకారాలు...
మధ్య మధ్యలో గాలి బుడగలు...
అక్కడక్కడా అలంకారాలు...
అన్నీ కలిసి గుండ్రటి ఆ గాజులో...
ఎలా దూరాయి చెప్మా?

## పేపర్ వెయిట్.. తయార్!

మనం స్కూళ్లలో, కార్యాలయాల్లో గాజు పేపర్ వెయిట్‌లను చూస్తూనే ఉంటాం కదూ. పరీక్షించి వాటిని ఎప్పుడైనా చూశారా? లోపల బోలెడు రంగులుంటాయ్. ఆకులు, పువ్వుల్లాంటి డిజైన్‌లుంటాయ్. మధ్య మధ్య నీటి బిందువుల్లా కనిపించే గాలి బుడగలుంటాయ్. అవన్నీ లోపలికి ఎలా వెళ్లి ఉంటాయ్? ఎప్పుడైనా ఆలోచించారా? లోపలికి వెళ్లినట్టు ఎక్కడా దారి కనిపించదు. ఎక్కడా అతికినట్టూ అనిపించదు. మరి అంత అందంగా, గుండ్రంగా అవి ఎలా తయారవుతాయబ్బా?

### తయారీ ఎలా?



◆ గాజు పేపర్ వెయిట్‌లను తయారు చేయడానికి మూల పదార్థంగా కరిగి ఉన్న గాజు ద్రవాన్ని వాడతారు. గాజు ముక్కల్ని 2000డిగ్రీల ఫారన్‌హీట్ దగ్గర మండించి ద్రవరూపంలోకి మారుస్తారు. అది ఒక కొలిమి దగ్గర ద్రవరూపంలో పై నుంచి కారుతుంటుంది. అక్కడ దూరం నుంచి గాలి ఊదడానికి వీలుగా ఉండేలా స్ట్రాలాంటి ఇనుప గొట్టాన్ని వాడతారు. దాని చివరను గాజు ద్రవం పడే దగ్గర పెట్టి గుండ్రంగా తిప్పుతూ ఉష్ణోగ్రతని తగ్గిస్తారు.



◆ అది కొంచెం కొంచెం గట్టి బడే సమయంలో చమ్కీల్లాంటివాటిని, రంగుల్నీ అద్దుతారు. పొడవు గొట్టాన్ని అటూ ఇటూ తిప్పుతూ మెత్తగా ఉన్న గాజును మెలికలు తిప్పి రకరకాల ఆకారాలు సృష్టిస్తారు.



◆ లోపలి డిజైన్ పూర్తయిన తర్వాత పైన మరోసారి గాజు ద్రవం పోసి గొట్టాన్ని గుండ్రంగా తిప్పుతారు. దాన్ని ఓ గుంట గరిటలాంటి దాంట్లో పెట్టి గుండ్రంగా తిప్పుతూ బంతి ఆకారం తెస్తారు.



◆ గొట్టానికి చివరిగా ఉన్న గాజు బంతిని చాకుతో కత్తిరించి అడుగుభాగాన్ని చదును చేస్తారు. అంతే. వేడి పూర్తిగా చల్లారే వరకూ పక్కన పెట్టి తర్వాత దాన్ని ప్యాక్ చేసేస్తారు. వాటినే మనం బజార్‌లో కొనుక్కుంటాం.


◆ ఇది సాధారణంగా గాజు పేపర్ వెయిట్ తయారీలో పాటించే విధానం. ప్రాంతాల్ని బట్టి ఈ విధానంలో కొన్ని మార్పులు ఉంటుంటాయి. కొన్నింటిని ఒక్కొక్కటిగా మనుషులే తయారు చేస్తే మరి కొన్ని ఫ్యాక్టరీల్లో పెద్ద ఎత్తున తయారవుతున్నాయి. గాజు పేపర్ వెయిట్‌లతోపాటు ఇప్పుడు ప్లాస్టిక్, రెజీన్‌లతో చేసిన పేపర్ వెయిట్‌లనూ ఎక్కువగా వాడుతున్నారు.

### పుట్టింది ఎప్పుడంట?


- 1845 నుంచి 1860ల మధ్యలో తొలిసారిగా యాంటిక్ పేపర్ వెయిట్‌లను తయారుచేశారు.
- జస్టిన్ స్కూబర్ట్ అనే ఆయన మొదటగా వీటిని తయారు చేశారని చెబుతారు. ఎక్కడంటే ఫ్రాన్స్‌లో.
- ఇప్పుడు మనం చూస్తున్న గాజు వెయిట్‌లు మాత్రం 1940ల తర్వాత పుట్టినవే.

### లోపల పువ్వులెలా?

- ద్రవపు గాజు మెత్తబడే సమయంలో ప్రత్యేకమైన పరికరాల్ని ఉపయోగించి చిన్న పువ్వులు, ఆకుల్లాంటి డిజైన్‌లను ముందే చేసి పెట్టుకుంటారు. వాటిని వెయిట్ తయారు చేసేప్పుడు లోపలే ముందు అందంగా పేరుస్తారు. రంగులు అద్దడం అయినా అంతే. నీటి బిందువుల్లా కనిపించాలనుకున్న చోట స్ట్రాలాంటి గొట్టంలో నుంచి గాలిని ఊదుతారు. దీంతో లోపల సన్నని గాజు బుడగలొస్తాయి.



### బింబా & బబ్లూ — అండమాన్‌లో సాహసాలు 1




### ఛత్తీస్‌గఢ్ రాజధాని ఏది?

**స్కూల్ సవాల్**

1. మన దేశంలో సిపాయిల తిరుగుబాటు ఎప్పుడు జరిగింది?
2. వాస్కోడీగామా ఏ దేశస్థుడు?
3. ఛత్తీస్‌గఢ్ రాజధాని ఏది?



- షణ్ముఖరావు, తొమ్మిదో తరగతి
బి. నేతాజీ, ఏడో తరగతి,
జడ్‌పీహెచ్ స్కూల్, చల్లవానిపేట, శ్రీకాకుళం జిల్లా

### ఆణిముత్యం

మంచిపనిని మించిన పూజలేదు, మానవత్వాన్ని మించిన సంపద లేదు

- మదర్ థెరిసా


### నేర్చుకుందాం!

ఆంగ్లంలో చాలా పదాల్లో సైలెంట్ లెటర్స్ ఉంటాయి. తెలియక మనం వాటిని తప్పుగా పలికేస్తుంటాం. వాటి సరైన ఉచ్చారణ తెలుసుకుంటే సరి.


Thumb - థమ్
Subtle - సటల్



### కవలలేవి? ఒకేలా ఉన్న జతను పట్టుకోండి



### దారి కనుక్కోండి!



### సబ్జెక్ట్ ల్యాబ్ — సైన్స్

ఇక్కడున్న బొమ్మలు, వాక్యాల ఆధారంగా ఖాళీల్లో వచ్చే పదాలేంటో కనుక్కోగలరా?

1. We [ ] with our (nose)
2. We [ ] with our (eyes)
3. We [ ] with our (ear)
4. We [ ] with our (tongue)
5. We [ ] with our (hands)

జవాబులు: స్కూల్ సవాల్: 1. 1857 2. పోర్చుగల్ 3. నయా రాయ్‌పూర్
కవలలు: 2,4 సబ్జెక్ట్ ల్యాబ్ - సైన్స్: 1.Smell 2.See 3.Listen 4.Taste 5.Touch

# నెల్లూరులో జనవరి 21న బలిజ వధూవరుల వివాహ పరిచయ వేదిక

బలిజ కమ్యూనిటీలో సంబంధాలను అన్వేషించే వారి సౌకర్యార్థం ఈనాడుపెళ్లిపందిరి.నెట్ నెల్లూరులో జనవరి 21న పరిచయవేదిక నిర్వహిస్తుంది.

**వేదిక :** డి.ఎస్.ఆర్. కళ్యాణ మండపం, డోర్ నెం. 23-1219, శోధన్‌నగర్, ఆర్.టి.సి.బస్టాండ్ దగ్గర, నెల్లూరు.

**ప్రత్యేకతలివీ.....**

వధువు/వరుడు, వారి ఇష్టాఇష్టాల పరిచయం.

వధువు/వరుడు వివరాలతో కూడిన సి.డి. ఇవ్వబడును.

ఈనాడుపెళ్లిపందిరి.నెట్ వెబ్‌సైట్ ద్వారా మీకు నచ్చిన 10 'కాంటాక్ట్ నంబర్స్' 30 రోజుల కాల వ్యవధిలో పూర్తి ఉచితంగా చూసుకునే అవకాశం.

ఈనాడుపెళ్లిపందిరి.నెట్ ద్వారా వివాహం జరిగిన వారు 3 నెలల లోపు తెలియచేస్తే రూ॥ 2500/- విలువ గల గిఫ్ట్ కూపన్ అందచేయబడును.

పరిచయవేదికకు వచ్చిన వధువు/వరుడుతో కలిపి ముగ్గురు వ్యక్తులకు భోజన వసతి.

రిజిస్ట్రేషన్ల సంఖ్య పరిమితం. రుసుము రూ॥ 2100/-.

ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకొనేవారికి 10% తగ్గింపు కలదు. 10% తగ్గింపు పొందుటకు ఆఖరు తేది : 11-01-2018.

**మరిన్ని వివరాలకు సంప్రదించండి :** ఈనాడు ఆఫీస్, 24-384ఎ, 2వ అంతస్తు, పి.ఎస్.ఆర్.ఎన్‌క్లేవ్, సరస్వతినగర్, నెల్లూరు. ఫోన్స్ : 8897511778, 9704671294, **అనంతపురం :** 8008551134, **కర్నూలు :** 8008551140, **తిరుపతి :** 9121178837, **కడప :** 8008551141, **ఒంగోలు :** 9121178837.

రిజిస్ట్రేషన్ కొరకు వచ్చునపుడు వధువు/వరుడుల ID Proof (Aadhar / Passport / Driving Licence / Voter ID) & Photo వెంట తీసుకురాగలరు లేదా మా WhatsApp Number : 8008550212 కు పంపగలరు.

రిజిస్ట్రేషన్స్ ఆన్‌లైన్‌లో కూడా చేసుకోవచ్చు.

www.eenadupellipandiri.net

## ఈటీవీలో ఈనాడు

**ఉదయం**

05-45: ఆరాధన, 06-30: అన్నదాత, 07-00: ఈటీవీ న్యూస్, 07-30: శుభమస్తు: సొంతింటి కల నెరవేరాలంటే చేయాల్సిన దానాలు?, వాస్తురీత్యా విద్యుత్ ఉపకరణాలు ఏ దిశలో ఉండాలి?, 08-30: టాలీవుడ్ టైమ్, 09-00: ఈనాడు సినిమా: ఆడదే ఆధారం (సీత, విసు).

**మధ్యాహ్నం**

12-00: తెలుగు'రుచి': ఘుమఘుమలు 'వంకాయ ఉలవకారం', మీ చేతివంట 'పన్నీర్ చెనా కర్రీ', 'ఆలూ పాలక్‌రైస్', జస్ట్ ఎ మినిట్ 'కాజూ గోబీపకోడీ' తయారు చేసే విధానం, ఇంటింటి వంటింటి చిట్కాలు, 01-00: స్టార్ మహిళ (మెగా గేమ్ షో), 02-00: అభిషేకం (డైలీ సీరియల్), 02-30: అత్తారింటికి దారేది (డైలీ సీరియల్), 03-00: సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు (విధి 2) (డైలీ సీరియల్), 03-30: ఆడదే ఆధారం (డైలీ సీరియల్).

**సాయంత్రం**

04-00: ఋతుగీతం (డైలీ సీరియల్), 04-30: వసంతం (డైలీ సీరియల్), 05-00: జీన్స్-2 (రిపీట్), 06-00: ఒకరి ఒకరు (డైలీ సీరియల్), 06-30: తేనెమనసులు (డైలీ సీరియల్).

**రాత్రి**

07-00: సావిత్రి (డైలీ సీరియల్), 07-30: మనసు మమత (డైలీ సీరియల్), 08-00: స్వాతిచినుకులు (డైలీ సీరియల్), 08-30: నా పేరు మీనాక్షి (డైలీ సీరియల్), 09-00: ఈటీవీ న్యూస్, 09-30: జబర్దస్త్ – సూపర్‌హిట్ కామెడీ షో, 10-30: జబర్దస్త్ జల్సాటైం...

## ఈటీవీ ప్లస్

**ఉదయం**

11:00 కిక్ రిపీట్

**మధ్యాహ్నం**

12:00 జబర్దస్త్ రిమిక్స్
01:00 డీజే రిపీట్
01:15 స్టే..పూలిష్ రిపీట్
01:30 పటాస్ రిపీట్
02:00 అల్లరే అల్లరి రిపీట్
02:30 సరదాగా కాసేపు రిపీట్
03:00 తారక్ మామా అయ్యోరామ రిపీట్
03:30 నా షో నా ఇష్టం రిపీట్

**సాయంత్రం**

04:30 ఎక్స్‌ప్రెస్ రాజా
05:00 జిల్ జిల్ జిగా
06:00 అమృతం రిపీట్
06:30 ఎక్స్‌ప్రెస్ రాజా

**రాత్రి**

07:30 తారక్ మామా అయ్యోరామ
08:00 పోవే..పోరా
09:00 పటాస్
09:30 టాప్స్
10:00 కిర్రాక్ కిడ్స్ రిపీట్
11:30 ఎక్స్‌ప్రెస్ రాజా రిపీట్

## ఈటీవీ లైఫ్

- ★ మానస - బ్రహ్మకుమారి (ఉ.6:00, రా.11:30)
- ★ యోగమంత్ర (ఉ.7:00, సా.6:00, రా.10:30)
- ★ గెట్‌సెట్‌ఫిట్ (ఉ.7:30, సా.6:30, రా.10:00)
- ★ అమృతం: డైరీ డిలైట్స్ (ఉ.8:00, మ.12:30, రా.8:00)
- ★ హెల్దీ & టేస్టీ (ఉ.8:30, మ.1:00, రా.8:30)
- ★ కౌంట్ యువర్ కేలరీస్ (మ.1:30)
- ★ జీవనరేఖ చైల్డ్‌కేర్: మీ పిల్లలు ఆడుకునే బొమ్మలు - తీసుకోవాల్సిన జాగ్రత్తలు (ఉ.9:30)
- ★ జీవనరేఖ చైల్డ్‌కేర్: మీ పిల్లలు తక్కువ బరువుతో పుట్టారా? (మ.2:00, రా.7:00)
- ★ సుఖజీవనం (ఉ.10:00, మ.2:30, రా.9:30)
- ★ ఆరోగ్యమస్తు: 1. చెడు అలవాట్లు - కీళ్ల నొప్పులు, 2. నొప్పి నివారణ మాత్రలు - వాస్తవాలు, 3. చెవిలో శబ్దాలు (ఉ.10:30)
- ★ ఆరోగ్యమస్తు: 1. మీ జుట్టు తీరు - మీ ఆరోగ్య స్థితి, 2. బాడీ పెయిన్స్ రావడానికి కారణాలు - పరిష్కారాలు, 3. మీ పళ్ళు జుంమంటున్నాయా? (మ.3:00, రా.9:00)
- ★ డా. ఈటీవీ: క్యాన్సర్ కేర్ (ఉ.11:00)
- ★ డా. ఈటీవీ: దంత సంరక్షణ (ఉ.11:15)
- ★ డా. ఈటీవీ: అజీర్తి సమస్యలు (మ.3:30, రా.7:30)
- ★ డా. ఈటీవీ: జనరల్ హెల్త్ (మ.3:45, రా.7:45)

## ఈటీవీ సినిమా

**ఉదయం:** 6-00: టెలిషాపింగ్, 7-00: సన్‌రైజ్ సినిమా: ఇద్దరు కొడుకులు (శోభన్‌బాబు, రాధ) 10-00: మార్నింగ్ షో: నిత్యాకల్యాణం పచ్చతోరణం (చలం) **మధ్యాహ్నం:** 1-00: మాట్నీ: దొంగమొగుడు (చిరంజీవి, రాధిక) **సాయంత్రం:** 4-00: ఈవినింగ్ షో: ఒక సినిమాకథ (రాజేంద్రబాబు) **రాత్రి:** 7-00: ఫస్ట్ షో: వాడె వీడు (ఎన్టీఆర్, మంజుల) 10-00: ప్రముఖ దర్శకుడు పి.సి.రెడ్డితో గుర్తుకొస్తున్నాయి... (రెండవ భాగం).

## ఈటీవీ అభిరుచి

ఉ.6.00: బ్రేక్ ఫాస్ట్ షో - కాబూలీ చెనా ముల్లంగి పరాటా & మష్రూమ్ మఫిన్స్, **ఉ.8.00, రా.9.00:** బ్రేక్ ఫాస్ట్ షో - కీన్వ కాబూలినా టిక్కీ & జుకిని మిల్లెట్ మఫిన్స్, **ఉ.8.45: టేస్ట్ ఆఫ్ ఇండియా (కర్ణాటక క్యూసైన్)** - మసాలా ఎనగై, **ఉ.9.30: సూపర్ భీమ్** - గేమ్ షో, **ఉ.11.00: గోరుముద్దలు** - సగ్గుబియ్యం టిక్కీస్, **ఉ.11.15, రా.8.30: డైట్ మెనూ (మైగ్రేన్ నివారణకు)** - బ్రొకోలి సూప్, **ఉ.11.30, రా.8:00: గోదావరి నెయ్యి "బాబాయ్ హోటల్"** - జొన్న రొట్టె & పండుమిరపకాయ పచ్చడి, **మ.12.00, సా.5.45: టేస్ట్ ఆఫ్ ఇండియా (కర్ణాటక క్యూసైన్)** - మిక్స్డ్ వెజ్ సాగూ, **మ.12.15, రా.10.15: మమ్మీస్ కిచెన్** - చెనా ఝూర్ గరం, **మ.12.30, రా.8.45: సూపర్ చెఫ్ (మొగలై స్టైల్)** - బెండకాయ మటన్ కర్రీ, **మ.12.45, సా.6.15: ఛాట్స్ & సూప్స్** - మేతి బార్లీ సూప్, **మ.1.00, సా.4.30: వావ్ ఏమి రుచి (పార్సీ క్యూసైన్)** - పార్సీ బిర్యానీ & పాలక్ ఈడ, **మ.1.30, రా.10.00: చట్‌పట్ (అత్తమ్మ రుచుల స్పెషల్)** వంకాయ బజ్జీ, **మ.1.45, రా.7.30: పెరటి రుచులు** - ఆయుర్వేదిక పెరటి మొక్కలు - ఇంటి చిట్కాలు, **మ.2.15: మటన్‌తో మస్తీ మస్తీ** - మటన్ ఖీమ బిరానీ రైస్ & గోంగూర మటన్, **మ.2.30, సా.6.00: మంత్రా డిటర్జెంట్ సోప్ "చోటా షెఫ్"** - టమాటో అటుకులు, **మ.2.45, రా.10.30: కారాలు, పొడులు** - ఉసిరి కారం & రాగి తీపి అట్టు పొడి, **మ.3.30: భళా మిస్టర్ బ్రహ్మచారి** - చికెన్ ఫ్రైడ్ రైస్.

## ఈటీవీ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమాలు

**ఉదయం:** 05-30 తమసోమా జ్యోతిర్గమయ, 06-00 ఘంటారావం, 06-30 ప్రార్థనా సమయం, 07-00 అంతర్యామి, 07-30 ఈటీవీ 360 º, 08-30 యువ (రి), 09-00 ఘంటారావం, 09-30 సుఖీభవ, 10-00 ఘంటారావం, 10-30 ఈటీవీ టాకీస్ (రిపీట్), 11-00 ఘంటారావం, 11-30 ఇదీ సంగతి!, **మధ్యాహ్నం:** 12-00 ఘంటారావం, 12-30 ప్రత్యేక వాణిజ్య కార్యక్రమం, 01-00 ఈటీవీ 360 º, 02-30 సఖి, 03-00 ఘంటారావం, 03-30 సుఖీభవ: పిల్లలు.. అత్యవసర పరిస్థితులు, **సాయంత్రం:** 04-00 ఘంటారావం, 04-30 తీర్థయాత్ర: శ్రీ సాయిబాబా మందిరం, అలంపురం, పశ్చిమ గోదావరి జిల్లా, 05-00 ఘంటారావం, 05-30 కమర్షియల్ స్లాట్, 06-00 ఘంటారావం, 06-30 జై కిసాన్, **రాత్రి:** 07-00 ఘంటారావం, 07-30 ఇదీ సంగతి, 08-00 ఈటీవీ 360 º, 09-00 ప్రతిధ్వని, 09-30 యువ, 10-00 ఘంటారావం, 10-30 బీబీసీ ప్రపంచం, 11-00 ఘంటారావం, 11-30 ఇదీ సంగతి.

## ఈటీవీ తెలంగాణ కార్యక్రమాలు

**ఉదయం:** 05-30 తమసోమా జ్యోతిర్గమయ, 06-00 ఘంటారావం, 06-30 యువ (రి), 07-00 అంతర్యామి, 07-30 ఈటీవీ 360 º, 08-30 యువ, 09-00 ఘంటారావం, 09-30 ఈటీవీ టాకీస్, 10-00 ఘంటారావం, 10-30 సుఖీభవ, 11-00 ఘంటారావం, 11-30 ఇదీసంగతి!, **మధ్యాహ్నం:** 12-00 ఘంటారావం, 12-30 కమర్షియల్ స్లాట్, 01-00 ఈటీవీ 360 º, 02-30 సఖి, 03-00 ఘంటారావం, 03-30 తీర్థయాత్ర: శ్రీ సాయిబాబా మందిరం, గంగారం, వికారాబాద్ జిల్లా, **సాయంత్రం:** 04-00 ఘంటారావం, 04-30 సుఖీభవ: పిల్లలు.. అత్యవసర పరిస్థితులు, 05-00 ఘంటారావం, 05-30 కమర్షియల్ స్లాట్, 06-00 ఘంటారావం, 06-30 జైకిసాన్, **రాత్రి:** 07-00 ఘంటారావం, 07-30 ఇదీ సంగతి, 08-00 ఈటీవీ 360 º, 09-00 ప్రతిధ్వని, 09-30 యువ, 10-00 ఘంటారావం, 10-30 బీబీసీ ప్రపంచం, 11-00 ఘంటారావం, 11-30 ఇదీ సంగతి.

## ఏ ఛానల్లో ఏముంది.. 04-01-2018

**SVBC (TTD)** — **ఉదయం:** 05-30 తిరుప్పావై - గోదాస్తుతి, 06-30 శుభోదయం + నిత్యపూజలివిగో, 07-00 విష్ణు సహస్రనామస్తోత్రం, 07-30 శ్రీవారి సేవలు (తిరుప్పావడ సేవ), 08-00 శతమానం భవతి, 08-30 పూజకువేళాయె - దత్తాత్రేయస్వామి, 09-00 ఆధ్యాత్మిక విశేషాలు, 09-30 భక్తిగీతమాలిక, 10-00 ఆధ్యాత్మిక విశేషగలు - కన్నడ, 10-30 లైవ్ శ్రీపద్మావతి అమ్మవారి కల్యాణం - తిరుచానూరు, 11-30 స్పెషల్ న్యూస్ + ఆముక్తమాల్యద, **మధ్యాహ్నం:** 12-00 లైవ్ కల్యాణోత్సవం, 01-00 ఆధ్యాత్మిక విశేషాలు, 01-30 విష్ణుసహస్ర నామామృతం + లైవ్ డోలోత్సవం, 02-00 లైవ్ ఆర్జిత బ్రహ్మోత్సవం, 02-30 లైవ్ వసంతోత్సవం, 03-00 అన్నమయ్య పాటకు పట్టాభిషేకం, **సాయంత్రం:** 04-30 యక్షప్రశ్నలు, 05-00 లైవ్ ఎస్.డి.సేవ + స్పెషల్ న్యూస్ + ఆళ్వార్ శ్రీసూక్తి, 06-00 లైవ్ నాదనీరాజనం - తిరుమల, **రాత్రి:** 07-30 లైవ్ ఘంటానాదం + శ్రీనివాసగద్యం + ఖడ్గమాలస్తోత్రం, 08-00 లైవ్ అధ్యయనోత్సవాలు నేను.. నా.. స్వామి, 08-30 మల్లికార్జున సుప్రభాతం - చాగంటి, 09-00 ఆలయదర్శనం - రామేశ్వరలక్ష్మణేశ్వర దేవస్థానం, 09-30 శివమహాపురాణం - శ్రీసామవేదం, 10-00 ఆధ్యాత్మిక విశేషాలు, 10-30 శ్రీరామ రసవాహిని - సాటులూరి గోపాల కృష్ణమాచార్యులు.

**భక్తి TV** — **ఉదయం:** 6-00 శ్రీసాయి హారతి, 6-30 సద్గురుస్తోత్రం, 7-00 అర్చన, 7-30 సాయి గీతామృతం, 8-00 పుణ్యక్షేత్రం, 8-30 జ్యోతి స్వరూపా అయ్యప్ప, 9-00 సంపూర్ణ మహాభారతం, 11-00 ధర్మసందేహాలు, **సాయంత్రం:** 4-30 పుణ్యక్షేత్రం, 5-00 శ్రీకనకధారాస్తోత్రం, 5-30 సాయిగీతామృతం, 6-00 సద్గురుస్తోత్రం, 7-00 భక్తివిశేషాలు, 7-30 అమృతకలశం, 8-00 పరిహారం, 8-30 శ్రీమద్భగవద్గీత 9-00 దుర్గాసప్తశతి, 9-30 మహాభారత పాత్రలు, 10-00 ధర్మ సందేహాలు, 10-30 భక్తివిశేషాలు, 11-00 గోదామృతం.

**జీ తెలుగు** — **ఉదయం:** 06-30 ఎంజాయ్ ఎవ్రిడే లైఫ్, 07-00 టెలిషాపింగ్, 07-30 శుభోదయం, 08-30 సినిమా: నాగవల్లి 11-30 వారెవా, **మధ్యాహ్నం:** 12-00 గోల్డ్‌రష్ 01-00 బతుకు జట్కా బండి, 02-00 గృహప్రవేశం, 02-30 నా కోడలు బంగారం, 03-00 సూర్యవంశం (రిపీట్), 03-30 కల్యాణ వైభోగం (రిపీట్), **సాయంత్రం:** 04-00 బిగ్ సెలబ్రిటి చాలెంజ్ ఇంటర్‌నేషనల్, 05-00 జై కృష్ణా ముకుంద మురారి, 05-30 కుంకుమ భాగ్య, 06-00 పక్కింటి అమ్మాయి, 06-30 పున్నాగ, **రాత్రి:** 07-00 అమెరికా అమ్మాయి, 07-30 ముద్దమందారం, 08-00 దట్ ఈజ్ మహాలక్ష్మి, 08-30 ఎవరే నువ్వు మోహిని, 09-00 కల్యాణ వైభోగం, 09-30 ముత్యాల ముగ్గు, 10-00 సూర్యవంశం, 10-30 నా కోడలు బంగారం (రిపీట్),11-00 బిగ్ సెలబ్రిటి ఛాలెంజ్ ఇంటర్‌నేషనల్ (రిపీట్).

**మా** — **ఉదయం:** 06-30 సిల్వర్ స్క్రీన్, 07-00 హరహర మహాదేవ, 08-00 రాశి ఫలాలు దినఫలం, 08-30 జానకి రాముడు, 09-00 సినిమా: చంద్రలేఖ, **మధ్యాహ్నం:** 12-00 కోడలా కోడలా కోడుకు పెళ్లామా, 12-30 అగ్నిసాక్షి (రిపీట్), 01-00 కుంకుమపువ్వు (రిపీట్), 01-30 చూపులు కలిసిన శుభవేళ, 02-00 కార్తీక దీపం, 02-30 సినిమా: యమదొంగ, **సాయంత్రం:** 06-00 ఉయ్యాలా జంపాలా, 06-30 అగ్నిసాక్షి, **రాత్రి:** 07-00 లక్ష్మీ కల్యాణం, 07-30 కార్తీకదీపం, 08-00 కోయిలమ్మ, 08-30 కుంకుమ పువ్వు, 09-00 సుందరకాండ, 09-30 పవిత్రబంధం, 10-00 నీలికలువలు, 10-30 దసరా వచ్చిందయ్య (రిపీట్).

**జెమిని** — **ఉదయం:** 06-00 టెలిషాపింగ్, 07-00 అమృతకలశం, 07-30 అనుగ్రహం, 08-00 శ్రీ ఆంజనేయం (రిపీట్), 08-30 సినిమా: దేవుళ్లు, 11-30 నాగిని -2 (రిపీట్), **మధ్యాహ్నం:** 12-00 నువ్వు నాకు నచ్చావ్ (రిపీట్) 12-30 చక్రవాకం, 01-00 నందిని (రిపీట్), 01-30 మొగలి రేకులు, 02-00 అమ్మ నేను ఓ అమ్మాయి, 02-30 శిరిడి సాయి, 03-00 సినిమా: ఆ నలుగురు, **సాయంత్రం:** 06-00 ప్రతిఘటన, 06-30 శ్రీ ఆంజనేయం, **రాత్రి:** 07-00 నాతిచరామి, 07-30 జై జై వినాయక, 08-00 మాతృదేవోభవ, 08-30 శనీశ్వరుని దివ్యచరిత్ర, 09-00 నందిని, 09-30 బోల్ బేబీ బోల్ - సీజన్ 10, 10-30 సినిమా: ఆర్య.

**HBO** — **ఉదయం:** 06-00 స్టార్ ట్రెక్ 2: ది రాత్ ఆఫ్ ఖాన్, 07-56 ది కరాటే కిడ్ పార్ట్ 2, 09-59 బ్యాక్ టు ది ఫ్యూచర్ పార్ట్ 3, **మధ్యాహ్నం:** 12-03 మ్యాన్ ఆఫ్ స్టీల్, 02-27 పుష్ ఇన్ బూట్స్, **సాయంత్రం:** 04-03 వే ఆఫ్ ది డ్రాగన్, 5-53 ది డిక్టేటర్ **రాత్రి:** 07-08 ది లాస్ట్ ఎయిర్‌బెండర్, 09-00 కుంగ్ ఫూ పాండా 2, 10-40 పాల్.

## రైతేరాజు

**ఈటీవీ అన్నదాతలో...** రేపు ఉదయం 6.30 గం.లకు

1. రబీ వరి పొలాల్లో ఎలుకల నిర్మూలన
2. వేరుశనగలో జిప్సం ఆవశ్యకత
3. పసుపు సాగులో ఇందూరు యువ రైతు ఆదర్శం

ఉచిత హెల్ప్‌లైన్ నెం.1800-425-4085కు ఉ.10-11 గం.ల మధ్య ఫోన్ చేయవచ్చు

**ఈటీవీ ఆంధ్రప్రదేశ్ జైకిసాన్‌లో...** నేటి సాయంత్రం 6.30 గంటలకు

1. గుర్రపుడెక్కతో సేంద్రియ ఎరువు ప్రయోగాత్మకంగా ప్రారంభించిన ఐఐసిటి
2. ఆధునిక పద్ధతిలో బంతిసాగు 'ఆత్మ' చేయూతతో ప్రకాశం రైతులకు లాభాలు

జైకిసాన్ కార్యక్రమాన్ని www.youtube.com/etv2jaikisan ద్వారా కూడా వీక్షించవచ్చు.

# మిరపలో తెగుళ్ల నివారణ

వాణిజ్య పంటలలో ప్రధానమైనది మిరప. ఈ పంటను ఎక్కువగా కృష్ణా, గుంటూరు, ప్రకాశం, కర్నూలు జిల్లాలో పండిస్తారు. నష్టమైనా, లాభమైనా ఏటా ఎంతో కొంత విస్తీర్ణంలో సాగు చేస్తారు. అలాంటి మిరపకు కొన్నేళ్లుగా చీడపీడలు అధికమయ్యాయి. పెట్టుబడి ఎక్కువగా పెట్టే ఈ పంట సాగులో సరైన జాగ్రత్తలు తీసుకోకుంటే నష్టాలు తప్పవు. ప్రస్తుతం మిరప పూత, పిందె, కాయ దశలో ఉంది. ఈ ఏడాది బొబ్బర తెగులు (వైరస్) సోకి చాలా మంది రైతులు నష్టపోయారు. మిరపలో చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలను పిడుగురాళ్ల ఉద్యానశాఖ అధికారి మోహన్ వివరించారు.

**పైముడత:** తామర పురుగులు ఆకుల అడుగు భాగంలో చేరి రసం పీల్చడం వల్ల ఆకులు పైకి ముడుచుకొని ఉంటాయి. దీని నివారణకు లీటరు నీటికి ట్రైజోఫాస్ 1.25 మి.లీ. లేదా పిప్రోనిల్ 2 మి.లీ. వేపనూనె 5 మి.లీ. జిగురు 1.5 మి.లీ. (గమ్)తోకలిపి పిచికారి చేయాలి.

**కింది ముడత:** ఇది నల్లి వల్ల వస్తుంది. నల్లి ఆశించిన ఆకులు కిందికి ముడుచుకొని తిరగబడిన పడవ ఆకారంలో కనిపిస్తాయి. ఇంకా ముదిరితే ఆకు పసుపు రంగులోకి మారి పూత, పిందె రావటం తగ్గిపోయి, వచ్చినవి రాలిపోతాయి. దీని నివారణకు ఫాసలోన్ 3 మి.లీ. డైకోఫాల్ 5 మి.లీ. లీటరు నీటికి చొప్పున పిచికారి చేయాలి. దీనికి వేపనూనె, జిగురు కలపాలి. పైముడత, కింది ముడత రెండూ ఉన్నట్లయితే పెగాసిస్ లీటరు నీటికి 2 గ్రా. చొప్పున పైరుపై చల్లుకుని బొబ్బర తెగులు ఆశించకుండా చూసుకోవచ్చు.



పైముడత తెగులు

**పేనుబంక:** చిన్న పురుగులు గుంపులు గుంపులుగా చేరి లేత కొమ్మలు, ఆకుల కాండంపై చేరి రసం పీల్చడం వల్ల నల్లగా మారి వైరస్‌ను వ్యాప్తి చెందిస్తాయి. దీని నివారణకు ఇమిడాక్లోప్రిడ్ 0.3 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలి. అంతేగాక పేనుబంక, తెల్లదోమను ముందుగానే గుర్తించి సస్యరక్షణ చర్యలు చేపట్టి, బొబ్బర తెగులు రాకుండా అరికట్టవచ్చు.

**ఆకుమచ్చ:** సర్కోస్పొర తెగులు వల్ల ఆకులపై గోధుమరంగు మచ్చలు ఏర్పడతాయి. నివారణకు బ్లైటాక్స్ 3 గ్రా. గానీ డైథేన్-ఎం-45 2.5 గ్రా./లీటరు నీటికి చొప్పున కలిపి, దానికి + స్ట్రెప్టోసైక్లిన్ 1 గ్రాము 10 లీటర్ల నీటికి చొప్పున కలిపి పిచికారి చేయాలి.

**బూడిద తెగులు:** బూడిద తెగులు సోకిన ఆకులపై తెలుపురంగులో బూడిదలా కనిపించే మచ్చలు ఏర్పడతాయి. తెగులు మరింత ఉధృతమైనప్పుడు ఆకులు పుసుపు వర్ణంలోకి మారి రాలిపోతాయి. దీని వల్ల పూత, పిందె నిలబడకుండా రాలిపోతాయి. దీని నివారణకు కెరాథేన్ 1 మి.లీ. లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేయాలి.

**ఎండు తెగులు:** ఎండు తెగులు భూమిలోని శిలీంధ్రం వల్ల వస్తుంది. దీని వల్ల మొక్కలు గుంపులు గుంపులుగా ఎండిపోతాయి. దీని నివారణకు కిలో ట్రైకోడర్మావిరిడీ శిలీంధ్రాన్ని 100 కిలోల పశువుల ఎరువులో కలిపి పైరులో చల్లుకోవాలి. పంటకు నీటి తడులు అందించినప్పుడు ఈ శిలీంధ్రం వ్యాప్తి చెంది తెగులు పెరగకుండా ఆపుతుంది. అంతేగాక బైటాక్స్ 3 గ్రా. లీటరు నీటికి చొప్పున కలిపి మొక్కలపై చల్లాలి.

**పూత రావటానికి :** పూత బాగా రావటానికి పొటాషియం నైట్రేట్ (13-0-45) 10 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలి. అంతేగాక వచ్చిన పూత పిందెగా మారి రాలుతుంటే ప్లానోఫిక్స్ 4 మి.లీ., 5 లీటర్ల నీటికి చొప్పున కలిపి పిచికారి చేయాలి. సూక్ష్మపోషకాల లోపం తలెత్తినప్పుడు ఫార్ములా-4, 5 గ్రా. + బోరాన్ 1 గ్రాము లీటరు నీటికి కలిపి పైరుపై పిచికారి చేయాలి.

– న్యూస్‌టుడే, మాచవరం (గుంటూరు జిల్లా)

# పాడి పరిశ్రమలో పాకల ప్రాధాన్యం

పాకలను ఒక వరుసలో కానీ, రెండు వరుసల్లో కానీ కట్టేసేలా నిర్మించుకోవచ్చు. ఈ పాకల నిర్మాణానికి ప్రభుత్వం- ఉపాధి హామి పథకం ద్వారా తోడ్పాటునిస్తోంది. గాలి, వెలుతురు ధారాళంగా వచ్చేలా పాకలను గడ్డితో గానీ, షెడ్ రేకులతో గానీ కప్పి, నిర్మించుకోవచ్చు. పాకల్లో దాణా, పశుగ్రాసం తినేందుకు 'మేంజర్' ఏర్పాటుచేయాలి. పాకల్లో నేల జరుడుగా కాక, కాస్త గరుకుగా ఉండాలి. పాడి పశువులు కూర్చున్నప్పుడు, శరీర బరువులో సగానికిపైగా వాటి మోకాళ్ళపై పడుతుంది కాబట్టి రబ్బర్‌మ్యాట్లను పరచాలి.. తక్కువ ధరలో పాకల నిర్మాణం చేపట్టాలి. పశువుల మల మూత్రాలు నీటితో జారిపోయేలా వాలు ఉండేలా పాకలు నిర్మించాలి. షెడ్‌కు దగ్గరలోనే నీటి సౌకర్యం ఉండాలి. షెడ్‌నుండి వచ్చే పశువుల మూత్రం, పేడ, దగ్గరలోని పశుగ్రాస క్షేత్రాలకు మళ్ళించాలి. పాకల వల్ల చలి, ఎండబారి నుండి పశువులకు రక్షణ లభిస్తుంది. పశువుల ఆరోగ్యం మెరుగ్గా ఉండి, పాల దిగుబడి పెరుగుతుంది.

## జీవిత నావకు చుక్కాని

# రేషన్‌కార్డు

**దరఖాస్తులు 42,770** **జిల్లాకు మంజూరు 27,940**

**ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే:** జన్మభూమి అంటేనే మొదట గుర్తుకొచ్చేది రేషన్‌కార్డులు, పింఛన్లు. మరీ ముఖ్యంగా రేషన్‌కార్డు ప్రతి ప్రభుత్వ పథకానికి అవసరం కావడంతో దీని కోసం ఎంతో మంది ప్రయత్నాలు చేస్తుంటారు. రేషన్‌కార్డు వస్తే చాలు జీవితంలో ఎంతో లబ్ధి పొందవచ్చని ప్రజలు భావిస్తుంటారు. 5వ విడత జన్మభూమి కార్యక్రమానికి 27,940 రేషన్‌కార్డులు మంజూరయ్యాయి. ప్రతీ జన్మభూమి కార్యక్రమంలో వీటి మంజూరు కోరుతూ వేలాది దరఖాస్తులు వస్తుంటాయి. ప్రభుత్వం సాధారణంగా జన్మభూమి కార్యక్రమాల సమయంలోనే వీటిని అందిస్తుండడం ఆనవాయితీగా మారింది. దీంతో జన్మభూమి కార్యక్రమం వచ్చిందంటే చాలు పరీక్షలు రాసిన విద్యార్థులు ఫలితాల కోసం ఎలా ఎదురు చూస్తుంటారో అలానే తమకు రేషన్‌కార్డు వచ్చిందో లేదో అన్న ఆత్రుతతో దరఖాస్తుదారులు ఉంటారు.

జిల్లాలో ఇటీవల వరకు 42,770 మంది రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకొన్నారు. వీరిలో 27,940 మందికి కార్డులు జారీ చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. తొలిరోజు వీటిని నేరుగా అధికారులు, ప్రజాప్రతినిధులు పంపిణీ చేశారు.



జిల్లాలో అత్యధికంగా రేషన్‌కార్డులు మంజూరైన మండలంగా ఆదోని నిలిచింది. ఇక్కడ 2,875 మందికి రేషన్‌కార్డులు మంజూరయ్యాయి. తర్వాత స్థానంలో కర్నూలు నగరం నిలిచింది. ఇక్కడ 2,856 మందికి రేషన్‌కార్డులు వచ్చాయి. అత్యల్పంగా రేషన్‌కార్డులు మంజూరైన మండలం ఆళ్లగడ్డ నియోజకవర్గంలోని రుద్రవరం కావడం గమనార్హం. ఈ మండలానికి అత్యల్పంగా 32 కార్డులే మంజూరయ్యాయి. తర్వాతి స్థానంలో 36 కార్డులతో సంజామల ఉంది.

◆ రేషన్‌కార్డు దరఖాస్తు చేసుకునేందుకు ఈ జన్మభూమిలో సైతం అవకాశం ఉంది. ఇప్పుడు దరఖాస్తు చేసుకొంటే వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు ప్రతీ రెవెన్యూ కార్యాలయంలో ప్రత్యేక సిబ్బంది అందుబాటులో ఉన్నారు.

**కార్డుల వివరాలు ఇలా...**

| మండలం | దరఖాస్తులు | మంజూరు |
|---|---|---|
| ఆదోని | 3,537 | 2,875 |
| ఆలూరు | 530 | 427 |
| కోసిగి | 1,606 | 1,321 |
| ప్యాపిలి | 1,314 | 277 |
| నందికొట్కూరు | 780 | 283 |
| ఆళ్లగడ్డ | 786 | 502 |
| చాగలమర్రి | 529 | 346 |
| దొర్నిపాడు | 116 | 83 |
| రుద్రవరం | 147 | 32 |
| శిరువెళ్ల | 660 | 282 |
| ఉయ్యాలవాడ | 326 | 234 |



రేషన్‌కార్డు అందుకొంటున్న లబ్ధిదారుడు (దాచిన చిత్రం)



**కార్డు రావడం సంతోషంగా ఉంది -యూసుఫ్, ఆళ్లగడ్డ**

మేము ఇదివరకు నాలుగుమార్లు కార్డు కోసం దరఖాస్తు చేసుకొన్నాం. ఎట్టకేలకు ఈసారి కార్డు మంజూరు కావడం సంతోషంగా ఉంది. రేషన్‌కార్డు రావడంతో గృహం, రుణం కోసం దరఖాస్తు చేసుకుంటాం. ఇది రావడం మాకు ఎనలేని సంతోషాన్నిచ్చింది.



**కార్డు లేనివాళ్లు దరఖాస్తు చేసుకోండి -సత్యశ్రీనివాసులు, ఉప తహసీల్దారు**

రేషన్‌కార్డు లేని వాళ్లు ఇప్పుడు దరఖాస్తు చేసుకోవచ్చు. ఏ రోజు వచ్చిన దరఖాస్తు ఆ రోజే ఆన్‌లైన్ చేస్తాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్ణయం తీసుకొంటాం. జన్మభూమి మా ఊరు కార్యక్రమాన్ని ఆశావహులు సద్వినియోగం చేసుకోవాలి.

## భక్తిశ్రద్ధలతో ప్రాతఃకాల పూజలు

**ఆళ్లగడ్డ గ్రామీణ, న్యూస్‌టుడే:** అహోబిలం లక్ష్మీనృసింహ స్వామి ఆలయంలో ధనుర్మాస పూజల్లో భాగంగా ఉదయం ప్రాతఃకాల పూజలు నిర్వహించారు. ఆండాల్ ఆలయాన్ని దీపాలతో అలంకరించారు. అనంతరం స్వామి వారికి దీపాలను ఆరాధించే పాశురం విన్నవించారు. సాయంత్రం అధ్యయనోత్సవాల్లో భాగంగా ప్రహ్లాదవరద స్వామి, శ్రీదేవి, భూదేవి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పల్లకిపై కొలువుంచి ఉత్సవం జరిపారు. ఆ తర్వాత స్వామి వారికి ఆళ్వార్‌ల సమక్షంలో నమ్మాళ్వార్ ప్రబంధంలోని తొమ్మిదవ శతకం విన్నవించారు. నమ్మాళ్వార్ పరమపద ఉత్సవం గురువారం చేయనున్నారు. దీంతో అధ్యయనోత్సవాలు ముగియనున్నాయి.



దీపాలంకరణలో గోదాదేవి అమ్మవారు

## కొనసాగుతున్న తవ్వకాలు

**తుగ్గలి, న్యూస్‌టుడే:** చెన్నంపల్లి కోటలో జరుగుతున్న తవ్వకాలు బుధవారం 22వ రోజుకు చేరుకున్నాయి. రోజు మాదిరిగానే కోట బురుజులో కూలీలు తవ్వకాలు జరిపి మట్టి, రాళ్లను బయట పడవేశారు. తవ్వకాల పనులను తహసీల్దారు గోపాలరావు పర్యవేక్షించారు. తవ్వకాలలో 10 మంది కూలీలు పాల్గొంటున్నట్లు ఆయన తెలిపారు. కోట వద్ద పోలీసు బందోబస్తు కొనసాగుతోంది.



**ఈనాడు-ఈటీవీ ఆంధ్రప్రదేశ్ నిర్వహిస్తున్న ముత్యాల ముగ్గుల పోటీ జనవరి 2, 2018 విజేతలు**

1. సి. హెచ్ జ్యోతి నిఖిల, జగ్గయ్యపేట; 2. వి. రమ్య, మదిర; 3. కె.పద్మ భారతి, యలమంచిలి; 4. ఎస్. శైలజ, జగ్గయ్యపేట; 5. కె. పూజిత, చిలకలూరిపేట; 6. డి. నాగయశస్వి, వైజాగ్; 7. దుర్గా ప్రవంతి, కనుమోలు, కృష్ణా; 8. కె.వి. లావణ్య, బుచ్చిరెడ్డి పాలెం; 9. సి. హెచ్. సంధ్యారాణి, చీరాల; 10. శైలజ, రామదుర్గం, బళ్లారి. విజేతల వివరాలు ఈనాడు డాట్ నెట్‌లో చూడవచ్చు.

## ప్రణాళికతోనే గ్రామాల అభివృద్ధి

- కలెక్టర్ సత్యనారాయణ

**డోన్ గ్రామీణ:** సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి లబ్ధిదారుడు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సత్యనారాయణ పేర్కొన్నారు. మండలంలోని ఉంగరానిగుండ్ల గ్రామంలో జన్మభూమి-మా ఊరు కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రణాళికతో గ్రామాలను అభివృద్ధి దిశగా తీసుకెళ్లాలని అధికారులకు, ప్రజాప్రతినిధులకు సూచించారు. జిల్లాలో 28 వేల రేషన్‌కార్డులు ఇవ్వడం జరుగుతుందన్నారు. రైతులకు పట్టాదారు పాసుపుస్తకాల జారీలో ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు చెప్పారు. చంద్రన్న బీమా నమోదు చేసుకున్న వారికి పత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అనంతపురము ఎమ్మెల్సీ, డోన్ జన్మభూమి-మా ఊరు కార్యక్రమ ఇన్‌ఛార్జి శమంతకమణి, ఆర్డీవో హుసేన్ సాహెబ్, డీఎంహెచ్‌వో నరసింహులు, ప్రత్యేకాధికారి రాఘవరెడ్డి, తహసీల్దారు ముని కృష్ణయ్య, మార్కెట్ యార్డు ఛైర్మన్ మురళీకృష్ణ గౌడ్, సర్పంచి రాముడు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



చంద్రన్న బీమా పత్రాలను అందజేస్తున్న కలెక్టర్

**యు.కొత్తపల్లెలో..**

రాష్ట్రాభివృద్ధి కోసం ముఖ్యమంత్రి ఎంతో కృషి చేస్తున్నట్లు అనంతపురము ఎమ్మెల్సీ, డోన్ జన్మభూమి-మా ఊరు కార్యక్రమం ఇన్‌ఛార్జి శమంతకమణి పేర్కొన్నారు. మండలంలోని యు.కొత్తపల్లెలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. అర్హులైన పేదలందరికీ ప్రభుత్వ పథకాలు అందించేందుకు జన్మభూమి-మా ఊరు కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఫ్యాథరిన్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ శమంతకమణి







# ఆదోని

## వేళకు బస్సులు నడపాలని విద్యార్థుల రాస్తారోకో

**ఆదోని నేరవార్తలు, న్యూస్‌టుడే :** ఆదోని-పెద్దకడబూరు బస్సు సర్వీసు వేళకు నడపాలని డిమాండు చేస్తు బుధవారం రాత్రి విద్యార్థులు ఆందోళన చేపట్టారు. స్థానిక ఆర్ట్స్ కళాశాల ప్రధాన రహదారిపై బైఠాయించి నిరసన తెలిపారు. బస్సు సర్వీసు ఎప్పుడు వస్తుందో తెలియని పరిస్థితి నెలకొందని వాపోయారు. అనంతరం మూడో పట్టణ ఎస్సైలు విజయ్, రాంనాయక్ ఘటనా స్థలానికి చేరుకొని డిపో మేనేజరుతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామన్నారు.

## బహిరంగ కొనుగోళ్లకు అనుమతులివ్వండి

**ఆదోని మార్కెట్, న్యూస్‌టుడే:** ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డులో బహిరంగంగా పోటీ మార్కెట్లో పత్తి కొనుగోళ్లకు అనుమతులు ఇవ్వాలని బుధవారం సీసీఐ అధికారి తిరుమలరావు మార్కెట్ యార్డు కార్యదర్శి లావణ్యను కోరారు. ఇప్పటికే ఆలస్యమవుతోందని, సీజన్ ముగింపు దశకు చేరుకుంటోందని వివరించారు. అనుమతి పత్రాన్ని మార్కెటింగ్‌శాఖ రాష్ట్ర కమిషనర్‌కు పంపడం జరిగిందన్నారు.

## హలో..ఈనాడు

## చరవాణి: 8008573736

**ఆదోని పట్టణం, న్యూస్‌టుడే:**

◆ **సమస్య:** బుడ్డేకల్ ప్రాంతంలో మురుగు కాల్వలు శుభ్రం చేయటానికి సిబ్బంది రావటం లేదు. పరిసరాలు దుర్వాసన వెదజల్లుతుండటంతోపాటు దోమల బెడద అధికంగా ఉంది. స్థానికులు రోగాల బారిన పడుతున్నారు.

**- రాము, బుడ్డేకల్**

**- సమాధానం:** ప్రజారోగ్యశాఖ సిబ్బందికి ఆదేశాలు జారీ చేసి మురుగు కాల్వలు శుభ్రం చేయిస్తాం.



శుభ్రం చేయని మురుగు కాల్వ

◆ **సమస్య:** బోయగేరి ప్రధాన రహదారిలో రెండు చోట్ల వీధి దీపాలు సక్రమంగా వెలగటం లేదు. చీకట్లో ఇబ్బందులు పడుతూ ఇళ్లకు వెళ్లాల్సి ఉంటుంది. అధికారులు స్పందించాలని కోరుతున్నాం.

**- ఈరన్న, బోయగేరి.**

**సమాధానం:** వెలగని వీధి దీపాలు వెలిగే విధంగా సిబ్బందికి ఆదేశాలు జారీ చేస్తాం.

◆ **సమస్య:** లక్ష్మమ్మనగర్‌లో తాగునీరు సక్రమంగా సరఫరా కావటం లేదు. నీటి కోసం ఇబ్బందులు పడుతున్నాం.

**- వెంకటేశులు, లక్ష్మమ్మనగర్.**

**సమాధానం:** సిబ్బందికి ఆదేశాలు జారీ చేసి తాగునీరు సక్రమంగా సరఫరా చేసే విధంగా చర్యలు తీసుకుంటాం.

◆ **సమస్య:** ఎస్కేడీ కాలనీలో పేరుకుపోయిన చెత్తను సకాలంలో తీసుకెళ్లడం లేదు. దీంతో పరిసరాలు దుర్వాసన వెదజల్లుతోంది. అధికారులు స్పందించాలని కోరుతున్నాం.

**- శంకర్, ఎస్కేడీ కాలనీ**

**సమాధానం:** రహదారి సమీపంలో పోగుపడిన చెత్తను సకాలంలో నిల్వకేంద్రానికి తరలించే విధంగా సిబ్బందికి ఆదేశాలు జారీచేస్తాం.

**(పై సమస్యలకు పురపాలకసంఘం కమిషనర్ రామలింగేశ్వర్ సమాధానం చెప్పారు.)**

◆ **గమనిక:** ఆదోని పట్టణంలో ప్రజలు నిత్యం ఎదుర్కొంటున్న సమస్యలను 'హలో ఈనాడు' దృష్టికి తీసుకువస్తే వాటిని సంబంధిత అధికారి దృష్టికి తీసుకెళ్లటం జరుగుతుంది. ప్రజలు ఈ చరవాణి సంఖ్య: 8008573736 ఫిర్యాదు చేయవచ్చు.

## తెరపై ఈనాడు

**ఆదోని మార్కెట్... సత్యం:** ప్రాజెక్టు, **శివం:** 2 కంట్రీస్, **రాజ్:** జుమాంజీ, **రాజ్‌శ్రీ:** టైగర్ జిందా హై, **ద్వారకా కాంప్లెక్స్ స్క్రీన్ 1:** ఎం.సి.ఎ, **స్క్రీన్ 2:** హల్లో, **స్క్రీన్ 3:** మళ్లీ రావా, **ప్రభాకర్:** సప్తగిరి ఎల్.ఎల్.బి, **సాయిబాబా:** ఒక్క క్షణం.

## ఆదోని బంగారం ధరలు..

**ఆదోని మార్కెట్, న్యూస్‌టుడే:**

**(10 గ్రాములు). 24 క్యారెట్లు :** రూ. 30,480.

**22 క్యారెట్లు ఆభరణాలు :** రూ. 28,190.

**వెండి కిలో :** 39,800.

## ఆదోని వ్యవసాయ మార్కెట్ ధరలు..

**(క్వింటాళ్లలో..ధర)**

| దిగుబడులు | కనిష్ఠ ధర | గరిష్ఠ ధర |
|---|---|---|
| పత్తి | 3601 | 5298. |
| వేరుసెనగ | 2359 | 4309. |
| ఆముదం గింజలు | 2610 | 3960. |
| పూలవిత్తనాలు | 2801 | 2931. |

**- న్యూస్‌టుడే, ఆదోని మార్కెట్**

# రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలిపేందుకు బాబు కృషి

## - ఎమ్మెల్సీ కేఈ ప్రభాకర్

**భావాజీపేట(ఆదోని పురపాలకం), న్యూస్‌టుడే:** దేశంలో రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలిపేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కృషి చేస్తున్నారని ఎమ్మెల్సీ కేఈ ప్రభాకర్ అన్నారు. బుధవారం పట్టణంలోని 2వ వార్డులో మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు అధ్యక్షతన జన్మభూమి-మా ఊరు కార్యక్రమానికి ప్రభాకర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రోజు 18 గంటలు పనిచేస్తూ రాష్ట్ర ప్రజల అభివృద్ధే ధ్యేయంగా ముఖ్యమంత్రి పనిచేస్తున్నారన్నారు. ఇలాంటి పనితీరు కలిగిన ముఖ్యమంత్రిని నేను..ఏ రాష్ట్రంలో చూడలేదన్నారు. ఈ రోజు తెదేపా ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు, ప్రతి ఇంటికి ఏదో ఒక్క పథకం తలుపుతట్టేలా ఉన్నాయన్నారు. ఈ ప్రభుత్వం ప్రజలకు అన్ని విధాలా ఆదుకుంటోందని భరోసాతో ఉండాలని సూచించారు. అనంతరం ప్రభుత్వం నుంచి పొదుపు సంఘాలకు వచ్చిన ప్రత్యేక నిధి పత్రాలు, చంద్రన్నబీమా పాలసీ పత్రాలను పంపిణీ చేశారు. గర్భిణులకు సీమంతం, ప్రజలకు సంక్రాంతి కానుకలు అందచేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆహార కమిటీ డైరెక్టర్ గుడిసె కృష్ణమ్మ, కమిషనర్ రామలింగేశ్వర్, ఎం.ఈ విశ్వనాథ్, ఇరిగేషన్ సీఈ నారాయణరెడ్డి, గృహనిర్మాణ శాఖ డీఈ కృష్ణారెడ్డి, డీఈ రామూర్తి, టీపీఓ శేకన్న, వార్డు కౌన్సిలరు తిమ్మప్ప, ఇతర ముఖ్యనాయకులు, అధికారులు పాల్గొన్నారు.



గజమాలతో ఎమ్మెల్సీ కేఈ , మీనాక్షినాయుడుకు సత్కారం

**ఆదోని గ్రామీణం,మార్కెట్, న్యూస్‌టుడే:** రాష్ట్రంలోని చంద్రబాబు ప్రభుత్వం తల్లి గర్భం నుంచి పిల్లల సంక్షరణ బాధ్యత తీసుకుంటుందని కర్నూలు ఎమ్మెల్సీ కేఈ ప్రభాకర్ అన్నారు. ఆదోని పట్టణంలోని బావాజీ పేటలో బుధవారం జన్మభూమి మా ఊరు కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ఆదోని తెదేపా నియోజకవర్గ బాధ్యులు, మీనాక్షినాయుడు, ఏపీ ఆహార కమిషన్ సభ్యులు గుడిసెకృష్ణమ్మలు హాజరైయ్యారు



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కేఈ.ప్రభాకర్

**'ఏ సమస్య వచ్చినా మా ఇంటి తలుపు తట్టండి'**

**వాల్మీకినగర్ (ఆదోని పురపాలకం), న్యూస్‌టుడే:** ఆదోని నియోజకవర్గ ప్రజల కష్టాల్లో పాలుపంచుకుంటా.. ఏ కష్టం వచ్చినా అర్ధరాత్రి అయినా నా ఇంటి తలుపుతట్టండని తెదేపా ఆదోని నియోజకవర్గ బాధ్యుడు మీనాక్షినాయుడు అన్నారు. బుధవారం ఉదయం బావాజీపేటలో జన్మభూమి-మా ఊరు కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. రాజకీయాల్లో నన్ను ఇంతటి వాడిని చేసింది మీరు. మీ రుణం ఎప్పటికీ తీర్చుకోలేనిదన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేపట్టిన సంక్షేమ పథకాలే.. ప్రభుత్వానికి. ప్రజలకు శ్రీరామరక్ష అన్నారు. 4704 జీ ప్లస్ త్రి కింద ఇళ్ల నిర్మాణాలు, 1890 బీఎల్‌సీ కింద ఇళ్లు మంజూరు చేయడం జరిగిందన్నారు. కొత్తగా ఎన్టీఆర్ భరోసా పింఛన్లు మంజూరు చేయడం జరిగిందన్నారు. రాజకీయాలకు అతీతంగా పథకాలను అందిస్తున్నామని, మా ప్రజాసంక్షేమమే ముఖ్యమన్నారు. అవినీతి లేని పాలనతో ప్రజల అభిమానాన్ని చూరగొంటున్నామన్నారు. పింఛన్లు రావడం లేదని పలువురు వృద్ధులు సభలో చెప్పడంతో, వారందరికీ పింఛన్లు వచ్చేలా చేయాలని మీనాక్షినాయుడు అధికారులకు ఆదేశించారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ భాస్కర్‌రెడ్డి, సీనియర్ నాయకులు ఉమాపతినాయుడు, కమిషనర్ రామలింగేశ్వర్, తిమ్మప్ప, సుబ్బు, వెంకటేష్, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

**రెండు గ్రామాల్లో నిరసన**

**ఆదోని గ్రామీణం, న్యూస్‌టుడే:** ఆదోని మండలం సాంబగల్లు, పెద్దపెండేకల్లులో బుధవారం జరిగిన జన్మభూమి మా ఊరు కార్యక్రమాన్ని పల్లెవాసులు అడ్డుకున్నారు. సమస్యల పరిష్కారంలో విఫలం అయ్యారంటూ అధికారులను నిలదీశారు. సాంబగల్లులో రహదారి సమస్యను పరిష్కరించాలని డిమాండు చేస్తు బైఠాయించారు. గ్రామాలకు, పొలాలకు దారులు లేవని , దీంతో ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్థులు వాపోయారు. సర్పంచి లక్ష్మి, ఎంపీటీసీ మాధవి, గ్రామస్థులు అధికారుల తీరుపై నిరసన వ్యక్తం చేశారు. డ్వామా పీడీ పుల్లారెడ్డి,నోడల్ అధికారి డాక్టర్ రమణయ్య, తహసీల్దారు శ్రీనాథ్, ఏపీడీ మల్లేశ్వరి, తాలుకా సీఐ దైవప్రసాద్, ఎస్సై సునీల్‌లు గ్రామస్థులతో సమస్యపై చర్చించారు. రహదారి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

◆ పెద్దపెండేకల్లులో ఉపాధి బకాయిలు చెల్లించాలని, పంట నష్టపరిహారం అందడం లేదని, రేషన్‌కార్డులు,తదితర సమస్యలు తీర్చాలని డిమాండు చేస్తూ అధికారులను నిలదీశారు. ◆ నెట్టెకల్లు, చిన్నపెండేకల్లు గ్రామాల్లో జన్మభూమి మా ఊరు కార్యక్రమం జరిగింది. ఇరిగేషన్ సీఈ నారాయణరెడ్డి, ఎంపీడీవో క్రిష్టియానమ్మ, ఎంఈవో శివరాములు, ఈవోఆర్డీ రామాంజినేయులు,ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ చంద్రశేఖర్‌రెడ్డి,మండల పరిశుత్తు ఏఈ రామచంద్ర,వ్యవసాయ అధికారి పాపిరెడ్డి పాల్గొన్నారు.



సాంబగల్లులో బైఠాయించిన గ్రామస్థులు

# సావిత్రిబాయి పూలెకు ఘన నివాళి



స్వకులసాలి సంఘం సభ్యులు ఆధ్వర్యంలో



బీసీ నాయకుల ఆధ్వర్యంలో పండ్ల పంపిణీ

**నియోజకవర్గ వ్యాప్తంగా సావిత్రిబాయి పూలె జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ముందుకు ఆమె చిత్రపటానికి పూల మాల వేసి నివాళి అర్పించారు. వివిధ ప్రజాసంఘాలు, స్వచ్ఛంద సంస్థలు వేడుకలను నిర్వహించారు. -న్యూస్‌టుడే, ఆదోని బృందం**



బీసీ సంఘం నాయకుల ఆధ్వర్యంలో



నివాళి అర్పిస్తున్న గుడిసె కృష్ణమ్మ, కోటి తదితరులు

## రైలు కిందపడి వృద్ధుడి ఆత్మహత్య

**ఆదోని పట్టణం, న్యూస్‌టుడే:** ఆదోని రైల్వేస్టేషన్ పరిధిలో రైలు కింద పడి వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్నారు. బుధవారం కి.మీ సంఖ్య 495-4-5 వద్ద వృద్ధుడు మృతి చెందినట్లు ఆదోని రైల్వే పోలీసులు తెలుసుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న మంత్రాలయం రైల్వేపోలీసు స్టేషన్ ఎస్.ఐ సుబ్బరాయుడు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని ఆదోని ప్రాంతీయ ఆసుపత్రిలోని శవగారానికి తరలించినట్లు తెలిపారు. గుర్తు తెలియన వృద్ధుడు రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నట్లు కేసు నమోదు చేశామన్నారు. తెల్లరంగు దుస్తులు, గడ్డం ఉన్నట్లు పోలీసులు తెలిపారు. రేణుకాంబవిలాస్ సమీపంలోని రైలుపట్టాలపై ఘటన జరిగిందని వివరించారు.

## నేడు పట్టణంలో జన్మభూమి- మా ఊరు

**ఆదోని పురపాలకం, న్యూస్‌టుడే:** ఆదోని పట్టణంలో నేడు(గురువారం) జన్మభూమి-మా ఊరు కార్యక్రమం ఐదు వార్డుల్లో జరగనుంది. ఉదయం 3వ వార్డులో పింజరిగేరి అసీర్‌ఖానా వెనుక, 28వ వార్డులో సంతపేట ఆలమ్మ.. గంగమ్మ పాఠశాలలో, 25వ వార్డులో నారాయణ గుంత ప్రాంతంలో. మధ్యాహ్నం 29వ వార్డులో వీరశైవ కల్యాణమండపంలో, 14వ వార్డులోని కార్వాన్‌పేట దుల్హన్ బావి ప్రాంతంలో జన్మభూమి కార్యక్రమం ఉంటుందని అధికారులు తెలిపారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# ఆదోని

24 గంటల అత్యవసర వైద్య సేవలకు 108కు ఫోన్ చేయండి

## నిందితులను కఠినంగా శిక్షించాలి

**ఆదోని మార్కెట్, న్యూస్‌టుడే**: రాజమండ్రిలో నూరాని మసీదు మౌజన్‌ను హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని బుధవారం బదర్ గుల్షన్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ముస్లింలు ఆర్డీవో కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సొసైటి అధ్యక్షుడు ఖుద్రుతుల్లాఖాద్రీ మాట్లాడారు. అరాచక శక్తుల వల్లే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని ఆరోపించారు.



# ఆదాయం పెంచరు.. ప్రగతి చూపరు

## ☛ పన్ను వసూలులో వెనుకబాటు ☛ మొద్దునిద్రలో అధికారులు

**ఆదోని పురపాలకం, న్యూస్‌టుడే: ఆదోని పురపాలక సంఘం ఆస్తి పన్ను వసూలులో పూర్తిగా వెనుకబడి ఉంది. అభివృద్ధి పనులు జరగాలంటే పన్ను వసూలే కీలకం. ఇప్పటికే ఆర్థిక ఏడాది ముగింపునకు రెండునెలల గడవు మాత్రమే మిగిలి ఉంది. మరోవైపు అభివృద్ధి పనులు పరుగులు పెట్టాలంటే కష్టంగా ఉంది. ఇప్పటికే నిధుల కోరతతో చాలా పనులు అగిపోతున్నాయి. ఇంత వరకు 42 శాతం పన్ను మాత్రమే వసూలు చేశారు. గడవు దగ్గర పడుతుండటంతో పురపాలక అధికారులు కళ్లు తెరిచి వందశాతం లక్ష్యాలను సాధించాల్సిన అవసరం ఉంది. –న్యూస్‌టుడే, పురపాలకం**

**ఆ**దోని పురపాలక సంఘం పరిధిలో 30774 ఆస్తి పన్ను చెల్లింపుదారులు ఉన్నారు. ఆస్తి పన్ను రూపంలో



పన్నులు చెల్లించేందుకు జనం వరస

పాత..కొత్త బకాయిలు కలిపి రూ.9.01 కోట్లు వసూలు కావాల్సి ఉంది. ఇక తాగునీటి బకాయిలు రూ.4.98 కోట్లు. అయితే ఇంత వరకు ఆస్తి పన్ను వసూలైంది మాత్రం రూ.3.76 కోట్లు, అంటే 42 శాతం అన్నమాట. ఇక తాగునీటి పన్ను అంటారా కేవలం రూ.493.25 లక్షలకు గాను.. రూ.133.74 లక్షలు వసూలు చేశారు. అంటే 27 శాతం వసూళ్లు మాత్రమే సాధించగలిగాయి. ఏటా పన్ను వసూళ్లకు పూరపాలక అధికారులు పెద్ద కసరత్తే చేయాల్సి వస్తోంది. చిన్న చిన్న పన్నుదారుల కంటే పెద్ద పన్ను చెల్లింపు దారులనుంచే ఇబ్బందులు ఎదురవుతున్నాయి. గతేడాదితో పోల్చితే ఈ సారి పన్ను వసూలులో పురోగతి బాగానే ఉన్నా ఇంకా బాగా మెరుగుపడాల్సి ఉంది. మొండి బకాయిదారులు మాత్రం ఇప్పటికి మొండికేస్తున్నారు. అవి ఇంకా రూ.3 కోట్లు దాకా ఉంటుందని అంచనా.

### కష్టంగా.. వసూలు

ఏటా పన్నుల వసూలులో అనుకున్నంత స్థాయిలో పురోగతి కన్పించడం లేదు. కారణం సరైన సిబ్బంది లేకపోవడమే. నిజానికి పూర్తిస్థాయి సిబ్బంది లేకపోవడమేనని ఉన్నతాధికారులు అంటున్నారు. ఆర్థిక ఏడాది ఆరంభం నుంచే పన్ను చెల్లింపులపై దృష్టి సారించాల్సి ఉంది. ఆదిశగా ఆశించినంత స్థాయిలో దృష్టి సారించడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి.

### ఖాళీలు.. అదనపు బాధ్యతలు

ప్రధానంగా సిబ్బంది కొరత తీవ్రంగా ఉంది. ఖాళీ స్థానాలకు ఇతర శాఖల నుంచి కొద్దో గొప్పో చదువుకున్న వారిని తెచ్చి వేసుకుని పనిచేయించుకోవాల్సి



మొండి బకాయిల దుకాణాలకు సీలు వేస్తున్న అధికారులు(దాచిన చిత్రం).

వస్తోంది. అందులోనూ పూర్తిగా అవగాహన లేని వారు ఉండటంతో, అక్షరాలు దిద్దించాల్సి వస్తోందన్న విమర్శలు ఉన్నాయి. ఇక చివరి క్షణంలో పైఅధికారులు పన్ను వసూలుపై ప్రత్యేక కార్యక్రమం ప్రకటించి కార్యక్షేత్రంలో పూర్తిగా దూకితే తప్పా.. కదలని పరిస్థితి కన్పిస్తోంది. ☛ పెద్ద పన్ను బకాయిదారులు సైతం ఏమాత్రం లెక్కలోకి తీసుకోకుండా మొండితనాన్ని ప్రదర్శిస్తున్నారు. మరోవైపు రాజకీయ పలుకుబడి ఉండటం, పైరవీలు చేయడం, పన్ను ఎగవేత్త చేయడం ఏటా రివాజుగా మారింది.

### వసూలుకు చర్యలు

**– సిలార్‌సాహెబ్, పురపాలక రెవెన్యూ అధికారి, ఆదోని.**

పురపాలక సంఘానికి పన్ను బకాయిల వసూలుకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే ఏళ్ల కొద్ది బకాయిలు చెల్లించని వారి జాబితాను రూపొందించాం. అందరికీ తాఖీదులు జారీ చేశాం. దీంతో పాటు ఆటోలతో ప్రచారం చేపట్టాం. ఈ రోజు కాకపోయినా రేపైనా కట్టాల్సిందే.



గణేకల్లులో అక్షరమాలలో విద్యార్థులు

## మా ఊరు.. విద్యార్థులు

**ఆదోని గ్రామీణం, న్యూస్‌టుడే:** ఆదోని మండలం గణేకల్లు గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు జన్మభూమి మా ఊరు కార్యక్రమంలో భాగంగా బుధవారం మా ఊరు అనే అక్షరమాలలో ఏర్పడి, గ్రామం మీద ఉన్న అభిమానాన్ని చాటుకున్నారు. విద్యార్థులు ఒకరికొకరు వరస క్రమంలో కూర్చొని చాలా ఉన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు జగదీష్, ఉపాధ్యాయులు పరీనాబేగాం,హనుమంతు, గజేంద్ర,రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

3ఎడిఎన్86 : మాట్లాడుతున్న వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు బసవన్నగౌడ్, భాజపా సీనియర్ నాయకులు

## అన్యమతస్థులకు దుకాణాలు కేటాయింపు సరికాదు

**బంగారుబజారు(ఆదోని మార్కెట్), న్యూస్‌టుడే:** పట్టణంలోని వెంగళాపురం ఆంజనేయస్వామి ఆలయ నిర్వహణలోని దుకాణాలను అన్యమతస్థులకు కేటాయించడం సరికాదని వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు బసవన్నగౌడ్, భాజపా రాష్ట్ర సీనియర్ నాయకులు గోవిందరాజులుగౌడ్, దేశాయి చంద్రన్న తెలపారు. బుధవారం ఆలయాన్ని సందర్శించి నిర్వహణపై అక్కడి వారితో అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఆలయ నిర్వహణ గతంలో దేవదాయ శాఖ పరిధిలో ఉండేదని, ప్రస్తుతం కొంత మందిప్రైవేటు వ్యక్తుల ఆధీనంలో పోయిందన్నారు. దీంతో ఆలయం చుట్టు వాణిజ్య సముదాయాలు నిర్మించి అద్దెల రూపంలో డబ్బులు వసూలు చేస్తున్నా ఇంత వరకు సరైన లెక్కలు లేవన్నారు. దుకాణాలను సైతం అన్యమతస్థులకు కేటాయించడం జరిగిందన్నారు. దీనిపై పూర్తి విచారణ చేసి, అవకతవకలకు పాల్పడిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని చరవాణి ద్వారా జిల్లా దేవదాయశాఖాధికారికి వివరించారు. దీంతో గురువారం కర్నూలు వచ్చి కలవాల్సిందిగా అధికారి నుంచి పిలుపువచ్చిందని, ఆయనకు వివరాలని వెల్లడిస్తామన్నారు. నాయకులు బాలకొండప్ప, దేవేంద్ర, సాయిప్రసాద్, లాలారామ్, తదితరులు పాల్గొన్నారు.

## అరెస్టు అన్యాయం

**ఆదోని మార్కెట్, న్యూస్‌టుడే:** హైదరాబాద్‌లో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మంద కృష్ణ మాదిగను అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ.. బుధవారం ఆ సంఘం ఆధ్వర్యంలో నాయకులు ఆదోని తహసీల్దారు కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దారు శ్రీనాథ్‌కు వినతిపత్రం అందచేశారు. నాయకులు బాలన్న, బండారి గిడ్డయ్య, ఈశ్వర్, బాలస్వామి, వీరేష్, ఈరన్న, గణేష్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి వ్యక్తి ఆరోగ్యంగా ఉండాలి

**ఆదోని గ్రామీణం:** ప్రతి కుటుంబంలో ప్రతి వ్యక్తి ఆరోగ్యంగా, ఆనందంగా ఉండాలన్నదే ప్రభుత్వం ఉద్దేశమని, అందుకు అన్ని వసతులు కల్పిస్తోందని డ్వామా పీడీ పుల్లారెడ్డి అన్నారు. ఆదోని మండలం ఢణాపురం,నారాయణపురం గ్రామాల్లో బుధవారం సాయంత్రం జన్మభూమి మా ఊరు కార్యక్రమంలో భాగంగా ఆరోగ్యం, ఆనందంపై అవగాహన కల్పించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రసంగాన్ని టీవీ ద్వారా చూపించారు. ఈ కార్యక్రమంలో నోడల్ అధికారి రమణయ్య, గ్రామ ప్రత్యేక అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు,వీఆర్వోలు, కార్యదర్శులు పాల్గొన్నారు.



నారాయణపురంలో చర్చిస్తున్న పీడీ పుల్లారెడ్డి



పోలీసు స్టేషన్ వద్ద గుమిగూడిన ఆటో చోదకులు

## ఆటోలపై పోలీసుల కొరడా

**ఆదోని నేరవార్తలు, న్యూస్‌టుడే :** ఆదోని పోలీసు సబ్ డివిజన్ పరిధిలో మంగళ, బుధవారాల్లో వరుస రహదారి ప్రమాదాలు జరిగి 11 మంది మృత్యువాత పడటంతో పోలీసు అధికారులు నిబంధనలు పాటించని వాహనాలపై బుధవారం కొరడా ఝులిపించారు. బుధవారం డీఎస్పీ అంకినీడు ప్రసాద్ ఆధ్వర్యంలో సీఐలు, ఎస్సైలు, సిబ్బంది పట్టణంలోని భీమాస్ కూడలి, శ్రీనివాసభవన్ కూడలి, ఆస్పరి బైపాస్, ఎమ్మిగనూరు బైపాస్ రహదారుల్లో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ఆటోల్లో సామర్థ్యానికి మించి ప్రయాణికులను ఎక్కించుకుని, డ్రైవరు పక్క సీటులో ప్రయాణికులను కూర్చొబెట్టుకున్న దాదాపు 60 ఆటోలను పోలీసులు సీజ్ చేశారు.

**ఆదోని గ్రామీణం, న్యూస్‌టుడే:** దిబ్బనకల్లు సమీపంలో బుధవారం సాయంత్రం తాలుకా సీఐ దైవప్రసాద్, ఎస్సై సునిల్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేపట్టారు. 24 కేసులు నమోదు చేశారు.

## విద్యార్థుల శ్రమదానం

**తిరుమలనగర్(ఆదోని మార్కెట్), న్యూస్‌టుడే:** పట్టణ శివారులోని తిరుమలనగర్‌లోని ప్రభుత్వ ఉద్యానవనంలో బుధవారం టీజీఎల్‌జీ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు శ్రమదానం నిర్వహించారు. జన్మభూమి-మా ఊరు కార్యక్రమం పిలుపుమేరకు విద్యార్థులు ఉద్యానవనంలో చెత్త.. చెదారాన్ని ఎత్తేశారు. కళాశాల ప్రధానాచార్యులు రాఘవేంద్ర, ఎన్ఎస్ఎస్ అధికారి శ్రీనివాసులు, అధ్యాపకులు కృష్ణమూర్తి, ప్రకాష్‌రావు, సురేష్, నెట్టికంటప్ప, మహానంది, ఈరన్న, తదితరులు పాల్గొన్నారు.

## పోలీసు దాడులకు నిరసనగా ఆటోడ్రైవర్ల ఆందోళన

**ఆదోని నేరవార్తలు, న్యూస్‌టుడే :** ఆదోని పట్టణంలో బుధవారం పోలీసు శాఖ ఆధ్వర్యంలో పోలీసు అధికారులు ఆటోలపై విస్తృతంగా దాడులు చేపట్టి వందల సంఖ్యలో ఆటోలను సీజ్ చేయడంతో ఆటోడ్రైవర్లు బుధవారం రాత్రి పట్టణంలో ఆందోళనకు దిగారు. సీఐటీయూ, ఏఐటీయూసీ, వైకాపా ఆటో కార్మికుల సంఘం ఆధ్వర్యంలో ఆటోడ్రైవర్లు స్థానిక భీమాస్ కూడలి వద్ద బైటాయించి రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా ఆటో కార్మిక సంఘం నాయకులు మహానందరెడ్డి, వీరేష్, మునిస్వామి, ఈరన్న, లక్ష్మన్న, వెంకటేశులు, సాయిరామ్ తదితరులు మాట్లాడుతూ ఆటో కార్మికులకు రోజు పోలీసు దాడులు అధికమయ్యాయని.. ఇలా చేస్తే ఆటో డ్రైవర్లు కుటుంబ పోషణ ఎలా చేయాలని ప్రశ్నించారు. పెద్దఎత్తున పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేపట్టారు. దాదాపు రెండు గంటల పాటు ఆందోళన చేపట్టడంతో ఎక్కడి వాహనాలు అక్కడే స్తంభించిపోయాయి. అనంతరం పట్టణ సీఐలు శంకరయ్య, చంద్రశేఖర్, ఎస్సైలు రంగ, వేణుగోపాలరాజు, విజయ్, సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని కార్మిక నాయకులతో చర్చించారు. ప్రధానంగా ఆటోడ్రైవర్లు



భీమాస్ కూడలి వద్ద రహదారిని దిగ్బంధించిన ఆటో కార్మికులు

సామర్థ్యానికి మించి ఎక్కించుకోరాదని.. నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తిస్తే కేసులు తప్పవని సీఐలు పేర్కొన్నారు. ఈ విషయమై కార్మిక నాయకులు మాట్లాడుతూ తాము పోలీసు అధికారులు, కార్మికులతో మాట్లాడి హామీ ఇస్తామని చెప్పడంతో ఆందోళనలను విరమించారు.

### స్తంభించిన వాహనాలు

ఆటోడ్రైవర్లు ఆందోళనలు చేపట్టడంతో పట్టణంలోని ప్రధాన రహదారిపై ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయాయి. ఇరువైపులా దాదాపు 2 కి.మీ.ల మేర వాహనాలు నిలబడిపోవడంతో పురవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చింది. అనంతరం ఆందోళన విరమించడంతో ఊపిరి పీల్చుకున్నారు.

## మృతుడి నేత్రాల సేకరణ

**ఆదోని నేరవార్తలు, న్యూస్‌టుడే :** ఆదోని పట్టణం మేదరగేరికి చెందిన చౌడం కృష్ణా అనే వ్యక్తి అనారోగ్యానికి గురై బుధవారం మృతి చెందారు. కృష్ణా కోరిక మేరకు వారి కుటుంబ సభ్యులు స్థానిక సాయి జ్యోతి ఐ ఫౌండేషన్ సంస్థ సభ్యులకు నేత్రాలను దానం చేశారు. సంస్థ టెక్నీషియన్ మృతుడి నేత్రాలను సేకరించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులు తాయమ్మ, అనుసూయ, మీనా, వీరేష్, ఆదిశేషులు, పంపాపతి, రామ్మూర్తి సంస్థ సభ్యులకు నేత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు కొల్లి శ్రీధర్, సహారశంకర్, మల్లికార్జున, చంద్రశేఖర్, విజయ్, శివ తదితరులు పాల్గొన్నారు.



కృష్ణా(పాతచిత్రం)

# ఆళ్లగడ్డ

### కూరగాయల ధరలు- నిన్నటివి (కిలో రూ.లో)

**ఆళ్లగడ్డ:** టమోటా 10, పచ్చిమిర్చి 20, ఉల్లిగడ్డలు 40, ఆలుగడ్డలు 20, వంకాయ 40, క్యారెట్. 40, బెండకాయలు. 40, కాకరకాయలు 40, బీరకాయలు 40, అల్లం 45

### మాంసం ధరలు (కిలో.రూ.లో)

పొట్టేలు మాంసం 440, కోడిమాంసం 160.

### నిత్యావసర వస్తువులు (కిలో రూ.లో)

**ఆళ్లగడ్డ:** కందిబేడలు 58, బియ్యం 46, చక్కెర 39, పామాయిల్ 72, సన్ ఫ్లవర్ ఆయిల్ 84, తెల్లగడ్డలు 50, చింతపండు 200, బెల్లం 50, కొబ్బెర 170, శనగబేడలు 70, గోధుమపిండి 28, ఉప్మారవ్వ 40, ఇడ్లీరవ్వ 30, మినపబేడలు 70, వేరుశనగపప్పులు 75, ఎండుమిర్చి 100

### తెరపై ఈనాడు

**ఆళ్లగడ్డ: శ్రీరామ:** ప్రాజెక్టు 2, **భవానీ:** హలో, **ఏవీ:** ఒక్క క్షణం, **రామలక్ష్మి:** 2 కంట్రీస్, **ప్రతాప్:** ఎంసీఏ

# మరుగు.. మందకొడి

## ❑ సహకరించని లబ్ధిదారులు ❑ రబీ పనుల్లో రైతు కుటుంబాలు ❑ నిధులు చాలవని మరికొందరు ❑ ఓడీఎఫ్ లక్ష్యం చేరేదెలా?

**ఉయ్యాలవాడ న్యూస్టుడే:** మలవిసర్జన రహిత గ్రామాలుగా రూపొందించటానికి అధికారులు చూపుతున్న చొరవకు ఫలితం దక్కటం లేదు. మరుగుదొడ్లు లేని కుటుంబాలను గుర్తించి వారికి మంజూరు చేసినా నిర్మాణపనులు ప్రారంభించటంలో లబ్ధిదారులు ఆసక్తి చూపటం లేదు. నిర్ణయించిన వ్యవధిలోగా లక్ష్యాన్ని పూర్తి చేయాలని సర్వోన్నతాధికారి సత్యనారాయణ అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో అధికారులు ప్రజలకు అవగాహన కల్పించినా ఫలితం దక్కడం లేదు. ఆళ్లగడ్డ నియోజకవర్గంలో 16,118 కుటుంబాలకు మరుగుదొడ్లు నిర్మించాలన్న లక్ష్యంతో రూ 24.17 కోట్లు నిధులు విడుదల చేశారు. నిధులు వినియోగించుకొని 7,484 మరుగుదొడ్లు మాత్రమే పూర్తి చేశారు. మిగిలినవి వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయి. ఇంకా కొందరు ప్రారంభించాల్సి ఉంది. రబీ సీజన్‌లో ప్రారంభమైన వ్యవసాయ పనులకు తోడు ప్రభుత్వం ఇచ్చే నిధులు చాలవన్న అభిప్రాయంతో లబ్ధిదారులు మరుగుదొడ్ల నిర్మాణ పనులను ముందుకు సాగించటం లేదు.

**మరుగుదొడ్ల నిర్మాణ పనుల వివరాలు**

| మండలం | గ్రామాలు | మంజూరు | నిర్మాణదశలో | పూర్తి |
|---|---|---|---|---|
| ఆళ్లగడ్డ | 17 | 2,259 | 1,901 | 1,191 |
| చాగలమర్రి | 17 | 3,189 | 1,734 | 1,338 |
| దొర్నిపాడు | 11 | 1,784 | 1,289 | 1,045 |
| రుద్రవరం | 20 | 3,415 | 1,920 | 1,498 |
| శిరివెళ్ల | 13 | 3,472 | 1,604 | 1,287 |
| ఉయ్యాలవాడ | 17 | 1,999 | 1,529 | 1,125 |

2018 జనవరి 31వ తేదీ నాటికి నియోజకవర్గంలోని 95 గ్రామాలలో 16,118 కుటుంబాలకు మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలన్నది లక్ష్యం. అయితే నిర్మాణ పనులు చూస్తే అందుకు తగ్గట్టుగా కానరావడంలేదు. సర్వే నిర్వహించిన సమయంలో మరుగుదొడ్లు అవసరమని ఆసక్తి చూపిన లబ్ధిదారులే నిర్మాణాలకు వచ్చేసరికి శ్రద్ధచూపటం లేదు. మరుగుదొడ్లు పూర్తి చేయటానికి గ్రామ స్థాయిలో ప్రత్యేక అధికారులు లబ్ధిదారుల వద్దకు వెళ్లి అభ్యర్థించినా ఫలితం లేదు. చివరికి గ్రామస్థాయిలో ప్రభుత్వ శాఖలో పనిచేసే ఉద్యోగులతో కలసి ప్రయత్నించినా ఎలాంటి స్పందన లేదు. దీంతో ఎంపీడీవోలు సర్పంచి నేతృత్వంలో పొక్లెయిన్లతో గుంతలు తీయించారు. గుంత చుట్టూ రాతి కటకం కట్టడానికి నిధులు చాలవన్న అభిప్రాయంతో వాటి వైపు లబ్ధిదారులు కన్నెత్తి కూడా చూడటం లేదు. చివరికి పునాదులు తీసిన వాటికి జియోట్యాగింగ్ చేస్తున్నా తిరస్కరిస్తున్నారు. జిల్లా సర్వోన్నతాధికారి సత్యనారాయణ ఆదేశాలను పాటిస్తూ తమ శాఖల పనులను పక్కన పెట్టి మరుగుదొడ్ల నిర్మాణాల వైపే అధికారులు దృష్టి మళ్లించారు. గ్రామస్థులు పొలం పనులకు వెళ్లుతారన్న భావనతో గ్రామ ప్రత్యేకాధికారి ఇతర శాఖల సిబ్బందితో కలిసి ఉదయం 7 గంటలకే గ్రామాలను చేరుకొని లబ్ధిదారులపై ఒత్తిడి తెస్తున్నారు.



ఆళ్లగడ్డలో సిద్ధం చేసిన సిమెంటు రింగులు



కొండుపల్లెలో ఇంటిముందు మరుగుదొడ్డికి తీసిన గుంత

### లక్ష్యసాధనకు కృషి
### -రమేష్‌రెడ్డి, జేఈ ఆర్‌డబ్ల్యూఎస్



స్వచ్ఛతను దృష్టిలో ఉంచుకొని మరుగుదొడ్ల నిర్మాణ పనులు సాగించటానికి తమ వంతు సహకారం అందిస్తున్నాం. పూర్తి చేసిన వాటికి ఏడు రోజుల వ్యవధిలో బిల్లులు చెల్లిస్తున్నాం. పొలం పనుల్లో రైతుకుటుంబాలు ఎక్కువగా ఉండటంతో నిర్మాణ పనుల్లో జాప్యం జరుగుతోంది. 2018 జనవరి 31 నాటికి 100 శాతం సాధించి మలవిసర్జన రహిత గ్రామాలుగా మార్చుతాం.



క్రీడల్లో ప్రతిభ సాధించిన కొండుపల్లె విద్యార్థులతో ఉపాధ్యాయ బృందం

## క్రీడల్లో పోటీతత్వం అలవర్చుకోవాలి

**కొండుపల్లె (ఉయ్యాలవాడ), న్యూస్‌టుడే:** విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో పోటీతత్వాన్ని అలవర్చుకోవాలని కొండుపల్లె ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రామలింగారెడ్డి అన్నారు. బుధవారం పాఠశాలలో జరిగిన క్రీడాకారుల అభినందన సభలో ఆయన మాట్లాడుతూ క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించటంతో మెరుగైన ఫలితాలను పొందుతారన్నారు. డిసెంబరు 29 నుంచి 31వ తేదీ వరకు జోనల్ స్థాయిలో అవుకు బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన క్రీడల్లో ఇక్కడి విద్యార్థులు ప్రతిభ చూపారని ప్రశంసించారు. అండర్ 14, అండర్ 17 విభాగంలో సెపక్‌తక్రాలో డబుల్ క్రౌన్ సాధించారు. అండర్ 14 విభాగంలో మొదటి స్థానం సాధించారు. వీరు ఈ నెల 28 నుంచి 30వ తేదీ వరకు ఆత్మకూరు ప్రభుత్వ పాఠశాలలో జరిగే సెంట్రల్ జోన్ పోటీల్లో పాల్గొంటారని ప్రధానోపాధ్యాయుడు రామలింగారెడ్డి తెలిపారు. క్రీడలో ప్రతిభ సాధించిన వారిని, వ్యాయామ ఉపాధ్యాయుడు నాగేంద్రను ఉపాధ్యాయులు అభినందించారు.





దివ్యదర్శనం యాత్ర బస్సుల వద్ద తెదేపా జిల్లా ఉపాధ్యక్షుడు బుడ్డా చంద్రమోహనరెడ్డి, పోచా రాధాకృష్ణారెడ్డి

## దివ్యదర్శనం.. ఇదో సదవకాశం

**ఉయ్యాలవాడ, న్యూస్‌టుడే:** దివ్యదర్శనం కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెదేపా జిల్లా ఉపాధ్యక్షుడు బుడ్డా చంద్రమోహనరెడ్డి అన్నారు. బుధవారం ఉయ్యాలవాడ నుంచి ఈ యాత్రకు బయలుదేరే బస్సులకు పూజలు నిర్వహించారు. ఎండోమెంట్ అధికారి వీరయ్య మాట్లాడుతూ 6వ తేదీ వరకు ఈ యాత్ర సాగుతుందన్నారు. ఒంటిమిట్ట, తిరుపతి, తిరుచానూరు, శ్రీకాళహస్తి, జొన్నవాడ, విజయవాడ, శ్రీశైలం పుణ్యక్షేత్రాలను చూపిస్తామని తెలిపారు. జిల్లా దేవాదాయశాఖ నిర్వహణాధికారి సుధాకరరెడ్డి, ఈవో మోహన్ తదితరులు పాల్గొన్నారు.

**24 గంటల వైద్య సలహాలకు 104కు ఫోన్ చేయండి**


## మహిళాభ్యుదయానికి దిక్సూచి సావిత్రి బాయి పూలే

**ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే:** మహిళాభ్యుదయానికి 18వ శతాబ్దంలోనే నాంది పలికిన ఘనత సావిత్రిబాయి పూలేకు దక్కుతుందని మానవత సేవా సమితి ఉపాధ్యక్షుడు అమీర్‌బాషా అన్నారు. బుధవారం సావిత్రిబాయి పూలే జయంతి పురస్కరించుకుని అరుణోదయ పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ప్రసంగిస్తూ అజ్ఞానాంధకారంలో మగ్గుతున్న మహిళలకు వెలుగుదారి చూపిన మహినీయురాలన్నారు. కులమతాలకు అతీతంగా వీరు మహిళాభివృద్ధికి కృషి చేశారన్నారు. దేశంలోనే తొలి ఉపాధ్యాయురాలిగా వారిలో చైతన్యాన్ని రగిలించారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు షాబాన్, కృపావతి, హుస్సేన్, ఇమామ్, గౌస్‌సాహెబ్ పాల్గొన్నారు.

✦ యాదవ సేవా సమితి ఆధ్వర్యంలో నాయకులు రామూయాదవ్ నేతృత్వంలో సావిత్రిబాయి చిత్రపటానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టె పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆంజనేయులు, వెంకటసుబ్బయ్య, మల్లికార్జున, శ్రీరాములు పాల్గొన్నారు.

**గొడిగనూరు (చాగలమర్రి):** గొడిగనూరు గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో బుధవారం జాతీయ మహిళా దినోత్సవాన్ని జరిపారు. ప్రధానోపాధ్యాయులు రమణారావు ఆధ్వర్యంలో సభ ఏర్పాటు చేసి ఉపాధ్యాయినులు వస్రూర్‌బీ, అరుణకుమారి, షఫిరూన్‌లను సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బెన్నయ్య, ఆంజనేయరెడ్డి, రవిశంకర్‌రెడ్డి, మహేంద్ర, విశ్వనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**ఉయ్యాలవాడ:** సమాజంలో మహిళల హక్కుల కోసం పోరాటం చేసిన సావిత్రి బాయి పూలే సేవలను మరువలేమని ఉయ్యాలవాడ ఆదర్శ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దాదా పీర్ అన్నారు. బుధవారం ఆమె జయంతి సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తొలుత ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.



గొడిగనూరులో ఉపాధ్యాయినులను సన్మానిస్తున్న పాఠశాల సిబ్బంది

**బీరవోలు (రుద్రవరం):** బాలికల జీవితాల్లో వెలుగు నింపిన మొదటి మహిళ సావిత్రిభాయ్‌పూలేనని బీరవోలు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వరప్రసాదు అన్నారు. బుధవారం మండల పరిధిలోని బీరవోలు గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో ఆమె జయంతి నిర్వహించారు. ముందుగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి లక్ష్మీకాంత్‌యాదవ్, సాక్షర భారత్ కో ఆర్డినేటర్ సుబ్బరాయుడు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## నీడ సరే.. జాగ్రత్త సుమా



ఆళ్లగడ్డ మండలంలోని 40వ జాతీయ రహదారి విభాగిని (డివైడర్)లో మొక్కలు పలువురికి నీడను ఇస్తున్నాయి. నల్లగట్ల, పేరాయపల్లె, గూబగుండం, బత్తలూరు గ్రామ పరిసర పొలాల్లో పని చేసే కూలీలు ఈ మొక్కల నీడను కూర్చొని భోజనాలు చేస్తున్నారు. జాతీయ రహదారి కావడంతో ప్రమాదకర స్థాయిలో వాహనాల రాకపోకలు ఉంటాయి. రోడ్డు దాటే సమయంలో ఏ మాత్రం ఏమరుపాటు వహించినా ప్రమాదం పాలయ్యే అవకాశాలు ఎక్కువ. బుధవారం ఆళ్లగడ్డ సమీపంలో జాతీయ రహదారిపై మొక్కల నీడన మహిళలు భోజనాలు చేస్తున్న చిత్రమే ఇది. **-న్యూస్‌టుడే, ఆళ్లగడ్డ గ్రామీణ**

# ఆళ్లగడ్డ

## చౌకదుకాణం ప్రారంభం

**పెద్దవంగలి (చాగలమర్రి), న్యూస్‌టుడే:** మండలంలోని పెద్దవంగలి గ్రామంలో 33వ నంబరు చౌకదుకాణాన్ని జెడ్పీటీసీ సభ్యురాలు నాగమ్మ బుధవారం ప్రారంభించారు. చౌకదుకాణదారు మహాలక్ష్మికి దీన్ని కొత్తగా కేటాయించారు. నూతనంగా రేషన్‌దుకాణం దక్కించుకున్నారు. కార్యక్రమంలో నాయకులు రామగురివిరెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## జన్మభూమి ఇట్టా.. చదువెట్టా!

జన్మభూమి మా ఊరు కార్యక్రమం బుధవారం గూబగుండం గ్రామంలో జరిగింది. అధికారుల ప్రణాళిక పరంగా పంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేయాలి. కాని స్థానిక ప్రాథమిక పాఠశాలలో ఈ కార్యక్రమం నిర్వహించారు. దీంతో విద్యార్థులు చదువుకు ఆటంకం కల్గింది. మధ్యాహ్న భోజనం చేయడానికీ పాట్లు పడ్డారు. ఏ కార్యక్రమం జరిగినా పాఠశాలనే వేదికను చేయడం అధికారులకు అలవాటుగా మారింది. ఇప్పటికైనా ప్రత్యామ్నాయంగా ఇతర ప్రదేశంలో ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.



-న్యూస్‌టుడే, గూబగుండం (ఆళ్లగడ్డ గ్రామీణ)

## మంత్రి రాకతో.. స్వచ్ఛత పనులు

మండలంలోని ముత్యాలపాడు గ్రామంలో బుధవారం మంత్రి పర్యటిస్తున్నారని తెలుసుకొన్న అధికారులు హుటాహుటిన పారిశుద్ధ్య పనులు చేయించారు. గత కొంతకాలంగా రహదారులపై పేరుకుపోయిన మట్టిని ట్రాక్టర్ల సాయంతో తొలగించారు. రోజూ ఇలా మంత్రుల పర్యటన ఉండే బాగుండు.. గ్రామం బాగుపడుతుంది అంటూ గ్రామస్థులు ఆనందపడ్డారు.



-న్యూస్‌టుడే, ముత్యాలపాడు (చాగలమర్రి)



అధికారులతో సమావేశమైన నోడల్ అధికారి సాంబశివరావు

## మంత్రి వస్తున్నారు.. వివరాలతో సిద్ధం కండి

**జీనపల్లె (శిరువెళ్ల), న్యూస్‌టుడే:** మండలంలోని యర్రగుంట్లలో ఈ నెల 4వ తేదీన జరిగే జన్మభూమి మాఊరు గ్రామసభకు మంత్రి అఖిలప్రియ వస్తున్న సమాచారం అధికారికంగా నోడల్ అధికారి ఉపాధి ఏపీడీ సాంబశివరావుకు బుధవారం అందింది. దాంతో ఆయన జీనపల్లెలో ఈ కార్యక్రమం ముగిసిన వెంటనే మండలస్థాయి అధికారులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. గురువారం జరిగే సమావేశంలో ఏయే అంశాలపై ఎవరెవరు మాట్లాడాలి, శాఖల వారీగా ప్రజా సమస్యలపై పురోగతి, సమావేశంలో ఏమైనా సమస్యలను ప్రజలు లేవనెత్తుతారా, వాటికి ఏయే శాఖల అధికారులు సమాధానమివ్వాలి, ఎలాంటి సమస్యలూ తలెత్తకుండా కార్యక్రమాన్ని ఎలా ముగించాలి తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. కార్యక్రమం ముగిసినా అధికారులంతా అక్కడే ఉండి చర్చించుకోవడంపై గ్రామస్థులు విస్తుబోయారు. ఒకరు ఇదే విషయమై వారిని అడిగారు. మరుచటి రోజు కార్యక్రమం గురించి చర్చించుకొంటున్నామని సమాధానం రాగా.. మంత్రా.. మజాకా అంటూ గ్రామస్థులు చర్చించుకొన్నారు.

# రాష్ట్రాన్ని అభివృద్ధి చేసిన ఘనత చంద్రబాబుదే



ఆలమూరులో మాట్లాడుతున్న మంత్రి అఖిలప్రియ

**ఆలమూరు (రుద్రవరం), న్యూస్‌టుడే:** రాష్ట్రాన్ని అభివృద్ధి చేసిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుదేనని మంత్రి అఖిలప్రియ అన్నారు. బుధవారం మండల పరిధిలోని ఆలమూరు గ్రామంలో జన్మభూమి మా ఊరు కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. జన్మభూమి, జనచైతన్య యాత్రల ద్వారా ప్రజల వద్దకే అధికారులు వచ్చి సమస్యలు తీరుస్తున్నారన్నారు. రైతురథం కింద మంజూరైన రెండు ట్రాక్టర్లను రైతులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్‌యార్డు ఛైర్మన్ బీవీ రామిరెడ్డి, ఆర్డీవో రామ్‌సుందర్, నోడల్ అధికారి శివారెడ్డి, ఆయాశాఖల అధికారులు పాల్గొన్నారు.

**తుడుమలదిన్నె (ఉయ్యాలవాడ):** పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని గ్రామసర్పంచి పి.సుబ్బారెడ్డి అన్నారు. బుధవారం తుడుమలదిన్నెలో జన్మభూమి మా ఊరు కార్యక్రమానికి ఆయన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు పింఛన్లు, రేషన్‌కార్డులు, పక్కాగృహాలు ఇచ్చిన ఘనత తెదేపాదే అన్నారు. తెదేపా మండల అధ్యక్షుడు కె.నారాయణరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం పెండ్లి కానుక కింద ఎస్సీ, ఎస్టీలకు రూ.50 వేలు, బీసీలకు రూ.30 వేలు ఇవ్వనున్నట్లు చెప్పారు. ప్రత్యేకాధికారి విజయుడు, ఎమ్పీడీఓ మహేష్‌కుమార్, సీడీపీఓ విజయలక్ష్మి, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

### సమస్యలకు పరిష్కారమేదీ

**ఆళ్లగడ్డ గ్రామీణ:** మండలంలో నల్లగట్ల, గూబగుండం గ్రామాల్లో బుధవారం జన్మభూమి- మా ఊరు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నల్లగట్లలో సమావేశం నిర్వహిస్తుండగా గ్రామస్థులు, రైతులు సమస్యలకు పరిష్కారం జరగడం లేదని వాపోయారు. గ్రామానికి చెందిన పెద్దపుల్లయ్య అనే రైతు భూముల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు రెండు మార్లు మీ ఇంటికి మీ భూమి కార్యక్రమంలో దరఖాస్తులు చేసుకున్నప్పటికీ పరిష్కారం కాలేదన్నారు. ఇలా నలుగురు రైతులు బాధితులుగా ఉన్నారన్నారు. దీనికి స్పందించిన తహసీల్దారు లక్ష్మీదేవి సమస్యను పరిష్కరిస్తామన్నారు. వెంటనే ఆన్‌లైన్‌లో ఆ వివరాలు ఎక్కించేలా చర్యలు తీసుకొంటామన్నారు. ఇదిలా ఉండగా గ్రామంలో నూతన శివాలయం నిర్మాణం ఎందుకు చేపట్టడం లేదని గ్రామస్థులు దేవాదాయశాఖ కార్యనిర్వహణాధికారి సి.వి.సుబ్బారెడ్డిని ప్రశ్నించారు. జాతీయ రహదారి విస్తరణలో తొలగిపోనున్న శివాలయానికి వెంటనే దాతలు ఇచ్చిన ప్రదేశంలో నిర్మించాలని కోరారు. ఈ విషయాన్ని కమీషనర్ దృష్టికి తీసుకెళ్లామని, అనుమతులు లభించన వెంటనే ప్రారంభిస్తామని ఈవో హామీ ఇచ్చారు. సమావేశంలో సర్పంచి శ్రీరాములు మాట్లాడుతుండగా బీసీ కాలనీకి నీరు సరఫరా కావడం లేదని మహిళలు చెప్పారు. నీటి సమస్యను పరిష్కరిస్తామని అధికారులు సమాధానమిచ్చారు.

**ఆళ్లగడ్డ:** గత జన్మభూమి కార్యక్రమాలతో పోల్చుకుంటే ఇప్పుడు అర్జీల సంఖ్య తగ్గిందని ఛైర్‌పర్సన్ ఉషారాణి అన్నారు. బుధవారం ఎంవీ నగరంలోని ఎంపీడీఓ కార్యాలయం ప్రాంగణంలో జన్మభూమి కార్యక్రమం కౌన్సిలరు సరోజిని అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఛైర్‌పర్సన్ మాట్లాడుతూ వచ్చే జన్మభూమి నాటికి అర్జీలే లేనంతగా నగరాభివృద్ధి చేసి చూపుతామన్నారు. ఇందుకు ప్రతి ఒక్క అధికారి సహకారం అందించాలన్నారు. ఉపాధ్యక్షులు రామలింగారెడ్డి మాట్లాడుతూ అధికారులు ప్రజల అంచనాలకు అనుగుణంగా పనిచేయడం లేదన్నారు. కార్యక్రమంలో కమిషనర్ వెంకట్రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**డబ్ల్యు కొత్తపల్లె (దొర్నిపాడు):** గ్రామాల్లో అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందిస్తామని మండల నోడల్ అధికారి వరప్రసాద్ అన్నారు. బుధవారం మండలంలోని డబ్ల్యు కొత్తపల్లె గ్రామంలో సర్పంచి భూమా శివలక్ష్మమ్మ ఆధ్వర్యంలో జన్మభూమి- మాఊరు కార్యక్రమం జరిగింది. గ్రామానికి 72 ఇళ్లు మంజూరైనట్లు గృహ నిర్మాణ అధికారి రామాంజనేయరెడ్డి తెలిపారు. అయా అధికారులు గ్రామ ప్రజల నుంచి వినతులు తీసుకొన్నారు. కార్యక్రమంలో మండల మాజీ ఎంపీపీ భూమా బ్రహ్మానందరెడ్డి, ఉపసర్పంచి రాజగోపాల్‌రెడ్డి, ఎంపీడీవో సుజాతమ్మ, ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



డబ్ల్యు కొత్తపల్లెలో పాల్గొన్న అధికారులు



వనికెన్‌దిన్నెలో రేషన్‌కార్డును పంపిణీ చేస్తున్న డీఎఫ్‌ఓ

**వనికెన్‌దిన్నె (శిరువెళ్ల):** గ్రామాల్లో నెలకొన్న ప్రజాసమస్యల పరిష్కారానికే జన్మభూమి మాఊరు కార్యక్రమం అని నంద్యాల డివిజన్ ప్రత్యేక అధికారి, అటవీశాఖ డీఎఫ్‌ఓ శివప్రసాద్ అన్నారు. బుధవారం మండలంలోని వనికెన్‌దిన్నె, జీనపల్లె గ్రామాల్లో సర్పంచులు రాజేశ్వరి, చింతలమ్మ ఆధ్వర్యంలో జరిగిన గ్రామసభలను ఆయన పరిశీలించారు. ముందుగా అధికారులు ప్రతిజ్ఞ చేశారు. నోడల్ అధికారి సాంబశివరావు, తహసీల్దార్ ఇంద్రాణి, ఎంపీడీవో సద్గుణ భాయి తదితర అధికారులు ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. గత రెండురోజులుగా ఎదుర్కొంటున్న విద్యుత్తు సమస్యను వనికెన్‌దిన్నె గ్రామస్థులు తెలిపారు. మీటర్లలో లోడ్ సమస్య కారణంగా ఈ సమస్య ఏర్పడిందని, పరిష్కరించామని ట్రాన్స్‌కో ఏఈ అనిల్‌కుమార్ సమాధానమిచ్చారు. డీఎఫ్‌ఓ మాట్లాడుతూ ప్రతి ఒక్క కుటుంబం 5 మొక్కలను నాటి సంరక్షించాలని తెలిపారు. మంజూరైన రేషన్‌కార్డులు, రుణమాఫీ పత్రాలు తదితర వాటిని అధికారులు, ప్రజాప్రతినిధులు సంబంధితులకు అందజేశారు.

## జన్మభూమి మనది.. సంక్షేమం అందరిదీ

జన్మభూమి మనది.. సంక్షేమం అందరిదీ అంటూ విద్యార్థులంతా నినదించారు. జన్మభూమి- మా ఊరుపై అవగాహన కల్పించేందుకు దొర్నిపాడు మండలంలోని చాకరాజు వేముల ప్రభుత్వ మండల పరిషత్తు పాఠశాల (మెయిన్) చెందిన విద్యార్థులు గ్రామంలో బుధవారం ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు మాట్లాడుతూ ప్రభుత్వం నిర్వహిస్తున్న ఐదో విడత ఈ కార్యక్రమంపై ప్రజలకు మరింత అవగాహన కల్పించడం కోసం విద్యార్థులతో ర్యాలీ నిర్వహించామన్నారు. ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

-న్యూస్‌టుడే, దొర్నిపాడు




## వైకాపాలో చేరిక

**జి.జంబులదిన్నె (ఆళ్లగడ్డ గ్రామీణ), న్యూస్‌టుడే:** మండలంలోని జి.జంబులదిన్నె గ్రామానికి చెందిన తెదేపా నాయకులు శంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో దశరాథరామిరెడ్డి, చక్కెర గోపాల్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, రామలింగారెడ్డి, వీరభద్రారెడ్డి, శేఖర్, పెద్దఈశ్వరయ్య, హుశేని, ఓబులేసు, అసామ్, ఓబుల్‌రెడ్డి, జయరామిరెడ్డి తదితర 70 మంది వైకాపాలో బుధవారం చేరారు. వైకాపా నియోజకవర్గ బాధ్యులు గంగుల బ్రిజేంద్రరెడ్డి సమక్షంలో వారందరికీ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు.

## దళితుల హక్కులను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే

**ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే:** దళితుల హక్కులను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపైనే ఉందని ఏపీ దళిత హక్కుల పోరాట సమితి జిల్లా కార్యదర్శి గురుదాస్ అన్నారు. బుధవారం డీఎస్పీ కార్యాలయం వద్ద ఆయన మాట్లాడుతూ అధికారుల నిర్లక్ష్యమే నక్కలదిన్నె ఘటనకు కారణమన్నారు. నీరు, నిత్యావసరాలు అందకుండా చేయడం బాధాకరమన్నారు. వెంటనే ప్రభుత్వం స్పదించి నిందితులను కఠినంగా శిక్షించి, బాధితులకు అండగా నిలవాలన్నారు. ● ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దండు వీరయ్య మాదిగ బుధవారం నక్కలదిన్నె గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళితులను సమాజ బహిష్కరణ చేయడం పెద్ద నేరమన్నారు. ఈ ఘటనకు కారకులైన వారందరినీ కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండు చేశారు. ● నక్కలదిన్నె గ్రామంలో సమాజ బహిష్కరణకు గురైన ఘటనపై ప్రభుత్వం స్పందించాలని తెదేపా ఎస్సీ సెల్ నాయకులు డాలు రత్నమయ్య అన్నారు. ప్రభుత్వం బాధిత దళితులకు అండగా నిలవాలని, రక్షణ కల్పించాలని పేర్కొన్నారు.

● నక్కలదిన్నె గ్రామంలో దళితులను బహిష్కరించడం అమానుషం అని ఏపీ దళితసమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్ అన్నారు. బుధవారం ఆయన ఆ గ్రామాన్ని సందర్శించి దళితులతో సమావేశం నిర్వహించారు. ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ సభ్యులతో కలిసి జరిగిన సంఘటనలపై ప్రభుత్వానికి నివేదిక పంపుతామన్నారు. ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమీటి సభ్యుడు బాలరాజు మాట్లాడుతూ ఇక మీదట ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని దళితులకు రక్షణ కల్పించాలన్నారు.

# ఆలూరు

## కూరగాయల ధరలు(కి. రూ.)

**ఆలూరు, న్యూస్‌టుడే :** టమోటా 10, పచ్చిమిరప 30, వంకాయ 20, బీట్‌రూట్ 40, క్యారెట్ 40, ఉర్లగడ్డలు 20, ఉల్లిగడ్డలు 50, క్యాలీఫ్లవర్ 20, బీన్స్ 40, ముల్లంగి 20, దోసకాయ 20, కాకరకాయ 40, బెండకాయ 40, చిక్కుడుకాయలు 30, క్యాబేజి 30, బీర కాయలు 40.

**తెరపై ఈనాడు**

**ఆలూరు : గోవర్ధన్ (డీటీఎస్) :** హలో.

## నిత్యావసర వస్తువుల ధరలు (కిలో రూ.)

బియ్యం కొత్తవి 40, బియ్యం పాతవి 48, మైదాపిండి 30, పప్పులు 75, వట్టికొబ్బెర 160, పెసరబేడలు 80, కందిబేడలు 55, కందిబేడలు (అకోల) 65, శనగబేడలు 75, చింత పండు 200, వెల్లుల్లి 50, ధనియాలు 80, ఉప్మారవ్వ 40, గోధుమపిండి 30, చక్కెర 40, బెల్లం 45, ఉద్దిబేడలు 80, అటుకులు 50, బొంబాయిరవ్వ 40, సన్‌ఫ్లవర్ నూనె (లీటరు) 82, పామోలిన్ 72.

## హలో... ఈనాడు

**8008573750**



ఖాజీపురం వద్ద వంతెనకు ప్రమాదకరంగా ఉన్న రంధ్రం

**చిప్పగిరి, న్యూస్‌టుడే:**

**సమస్య:** చిప్పగిరి బస్టాండు ప్రాంగణంలో వ్యర్థాలను పడేస్తున్నారు. దీంతో పరిసరాల్లో దుర్గంధం వెదజల్లుతోంది. దోమల బెడద పెరిగింది.

***– రామాంజనేయులు, చిప్పగిరి***

**సమాధానం:** వ్యర్థాలను రహదారికి దూరంగా వేయించి ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా చేస్తాం. దోమల నివారణకు చర్యలు చేపడతాం.

***– భాస్కరరావు, ఈఓఆర్‌డీ***

ఖాజీపురం రహదారిలోని వంతెనకు రంధ్రం పడింది. చీకటి సమయంలో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. గుంతను పూడ్చి ప్రమాదాలు జరగకుండా చూడాలని కోరుతున్నాం. ***– నాగరాజు, ఖాజీపురం***

**సమధానం:** గుంతను పూడ్చి ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపడతాం.

***– షేక్షావలి, పీఆర్ డీఈ ఆలూరు***

* ఏరూరులో సరైన మురుగు కాల్వలు లేక పోవడంతో రహదారులపైకి ప్రజలు మురుగు నీరు వదులుతున్నారు. సమస్య పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని విన్నవిస్తున్నాం. ***– నారాయణ, ఏరూరు***

**సమాధానం:** కాల్వల ఏర్పాటుకు కృషి చేస్తాం. ప్రస్తుతానికి రోడ్లపై నీరు వదల కుండా చర్యలు చేపడతాం.

***– భాస్కరరావు, ఈఓఆర్‌డీ***

(గమనిక: మీ ప్రాంతంలోని ప్రధాన సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లడానికి 'హలో ఈనాడు'కు ఫిర్యాదు చేయండి. వాటిని సకాలంలో అధికారులకు తెలియజేసి పరిష్కారానికి కృషి చేస్తాం. మీరు చేయాల్సిందల్లా.. చరవాణి సంఖ్య: 800 857 3750 తమ సమస్యలను చెప్పడమే.)

## జాతీయ స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

**పెద్దహోతూరు (ఆలూరు), న్యూస్‌టుడే :** ఆలూరు మండలం పెద్దహోతూరు గ్రామానికి చెందిన ఉన్నత పాఠశాల విద్యార్థులు జాతీయ స్థాయి సెపక్‌తక్రా పోటీలకు ఎంపికయ్యారు. గత డిసెంబరులో అనంతపురం జిల్లా ఉరవకొండలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో పాఠశాలకు చెందిన బాలికల విభాగంలో మల్లేశ్వరి, ఉమా, బాలుర విభాగంలో మనోజ్ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయికి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు కరిబసప్ప, వ్యాయామ ఉపాధ్యాయుడు చినబాబు తెలిపారు. బుధవారం విద్యార్థులకు అభినందనసభ నిర్వహించారు. తమ పాఠశాలకు చెందిన విద్యార్థులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికవడం హర్షణీయమన్నారు. జాతీయ స్థాయిలో కూడా మంచి ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు. ఎక్కడా లేని విధంగా పాఠశాల విద్యార్థులు సెపక్‌తక్రా పోటీల్లో ప్రతిభ చూపుతున్నారని పేర్కొన్నారు.

# పౌరసేవ.. చూపునా పరిష్కార తోవ

➠ సకాలంలో స్పందించని అధికారులు ➠ ప్రజలకు తప్పని తిప్పలు





మీసేవా కేంద్రం..

**ప్రస్తుతం ఏదైనా ప్రభుత్వానికి సంబంధించిన పథకానికి దరఖాస్తు చేసుకోవాలంటే తప్పని సరిగా మీసేవా ద్వారానే వెళ్లాలి. ఇక్కడి నుంచి వెళ్లే దరఖాస్తులకు పరిష్కారం లభించడం లేదు. అధికారులు మీనా మేషాలు లెక్కిస్తున్నారు. దీంతో సామాన్యులకు సేవలు అందడం గగనంగా మారింది. చాలా మంది అర్హులు ప్రభుత్వ పథకాలకు దూరమవుతున్నారని భావించిన రాష్ట్ర ప్రభుత్వం గడువులో సమస్యను పరిష్కరించేందకు పౌర సేవా విధానాన్ని అమల్లోకి తెచ్చింది. అయితే ఇక్కడా జాప్యం జరుగుతోంది. ఈనేపథ్యంలో 'న్యూస్‌టుడే' పరిశీలన కథనం. -న్యూస్‌టుడే, హొలహర్వి**

నియోజకవర్గంలో ఆరు మండలాలు కలిపి 98 గ్రామపంచాయతీలు, 120 వరకు గ్రామాలు ఉన్నాయి. ప్రస్తుతం మండలంలో జనాభాను ఒక్కో మండలంలో రెండు నుంచి నాలుగు వరకు మీసేవా కేంద్రాలు ఉన్నాయి. త్వరలో ప్రతి గ్రామ పంచాయతీకి ఒక మీసేవా కేంద్రం రానుంది. దీంతో ప్రజలకు మరిన్ని సేవలు అందించే అవకాశం ఉంటుంది.

### ధ్రువపత్రాలకు.. తప్పని తిప్పలు

నియోజకవర్గంలో విద్యార్థులకు, ఇతరులకు అవసరాల కోసం కుల ధ్రువీకరణ పత్రం చాలా అవసరం. గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ పథకాలపై అవగాహన అంతంతామాత్రంగానే ఉంటుంది. ఇలాంటి తరుణంలో పథకానికి అవసరమైనా పత్రాలు కావాలంటే అధికారులు అలసత్వం కారణంగా ధ్రువపత్రాలు అందడం లేదు. అంతే కాకుండా ఇతర శాఖల్లో సైతం ఏదైనా అనుమతి కావాలంటే నేరుగా మీసేవా ద్వారానే దరఖాస్తులు చేసుకోవాలి. దరఖాస్తు చేసుకుని సమయం మించిపోతున్నా పరిష్కారం మాత్రం కావడం లేదు.

### విధి విధానాలు

గతంలో ఎవరైనా కుల ధ్రువీకరణ పత్రం కోసం దరఖాస్తు చేసుకుంటే రెవెన్యూ అధికారులు విచారణ, పరిశీలన అంటూ కాలం వెళ్లదీసేవారు. ఇకాపై ఇలా అలసత్వం ప్రదర్శిస్తే సంబంధింత అధికారులకు జరిమానా విధించేలా నిబంధనలను అమలు చేయనున్నారు. దీని వల్ల బాధితుడు దరఖాస్తుకు పెట్టిన ఖర్చుతో సహా అధికారి చెల్లించాల్సి ఉంటుంది. దీని వల్ల అధికారుల్లో జవాబుదారితనం పెరిగి సేవల్లో పారదర్శకత, పనుల్లో వేగం పెరగనుంది.

### అవగాహన లోపం

గ్రామీణ ప్రాంతాల్లో చాలా మంది నిరక్షరాస్యులు అధికంగా ఉంటారు. అయితే వారు ఏదైనా దరఖాస్తు చేసేందుకు మీసేవకు వెళితే వారికి ఎలా రాసుకోవాలి, ఎలా దరఖాస్తు చేసుకోనే విధానం తెలియక పోవడంతో చాలా మంది దరఖాస్తు చేసుకొనే ముందు చాలా తప్పులు చేస్తుంటారు. అలాంటి సమయంలో దరఖాస్తుకు న్యాయం జరిగేందుకు కొంత ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. దీనిపై సంబంధింత అధికారులే కాకుండా స్థానికంగా ఉన్న అధికారులు సైతం అవగాహన కల్పిచాల్సిన అవసరం ఉంటుంది. అయితే ఇవేవి గ్రామాల్లో అమలు కావడం లేదు.

### సకాలంలో సేవలు



**-హుసెన్‌సాహెబ్, తహసీల్దార్**

ప్రజలు రెవెన్యూ సమస్యలపై మీసేవా ద్వారా దరఖాస్తులు చేసుకుంటే వెంటనే వాటిపై విచారించి తగిన నిర్ణయం తీసుకుంటున్నాం. పత్రాలు అందచేయడంలో ఎలాంటి ఆలస్యం లేదు. ఇందుకు సిబ్బందికి సైతం పౌరసేవలపై గట్టి ఆదేశాలు జారీ చేయడమే కాకుండా వారిని బాధ్యులుగా చేసేలా చర్యలు చేపడుతున్నాం. కొంత సిబ్బంది కొరత ఉన్నప్పటికి పౌరసేవలు అందిస్తాం.

### విద్యార్థులకు ఉపయోగం



**-కమాలకర్, చింతకుంట**

పౌరసేవల్లో అధికారులు అలసత్వానికి జరిమానా విధానం రావడం వల్ల విద్యార్థులకు ఎంతోగాను ఉపయోగపడుతుంది. విద్యార్థులకు సకాలంలో వివిధ రకకాల ధ్రువపత్రాలు అందుతాయి. గతంలో మాదిరిగా విద్యార్థులు పాఠశాలలు, కళాశాలలు వదిలి రావాల్సిన అవసరం లేకుండా సకాలంలో పత్రాలు చేతికి అందుతున్నాయి. అలాగే ఈ విధానం అన్ని శాఖ అధికారులకు పకడ్బంధీగా అమలు అయ్యేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటే బాగుంటుంది.

### అవగాహన కల్పించాలి



**-సిద్ధప్ప, జె.హోస్కళ్లి**

గ్రామీణ ప్రాంతాల్లో మీసేవా వినియోగం పట్ల సరైన అవగాహన లేదు. వివిధ రకాల ధ్రువపత్రాలు కావాలంటే పల్లె ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి వచ్చింది. సేవల్లో, అధికారుల్లో జవాబుదారీతనం, పారదర్శకత తెచ్చేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులోనే భాగంగానే గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన కల్పిస్తేనే ఎంతో బాగుంటుంది.

## వలస బండి కదిలింది

**ఆ**స్పరి మండలంలోని బవనూరు నుంచి దాదాపు 15 కుటుంబాలకు పైగానే బుధవారం వలస బాట పట్టాయి. వివిధ కాలనీలకు చెందిన వ్యవసాయకూలీలు మూటాముళ్లతో గుంటూరుకు వెళ్లారు. గ్రామంలో వ్యవసాయ పనులు ముగియడంతో పాటు ప్రస్తుతం పనులు లేక వలస పోతునట్లు వారు తెలిపారు. గుంటూరు ప్రాంతంలోని మిరప కోత పనులు ఉన్నాయని తెలిపారు. ముఖ్యంగా ఖరీఫ్, రబీ పనులు ముగియడంతో వలస వెళ్లినట్లు స్థానిక ప్రజలు తెలిపారు. స్థానికంగా గిట్టుబాటు కలిగేలా ఉపాధి పనులు ఉంటే ఈపరిస్థితి ఉండదని చెబుతున్నారు. **-న్యూస్‌టుడే, ఆస్పరి**

నివేదన



బనవనూరు నుంచి ఆటోలో వలస పోతున్న కూలీలు



విగ్రహాన్ని పరిశీలిస్తున్న హెడ్‌కానిస్టేబుల్ బీరప్ప

## విగ్రహం ధ్వంసం

**ఎల్లార్తి (హొళగుంద), న్యూస్‌టుడే :** మండలంలోని ఎల్లార్తి గ్రామంలో ప్రతిష్ఠించిన గాదిలింగేశ్వరస్వామి విగ్రహాన్ని గుర్తు తెలియని వ్యక్తులు బుధవారం ధ్వంసం చేశారని మండల కురవ సంఘం నాయకులు కాళికాప్రసాద్, గాదిలింగప్ప తదితరులు తెలిపారు. ఉదయం పూజ చేయడానికి వెళ్లిన భక్తులు ధ్వంసమైన విగ్రహాన్ని చూసి పెద్దల దృష్టికి తీసుకువచ్చారు. విగ్రహం ధ్వంసం కావడంతో ఆవేదనకు గురైన సంఘం నాయకులు ఘటనను పోలీసుల దృష్టికి తీసుకువెళ్లడంతో హెడ్‌కానిస్టేబుల్ బీరప్ప అక్కడికి వెళ్లి విగ్రహాన్ని పరిశీలించారు. ఘటనకు బాధ్యులైన వారిని గుర్తించి పట్టుకుని వారికి కఠినంగా శిక్షించాలని సంఘం నాయకులు డిమాండు చేశారు.

## మహిళా సమస్యలపై ఉద్యమించాలి





మాట్లాడుతున్న మహిళ నాయకురాలు

**ఆస్పరి, న్యూస్‌టుడే :** మహిళా సమస్యలపై ఉద్యమించాలని ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్రకార్యదర్శి మణి పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని పుటుకల మర్రి ఆదర్శ పాఠశాలలో పీడీఎస్‌యూ డివిజన్ కార్యదర్శి తిరుమల్లేష్ ఆధ్వర్యంలో విద్యార్థినులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకులు భాస్కర్, ప్రగతిశీల మహిళ సంఘం రాష్ట్ర కార్యదర్శి మణి మాట్లాడారు. మహిళా సమస్యల పరిష్కారానికి మహిళలు, విద్యార్థులు చైతన్యవంతం కావాలన్నారు. మహిళ లు అనుకుంటే సాధించలేనిది ఏమీలేదన్నారు. మహిళలు అక్షరాస్యత దిశగా పయనించారు. ఈ కార్యక్రమంలో రామంజనేయులు, మహబుబ్‌బాషా, హనుమన్న, రాధమ్మ, సుజాత, ఉషా, తదితరులు పాల్గొన్నారు.

# ఆలూరు

24 గంటల అత్యవసర వైద్య సేవలకు 108కు ఫోన్ చేయండి

## నేడు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ రాక

**ఆస్పరి, న్యూస్‌టుడే :** మండలకేంద్రమైన ఆస్పరిలో జరిగే ఆలూరు నియోజవర్గ సీపీఐ మహాసభలకు ముఖ్యఅతిథిగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ వస్తున్నట్లు సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి గిడ్డయ్య, జిల్లా సమితి సభ్యులు నాగేంద్రయ్య, మండల కార్యదర్శి విరుపాక్షి తెలిపారు. బుధవారం ఆస్పరి ప్రధాన రహదార్లలోను, చౌరస్తాలో ఎర్రజెండాలను కట్టి ఎరుపుమయంగా మార్చారు. సభా స్థలాన్ని ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు.



## నేత్రానందంగా దేవర

### తుంబళబీడులో భక్తజనసంద్రం


**తుంబళబీడు, (ఆలూరు), న్యూస్‌టుడే :** ఆలూరు మండలం తుంబళబీడు గ్రామంలో దేవమ్మవ్వ, సుంకలమ్మవ్వ దేవర మహోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. దాదాపు వందేళ్ల తరువాత గ్రామంలో దేవర నిర్వహించడంతో వలసలకు వెళ్లిన వారితో పాటు బంధువులు, సన్నిహితులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. దీంతో గ్రామంలోని వీధులు కాస్త జనంతో కిక్కిరిసిపోయాయి. తెల్లవారు జామునే అమ్మవార్లకు దున్నపోతును బలిగా సమర్పించడంతో దేవర ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. గ్రామంలోని ప్రతి ఇంటి నుంచి మహిళలు కుంభాలను నెత్తిన పెట్టుకుని దేవమ్మవ్వ, సుంకలమ్మవ్వ ఆలయాల వరకు తీసుకెళ్లి అమ్మవార్లకు సమర్పించారు. వరస కరవు కాటకాలతో పంటలు పండక రైతులు తీవ్రంగా నష్టపోయారని.. దీనికి తోడు గ్రామస్థులు సుఖ సంతోషాలకు దూరమయ్యారని పెద్దలు తెలిపారు. దాంతో గ్రామంలో దేవరను నిర్వహించాలని నిశ్చయించడం జరిగిందన్నారు. దేవర నిర్వహిస్తే సకాలంలో వర్షాలు కురిసి పంటలు సంవృద్ధిగా పండటంతో పాటు గ్రామంలో శాంతి నెలకొంటుందని పేర్కొన్నారు. ఇలా ఉండగా దాదాపు వందేళ్ల కిందట గ్రామంలో దేవరను నిర్వహించారని తెలిపారు. కేంద్ర మాజీ మంత్రి కోట్ల సూర్యప్రకాశ్, ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, తెదేపా నియోజకవర్గ బాధ్యుడు వీరభద్రగౌడ్ దేవరకు హాజరై అమ్మవార్లను దర్శించుకున్నారు. సర్పంచి వెంకటేశ్వర్లు, గ్రామస్థులు పాల్గొన్నారు.



పూల అలంకరణలో దేవమ్మవ్వ



కుంభాలను తీసుకెళ్తున్న గ్రామస్థులు



అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే

## ప్రజలు వద్దకే ప్రభుత్వ పథకాలు

**అరికెర (ఆలూరు), న్యూస్‌టుడే :** ప్రజల వద్దకు పాలన ఒక్క చంద్రబాబునాయుడుతోనే సాధ్యమని శాలివాహన ఫెడరేషన్ ఛైర్మన్, నియోజకవర్గ జన్మభూమి కార్యక్రమ పరిశీలకులు తుగ్గలి నాగేంద్ర అన్నారు. ఆలూరు మండలం అరికెర గ్రామంలో బుధవారం జన్మభూమి-మాఊరు కార్యక్రమం జరిగింది. జడ్పీటీసీ సభ్యుడు రాంభీంనాయుడు, తెదేపా నాయకులు నారాయణరెడ్డి, కురవ జయరాం, బొగ్గుల రాముడు, సర్పంచి వెంకటేష్‌నాయక్, ప్రత్యేక అధికారి రాజశేఖర్, ఎంపీడీవో విజయభాస్కర్, ఎస్సై ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.

**బిలేహాల్ (హాలహర్వి), న్యూస్‌టుడే :** ప్రభుత్వం అందించే ప్రతి పథకాన్ని ప్రజలకు అందించేలా ప్రతి ఒక్క అధికారి కృషి చేస్తారని మండల ప్రత్యేకాధికారి వేణుగోపాల్ రెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలో బిలేహాల్ గ్రామంలో జన్మభూమి-మాఊరు కార్యక్రమం నిర్వహించారు. అనంతరం గర్భిణులకు ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సీమంతాలు, వైద్యాధికారి రవి ప్రత్యేక వైద్యా పరీక్షలు నిర్వహించారు. ఉపాధి హామీ ఎపీడీ లోకేశ్వర్; ఎంపీడీవో అక్బర్‌సాహెబ్, తహసీల్దార్ హుసెన్‌సాహెబ్ పాల్గొన్నారు..

**ఎండి హళ్లి, పెద్దగోనేహాల్ (హొళగుంద), న్యూస్‌టుడే :** ప్రజలందరికీ అభివృద్ధి ఫలాలు అందించాలన్న లక్ష్యంతోనే రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 'జన్మభూమి-మాఊరు' కార్యక్రమాన్ని ప్రారంభించారని నోడల్ అధికారి లక్ష్మీప్రసాద్ అన్నారు. బుధవారం ఆయన మాట్లాడారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలో ఎంపీడీవో మేరీ గర్భిణులకు సీమంతం చేశారు. తహసీల్దారు సతీష్, ట్రాన్స్‌కో, హౌసింగ్, పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్, టీబీపీ ఏఈలు నాగరాజు, ఆదినారాయణ, మాణిక్యరావు, బాలచంద్రాచారి, హుసేనప్ప, మండల విద్యాధికారి మహబూబ్‌జాన్, పాల్గొన్నారు.

**చిగళి, నగరూరు(ఆస్పరి), న్యూస్‌టుడే :** ప్రభుత్వ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని మండల ప్రత్యేక అధికారి చెంగళరాయుడు, ఎంపీడీవో సలీంబాషా అన్నారు. బుధవారం మండలంలోని చిగళి, నగరూరు గ్రామాల్లో గ్రామ సర్పంచులు పద్మమ్మ, రామకృష్ణప్పల అధ్యక్షతన జన్మభూమి-మాఊరు కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముందుగా అధికారులు, ప్రజలందరూ కలసి ప్రతిజ్ఞ చేశారు. వైద్యాధికారి రఘురామిరెడ్డి , ఉపతహసీల్దారు శ్రీనివాసులు, ఏవో మునెమ్మ, ఏపీవో బొజ్జయ్య, పాల్గొన్నారు.

**నగరడోణ (చిప్పగిరి):** ప్రజా సమస్యల పరిష్కారమే జన్మభూమి ఉద్దేశమని జడ్పీటీసీ సభ్యుల జిల్లా సంఘం అధ్యక్షుడు మీనాక్షినాయుడు తెలిపారు. చిప్పగిరి మండలం, నగరడోణలో సర్పంచి నాగేంద్ర ఆధ్వర్యంలో 'జన్మభూమి- మాఊరు' గ్రామసభను ఉద్దేశించి ఆయన బుధవారం మాట్లాడారు. డిప్యూటీ కలెక్టరు తిప్పేనాయక్ ప్రజాసమస్యలపై చర్చించారు. ప్రత్యేక అధికారి రామచంద్రారెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ ఖాజామోహిద్దీన్, ఎంపీపీ పద్మావతి, స్థానిక తెదేపా నాయకుడు క్రిష్టప్ప, బెల్డోణ సర్పంచి భీమలింగప్ప, తహసీల్దారు వలిబాషా, ఎంపీడీవో అల్లాబకాష్, విద్యాధికారి నారాయణస్వామి, పాల్గొన్నారు.

## ఆదర్శ భావాలు కలిగి ఉండాలి

**హొళగుంద, న్యూస్‌టుడే :** ప్రతి ఒక్కరు ఆదర్శ భావాలు కలిగి ఉండాలని స్వేరోస్ రాష్ట్ర అధ్యక్షుడు తిరుమలయ్య సూచించారు. హొళగుందలోని కస్తూర్బా గాంధీ బాలికల గురుకుల విద్యాలయంలో బుధవారం సావిత్రి బాయి పూలే జయంతిని పురస్కరించుకుని సంస్థ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం విద్యాలయం విద్యార్థినులకు పోటీ పరీక్షలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. సంస్థ రాయలసీమ ప్రాంత్రీయ కార్యదర్శి దుర్గాప్రసాద్, పాల్గొన్నారు.

## బ్రాహ్మణుల సమస్యలను పరిష్కరించాలి

**ఆలూరు, న్యూస్‌టుడే :** బ్రాహ్మణుల సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించి న్యాయం జరిగేలా చూడాలని ఆ సంఘ తాలుకా అధ్యక్ష, కార్యదర్శులు నారాయణరావు, ఎల్‌ఆర్ వెంకటేశ్వర్లు, రవీంద్రరావు, సేతురాం ఆచార్ కోరారు. బుధవారం ఆలూరులో ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాంను కలసి వినతి పత్రం అందజేశారు. బ్రాహ్మణుల కోసం ప్రత్యేకంగా కార్పొరేషన్ ఏర్పాటు చేసినా సరైనా అవగాహన లేకపోవడంతో చాలా మంది ఉపయోగించుకోలేకపోతున్నారని అన్నారు. ప్రస్తుతం ఈ ఏడాది విద్యార్థులకు కార్పొరేషన్ నుంచి ఉపకార వేతనాలు కూడా అందించలేదని తెలిపారు. ఇలా ఉండగా ఆలూరులో బ్రాహ్మణులకు ప్రత్యేకంగా శ్మశాన వాటిక లేకపోవడతో మృత దేహాలను తగుల బెట్టేందుకు స్థలాలను వెతుక్కోవాల్సి వస్తోందన్నారు. శ్మశాన వాటిక కోసం స్థలం కేటాయించాలని కోరుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని వాపోయారు. వెంటనే స్థలం సమకూరేలా ప్రత్యేక చొరవ చూపాలని ఎమ్మెల్యేకు విన్నవించారు. ఇందుకు స్పందించిన ఎమ్మెల్యే జయరాం బ్రాహ్మణుల సమస్యలు పరిష్కరించేందుకు తనవంతు కృషి చేస్తానని చెప్పారు. ప్రధానంగా శ్మశాన వాటిక కోసం స్థలం సమకూర్చాలని అధికారులను కోరుతానని పేర్కొన్నారు.



గుమ్మనూరు జయరాంకు వినతి పత్రం అందిస్తున్న బ్రాహ్మణ సంఘ నాయకులు

## బాధిత కుటుంబాలకు నగదు అందజేత

**కొత్తపేట (హొళగుంద), న్యూస్‌టుడే :** రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మండలంలోని నెరణికితండా మజరా కొత్తపేట గ్రామ బాధిత కుటుంబ సభ్యులకు తక్షణ సాయం కింద ఒక్కొక్కరికి రూ. 5 వేల నగదును అందజేసినట్లు వెలుగు ప్రాంతీయ సమన్వయకర్త, ఏపీఎం ఆంజనేయులు బుధవారం తెలిపారు. దేవరగట్టు మాజీ ఛైర్మన్ ముద్దు బసవనగౌడ్ తన వంతు సాయంగా ఒక్కో కుటుంబానికి రూ. 5 వేలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్టీఆర్ బీమా కింద మృతుల కుటుంబానికి త్వరలోనే రూ. 5 లక్షలు అందేలా చర్యలు తీసుకుంటామన్నారు.

## మహిళ ఆత్మహత్య

**ఆస్పరి, న్యూస్‌టుడే :** మండలంలోని చిరుమాన్ దొడ్డి గ్రామంలో ఓ మహిళ పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకునట్లు ఆదోని ప్రాంతీయ ఆస్పత్రి ఔట్‌పోస్టు పోలీసులు తెలిపారు. బుధవారం గ్రామానికి చెందిన నారాయణమ్మ(52) ఇంట్లో ఉన్న పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకునట్లు తెలిసింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తునట్లు ఆస్పరి ఎస్సై శంకరయ్య తెలిపారు.



నారాయణమ్మ

## కొత్తపేటలో విషాదం



ఘటనా స్థలంలో ఎస్పీ గోపినాథ్

ఆస్పరి మండలం చిన్నహోతూరు గ్రామ సమీపంలో జరిగిన ప్రమాదంతో హొళగుంద మండలం కొత్తపేట గ్రామంలో విషాదం అలుముకుంది. ప్రమాద ఘటన ప్రదేశంలో వాహనం టైర్ పొలాల్లోకి దూసుకెళ్లింది. ఘటనా స్థలాన్ని చూడటానికకి ఎంతో మంది తరలి వచ్చారు.

-న్యూస్‌టుడే, ఆలూరు



క్షతగాత్రులను ఆటోలో ఆస్పత్రికి తరలిస్తూ..



ఘటనా స్థలంలో ఎస్పీ గోపినాథ్

## మహిళలు అన్నింటా రాణించాలి

**ఆస్పరి, న్యూస్‌టుడే :** మహిళలు పురుషులతో సమానంగా పోటీపడి అన్నింటా రాణించాలని ఎస్టీయూ జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి నాగేంద్రప్ప అన్నారు. బుధవారం సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా స్థానిక ప్రధాన పాఠశాల్లో మహిళ ఉపాధ్యాయిని రాధమ్మ, కన్య కూమారిలను అదేవిధంగా బిణిగేరిలోని ఉపాధ్యాయురాలు ప్రమీల, నిర్మల సన్మానించారు. ప్రధానోపాధ్యాయులు జ్యోతిమూర్తి, కాంతరావు, తిమ్మప్ప, నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.



# బనగానపల్లి

## మాన్యం భూముల వివరాలు

**సంజామల, న్యూస్‌టుడే:** మాన్యం భూ సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టినట్లు అక్కంపల్లె నయనాలప్ప క్షేత్రం ఓంకారేశ్వరస్వామి దేవాలయం ఈవో వీరయ్య పేర్కొన్నారు. సంజామల, ఎగ్గోని, ముచ్చలపురి, కొత్తపేట, ముదిగేడు, కమలపురి, వసంతాపురం, బొందలదిన్నె, హోత్రమాన్‌దిన్నె, నట్లకొత్తూరు గ్రామాల్లోని పంచాయతీల్లో వివరాలను ప్రజలకు అందుబాటులో పెట్టనున్నట్లు తెలిపారు.

## రజకులను ఆదుకోవాలి

**అవుకు, న్యూస్‌టుడే:** రజకులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కరించి ఆదుకోవాలని సంఘం నాయకులు ఆర్. కేశవర్ధన్, సి. వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలంటూ ఏళ్ల తరబడి సూచిస్తున్నా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు వెంకటేశ్వర్లు, శివ తదితరులు పాల్గొన్నారు.

# గనుల్లో నీళ్లు.. ఉపాధికి కన్నీళ్లు

- వర్షం నీటి నిల్వతో అవస్థలు
- పనులు లేక ఇబ్బందుల్లో యజమానులు, కూలీలు
- నీళ్లు తోడేందుకు యజమానుల పాట్లు



నీటిని తోడేందుకు ఏర్పాటు చేసిన పైపులు

**బనగానపల్లి, న్యూస్‌టుడే:** వ్యవసాయ రంగం తరువాత నాపరాళ్ల పరిశ్రమకు ప్రాముఖ్యత ఇస్తారు. నాపరాళ్ల పరిశ్రమను నమ్ముకొని సుమారు 10 వేల కుటుంబాలకుపైగా జీవనం సాగిస్తున్నారు. ప్రతినెలా రూ. కోట్లలో జరిగే వ్యాపారం ప్రస్తుతం 40 శాతానికి పడిపోయింది. కూలీలతో పాటు గనుల యజమానులకు కష్టాలు తప్పడం లేదు. నాపరాళ్ల కోసం తవ్విన గనుల్లో వర్షపు నీరు నిల్వ ఉండటంతో చెరువులను తలపిస్తున్నాయి. నియోజకవర్గంలోని పలుకూరు, రామకృష్ణాపురం, అవుకు, చెర్లోపల్లె, రామాపురం, కొలిమిగుండ్ల, బెలుం, అంకిరెడ్డిపల్లె, కనకాద్రిపల్లె, మీర్జాపురం గ్రామాల్లో విస్తారంగా నాపరాళ్ల గనులు ఉన్నాయి. ప్రస్తుతం పనులు సాగకా.. ఇటు యజమానులు అటు కూలీలు ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై 'న్యూస్‌టుడే' పరిశీలనాత్మక కథనం.

నియోజకవర్గంలో సుమారు 930 హెక్టార్లలో నాపరాళ్ల గనులు ఉన్నాయి. ప్రత్యక్షంగా పరోక్షంగా 20 వేల మంది గనులు జీవనోపాధి పొందుతున్నారు. పరిశ్రమలో నీరు చేరడంతో దాదాపుగా 300 హెక్టార్ల వరకు గనుల్లో నీరు చేరింది. వర్షపు నీరు నిల్వ ఉండటంతో పనులు లేకపోవడంతో కూలీలు వలసలు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. కొందరు పొలం పనులకు వెళ్తున్నారు. మరికొందరు గుంటూరుకు వలస బాట పట్టారు. స్థానికంగా రోజుకు రూ. 400 వరకు సంపాదించుకునే కూలీలు నేడు రూ. 200 కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

✦ గతేడాది ఎన్నడూ లేని విధంగా వర్షాలు కురిసాయి. దీంతో నాపరాళ్ల గనుల్లో అధిక మోతాదులో వర్షం నీరు నిల్వ ఉంది. 2017 జూన్ నుంచి డిసెంబర్ వరకు సుమారు 120 సెంటీమీటర్ల వర్షపాతానికి పైగా నమోదైనట్లు అధికారులు చెబుతున్నారు.

✦ గనుల్లో నీరు చేరడంతో ఉత్పత్తి పూర్తిగా తగ్గిపోయింది. నాపరాయిని ఇతర ప్రాంతాలకు తరలించే లారీలు, ట్రాక్టర్లకు కూడా పూర్తిగా పనులు తగ్గిపోయాయి. నియోజకవర్గం నుంచి నిత్యం సుమారు రూ. 30 లక్షల విలువ చేసే రాయిని దూర ప్రాంతాలకు తరలిస్తుంటారు. రోజుకు రూ. 30 లక్షల రాయిని తరలిస్తే నెలకు రూ. 9 కోట్లకు పైగా వ్యాపార లావాదేవీలు జరిగేవి.



చెరువును తలపిస్తున్న రామకృష్ణాపురం గనులు

| | |
|---|---|
| మొత్తం నాపరాళ్ల పరిశ్రమలు: | 930 హెక్టార్లు |
| నీరు నిల్వ ఉన్న గనులు: | 300 హెక్టార్లు |
| నిత్యం బయటికి తీసే రాయి: | సుమారు 6000 చదరాలు |
| ప్రస్తుతం తగ్గిన రాయి: | సుమారు 3000 చదరాలు |
| ఒక్కో చదరం రాయి విలువ: | రూ. 500 |

### వలసలే దిక్కు



**- రాజు, ఎస్సీ కాలనీ, పలుకూరు**

గనుల్లో నీరు చేరడంతో ఇతర ప్రాంతాలకు పనుల కోసం వలస వెళ్లాల్సి వస్తోంది. మరికొందరు వ్యవసాయ పనులకు వెళ్తున్నారు. గతంలో ఇతరులు పనుల నిమిత్తం మా గ్రామానికి వచ్చేవారు. ప్రస్తుతం మేమే వెళ్లాల్సి వస్తోంది.

### పనిలేక ఖాళీగా ఉంటున్నాం

**- ఏకాంబరం, పలుకూరు**



ప్రస్తుతం గనుల్లో వర్షం నీరు ఉండటంతో ట్రాక్టర్లను ఇంటి వద్దే ఖాళీగా పెట్టాల్సిన పరిస్థితి నెలకొంది. ఇతర పనులు అలవాటు లేకపోవడంతో ఎక్కడికీ వెళ్లలేకపోతున్నాం. గనుల్లో నీరు తగ్గిపోతే పనులు లభిస్తాయి.

### తగ్గుముఖం పట్టిన పనులు

**- వెంకటరెడ్డి, గనుల శాఖ ఏడీ**

గనుల్లో వర్షం నీరు అధికంగా చేరడంతో నాపరాళ్ల పరిశ్రమలో ఉత్పత్తులు తగ్గిపోయాయి. నిత్యం రాయల్టీ అనుమతుల కోసం యజమానులు వచ్చిపోయేవారు. మోటార్లతో నీటిని తొలగించుకోవాలి.



ముళ్లకంపలతో నిండిపోయిన చాకిరేవు రహదారి

## సమస్యలు తీర్చండయ్యా..

**కొలిమిగుండ్ల, న్యూస్‌టుడే:** ఈ నెల 4న చింతలాయిపల్లె, అంకిరెడ్డిపల్లె గ్రామాల్లో ఐదో విడత జన్మభూమి-మా ఊరు కార్యక్రమం నిర్వహించనున్నారు. చింతలాయిపల్లె గ్రామానికి సమీపంలోని గంగమ్మ దేవాలయానికి వెళ్లే రహదారి అధ్వానంగా ఉంది. ఈ దారిలో పొలానికి వెళ్లాలంటే ముళ్లకంపలతో ఇబ్బందిగా ఉందని రైతులు వాపోతున్నారు. ఉన్నత పాఠశాలకు ప్రహరీ లేదని, ఏర్పాటు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని గ్రామస్థులు కోరుతున్నారు.



విజేతలతో ప్రధానోపాధ్యాయుడు సోమశేఖర్‌రెడ్డి

## జోనల్ స్థాయిలో ప్రతిభ

**కైప (బనగానపల్లి గ్రామీణ), న్యూస్‌టుడే:** చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ప్రధానోపాధ్యాయుడు సోమశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని కైప ఉన్నత పాఠశాల విద్యార్థులు అవుకులో జరిగిన జోనల్ స్థాయి క్రీడా పోటీల్లో అండర్-17 బాల్ బాడ్మింటన్‌లో ప్రథమ స్థానం సాధించినట్లు తెలిపారు. ప్రతిభ కనబరిచిన సుభాష్, నాగ జనార్దన్, సునీల్, సురేంద్ర, మధు, సురేష్, విజయానికి కృషి చేసిన వ్యాయామ ఉపాధ్యాయుడు హరికృష్ణను పాఠశాల ఉపాధ్యాయ బృందం అభినందించారు.

## అంధులకు క్రీడా పోటీలు ప్రారంభం

**నంద్యాల క్రీడా విభాగం, న్యూస్‌టుడే:** బ్రెయిలీ జయంతిని పురస్కరించుకుని సెయింట్ లూక్స్ అంధుల పాఠశాల ఆధ్వర్యంలో బుధవారం స్థానిక ఎస్పీజీ పాఠశాల మైదానంలో క్రికెట్ పోటీలు ప్రారంభించారు. దీనికి ముఖ్య అతిథులుగా ఆంధ్రా బ్యాంకు మేనేజర్లు హరీష్ రావు, విశ్వరంజిత్, ఎస్పీజీ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జీవలత, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ దివాకర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. అనంతరం కళాశాల ప్రిన్సిపల్ మాట్లాడుతూ.. మొత్తం 150 మంది క్రీడాకారులు పాల్గొన్నట్లు తెలిపారు. రెండు రోజులు పాటు జరిగే ఈ పోటీల్లో క్రికెట్, కబడ్డీ ఇతర ఆటలను నిర్వహిస్తామన్నారు.

## ఘనంగా సావిత్రి బాయి పూలె జయంతి

**నొస్సం (సంజామల), న్యూస్‌టుడే:** స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం ప్రధానోపాధ్యాయుడు శ్రీరాములు ఆధ్వర్యంలో జాతీయ మహిళా ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని సావిత్రి బాయి పూలె చిత్రపటానికి పూలమాలలు వేశారు. నొస్సం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రామయ్య ఆధ్వర్యంలో జరిగాయి. కార్యక్రమంలో యూటీఎఫ్ వెంకటయ్య, బాబాఫకృద్దీన్, నబీరసూల్, కిరణ్‌కుమార్, వెంకటరాముడు, చంద్రశేఖర్, సత్యనారాయణ, బాబు, చాంద్ బాషా, ఖలీల్, నాయక్, వెంకటరెడ్డి, ఓబులేసు, యశోద, పార్వతి, ఆదినారాయణమ్మ, మోనిక లావణ్య, పద్మవతమ్మ తదితరులు పాల్గొన్నారు.



నివాళి అర్పిస్తున్న ఉపాధ్యాయులు

## ప్రమాదంలో 21 గొర్రెల మృత్యువాత


**గుల్లదుర్తి (కోవెలకుంట్ల గ్రామీణ), న్యూస్‌టుడే:** కోవెలకుంట్ల నుంచి జమ్ములమడుగు వెళ్లే మార్గంలో బుధవారం రహదారి ప్రమాదంలో 21 గొర్రెలు మృత్యువాత పడ్డాయి. ఉయ్యాలవాడ మండలం నర్సిపల్లెకు చెందిన నార్వేని మద్దిలేటికి చెందిన గొర్రెల మందను కోవెలకుంట్ల పట్టణ శివారులోని మార్కెట్ యార్డు సమీపంలో సుమో ఢీకొనడంతో 10 గొర్రెలు మృత్యువాత పడ్డాయి. అక్కడి నుంచి గుల్లదుర్తికి చేరుకునే సరికి ధర్మల్ నుంచి యనకండ్లకు వెళ్తున్న లారీ వేగంగా వచ్చి గొర్రెల మందమీదకు వెళ్లడంతో మరో 11 గొర్రెలు మృత్యువాత పడ్డాయి. సుమారు రూ. 2 లక్షల మేర నష్టం వాటిల్లిందని బాధితుడు వాపోయాడు.

## సమాజ సేవలో పాలు పంచుకోవాలి

**సౌదరదిన్నె (కోవెలకుంట్ల గ్రామీణ), న్యూస్‌టుడే:** విద్యార్థులు చదువుతోపాటు సమాజ సేవను అలవాటు చేసుకోవాలని రాయలసీమ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ అమర్‌నాథ్ అన్నారు. బుధవారం మండలంలోని సౌదరదిన్నె గ్రామంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్, జన్మభూమిలో భాగంగా 'ఆరోగ్యం-ఆనందం' అనే అంశంపై కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ శశికళ, ఉప ప్రిన్సిపల్ వెంకటేశ్వర్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ కార్యక్రమం అధికారి శివారెడ్డి, ఎంఈవో గోపాల్‌రెడ్డి, సర్పంచి రమణారెడ్డి, అధ్యాపకులు, ఎంపీఈవోలు, ఆశా కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న ఆర్‌యూ రిజిస్ట్రార్ అమర్‌నాథ్




సమావేశంలో మాట్లాడుతున్న హరినాథ్‌రెడ్డి

## ఆంగ్లంపై పట్టు సాధించాలి

**బనగానపల్లి, న్యూస్‌టుడే:** విద్యార్థులు ఆంగ్ల భాషపై పట్టు సాధించాలని నెహ్రూ పాఠశాల కరస్పాండెంట్ కోడూరు హరినాథ్‌రెడ్డి సూచించారు. బుధవారం పాఠశాలలో ఆంగ్ల భాషపై వేడుకలు జరుపుకొన్నారు. తెలుగుతోపాటు ఆంగ్ల భాషని శ్రద్ధగా నేర్చుకోవాలన్నారు.

ఆంగ్ల భాషపై విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు కమల్ తేజారెడ్డి, డైరెక్టర్ రవితేజారెడ్డి, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# డోన్

## నేడు గ్రామాల్లో..

**డోన్ గ్రామీణ:** మండలంలోని కొచ్చెర్వు, గోసానిపల్లె గ్రామాల్లో జన్మభూమి-మా ఊరు కార్యక్రమం గురువారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో క్యాథరిన్ తెలిపారు. కొచ్చెర్వులో ఎంపీడీవో బృందం, గోసానిపల్లెలో తహసీల్దారు బృందం ఆధ్వర్యంలో జరుగుతుందన్నారు. గ్రామంలో ఉన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని ప్రజలను కోరారు.

## నేడు హెచ్.కొట్టాలకు శమంతకమణి రాక

**బేతంచెర్ల, న్యూస్‌టుడే:** మండల పరిధిలోని హెచ్.కొట్టాల గ్రామంలో గురువారం జరిగే జన్మభూమి-మా ఊరు కార్యక్రమానికి అనంతపురం ఎమ్మెల్సీ శమంతకమణి వస్తున్నట్లు తెదేపా మండల కన్వీనర్ అశోక్ కుమార్, మద్దిలేటిస్వామి ఆలయ మాజీ ఛైర్మన్ ఎల్లనాగయ్య తెలిపారు. ప్రజలు, తెదేపా నాయకులు, కార్యకర్తలు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

**ఈ** చిత్రంలో కనిపిస్తున్న ఆమె డోన్ పాతపేట కాలనీకి చెందిన పద్మాబాయి. ఈమె భర్త లక్ష్మణ్‌రావు, రేకుల షెడ్డు వేసుకొని చిన్న పాటి దుకాణాన్ని నిర్వహిస్తున్నారు. 30 ఏళ్ల నుంచి వీరు పాతపేటలో




నివాసముంటున్నారు. పక్కా గృహానికి నోచుకోక రేకుల షెడ్డులోనే కాలం వెల్లదీస్తున్నారు. గత ప్రభుత్వం హయాంలో పలుమార్లు పక్కా గృహం మంజూరు చేయాలని వేడుకున్నా ఫలితం లేకుండా పోయింది. ఈ సారి జన్మభూమి కార్యక్రమంలోనైనా తమ సమస్య నెరవేరుతుందా లేదా అని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



**ఈ** చిత్రం పాతపేటలోని కర్నూలు రైల్వే గేట్లు. నిత్యం రైళ్లు, గూడ్సుల రాకపోకలు సాగుతుంటాయి. ఆ సమయంలో రైల్వే గేట్లు పడితే గంటల తరబడి ఎండలో వేచి ఉండాల్సిన పరిస్థితి. ఏళ్లు గడుస్తున్నా సమస్య మాత్రం తీరడం లేదు. గత ప్రభుత్వ హయాంలో మాజీ కేంద్ర రైల్వే సహాయ మంత్రి కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి భూగర్భ వంతెన నిర్మాణం కోసం శంకుస్థాపన చేశారు. నేటికీ నిర్మాణం ఊసే లేకుండా పోయింది. ఈ రహదారి వెంటా శ్మశానానికి వెళ్లాలి. గేట్లు పడినప్పుడు మృతదేహాలను తీసుకెళ్లాలంటే ఇబ్బందులు పడుతున్నారు.

# ఐదో విడతైనా.. సమస్యలు తీరేనా

★ అర్హులకు దక్కని పథకాలు

★ దరఖాస్తులకే పరిమితం

★ పట్టించుకోని పాలకులు, అధికారులు

**డోన్‌పట్టణం, న్యూస్‌టుడే:** గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు జన్మభూమి, స్వచ్ఛ భారత్ కార్యక్రమాలను రూ. లక్షలు వెచ్చించి ప్రభుత్వం నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమాలతో ఏమాత్రం అభివృద్ధి పనులు జరగడం లేదు. పేదలు పేదవారిగానే. . ధనికులు ఇంకా ఆస్తిపరులు అవుతున్నారు. అధికారులకు కూడా పేద ప్రజలు పట్టించుకోవడం లేదు. చాలా గ్రామాల్లో నేటికి పక్కా గృహాలు లేక గుడిసెల్లోనే జీవనాలు సాగించాల్సిన దుస్థితి నెలకొంది. ఎక్కడ చూసినా చెత్తా చెదారంతో రహదారులు అపరిశుభ్రంగా దర్శనమిస్తుంటాయి.

ఇలా అనే సమస్యలు పేరుకుపోయిన వాటిని తీర్చేందుకు ప్రభుత్వం ఐదో విడత జన్మభూమి-మా ఊరు కార్యక్రమాని ప్రారంభించింది. ఈ విడతలోనైనా తమ సమస్యలకు పరిష్కారం లభిస్తాయేమోనని ప్రజలు ఆశా భావం వ్యక్తం చేస్తున్నారు.

### అద్దె ఇంట్లో ఉంటున్నాం - రవికుమార్



పాతపేటలో నాలుగేళ్ల నుంచి అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నాం. మాకు స్థలం లేదు. కార్పెంటర్ పని చేస్తూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నా. ఇలాంటి పరిస్థితిలో స్థలం కొనలేని దుస్థితి మాది. తమకు ఈ జన్మభూమిలోనైనా అధికారులు స్పందించి స్థలంతో పాటు పక్కా గృహం మంజూరు చేయాలని.

### కాల్వలు శుభ్రం చేయాలి - అంజాద్ ఖాన్



పట్టణంలోని రహదారులు, మురుగు కాల్వలు అధ్వానంగా ఉన్నాయి. రహదారుల పక్కనే మట్టి దిబ్బలు, కుండీల దగ్గర చెత్తా చెదారం అధికంగా ఉండటంతో దుర్వాసన వస్తోంది. కాల్వల్లో చెత్తంతా పేరుకుపోయి నీరు సరిగా ప్రవహించక నిల్వ ఉంది. ఫలితంగా దోమలు వృద్ధి చెందుతున్నాయి. ఇప్పటి నుంచి అధికారులు స్పందించి శుభ్రతవైపు అడుగులేయాలి.

### పింఛన్ రావడం లేదు - యాగంటయ్య



పింఛన్ కోసం పలుమార్లు జన్మభూమి కార్యక్రంల్లో దరఖాస్తు చేసుకున్నా. అర్జీ తీసుకుంటున్నారే తప్ప పింఛన్ మంజూరు చేయడం లేదు. 68 ఏళ్లు ఉండి పింఛన్‌కు అర్హత కలిగి ఉన్నా ఇవ్వడం లేదు. ఈసారి జన్మభూమిలో అయినా అధికారులు స్పందించి పింఛన్ మంజూరు చేసి సమస్య తీర్చాలి.

### అర్హులందరికీ న్యాయం చేస్తాం

**- కోట్రికె గాయత్రీదేవి, పురపాలక అధ్యక్షురాలు**



పురపాలక సంఘం పరిధిలోని వార్డుల్లో అభివృద్ధి చేస్తూ సమస్యలు లేకుండా కృషి చేస్తున్నాం. పట్టణంలోని 4వ వార్డులో 33.80 లక్షలు, 5వ వార్డులో రూ.32.13 లక్షలతో సీసీ రహదారులు, మురుగు కాల్వలు, నీటి గొట్టాలు, కల్వర్టులు వంటి అభివృద్ధి పనులు చేపట్టాం. పట్టణంలో స్థలాలు, పక్కా గృహాలు లేని వారికి సంబంధించి 4 వేల దరఖాస్తులు వచ్చాయి. ఇప్పటి వరకు అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నాం.

## ఎస్సీ వర్గీకరణ సాధనే లక్ష్యం

**బేతంచెర్ల, న్యూస్‌టుడే:** రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఎస్సీ వర్గీకరణను కేంద్రం దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించే వరకు ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఉద్యమాలను చేపడుతామని జిల్లా కార్యదర్శి శ్రీనువాసులు పేర్కొన్నారు. బుధవారం స్థానిక కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ నాయకత్వంలో ఐదురోజుల ఉపవాస దీక్షకు అనుమతి ఇవ్వాలని కేసీఆర్ ప్రభుత్వాన్ని కోరగా అనుమతి ఇవ్వకుండా అరెస్టు చేయడం దారుణమన్నారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు గిడ్డయ్య, పట్టణ అధ్యక్షుడు సుందర్ రాజు, నారాయణ, శ్రీనివాసులు, శివ, మద్దయ్య, రాజశేఖర్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.




కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

**ప్యాపిలి, న్యూస్‌టుడే**: ఎస్సీ వర్గీకరణ కోసం రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులు పట్టించుకోవడం లేదని ఎమ్మార్పీఎస్ నాయకులు బుధవారం ఆందోళన కార్యక్రమం చేపట్టారు. ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు సుందరం ఆధ్వర్యంలో జాతీయ రహదారిపై రాస్తారోకో చేశారు. ఎస్సీ వర్గీకరణ చేసేంత వరకు ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తూనే ఉంటామన్నారు. కార్యక్రమంలో డోన్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి నాగరాజు, ఎంఈఎఫ్ నాయకులు మేకల డేవిడ్, లక్ష్మయ్య, జానకి రాముడు, శ్రీరాములు, శీను, నాగపుల్లయ్య, మహానంది, మిద్దె అంజనయ్య, మధు, రఘురాముడు, బాలరంగన్న కిరణ్ పాల్గొన్నారు.

## గ్యాస్ సమాచారం

**డోన్:** పట్టణంలో గ్యాస్ సిలిండర్ల కోసం ఈ నెల 3వ తేదీ వరకు పేర్లు నమోదు చేసుకున్న వినియోగదారులకు సిలిండర్లు గురువారం పంపిణీ చేస్తున్నట్లు భారత్‌గ్యాస్ పంపిణీదారుడు రాజా విజయ్‌కుమార్ తెలిపారు. * హెచ్‌పీ గ్యాస్ సిలిండర్ల కోసం ఈ నెల 3వ తేదీ వరకు పేర్లు నమోదు చేసుకున్న వినియోగదారులకు సిలిండర్లు గురువారం పంపిణీ చేస్తున్నట్లు పంపిణీదారుడు విశ్వమోహన్‌రెడ్డి తెలిపారు.

## అయ్యప్పస్వామి అన్నదానానికి రూ.లక్ష విరాళం

**డోన్, న్యూస్‌టుడే:** అయ్యప్పస్వామి ఆలయంలో అన్నదానానికి పట్టణానికి చెందిన పారిశ్రామిక వేత్త ఎన్.ఎల్. మధుసూదన్‌గుప్తా రూ.లక్ష విరాళాన్ని అందజేశారు. బుధవారం ఆలయంలో మణికంఠ భక్తబృందం సభ్యులకు ఇచ్చారు. విరాళం అందించడంతో దాత కుటుంబ సభ్యులను అయ్యప్ప స్వామి భక్తులు సన్మానించారు. డోన్‌లో అయ్యప్ప మాల ధరించిన భక్తులకు పలువురు దాతల సహకారంతో ప్రతిఏటా 53 రోజుల పాటు అన్నదానం నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో దాత సతీమణి భారతితోపాటు కుటుంబ సభ్యులు, మణికంఠ భక్త బృందం సభ్యులు, అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు. పట్టణంలోని దాదాపు 2 వేల మంది అయ్యప్ప స్వామి భక్తులకు అన్నదానం చేశారు.



విరాళం అందిస్తున్న పారిశ్రామిక వేత్త మధుసూదన్‌గుప్తా

## తాత్కాలిక ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి

**డోన్, న్యూస్‌టుడే:** విద్యుత్తు శాఖలో ఒప్పంద విధానాన్ని రద్దు చేసి ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని విద్యుత్తు ఒప్పంద కార్మికుల ఐక్యవేదిక నాయకులు పేర్కొన్నారు. బుధవారం విద్యుత్తు డీఈ కార్యాలయం ఎదుట నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యుత్తు కార్మికులు దీర్ఘకాలిక సమస్యలతో సతమతం అవుతున్నారన్నారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని డీఈకి అందజేశారు. ఈ కార్యక్రమంలో తాత్కాలిక ఉద్యోగ సంఘం ఐక్యవేదిక నాయకులు వలి, రామరాజేష్, జాన్ ప్రభాకర్, అమృతరాజ్, శీను, రాజారం, నాయక్, బాషా తదితరులు పాల్గొన్నారు.




నిరసన వ్యక్తం చేస్తున్న ఒప్పంద కార్మికులు

## కురవలకు ఎస్సీ ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలి

**పీఆర్‌పల్లె (ప్యాపిలి), న్యూస్‌టుడే:** గతంలో ఎస్సీ జాబితాలోని 31వ నంబరులో ఉన్న మాదాసి కురవ, మాదాసి కురవలకు ఎస్సీ ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలని సంఘం డోన్ నియోజకవర్గ అధ్యక్షుడు వెంకటప్ప ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం మండలంలోని పీఆర్ పల్లె గ్రామంలో సంఘం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సంరద్భంగా మాట్లాడుతూ ఎస్సీ జాబితాలో ఉన్న మాదాసి కురవలను తొలగించడం అన్యాయమన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షుడు బి.మల్లికార్జున, పరమేష్, అలేబాదు సర్పంచి హరికుమార్, బి.అర్జున్, ప్రసాద్, పీఆర్‌పల్లె నాయకులు కంబయ్య, శ్రీరాములు, బీరప్ప, రాజు, జనార్దన్, చిన్నమద్దిలేటి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాదాసి కురవ సంఘం నాయకుడు

# డోన్

## నేటి తాగునీటి సరఫరా ప్రాంతాలు

**డోన్, న్యూస్‌టుడే:** డోన్ పట్టణ పరిధిలో గురువారం పాతపేట, కొండపేట, కొత్తపేట, చిగురుమాన్‌పేట, శ్రీనివాసనగర్, సుందర్‌సింగ్ కాలనీలో కొన్ని ప్రాంతాల్లో తాగునీటి సరఫరా చేయనున్నారు. తారకరామనగర్‌లోని 18వ వార్డు ప్రాంతాల్లో, గాంధీనగర్, కేవీఎస్ కాలనీల్లో నీటి సరఫరా చేయనున్నట్లు మున్సిపల్ అధికారులు తెలిపారు.

24 గంటల అత్యవసర వైద్య సేవలకు 108కు ఫోన్ చేయండి



# ఘనంగా సావిత్రీ బాయి పూలె జయంతి

**డోన్ పట్టణం, న్యూస్‌టుడే:** మహిళా లోకానికే మణిపూసలాంటి వారు సావిత్రీ బాయి పూలె ఒకరని యూటీఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఎన్.నరసింహుడు పేర్కొన్నారు. సావిత్రీబాయి జయంతిని పురస్కరించుకొని యూటీఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక బాలికల జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో అధ్యక్షుడు కె.లక్ష్మయ్య అధ్యక్షతన నిర్వహించారు.


✦ బాలికల ఉన్నత పాఠశాల, యు.కొత్తపల్లి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయినీలు కె.కళావతి, వరలక్ష్మి, ఉపాధ్యాయిని గ్రేసమ్మను యూటీఎఫ్ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ కార్యదర్శి ఎన్ఎస్ బాబు, జిల్లా కార్యదర్శి సుబ్బారెడ్డి, నాయకులు లక్ష్మీకాంతరెడ్డి, ప్రసాదరెడ్డి, రమేష్, పాఠశాల ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.

✦ స్థానిక పాతపేటలోని జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు జె.రామచంద్రుడు అధ్యక్షతన సావిత్రీ బాయి పూలె జయంతిని నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయినులు నూర్జహాన్, శ్రీకళ, అనురాధ, వెంకటలక్ష్మి, ఉపాధ్యాయులు శివప్రసాద్, లక్ష్మయ్య, సుబ్బారెడ్డి, సుబ్రమణ్యం, వెంకటేశ్వరగౌడ్, లక్ష్మీకాంతరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

✦ శ్రీఅక్షర ఆంగ్ల మాధ్యమం పాఠశాలలో మహిళా ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా కరస్పాండెంట్ రామకృష్ణ అధ్యక్షతన బుధవారం సావిత్రీ బాయి పూలె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సమన్వయకర్త కిరణ్మయ్, ఉపాధ్యాయినులు రాణి, శిరీష, రజనీ, పద్మ, విజయ, జయలక్ష్మి, పార్వతి, సుధ, సుహాసిని, మాధవి, పద్మావతి, రిజ్వానా, గౌరీ, విద్యార్థులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయినీలను సన్మానిస్తున్న ఎస్టీయూ నాయకులు



ప్యాపిలి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో..

✦ విజ్ఞాన్ పాఠశాలలో కరస్పాండెంట్ అక్బర్‌పాషా అధ్యక్షతన సావిత్రీబాయి పూలె జయంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మునిస్వామి, మంజుల, రేవతి, సుధామణి తదితరులు పాల్గొన్నారు.

### ఎస్టీయూ ఆధ్వర్యంలో

**డోన్ గ్రామీణ:** స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయినీలకు ఎస్టీయూ ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమం రాష్ట్ర కౌన్సిలర్ బీవీ రమణ ఆధ్వర్యంలో జరిగింది. కార్యక్రమంలో ఎస్టీయూ మండల అధ్యక్షుడు జానకీరాముడు, ఎస్టీయూ నాయకులు సుధాకర్‌గౌడ్, మౌలాలి, మద్దిలేటి, శారద దేవి, వేదవతి, ఇక్బాల్ బాషా, శివప్రసాద్, దేవేంద్రప్ప తదితరులు పాల్గొన్నారు.

**ప్యాపిలి, న్యూస్‌టుడే:** ప్యాపిలి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ రవీంద్రనాథ్ ఆధ్వర్యంలో సావిత్రీ బాయి పూలె జయంతిని ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆమె చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కార్యక్రమం అధికారి నవీనపాటి, అధ్యాపకులు ఓబులరావు, శంకరయ్య, శీను, ఓబులేసు, నారాయణస్వామి, ముస్తాక్, రమణ, అంజి, వెంకటేశ్వర్లు విద్యార్థులు పాల్గొన్నారు.

✦ ప్రాథమిక పాఠశాల (మెయిన్)లో ఎస్టీయూ ఆధ్వర్యలో మహిళా ఉపాధ్యాయ దినోత్సవనాన్ని నిర్వహించారు.

✦ మండలంలోని బూరుగుల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు చిరంజీవిరెడ్డి ఆధ్వర్యలో జరిగింది.

✦ స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలో యూటీఎఫ్ ఆధ్వర్యలో సావిత్రీ బాయి పూలె జయంతి వేడుకలను నిర్వహించారు.

✦ స్థానిక ప్రియదర్శిని పాఠశాలలో ప్రధానోపాధాయుడు పార్థసారథి ఆధ్వర్యలో ఉపాధ్యాయులను సత్కరించారు.

**డోన్, న్యూస్‌టుడే:** మహిళల అభ్యున్నతికి, రక్షణకు పాటుపడిన ఘనత సావిత్ర బాయి పూలెకు దక్కుతుందని సమగ్ర వినియోగదారుల సంక్షేమ సంస్థ అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి అన్నారు. స్థానిక జ్యోతి స్టూడియో ఆవరణలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు, ఏఈ నాగరాజు, మహమ్మద్‌రఫీ, భాస్కర్, హరీష్, శీను తదితరులు పాల్గొన్నారు.



వినియోగదారుల సంక్షేమ సంస్థ ఆధ్వర్యంలో..

## వ్యక్తిపై దాడి

**బేతంచెర్ల, న్యూస్‌టుడే:** సంజీవనగర్ కాలనీకి చెందిన సుంకన్న అనే వ్యక్తిపై అదే కాలనీకి చెందిన నలుగురు వ్యక్తులు దాడి చేసి గాయపరిచినట్లు హెడ్‌కానిస్టేబుల్ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. కాలనీకి చెందిన సుంకన్న అనే వ్యక్తి అదే కాలనీకి చెందిన రవి, మహాలక్ష్మి, హసీనా ఆమె తల్లి నలుగురు కలిసి పాత విషయాలను దృష్టిలో పెట్టుకొని దాడులు దాడికి పాల్పడినట్లు చెప్పారు. గాయపడిన సుంకన్నను ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స అందించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు వివరించారు.

## డబ్బు విషయంలో గొడవ

**కొత్తబురుజు (డోన్), న్యూస్‌టుడే:** డబ్బు విషయంలో సువర్ణ అనే మహిళపై దాడి చేసిన ఘటన బుధవారం కొత్తబురుజు గ్రామంలో జరిగింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు సులోచన, రాజు, సరస్వతి అనే వారిపై కేసు నమోదు చేసినట్లు గ్రామీణ ఎస్సై రామసుబ్బయ్య తెలిపారు.

## తాడూరులో రైతు ఆత్మహత్య

**డోన్, న్యూస్‌టుడే:** మండలంలోని తాడూరు గ్రామంలో బత్తిన నారాయణ (60) అనే రైతు మనస్థాపంతో బుధవారం వేకువజామున చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నారు. రెండెకరాల పొలంలో సక్రమంగా పంట రాకపోవడంతో, అప్పులపాలైనట్లు బంధువులు తెలిపారు. కొంతకాలం అనారోగ్యానికి గురికావడంతో వైద్యం కోసం అప్పులు చేశారు. రూ.5 లక్షల వరకు అప్పులు చేసినట్లు బంధువులు వివరించారు. మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం డోన్ ఆసుపత్రికి తరలించారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు గ్రామీణ ఎస్సై రామసుబ్బయ్య తెలిపారు.

## రుణమాఫీ మంజూరు చేయాలి

**డోన్, న్యూస్‌టుడే:** మూడో విడత రైతు రుణమాఫీకి సంబంధించిన సొమ్మును సంబంధిత రైతుల ఖాతాలలో రెండు రోజులలో జమచేయాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి రంగనాయుడు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రైతులపై బ్యాంకు అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు సుంకయ్య, వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘం జిల్లా నాయకులు రాధాకృష్ణ, నారాయణ పాల్గొన్నారు.

మండలంలోని ఓబులాపురం గ్రామంలో సీపీఐ సీనియర్ కార్యకర్త రాంపురం అనంతమ్మ మృతి చెందడంతో బుధవారం సీపీఐ నాయకులు ఆమె మృతదేహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. సీపీఐ నాయకులు రంగనాయుడు, సుంకయ్య, రాధాకృష్ణ, ఆనంద్, రంగస్వామి, నారాయణ, ఓబులేసు సంతాపం తెలిపారు.

## రెండు వార్డుల్లో 31 దరఖాస్తులు

**డోన్ పట్టణం, న్యూస్‌టుడే:** పట్టణంలో జరుగుతున్న ఐదో విడత జన్మభూమిలో బుధవారం 2, 3 వార్డుల్లో ప్రజల నుంచి 31 దరఖాస్తులు వచ్చినట్లు పురపాలక అధ్యక్షురాలు కోట్రికె గాయత్రీదేవి తెలిపారు. పింఛన్లకు 7, రేషన్‌కార్డులకు 10, ఇళ్ల స్థలాల కోసం 7, పక్కా గృహాలకు 7 చొప్పున అర్జీలు వచ్చినట్లు చెప్పారు.

## కూరగాయల ధరలు నిన్నటివి (కిలో.రూ)

**డోన్:** టమోటా: 10, మిర్చి: 30, ఉల్లి: 40-50, కాకర: 40, బెండ: 30, క్యాబేజి: 20, చిక్కుడు: 30, బీన్స్: 40, క్యారెట్: 40, వంకాయ: 20, దొండ: 40, చౌళెకాయ: 30, కాలీఫ్లవర్: 20-30, బంగాళదుంప: 20, ఆకుకూరల కట్ట: 3.

**తెరపై ఈనాడు:** డోన్ రాజా: ఎంసీఏ (మిడిల్ క్లాస్ అబ్బాయి), శ్రీరామా: ఒక్క క్షణం, రాఘవేంద్ర: హలో, శ్రీనివాస: 2 కంట్రీస్.

# సమస్యల పరిష్కారానికే.. జన్మభూమి-మా ఊరు

**డోన్ పట్టణం, న్యూస్‌టుడే:** పేదల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి కృషి చేస్తున్నారని అనంతపురం ఎమ్మెల్సీ శమంతకమణి తెలిపారు. డోన్‌లో జరిగే ఐదో విడత జన్మభూమి-మా ఊరు కార్యక్రమానికి ఇన్‌ఛార్జిగా ప్రభుత్వం నియమించింది. పట్టణంలోని 2, 3 వార్డులకు సంబంధించిన కొత్తపేటలోని అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమం పురపాలక అధ్యక్షురాలు కోట్రికె గాయత్రీదేవి ఆధ్వర్యంలో జరిగింది. అనంతరం రెండు వార్డుల్లో కొత్తగా మంజూరైన రేషన్ కార్డులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. పొదుపు మహిళలు వేసిన రంగవల్లులను పరిశీలించి ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పురపాలక కమిషనర్ రమేష్ బాబు, కౌన్సిలర్లు కె.వి.ఫణిరాజ్, వెంకటేశ్వరమ్మ, శోభారాణి, కోఆప్షన్ సభ్యుడు జాకీర్ ఉసేన్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

**రంగాపురం (ప్యాపిలి), న్యూస్‌టుడే:** ప్రభుత్వం ప్రవేశపెట్టిన జన్మభూమి-మా ఊరు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కర్నూలు ఆర్డీవో హుసేన్ సాహెబ్ పేర్కొన్నారు. బుధవారం ఎన్.రంగాపురం గ్రామంలో నిర్వహించిన జన్మభూమి కార్యక్రమం నిర్వహించారు. జిల్లా గొర్రెల పెంపకందార్ల సంఘం అధ్యక్షుడు వై.నాగేశ్వరరావు యాదవ్, ఎంపీపీ టి.సరస్వతి మాట్లాడారు. అంతకుముందు మండలంలోని మెట్టుపల్లె, ఏనుగుమర్రి గ్రామాల్లో జన్మభూమి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఏనుగుమర్రి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ టి.శ్రీనివాసులు, సాగునీటి సంఘం అధ్యక్షుడు రామకృష్ణ, సర్పంచులు వీరంజనేయులు, నాగరాజు, ఎం.రాము, సుదర్శన్, మండల ప్రత్యేక అధికారి ఉమామహేశ్వరమ్మ, ఎంపీడీవో అమృతరాజ్, తహసీల్దార్ గోవింద్‌సింగ్, వ్యవసాయాధికారి అల్లీపీర, ఈవోఆర్డీ ఐజయ్య, ఇంజినీర్లు గణేష్, లక్ష్మి, వేణుగోపాల్ వెలుగు ఏపీఎం లక్ష్మమ్మ, ఏపీవో షకూర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ శమంతకమణి


**డోన్ గ్రామీణ:** ప్రజలకు లబ్ధిచేకూర్చేందుకే జన్మభూమి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ లక్ష్మీదేవి, ప్రత్యేకాధికారి రాఘవరెడ్డి అన్నారు. మండలంలోని ధర్మవరం, కన్నపుకుంట గ్రామాల్లో బుధవారం జన్మభూమి-మా ఊరు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో క్యాథరిన్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

**గూటుపల్లె (బేతంచెర్ల), న్యూస్‌టుడే:** అంగన్‌వాడీ కేంద్రాల్లో అందే సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నోడల్ అధికారి వెంకటరమణ, జడ్పీటీసీ సభ్యురాలు పద్మావతి పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని గూటుపల్లె గ్రామంలో ఎంపీడీవో మోహన్ కుమార్ అధ్యక్షతన ఐదో విడత జన్మభూమి-మా ఊరు కార్యక్రమం నిర్వహించారు. అనంతరం రేషన్ కార్డులకు 25, పింఛన్లకు 20, ఇంటి స్థలాల కోసం 5 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో సోమశేఖర్, ఏఈ మహేష్, తెదేపా మండల కన్వీనర్ అశోక్ కుమార్, మండల ఉపాధ్యక్షుడు మునీశ్వరరెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు బాలుడు, సర్పంచి లక్ష్మీదేవి, ఐసీడీఎస్ పర్యవేక్షకురాలు కామేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

### నేడు 4, 5 వార్డుల్లో..

**డోన్ పట్టణం, న్యూస్‌టుడే:** పట్టణంలోని పాతపేట రాములవారి దేవాలయం ప్రాంగణంలో గురువారం 4, 5 వార్డుల్లో జన్మభూమి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు పురపాలక కమిషనర్ ఏవీ రమేష్‌బాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 4వ వార్డులో ఉదయం 10 నుంచి 12.30 వరకుకు, 5వ వార్డులో మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కార్యక్రమం ఉంటుందన్నారు.

**డోన్ పట్టణం, న్యూస్‌టుడే:** పట్టణంలోని 2 వార్డులో బుధవారం జరిగిన జన్మభూమి కార్యక్రమంల్లో గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. పురపాలక అధ్యక్షురాలు కోట్రికె గాయత్రీదేవి ఆధ్వర్యంలో జరిగాయి. 3వ వార్డులో చిన్నారులకు అన్నప్రాసన చేశారు. ఈ కార్యక్రమంలో 3, 13 వార్డుల కౌన్సిలర్లు వెంకటేశ్వరమ్మ, శోభారాణి, ఐసీడీఎస్ పర్యవేక్షకురాలు మహబూబ్‌బీ, అంగన్‌వాడీ కార్యకర్తలు సుగుణమ్మ, సులోచన, మనోహరి, మల్లిక, సువర్ణ, తదితరులు పాల్గొన్నారు.



గర్భిణులకు సీమంతం

# ఎమ్మిగనూరు

## చికిత్స పొందుతూ మరొకరు మృతి

**కోటేకల్లు(ఎమ్మిగనూరు గ్రామీణ), న్యూస్‌టుడే:** మండల పరిధిలోని కోటేకల్లు గ్రామ సమీపంలో కొండ వద్ద జరిగిన ప్రమాదంలో గాయపడిన ఈరన్న(45) బుధవారం మృతిచెందారు. మంగళవారం నాటి ప్రమాదంలో గాయపడిన ఈరన్నను కర్నూలు తీసుకెళ్లగా... పరిస్థితి విషమంగా ఉండని హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్సపొందుతూ ఉదయం మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

## బడుగులను ఆదుకోవడంలో విఫలం

**గోనెగండ్ల, న్యూస్‌టుడే:** బడుగు, బలహీన వర్గాలను ఆదుకోవడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని సీపీఐ జిల్లా కార్యదర్శి రామాంజనేయులు విమర్శించారు. బుధవారం గోనెగండ్లలో సీపీఐ మహాసభలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలో భాజపా ప్రభుత్వం మతతత్వాన్ని పెంచిపోషించడం సరికాదన్నారు.

## ప్రతి పేదవాడి అభివృద్ధికి కృషి

**-ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి**

**నందవరం, న్యూస్‌టుడే:** పేద, బలహీన వర్గాలకు చెందిన ప్రతి ఒక్కరికి అభివృద్ధి ఫలాలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి అన్నారు. మండల పరిధిలోని మిట్టసోమాపురం, కనకవీడు గ్రామంలో బుధవారం జన్మభూమి-మాఊరు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు ఇతర రాష్ట్రాలు రైడాఆదర్శంగా తీసుకుంటున్నా యని అన్నారు. తెదేపా ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికి చేరే విధంగా తెదేపా కార్యకర్తలు కృషి చేయాలన్నారు. అధికారులు కూడా పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందేలా చూడాలని.. కార్యక్రమంలో వచ్చిన అర్జీలను తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. అయితే గ్రామంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను కార్యక్రమంలో ఎంపీపీ నరసింహారెడ్డి, వైస్ ఎంపీపీ రఘుమూర్తి, పార్టీ నాయకులు మాధవరావ్ దేశాయ్, నారాయణరెడ్డి, చిన్నరాముడు, ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



గర్భిణులకు సీమంతం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే, తదితరులు

# రథోత్సవానికి భారీ ఏర్పాట్లు

- చేనేతపురిలో విద్యుదీపాల తోరణాలు
- వీధుల్లో జన సందోహం
- పోలీసు బందోబస్తు



రథం కార్యక్రమంపై ఏర్పాట్లు పరిశీలిస్తున్న సీఐ ప్రసాద్, పోలీసు సిబ్బంది



శ్రీనీలకంఠేశ్వరస్వామి మూలవిరాట్

**ఎమ్మిగనూరు, ఎమ్మిగనూరు వ్యవసాయం, న్యూస్‌టుడే:** చేనేతపురిలో నీలకంఠేశ్వరుడి రథోత్సవానికి అధికారులు భారీ ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు. నెల రోజులకుపైగా జరిగే జాతర తెలుగు రాష్ట్రాల్లో ఎంతో ప్రసిద్ధి. ఎమ్మిగనూరు పట్టణంలో వెలసిన స్వామి అమ్మవార్ల బ్రహ్మోత్సవాల్లో భాగంగా వీధులన్నీ విద్యుత్తు దీపాల కాంతులతో అలంకరణ చేశారు. పెద్దసంఖ్యలో వచ్చిన భక్తులతో బుధవారం పట్టణంలో జాతర సందడి నెలకొంది. గురువారం ఉదయం ఆదిదంపతులకు ఆకుపూజ, అభిషేకం, బిల్వార్చన, రుద్రాభిషేకం నిర్వహిస్తారు. ప్రధాన గుడిలో స్వామికి మొక్కులను తీర్చుకునేందుకు లక్షల మంది భక్తులు వస్తారు. వీరి కోసం దేవాదాయ, పురపాలక సంఘం, పోలీసు భద్రత, ఇతర శాఖల పరిధిలో ఏర్పాట్లు చేపట్టారు. సుమారు మూడు లక్షలకు పైగానే భక్తులు వస్తారని ఆలయకమిటీ సభ్యులు అంచనా వేస్తున్నారు. అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేయడంలో నిమగ్నమయ్యారు. దేవాలయం వద్ద బారికేడ్లు ఏర్పాటు చేశారు.

### వసతుల కల్పన

వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల కోసం పురపాలక అధికారులు ఏర్పాట్లు చేశారు. తాగునీటి వసతి కోసం మూడు మున్సిపాలిటీ ట్యాంకర్లతోపాటు ప్రైవేటు ట్యాంకర్లు సోమప్ప కూడలి, తేరుబజార్ ప్రాంతంలో ఏర్పాటు చేశారు. రద్దీ ప్రాంతాల్లో తాత్కాలిక మరుగుదొడ్లను ఏర్పాటు చేశారు. చెత్తను ఎటికప్పుడు శుభ్రం చేసేందుకు 24 గంటలు పారిశుద్ధ్య పనులు చేపట్టనున్నారు.

### తేరుబజార్ మైదానం చదును

తేరుబజార్‌లోని రథం లాగే మైదానంలో రహదారిపై ఉన్న ఎర్రమట్టిని ట్రాక్టర్లు, ప్రొక్లెయిన్‌తో దున్నేశారు. వేలాది మంది భక్తుల మధ్య రథం నెమ్మదిగా వెళ్లే విధంగా దారిని ఇలా దన్నించారు. ఇలా ఉంటే ఎలాంటి ప్రమాదాలు జరగవని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఇప్పటికే అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ రథోత్సవానికి వివిధ రాజకీయ పార్టీల నేతలు, ప్రజాప్రతినిధులు హాజరు కానున్నట్లు తెలిపారు.

**భారీ బందోబస్తు**

**-ప్రసాద్, సీఐ, ఎమ్మిగనూరు సర్కిల్**

మహారథోత్సవం సందర్భంగా ఆదోని డీఎస్పీ ప్రసాద్ ఆధ్వర్యంలో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశాం. బందోబస్తులో 16 మంది సీఐలు, 42 మంది ఎస్సైలు, 58 మంది ఏఎస్ఐ, 391 మంది పోలీసులు, 26మంది మహిళా పోలీసులు, మూడు ప్రత్యేక పోలీసు బలగాలు, రెండు డ్రోన్ కెమెరాలతో పర్యవేక్షిస్తాం. తేరు పక్కన వీవీఐపీలకు ప్రత్యేకంగా సీట్లు కేటాయించాం. భక్తులు, ప్రజలు సహకరించాలి.



సిద్ధం చేస్తున్న రథం



ఓటర్ల జాబితాను సిద్ధం చేసిన సిబ్బంది

## టౌన్‌బ్యాంకు ఎన్నికల ప్రకటన జారీ

- 11న తేదీన నామినేషన్ల స్వీకారణ
- ఈనెల 20న ఓటింగ్, ఫలితాలు

**ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే:** పట్టణంలోని టౌన్‌బ్యాంకు ఎన్నికలు ఈనెల 20వ తేదీన నిర్వహిస్తున్నట్లు ఎన్నికల అధికారి నాగరాజు తెలిపారు. బుధవారం బ్యాంకు ఎన్నికల విధానంపై విలేకర్ల సమావేశంలో ఆయన వెల్లడించారు. తొమ్మిది మంది డైరెక్టర్లు ఉంటారని, ఈ స్థానాలకు ఎన్నికలు జరుగుతాయన్నారు. ఈనెల 11న నామినేషన్ల స్వీకరణ ఉదయం 10 గంటల నుంచి 3 గంటల వరకు ఉంటుందన్నారు. 12న ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు నామినేషన్ల పరిశీలన. 13వ తేదీన నామినేషన్ల ఉపసంహరణ ఉదయం 10 నుంచి ఐదు గంటల వరకు ఉంటుందన్నారు. ఈ నెల20వ తేదీన ఎన్నికలు ఉంటాయి. ఓటింగ్ మాచాని సోమప్ప బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. అదే రోజు సాయంత్రం ఫలితాలు వెల్లడిస్తామన్నారు. ఓటరు జాబితా సిద్ధమైందని... 6060 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నట్లు వివరించారు. సమావేశంలో అధికారులు రమేష్, అశోక్, వాసుదేవ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సావిత్రి బాయి జయంతి




ఎమ్మిగనూరు పట్టణంలో ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో సావిత్రి బాయి పూలే జయంతి వేడుకలు

**ఎమ్మిగనూరు బృందం, న్యూస్‌టుడే:** భారతదేశంలో మొదట మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే జయంతి బుధవారం ఘనంగా నిర్వహించారు. పురపాలక సంఘం, ఎమ్మిగనూరు, గోనెగండ్ల, నందవరం మండలాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలు, వివిధ సంఘాలు, పార్టీల కార్యాలయాల్లో పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం ఆమెను బాలికల విద్య, మహిళల హక్కుల కోసం ఆమె చేసిన కృషి కొనియాడుతూ... ప్రతి ఒక్కరు ఆమెను ఆదర్శంగా తీసుకోవాలని వక్తలు అన్నారు.




భాజపా అధ్వర్యంలో సావిత్రిబాయిపూలే చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులు అర్పిస్తూ



నాగలదిన్నెలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పూలే జయంతి వేడుకలు

## సాజిదాబేగంకు సావిత్రిబాయి పురస్కారం

**బనవాసిఫారం(ఎమ్మిగనూరు గ్రామీణ), న్యూస్‌టుడే:** బనవాసిఫారం ఆంధ్రప్రదేశ్ బాలికల గురుకుల పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సాజిదాబేగంకు సావిత్రిబాయి పూలే పురస్కారానికి ఎంపిక య్యారు. బుధవారం విజయవాడలో మానవ వనరుల శాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు చేతులమీదుగా ఆమె పురస్కారం అందుకున్నారు. ఈ సందర్భంగా ఆమె న్యూస్‌టుడేతో మాట్లాడుతూ అవార్డు రావడం సంతోషంగా ఉందన్నారు.



మానవ వనరుల అభివృద్ధిశాఖ మంత్రి గంటా శ్రీనివాసరావుచేత ప్రశంసా పత్రం అందుకుంటున్న సాజిదాబేగం

# ఎమ్మిగనూరు

## తెరపై ఈనాడు

**ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే:** మినీశివ: ఎంసీఏ, శివప్రియ: ఒక క్షణం, రాఘవేంద్ర: 2 కంట్రీస్, అబ్బాస్: టెన్, లక్ష్మణ్ : రాజాదిగ్రేట్, శివ: ప్రాజెక్టు జెడ్(తెలుగు) మినీశ్రీనివాస : హలో.., శ్రీనివాస: జవాన్..

## మాంసం ధరలు (కిలో రూ.ల్లో)

కోడి మాంసం (వెంకాబ్): 150 మాంసం : 480, డజన్ గుడ్లు: 56

## ప్రమాద స్థలాన్ని పరిశీలించిన ఎస్పీ

**కోటేకల్లు(ఎమ్మిగనూరు గ్రామీణ), న్యూస్‌టుడే:** మండల పరిధిలోని కోటేకల్లు సమీపంలో రోడ్డు ప్రమాదం జరిగిన స్థలాన్ని ఎస్పీ గోపినాథ్ జట్టి పరిశీలించారు. బుధవారం సంఘటనాస్థలానికి చేరుకొని ప్రమాదం జరిగిన తీరును డీఎస్పీ అంకినీడు ప్రసాద్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మృతుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంటనే సీఐ ప్రసాద్, ఎస్సైలు వేణుగోపాల్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# వైభవంగా ప్రభావళి మహోత్సవం



ప్రభోత్సవానికి ఊరేగింపుగా వెళ్తున్న ధర్మకర్త మండలి సభ్యులు



ప్రభావళి ఊరేగింపు



శ్రీకృష్ణ రాయబార అంకం

**ఎమ్మిగనూరు వ్యవసాయం, న్యూస్‌టుడే:** శ్రీనీలకంఠేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు సందర్భంగా బుధవారం రాత్రి 9 గంటల నుంచి 12 గంటల వరకు ప్రభావళి మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఉత్సవమూర్తిని ప్రభపై ఉంచి బసవన్న దేవాలయం వరకు ఊరేగించారు. అక్కడ పూజలు చేసి మంగళహారతి ఇచ్చారు. ప్రభావళి ముందు నందికోల ఆడుతూ ముందుకు సాగారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ ఈవో రామాంజనేయులు, ఆలయ వంశ పారంపర్య ధర్మకర్త మాచాని నీలకంఠప్ప నాగరాజు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

### తొమ్మిది అంకముల ప్రదర్శన

శ్రీనీలకంఠేశ్వరస్వామి జాతర సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమల్లో భాగంగా బుధవారం రాత్రి ఎన్టీఆర్ కళా ప్రాంగణంలో తొమ్మిది అంకాలు ప్రదర్శించారు. తన నటన, పద్యాల ఆలాపనతో కళాకారులు ఆకట్టుకున్నారు.

## పోలీసుల తనిఖీలు.. 60 ఆటోల సీజ్

**ఎమ్మిగనూరు గ్రామీణ, న్యూస్‌టుడే:** వరుస రహదారి ప్రమాదాలతో పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఆటో ప్రమాదాల నేపథ్యంలో ఎస్పీ ఆదేశాలతో బుధవారం ఎమ్మిగనూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ ఆధ్వర్యంలో విస్తృతంగా వాహనాల తనిఖీలు నిర్వహించారు. ట్రాఫిక్, పట్టణం, గ్రామీణ, నందవరం పరిధిలోని 60 ఆటోలపై కేసులు నమోదు చేసి స్టేషన్‌కు తరలించారు. ఆటో చోదకులు నిబంధనలు పాటించకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దాడులలో సీఐ ప్రసాద్, ట్రాఫిక్ ఎస్సై కృష్ణారెడ్డి, టౌన్ ఎస్సై హరిప్రసాద్ పాల్గొన్నారు.



# జన్మభూమితో సమస్యలు పరిష్కారం

**ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే:** జన్మభూమి కార్యక్రమంతో ప్రజల సమస్యల పరిష్కారం సాధ్యమని పురపాలక ఛైర్ పర్సన్ సాయసరస్వతి అన్నారు. బుధవారం పట్టణంలోని 5, 6 వార్డుల్లో జన్మభూమి కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆమె ప్రసంగిస్తూ తెదేపా ప్రభుత్వం అధికారం చేపట్టాక ప్రజల సమస్యలు తీర్చేందుకు ప్రాధాన్యం ఇచ్చిందన్నారు. పేదల సంక్షేమం కోసం చంద్రన్న భీమా, చంద్రన్న సంక్రాంతి కానుక, ఇతర పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. కార్యక్రమంలో పురపాలక సంఘం ఉపాధ్యక్షుడు కొండయ్యచౌదరి, కమిషనర్ రఘునాథ్‌రెడ్డి, ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ బాలయ్య, మేనేజర్ రంగస్వామి, డీఈ వెంకటేశ్వర్లు, కౌన్సిలర్లు రంగస్వామి గౌడు, గురుమూర్తమ్మ, ముల్లాకలీముల్లా తదితరులు పాల్గొన్నారు.

## జన్మభూమిలో అధికారుల నిలదీత

### ☛ కె.తిమ్మాపురంలో ప్రజల ఆగ్రహం

**కె.తిమ్మాపురం(ఎమ్మిగనూరు గ్రామీణ), న్యూస్‌టుడే:** పనులపై కార్యాలయానికి వస్తే పట్టించుకోవడం లేదని జన్మభూమి-మా భూమి కార్యక్రమంలో అధికారులను రైతులు నిలదీశారు. బుధవారం మండల పరిధిలోని కె.తిమ్మాపురం, టీఎస్ కూలూరు గ్రామాల్లో జన్మభూమి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాధికారిణి ఉషారాణిపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం రాయితీ ట్రాక్టర్ కోసం దరఖాస్తు చేసుకుంటే తమను అగౌరపరిచిందన్నారు. అధికారిణిగా పనిచేసేందుకు ఆమెకు అర్హత లేదన్నారు. దీంతో అక్కడ కొద్దిసేపు సమావేశం వాడివేడిగా జరిగింది. అనంతరం అధికారులు ఆయన్ను బుజ్జగించారు. టీఎస్ కూలూరులో తహసీల్దార్ వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన జన్మభూమి కార్యక్రమానికి ఎంపీపీ శంకరయ్య పాల్గొన్నారు.



కె.తిమ్మాపురంలో అధికారులను నిలదీస్తున్న రైతులు

# కోడుమూరు

## ఉచితంగా పాతర గడ్డి పంపిణీ

**పెంచికలపాడు, కె.నాగులాపురం(గూడూరు), న్యూస్‌టుడే:** ఐదో విడత జన్మభూమి సందర్భంగా మండలంలోని కె.నాగులాపురం, పెంచికల పాడు గ్రామాల్లో బుధవారం రైతులకు ఉచితంగా 17 టన్నుల పాతరగడ్డిని పంపిణీ చేశారు. ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించి 71 పశువులకు వైద్య సేవలందించి 37 మేకలు, దూడలకు నట్టల నివారణ మందును తాపారు.



## అంతర్గత శక్తిని మేల్కొలిపితే అంతటా విజయం

- పది విద్యార్థులకు సైకాలజిస్టు జయారెడ్డి సూచనలు
- ఈనాడు-ఈటీవీ ఆధ్వర్యంలో ఉల్చాలలో అవగాహన సదస్సు



విద్యార్థికి హిప్నటైజ్ చేస్తున్న సైకాలజిస్టు శిరిగిరెడ్డి జయారెడ్డి

**ఉల్చాల(కర్నూలు గ్రామీణ), న్యూస్‌టుడే:** ప్రతి మనిషిలో అపరిమిత శక్తి దాగుందని, హిప్నాటిజం మాయాజాలం కాదని ప్రముఖ సైకాలజిస్టు శిరిగిరెడ్డి జయారెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఉల్చాల గ్రామంలో ఈనాడు-ఈటీవీ ఆధ్వర్యంలో నిర్వహించిన 'మనసు ఒక మాయాజాలం' అనే అంశంపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. సైకాలజిస్టు శిరిగిరెడ్డి జయారెడ్డి పాఠశాలలో పలువురు విద్యార్థులకు ఏకాగ్రత కోసం ఎదురుగా ఉన్న లైటును చూడమని కొంతసేపు పలు సూచనలు చేస్తూ, గాలిని దీర్ఘంగా తీసుకోమని సలహాలు ఇచ్చి బాహ్య ప్రపంచం నుంచి సబ్‌కాన్షియస్ మైండ్‌లోకి తీసుకెళ్లారు. అనంతరం ఒక విద్యార్థిని తన మాటలతో లేపి అతని ఎడమ చేతిని స్పర్శ లేకుండా చేసి సూది గుచ్చారు. ఆ విద్యార్థి ముఖంలో ఎలాంటి భావావేశం కనిపించకపోవటం విశేషం. మరో విద్యార్థిని మూడు కుర్చీలపై పడుకోబెట్టి పలు సూచనల అనంతరం రెండు కుర్చీలపై ఉండేలా చేశారు. విద్యార్థి కేవలం తల, కాళ్ల సాయంతో గాలిలో ఉన్న సన్నివేశం అందరినీ ఆశ్చర్యపరిచింది. పలువురు విద్యార్థిని, విద్యార్థులకు నోరు తియ్యగా ఉందని సూచనలు చేసి మిరపకాయను తినమని చెప్పగా వారు తియ్యగా ఉందని చెప్పడం విశేషం. విద్యారంగంలో విద్యార్థులు వారి మనోశక్తిని ఏవిధంగా కావాలన్న అలా మార్చుకోవచ్చని ఈ ప్రయోగాత్మకమైన విన్యాసాలతో చేసి చూపించిన సైకాలజిస్టు శిరిగిరెడ్డి జయారెడ్డి తీరును ప్రధానోపాధ్యాయిని సర్దార్‌జున్నీషా బేగం, ఉపాధ్యాయులు ఆచారి, మహ్మద్ ఇస్మాల్, నాగరాజురావు, దాదాబాషా, నిర్మల, సుజాత, మాధవి ప్రశంసించారు. విద్యార్థుల్లో పరీక్షలపై భయం పోగొట్టి పదిలో అధిక శాతం ఉత్తీర్ణత సాధించాలని ఈనాడు-ఈటీవీ వారు చేస్తోన్న కృషి అభినందనీయమన్నారు. కార్యక్రమ ఆరంభంలో సైకాలజిస్టు శిరిగిరెడ్డి జయారెడ్డిని పాఠశాల ఉపాధ్యాయులు శాలువా కప్పి పుష్పగుచ్ఛం ఇచ్చి సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సల్మా, వెంకటేశ్వరరెడ్డి, రామచంద్రుడు, శ్రీనివాసులు, జెస్సీ సులోచనమ్మ, పద్మావతి, ధనలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థిని హిప్నటైజ్ చేసి కర్రీలా కేవలం తల, కాళ్ల సాయంతో గాల్లో ఉండేలా చేసిన దృశ్యం



విద్యార్థినికి చదువుపై ఏకాగ్రత పెరిగేలా సూచనలు చేస్తూ..

### పరీక్షలంటే భయం పోయింది

**- డి.శివ, పదోతరగతి**



ఈ సదస్సులో పరీక్షలంటే భయం పోయింది. మనలో ఉన్న అంతర్గత శక్తిని పెంచుకునేందుకు ఈ కార్యక్రమం చాలా ఉపయోగకరంగా ఉంది. పదిలో మంచి గ్రేడ్‌తో ఉత్తీర్ణత సాధిస్తాం.

### కొత్తగా అనిపించింది

**- వినోద్, విద్యార్థి**



ఈ కార్యక్రమంలో పాల్గొనడంతో మనసు ప్రశాంతంగా ఉంది. ఏకాగ్రత శక్తి పెంచుకునేందుకు పెద్దలు, ఉపాధ్యాయులు ఇచ్చిన సూచనలు, సలహాలు బాగున్నాయి. వాటిని ఆచరణలో పెడతాం.

### అపోహలు తొలగాయి

**- రఘువరణ్, పదోతరగతి**



హిప్నాటిజం అంటే మాయాజాలం అని అపోహ దూరమైంది. ఈ శాస్త్రం మనలోని అంతర్గత శక్తికి సంబంధించినది అని సైకాలజిస్టు శిరిగిరెడ్డి జయారెడ్డి వివరించిన తీరు అర్థవంతంగా ఉంది.

### విద్యార్థులకు ఉపయోగపడే కొన్ని మెలకువలు సూచించారు

- ★ పరీక్షలకు ముందస్తు ప్రణాళికలతో సన్నద్ధం కావాలి.
- ★ పరీక్షల సమయంలో కావాల్సిన పుస్తకాలను అందుబాటులో ఉంచుకోవాలి.
- ★ గాలి, వెలుతురు బాగా వచ్చే ప్రదేశంలో చదువు సాగించాలి
- ★ సెలవు దినాల్లోనూ సమయం వృథా చేయక ఉపయోగించుకోవాలి
- ★ ఉదయం వేళ సమయాన్ని కష్టమైన పాఠాలను చదివేందుకు సిద్ధపడాలి
- ★ మంచి మిత్రులతో పాఠాలపై చర్చించి అవగాహన పెంచుకోవాలి
- ★ ముఖంపై చిరునవ్వును ఎప్పటికీ చెరగనివ్వకుండా ఉండే అలవాటు చేసుకోవాలి
- ★ నిద్ర సమయంలో వేరే వ్యాపకాలకు లోనుకాకుండా నిద్రపోవాలి
- ★ ఇంట్లో సమస్యలను నెత్తిన వేసుకోకుండా చదువుపై శ్రద్ధ వహించాలి
- ★ మనసును ఎప్పటికప్పుడు ప్రశాంతంగా ఉంచుకోవాలి

### అన్ని విషయాలపై అవగాహన

**- సర్దార్‌జున్నీషా బేగం, ప్రధానోపాధ్యాయురాలు**



విద్యార్థులు అన్ని విషయాలపై అవగాహన పెంచుకోవాలి. హిప్నాటిజాన్ని తన జీవితంగా చేసుకుని 25 సంవత్సరాలుగా ఈ వృత్తిలో ఉంటూ ఎంతో మంది మానసిక రుగ్మతలు తొలగించిన సైకాలజిస్టు శిరిగిరెడ్డి జయారెడ్డి సేవలు హర్షణీయం. మా పాఠశాలలో విద్యార్థులకు ఉచితంగా 'మనసు ఒక మాయాజాలం' అనే అంశాన్ని ఈనాడు-ఈటీవీ వారి సహకారంతో వివరించడం ఆనందంగా ఉంది.

### చేతన, ఉపచేతన స్థితులు ఉంటాయి

**- శిరిగిరెడ్డి జయారెడ్డి, సైకాలజిస్టు**



దినచర్యలో మనం చేస్తోన్న పనులన్నీ చేతన స్థితిలోకి వస్తాయి. నిగూఢంగా మనలో దాగి ఉన్న దాదాపు 80 శాతం శక్తి ఉపచేతన స్థితిలో ఉంటుంది. ఎవరైతే వారి అంతర్గత శక్తిని ఉపయోగించుకోగలరో వారు అద్భుతాలు చేస్తారు. నేటి సమాజంలో యువకులు, ఉద్యోగులు, పారిశ్రామికవేత్తలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు వీటిపై అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉంది.



ఊరేగింపులో కిస్తీ బండ్లు

## ఘనంగా దస్తగిరి స్వామి కిస్తీ ఉత్సవం

**గూడూరు:** పట్టణంలోని పడఖాన వీధిలో బుధవారం దస్తగిరి ఉరుసులో భాగంగా బుధవారం కిస్తీ ఉత్సవాన్ని(జియారత్) భక్తులు ఘనంగా జరుపుకొన్నారు. పట్టణంలో వాయిద్యాలతో కిస్తీ బండ్లను ఊరేగించి దర్గా వద్ద కిస్తీని నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు భక్తులు పాల్గొని ఫాతిహాలు నిర్వహించారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మణిగాంధీ

## విభేదాలు లేకుండా కలిసి ఉంటే అభివృద్ధి

**కె.నాగులాపురం(గూడూరు గ్రామీణ), న్యూస్‌టుడే:** విభేదాలు మాని కలిసి ఉండటం వల్ల అభివృద్ధి జరుగుతుందని, ఐకమత్యంతో మెలగాలని ఎమ్మెల్యే ఎం.మణిగాంధీ పేర్కొన్నారు. మండలంలోని కె.నాగులాపురంలో బుధవారం సర్పంచి శ్రీనివాసులు అధ్యక్షతన జరిగిన ఐదో విడత జన్మభూమి కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ఒక వర్గానికే బియ్యం కార్డులు, పింఛన్లతో పాటు ఇళ్ల మంజూరు వుతున్నాయని, పట్టాలిచ్చి ఇళ్ల స్థలాలు చూపలేదని పలువురు నిలదీయగా ఆయన పైవిధంగా స్పందించారు. 2018 నాటికి అందరికీ ఇళ్లు, అర్హులందరికి పింఛన్లు, బియ్యం కార్డులు వస్తాయని, పక్షపాత ధోరణి లేదు వర్గ విభేదాలతో అభివృద్ధికి దూరం కావద్దని హితవు పలికారు. పట్టాలిచ్చిన వారికి ఇళ్ల స్థలాలు చూపాలని తహసీల్దారు శివశంకర్‌నాయక్‌కు సూచించారు. జాతీయ గ్రామీణాభివృద్ధి పథకం కింద పంట కుంట తవ్వకం పనులు ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో నోడల్ అధికారి కల్యాణం, నియోజకవర్గ స్థాయి అధికారి, ఉప కలెక్టర్, తాత్కాలిక డీఎస్‌వో మల్లికార్జున, ఎమ్పీడీవో నాగరాజునాయుడు, ఐకేపీ ఏపీఎం శ్రీనివాసగౌడు, ఎంఎవో మాధురి ఐసీడీఎస్ పర్యవేక్షణాధికారి కళ్యాణిబాయి, సంబంధిత శాఖ అధికారులు, తెదేపా మాజీ మండల బాధ్యుడు డి.సుందరరాజు, ఎంపీటీసీ బజారి పాల్గొన్నారు.

## మద్యం దుకాణాన్ని మార్చాలని వినతి

**ముడుమాలకొండాపురం(సి.బెళగల్), న్యూస్‌టుడే:** గ్రామంలో ముడుమాల ఉన్నత పాఠశాల, బస్‌స్టాండు సమీపంలో ఉన్న మద్యం దుకాణం పలువురిని ఇబ్బందులకు గురిచేస్తోందని గ్రామస్థులు నోడల్ బృందం అధికారులకు వినతిపత్రం అందజేశారు. గ్రామంలో బుధవారం పంచాయతీ కార్యాలయంలో సర్పంచి మద్దిలేటి అధ్యక్షతన నిర్వహించిన జన్మభూమి మాఊరు గ్రామసభకు విచ్చేసిన నోడల్ బృందానికి ఈమేరకు వినతిపత్రం సమర్పించారు. గ్రామసభలో ఐసీడీఎస్ పర్యవేక్షకురాలు కుసుమకుమారి, ఎంపీపీ ఇ.నాగమణి పసుపురాసి సీమంతం చేసి రవిక, గాజులు పండ్లు అందజేసి ఆశీర్వదించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు బి.చంద్రశేఖర ఎంపీడీవో సిద్ధలింగమూర్తి బృందం అధికారులు పాలుపంచుకున్నారు. కొండాపురం గ్రామంలో ఏర్పాటుచేసిన సభలో నోడల్ అధికారి ప్రసాదరావు, ఎంపీడీవో సిద్ధలింగమూర్తి పాల్గొన్నారు.

## పథకాలు సద్వినియోగం చేసుకోండి

**గూడూరు, న్యూస్‌టుడే:** ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని ఛైర్‌పర్సన్ బి.ఇందిరసుభాషిణి పేర్కొన్నారు. స్థానిక ఏబీఎం ప్రాథమిక పాఠశాల ఆవరణలో బుధవారం ఐదో విడత జన్మభూమి మాఊరు కార్యక్రమం జర్గ్గా పాల్గొన్న ఆమె మాట్లాడారు. అంతకుముందు ప్రతిజ్ఞ, సంబంధిత శాఖ అధికారులు మాట్లాడగా చివరగా మంజూరైన ఏడుగురికి బియ్యం కార్డులు ఉప తహసీల్దారు శ్రీనివాసులు, కమిషనర్ నయీంఅహ్మద్, వైద్యాధికారి డా.నారాయణ తదితరులు పంపిణీ చేశారు. సీడీపీవో ఉమామహేశ్వరమ్మ, కార్యకర్తలు, ఛైర్‌పర్సన్ బి.ఇందిరసుభాషిణి తదితరులు గర్భిణులకు సీమంతం కార్యక్రమాన్ని నిర్వహించారు. మధ్యాహ్నం 15వ వార్డు ఐదో విడత జన్మభూమి కార్యక్రమానికి కౌన్సిలర్ జె.వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించగా కొత్త బియ్యం కార్డులు నాలుగు పంపిణీ చేశారు.

## ఫుట్‌బాల్ విజేత అమడగుంట్ల విద్యార్థినుల జట్టు

**అమడగుంట్ల(కోడుమూరు), న్యూస్‌టుడే:** మంత్రాలయంలో జరిగిన ఆదోని డివిజన్ ఆటల పోటీల్లో ఫుట్‌బాల్‌లో కోడుమూరు మండలం అమడగుంట్ల జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థినులు తమ ప్రతిభను చాటి విజేతలుగా నిలిచినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శరభయ్య తెలిపారు. విద్యార్థినులను, పీడీ విజయకుమారిని, హెచ్ఎం శరభయ్య, ఇతర ఉపాధ్యాయ బృందం అభినందించారు.



విజేతలతో పీడీ విజయకుమారి

# కోడుమూరు

## ఆంజనేయస్వామి ఆలయానికి రూ.41 వేలు విరాళం

**గూడూరు, న్యూస్‌టుడే:** స్థానిక ఆంజనేయస్వామి అభివృద్ధికి యువత పూనుకున్నారు. వారు చేస్తున్న పనులకు ఆకర్షితులైన భక్తులు విరాళంగా బుధవారం రూ. 41,156 విరాళంగా అందజేశారు. ఆలయానికి మాన్యాలున్నా, దేవదాయ శాఖ పట్టించుకోని నేపథ్యంలో యువత నడుం బిగించి ఆలయ ఆధునికీకరణకు పూనుకోవటం గమనార్హం.

## పెద్దపాడులో పోలీసు కార్డన్ సెర్చ్

**పెద్దపాడు, కె.నాగులాపురం(గూడూరు), న్యూస్‌టుడే:** మండలంలోని కె.నాగులాపురం ఠాణా పరిధి పెద్దపాడు వద్ద కర్నూలు గ్రామీణ సీఐ నాగరాజు యాదవ్, నాగులాపురం, ఉలిందకొండ, ఓర్వకల్ ఎస్సైలు మల్లికార్జున, వెంకటేశ్వర్లు, చంద్రబాబునాయుడు పోలీసులతో కార్డన్ సెర్చ్ కార్యక్రమాన్ని చేపట్టారు. గ్రామంలో సమస్యాత్మక వ్యక్తులు, అనుమానితుల ఇళ్లు సోదా చేశారు.

# ఆరోగ్యంపై అందరూ దృష్టి సారించాలి

**ఈ.తాండ్రపాడు, పంచలింగాల(కర్నూలు గ్రామీణ), న్యూస్‌టుడే:** జన్మభూమి-మా ఊరు కార్యక్రమంలో భాగంగా రెండో రోజు బుధవారం గ్రామాల్లో ప్రజలకు ఆరోగ్యం, పౌష్టికాహారంపై అధికారులు, నాయకులు అవగాహన కల్పించారు. ఈ.తాండ్రపాడులోని గ్రామపంచాయతీ కార్యాలయంలో తహశీల్దారు వెంకటరమేష్‌బాబు ఆధ్వర్యంలో అన్ని శాఖల అధికారులు పాల్గొని గ్రామ ప్రజలకు పింఛను, రేషన్ కార్డులను పంపిణీ చేశారు. అనంతరం ప్రజల నుంచి వ్యక్తిగత, గ్రామ సమస్యలపై వినతులు స్వీకరించారు. తహశీల్దారు జన్మభూమి లక్ష్యాలపై ప్రజలు, నాయకుల చేత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ రఘునాథ్, జిల్లా తెదేపా కార్యదర్శి పి.సత్యనారాయణ, గ్రామ సర్పంచి శాంతమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు పి.వెంకటలక్ష్మీ, మండల కార్యదర్శి వెంకటేశ్వర్లు, గ్రామ కమిటీ అధ్యక్షుడు లక్ష్మీ నారాయణ, గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

◆ పంచలింగాలలోని ఊరవాకిలిలో నిర్వహించిన జన్మభూమి-మా ఊరులో ఎంపీడీవో నాగశివలీల పాల్గొని ప్రజలకు ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. అనంతరం గ్రామ ప్రజలకు రేషన్‌కార్డులు, పింఛను కార్డులు పంపిణీ చేశారు. గ్రామస్థుల నుంచి పలు వినతులు స్వీకరించారు. ప్రజలు ఆరోగ్యంగా ఉండాలని సూచనలు చేశారు. కార్యక్రమంలో సర్పంచి అనంత లక్ష్మీ, పంచాయతి కార్యదర్శి నాగమణి, అన్ని శాఖల అధికారులు, గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.



ఈ.తాండ్రపాడులో నిర్వహించిన జన్మభూమి-మా ఊరు సభలో మాట్లాడుతున్న తహశీల్దార్ వెంకటరమేష్ బాబు, అధికారులు



గార్గేయపురం జడ్పీ పాఠశాలలో శ్రమదానం అనంతరం అధికారులు, ఉపాధ్యాయులతో ఐజీ షేక్ మహ్మద్ ఇక్బాల్ బాష

### నేడు జన్మభూమి-మా ఊరు

◆ గార్గేయపురం గ్రామంలో జడ్పీ ఉన్నత పాఠశాలలో ఐజీ షేక్ మహ్మద్ ఇక్బాల్ బాష పాల్గొని శ్రమదానం చేశారు. జన్మభూమి-మా ఊరు కార్యక్రమానికి నందికొట్కూరు, కర్నూలు నోడల్ అధికారి హోదాలో ఆయన పాఠశాలలో శ్రమదానాన్ని సీఐ నాగరాజు, ఎస్సై గిరిబాబు, ప్రధానోపాధ్యాయుడు డి.రామశేషయ్య, గ్రామయువకుడు రవిశాస్త్రీ, పోలీస్ సిబ్బందితో కలిసి చేపట్టారు. శ్రమదానం జన్మభూమిలో ముఖ్యభాగమని ఐజీ ఈ సందర్భంగా గుర్తు చేశారు.

◆ జన్మభూమి-మా ఊరులో భాగంగా గురువారం ఎంపీడీవో బృందం సుంకేసులలోని ఎంపీ ఈఎల్ఈ పాఠశాలలో... తహశీల్దారు బృందం ఆర్.కొంతలపాడులోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో కార్యక్రమాన్ని చేపట్టనున్నారు.



కొండాపురంలో పింఛన్లు పంపిణీ చేస్తున్న వీఆర్వో అక్బర్ హుసేన్

## ముమ్మరంగా పింఛన్లు పంపిణీ

**కొండాపురం(సి.బెళగల్), న్యూస్‌టుడే:** మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం ఆయా గ్రామాల్లో పింఛన్ల పంఫిణీ కార్యక్రమం ముమ్మరంగా కొనసాగుతోంది. కొండాపురంలో గ్రామపంచాయతీ కార్యాలయంలో వీఆర్వో అక్బర్‌హుసేన్ 279 పింఛన్లకు 240 పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యాలయాల దగ్గరకు అనారోగ్య పరిస్థితులు ఉన్నవారికి ఇళ్ల వద్దకు వెళ్లి పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. సి.బెళగల్‌లో వీఆర్వో జాకీరు ఆధ్వర్యంలో 90 శాతం పూర్తి చేసినట్లు మండలం మొత్తం 75 శాతం పూర్తయినట్లు ఎంపీడీవో సిద్ధలింగమూర్తి తెలిపారు.



ఆలయ ఈవో శోభకు పోలీసుల సమక్షంలో అంగీకార పత్రం అందజేస్తున్న ప్రతాప్‌నాయుడు

## సత్రాన్ని ఆలయానికి అందజేందుకు అంగీకారం

**కోడుమూరు, న్యూస్‌టుడే:** కోడుమూరు మండలం గోరంట్ల గ్రామంలో వివాదాస్పదంగా మారిన సత్రం మరమ్మతు సమస్య సామరస్యంగా పరిష్కారమైంది. సత్రం మరమ్మతు చేయడంతోపాటు సత్రానికి కటాంజనం వేయించడంతో మరమ్మతు చేయించిన ప్రతాప్‌నాయుడు ఆ సత్రాన్ని ఆయనే స్వాధీనం చేసుకోవచ్చుననే అనుమానంతో గ్రామస్థులు దేవస్థానం ఈవో శోభకు ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. ఆమె మంగళవారం సత్రాన్ని సందర్శించి పరిశీలించారు. దీనిపై స్పందించిన ప్రతాప్‌నాయుడు మరమ్మతు చేసిన అనంతరం సత్రాన్ని దేవస్థానానికి అప్పగించనున్నట్లు అంగీకార పత్రాన్ని బుధవారం ఆలయ ఈవోకు కోడుమూరు పోలీసు స్టేషన్‌లో ఈవో శోభకు అందజేశారు. దీంతో గ్రామస్థుల్లో నెలకొన్న అపోహలకు తెర పడింది.

## ముమ్మురంగా మత్స్య కేంద్రం నిర్మాణం పనులు

**కొత్తకోట(సి.బెళగల్), న్యూస్‌టుడే:** కొత్తకోటలో మత్స్య కేంద్రం నిర్మాణ పనులు ముమ్మరంగా కూలీలతో చేపట్టారు. ఈ నిర్మాణానికి రూ.30 లక్షలతో భవనం నిర్మాణం పనులు చేపట్టారు. ఈ భవనం నిర్మాణం పనులను జన్మభూమి మాఊరు గ్రామసభకు వచ్చిన పంచాయతీరాజ్ శాఖ ఈఈ సురేంద్ర కోడుమూరు పంచాయతీరాజ్ శాఖ డీఈఈ శ్రీనివాసులు విచ్చేసి నిర్మాణ పనులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. నిర్మాణం త్వరితంగా పూర్తిచేయాలని గుత్తేదారుకు సూచించారు.



కొత్తకోటలో కొనసాగుతున్న మత్స్య కేంద్రం నిర్మాణం పనులు



ఎస్టీయూ దైనందినిని ఆవిష్కరిస్తున్న అనంతయ్య

## ఎస్టీయూ దైనందినిని ఆవిష్కరణ

**కోడుమూరు, న్యూస్‌టుడే:** ఎస్టీయూ కోడుమూరు మండల శాఖకు సంబంధించిన దైనందినిని మండల విద్యాధికారి అనంతయ్య బుధవారం విద్యావనరుల కేంద్రం ఆవరణలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎస్టీయూ ఏపీ కార్యదర్శి ఆర్.విక్టర్, ఆర్థిక కార్యదర్శి పి.మహేష్, ఉపాధ్యాయులు నరసింహులు, మురళీ, వెంకటేష్, బ్రహ్మయ్య, ఈశ్వరయ్య, బాలకృష్ణ, ప్రసాద్‌వీరేష్, తిక్కన్న, కాశిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## శాఖల మధ్య సమన్వయ లోపంతో అందని జీతాలు


**కోడుమూరు, న్యూస్‌టుడే**: నీటి పారుదల శాఖ ఆదోని డివిజన్ కార్యాలయ సిబ్బందికి కర్నూలు పే అండ్ అకౌంట్స్ కార్యాలయ సిబ్బంది మధ్య సమన్వయ లోపంతో జీతాల బిల్లు సమయానికి పంపక పోవడంతో డివిజన్ పరిధిలోని ఆదోని 1, 2, ఎమ్మిగనూరు, కోడుమూరు, గాజులదిన్నె ప్రాజెక్టు సబ్‌డివిజన్ పరిధిలో పనిచేసే లస్కర్లు, వర్క్ఇన్స్‌పెక్టర్లు డిసెంబర్ నెల జీతాలకు నోచుకోలేక పోయారు. ప్రతినెలా ఒకటో తేదీన అందే జీతాలు మూడో తేదీన కూడా రాకపోవడంతో ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. మూడురోజులుగా బ్యాంకులు, ఏటీఎంల చుట్టూ తిరిగి అలసిపోయిన ఉద్యోగులు వారి నాయకులు ఆదోని డివిజన్ కార్యాలయ సిబ్బందిని విచారించగా తాము నిర్ణీత సమయంలో జీతాల బిల్లును పే అండ్ అకౌంట్ కార్యాలయానికి అధికారులను విచారించగా జీతాలబిల్లును తమకు ఇవ్వలేదని వచ్చిన వ్యక్తి ఈ బిల్లును తమకు తెలుపకుండా ట్రేలో పెట్టి వెళ్లారని అధికారక పోవడంతో పెట్టలేక పోయామని 6వ తేదీ ఖాతాలకు జమ చేస్తున్నట్లు చెప్పినట్లు వర్క్‌ఛార్జ్‌డ్ ఉద్యోగుల సంఘం జిల్లా నాయకులు ఆంజనేయులు, జె.మగ్బుల్‌బాష, అర్జున్ తెలిపారు. కారకులపై చర్యలు తీసుకోవాలని సంఘం నాయకులు డిమాండ్ చేశారు.

# ఘనంగా సావిత్రి బాయి పూలె జయంతి

**గార్గేయపురం, నందనపల్లె(కర్నూలు గ్రామీణ), న్యూస్‌టుడే:** దేశంలోనే మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయిని సావిత్రి బాయి పూలే జయంతిని మండలంలోని గ్రామాల్లోని పాఠశాలల్లో గురువారం ఘనంగా నిర్వహించారు. గార్గేయపురంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయిని రాజేశ్వరి అధ్యక్షతన జయంతి కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రధానోపాధ్యాయుడు డి.రామశేషయ్య సావిత్రిబాయి పూలే చరిత్రను విద్యార్థులకు వివరించారు. అనంతరం పాఠశాలలోని ఉపాధ్యాయినికి ఉపాధ్యాయులు సన్మానం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అనురాధ, రాజమణి, సుజాత, పద్మావతి, సుబ్రహ్మణ్యం, రామచంద్రుడు, పీఈటీ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



మిలిటరీ కాలనీలోని జడ్పీ పాఠశాలలో ఉపాధ్యాయిని సరస్వతికి సన్మానం చేస్తున్న ఉపాధ్యాయులు



సావిత్రిబాయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న విద్యార్థి సంఘ నాయకులు

☛ మిలటరీ కాలనీలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయిని ఎస్.విజయమ్మ అధ్యక్షతన సావిత్రి బాయి పూలే జయంతిని నిర్వహించారు. పాఠశాల సామాజిక శాస్త్రం ఉపాధ్యాయిని సరస్వతి సావిత్రి బాయి జీవితంలోని కొన్ని ముఖ్య ఘట్టాలను విద్యార్థులకు వివరించారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయులు సామాజిక శాస్త్రం ఉపాధ్యాయిని సరస్వతిని సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కృష్ణమూర్తి, ఎం.శ్రీనివాసులు, కృష్ణుడు, అయ్యప్ప, వ్యాయామ ఉపాధ్యాయుడు బాష, అనిత, శ్రీదేవి, చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

గూడూరు, న్యూస్‌టుడే: పట్టణంలోని ప్రధాన ప్రాథమిక పాఠశాలలో బుధవారం సావిత్రిబాయి జయంతిని ఘనంగా నిర్వహించారు. యూటీఫ్ మండల బాధ్యుడు మారెప్ప అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంఈవో సునీలమ్మ పాల్గొని సావిత్రిబాయి చిత్రపటానికి పూలమాల వేయటం ద్వారా నివాళి అర్పించారు. యూటీఎఫ్ గౌరవాధ్యక్షుడు హనుమంతు, సభ్యులు రామకృష్ణ, విశ్రాంతమ్మ, ఆనందమ్మ, జయపాల్, ఎర్రన్న, దాదామియ్య, కేశన్న, పాల్గొన్నారు.

### ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో..

కోడుమూరు, న్యూస్‌టుడే: కోడుమూరులో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో సాయిత్రిబాయి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సావిత్రిబాయి చిత్ర పటానికి ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు శ్రీరాములు, శివశంకర్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వీరు సావిత్రిబాయి మహిళా అభివృద్ధికి చేసిన కృషిని శ్లాఘించారు.

☛ జన్మభూమి కార్యక్రమానికి విద్యార్థులను, ఉపాధ్యాయులను ఉపయోగించడం తగదని ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు శ్రీరాములు, శివశంకర్ పేర్కొన్నారు. వీరిని దూరంగా ఉంచాలని కోరారు. కార్యక్రమంలో మహేష్‌నాయుడు, మధు, విజయ్, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.



గార్గేయపురం జడ్పీ పాఠశాలలో భాగ్యమ్మను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు



సావిత్రిబాయి పూలె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎంఈవో తదితరులు

# కర్నూలు





## 5న కుస్తీ పోటీలు

**కర్నూలు క్రీడలు, న్యూస్‌టుడే:** ఈ నెల 5న జిల్లా క్రీడాప్రాధికారిక సంస్థ మైదానంలో ఉదయం 9.00 గంటలకు జిల్లాస్థాయి కుస్తీ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు సంఘం కార్యదర్శి మల్లికార్జున తెలిపారు. ఈనెల 10 నుంచి ప్రకాశం జిల్లాలో జరిగే జూనియర్స్, 20 నుంచి 22వ తేదీ వరకు కడపలో జరిగే సబ్‌జూనియర్స్ రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని వెల్లడించారు. ఆసక్తిగల క్రీడాకారులు నేరుగా పాల్గొనాలని సూచించారు.

## నేడు ఉపాధ్యాయులకు ఒకరోజు శిక్షణ

**కర్నూలు విద్య:** జిల్లాలోని ప్రభుత్వ, జిల్లాపరిషత్, కేజీబీవీ, ఆదర్శ, ఎయిడెడ్ ఉన్నత పాఠశాలల్లో పదోతరగతి బోధించే ఉపాధ్యాయులకు గురువారం స్థానిక వాసవి మహిళా కళాశాలలో ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాధికారిణి తాహెరా సుల్తానా ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు శిక్షణ ఉంటుందని, తెలుగు ఉపాధ్యాయులు తప్పకుండా హాజరుకావాలని ఆదేశించారు.

## పరిశీలకులుగా ఇద్దరు ఐపీఎస్ అధికారులు

**కర్నూలు సచివాలయం:** ఐదో విడత జన్మభూమి-మాఊరు కార్యక్రమం నిర్వహణపై నియోజకవర్గాలకు ప్రత్యేక అధికారులను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వు జారీ చేసింది. శ్రీశైలం నియోజకవర్గానికి డీఐజీ కె.వి.వి గోపాలరావు (ఐపీఎస్) అధికారిని నియమించారు. డోన్ నియోజకవర్గానికి హోంశాఖ ప్రత్యేక కార్యదర్శి మొహమ్మద్ అషాన్ రెజా(ఐపీఎస్)ను నియమించారు. గోపాలరావు బుధవారం జన్మభూమి గ్రామసభల్లో పాల్గొన్నారు.

## యువతకు ఉచిత శిక్షణ

**కర్నూలు పాతనగరం:** నిరుద్యోగ యువకులకు కంప్యూటర్‌లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు నైస్ స్వచ్ఛంద సేవాసంస్థ అధ్యక్షుడు రాయిపాటి శ్రీనివాస్ ప్రకటనలో పేర్కొన్నారు. పదో తరగతి ఉత్తీర్ణత పొంది 18 నుంచి 35 సంవత్సరాలలోపు వయస్సున్న వారు 5వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. పూర్తి వివరాలకు నైస్ కంప్యూటర్స్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

## పట్టపగలు చోరీ

**కర్నూలు నేరవార్తలు, న్యూస్‌టుడే:** కల్లూరు పోలీసుకాలనీలో బుధవారం పట్టపగలు చోరీ జరిగింది. వ్యాపారి జె.ప్రకాశ్ మధ్యాహ్నం బయటకు వెళ్లి సాయంత్రం తిరిగి వచ్చేలోపు దొంగలు ఇంటిని దోచేశారు. రూ.4లక్షల నగదు, ఆరు తులాల బంగారు ఆభరణాలు అపహరణకు గురైనట్లు తెలిసింది. కర్నూలు నాలుగో పట్టణ పోలీసుల కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## తెరపై ఈనాడు

**కర్నూలు బిక్యాంపు, న్యూస్‌టుడే:** ఐనాక్స్ కాంప్లెక్స్: టైగర్ జిందా హై, జ్యామాంజి 2, ప్రాజెక్ట్-జెడ్, ది గ్రేటెస్ట్ షో మ్యాన్, **వి సెల్యూలాయిడ్స్ ఆనంద్ కాంప్లెక్స్:** ఎంసీఏ మిడిల్ క్లాస్ అబ్బాయి, 2 కంట్రీస్, హలో, టైగర్ జిందా హై, జ్యామాంజి (ఇంగ్లిష్), **భరత్ కాంప్లెక్స్:** ఒక క్షణం, ఎంసీఏ మిడిల్ క్లాస్ అబ్బాయి, 2 కంట్రీస్, **రాజ్:** మిడిల్ క్లాస్ అబ్బాయి, **శ్రీరామ:** హలో.

# ఆసుపత్రిలో ఎవరికివారే..!

◆ పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణ కరవు ◆ ద్విచక్ర వాహనాలు, ఆటోలతో తీవ్ర ఇబ్బందులు ◆ నియంత్రణ చర్యలు అవసరం అంటున్న రోగులు



ఆసుపత్రిలో ప్రధాన రహదారి ఎదుట ద్విచక్ర వాహనాలు

**కర్నూలు వైద్యాలయం, న్యూస్‌టుడే:** సర్వజన వైద్యశాలలో వాహనాల రొద అధికమైంది. ద్విచక్ర వాహనాలు, ఇతర మోటారు వాహనాలకు సంబంధించి రద్దీ నియంత్రణ చర్యలు లేకపోవడంతో ఉదయం వేళల్లో రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఒక్కోసారి అత్యవసర విభాగానికి 108 వాహనాలు వెళ్లాలన్నా దారి ఉండటం లేదు. ప్రాణాప్రాయ స్థితిలో ఉన్న రోగులతో వచ్చే ఈ వాహనాలకు ఉదయం 10 నుంచి 12 గంటల సమయంలో తీవ్ర ఆటంకాలు తప్పడం లేదు. రోగుల తాకిడి, ప్రధాన రహదారి వెంట ద్విచక్ర వాహనాలు ఆపడం, మరోవైపు ఆటోల రాకపోకలతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వాహనాలను ఓపీలు, అత్యవసర విభాగం ఎదుట అడ్డదిడ్డంగా పెడుతుండంతో రోగులు ఆసుపత్రిలోకి వెళ్లాలన్నా వీలుకావడం లేదు. ఆసుపత్రి కాపలా సిబ్బంది ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు వీటి నియంత్రణ చేసేవారు. వారికి నాలుగు నెలల నుంచి వేతనాలు చెల్లించకపోవడంతో ఆసుపత్రి అధికారులు వారిని ప్రశ్నించలేని పరిస్థితి.

ప్రధానంగా పెద్దాసుపత్రికి సోమ, బుధ, శుక్రవారాల్లో రోగుల సంఖ్య గణనీయంగా ఉంటుంది. దీనికితోడు భారీ ప్రమాదాలు జరిగినప్పుడు రోగుల బంధువులు, మీడియా ప్రతినిధులు, అధికారులు, ప్రజాప్రతినిధుల రాకతో గందరగోళం సరేసరి. ప్రాంగణంలో పార్కింగ్ స్థలం ఉన్నప్పటికీ అక్కడ వాహనాలు ఆపకపోవడం ప్రధాన సమస్యగా మారింది. కాపలా సిబ్బంది సేవలు సద్వినియోగం చేసుకోవడంతోపాటు వాహనాలు నిర్దేశిత ప్రాంతంలో ఆపడం, ప్రధాన ద్వారం వద్ద నియంత్రణ కోసం ఇరువైపులా సిబ్బందిని నియమించడం, ప్రధాన రహదారిలో వాహనాలు ఆపకుండా చూడటం వంటి చర్యలను ఆసుపత్రి అధికారులు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

## ఆసుపత్రి సమాచారం

**కర్నూలు వైద్యాలయం, న్యూస్‌టుడే :** సర్వజన వైద్యశాలకు బుధవారం సాయంత్రం వరకు ఓపీకి వచ్చిన వారు 2,350 మంది. వారిలో వివిధ వార్డులలో చికిత్సలకోసం చేరినవారు 235 మంది. గురువారం న్యూరోఫిజీషియన్, ప్లాస్టిక్ సర్జరీ, గ్యాస్ట్రో ఎంట్రాలజీతోపాటు అన్ని సాధారణ జబ్బులకు ఓపీ ఉంటుంది.

# మద్యంలో నీళ్ల కల్తీ

### అబ్కారీశాఖ దాడులు, 271 సీసాలు స్వాధీనం

**కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే:** మద్యనిషేధ, అబ్కారీశాఖ రాష్ట్ర టాస్కుఫోర్స్ కల్తీ మద్యం విక్రయిస్తున్న మద్య దుకాణం బాగోతాన్ని బట్టబయలు చేసింది. రాబడిన సమాచారం మేరకు కల్లూరు మండలం ఉల్లిందకొండ గ్రామంలోని కేసీఆర్ వైన్స్ దుకాణంపై ఆకస్మిక దాడి చేశారు. దుకాణంలో మద్యాన్ని నీళ్లతో కల్తీ చేస్తున్నట్లు గుర్తించారు. దుకాణంలో పనిచేసే లోకేశ్‌రెడ్డి, శివశంకర్‌రెడ్డిలతో ఈ బాగోతం నడుపుతున్నట్లు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు. నీళ్ల కలిపిన 271 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. విశ్రాంత డీఎస్పీ కుమారుడు ఈ దుకాణాన్ని నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. ఎంతకాలం నుంచి కల్తీ మద్యం విక్రయిస్తున్నారన్న దానిపై విచారణ చేపట్టారు. దాడిలో ఎస్టీఎఫ్ సీఐ కృష్ణమూర్తి, లక్ష్మీనారాయణ, శంకర్, హెడ్ కానిస్టేబుల్ లీలామోహన్ పాల్గొన్నారు. కర్నూలు మండలం ఆర్.కొంతలపాడు గ్రామంలో గొలుసుదుకాణంపై మద్యనిషేధ, అబ్కారీశాఖ సీఐ పద్మావతి, సిబ్బంది దాడులు జరిపి తెలంగాణ రాష్ట్రానికి చెందిన 41 సీసాలు స్వాధీనం చేసుకున్నారు. వెంకటేశ్వరమ్మ అనే మహిళ నిర్వాహకురాలిని అరెస్టు చేశారు.

# హలో ఈనాడు

**కర్నూలు గ్రామీణ, న్యూస్‌టుడే:** స్థానిక సమస్యలు పరిష్కారం కాక ఇబ్బందులు పడుతున్నారా? ఎవరికి చెప్పుకోవాలో తెలియక సతమతమవుతున్నారా? ఇక ఆ చింత వీడండి. హలో ఈనాడు చరవాణి: 97014 76343కి చేసి సమస్యను తెలియజేయండి. మీకు ఆసక్తి ఉంటే ఆ సమస్య చిత్రాన్ని తీసి, దానికి వివరణ రాసి ఇదే నెంబర్‌కు వాట్సప్ చేయండి. ఇలా వచ్చిన సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి సత్వరం పరిష్కరించేలా కృషి చేస్తాం. సత్వరమే స్పందించడి.. సమస్య పరిష్కారంలో మీవంతు సహకారం అందించండి.

◆ **సమస్య:** బళ్లారి చౌరస్తా సమీపంలోని దుర్గా హోటల్ వెనుక వైపు ఉన్న గణేష్ నగర్‌లో కాల్వల్లో మురుగు పేరుకుపోయింది. రాత్రివేళల్లో దోమల బెడద ఎక్కువైంది. స్థానికులు అనారోగ్యం బారిన పడుతున్నారు. అధికారులు చొరవ చూపాలి.

**- వీణా వెంకటరమణ, కాలనీవాసి**

◆ **సమస్య:** చౌరస్తా సమీపంలోని గురుబ్రహ్మ నగర్‌లో శంకర్ గౌడ్ ఆటో కన్సల్టింగ్ ఎదుట ఉన్న రెండు వీధి దీపాలు వెలగడం లేదు. రాత్రివేళల్లో కుక్కల బెడద అధికంగా ఉంది. దీపాలను ఏర్పాటు చేయాలి. **- పద్మనాభరావు, స్థానికుడు.**

◆ **సమస్య:** పాణ్యం మండలం సుబ్బరాయుడు కొత్తూరు గ్రామంలో నాలుగు రోజులుగా ట్యాంకులకు నీరు రావడం లేదు. గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తాగునీటి సమస్యను పరిష్కరించాలి. **- రామసుబ్బయ్య, గ్రామస్థుడు**

◆ **సమస్య:** నగరంలోని అమ్మ ఆసుపత్రి సమీపంలోని కిసాన్ నగర్‌లో ఉన్న ఆంధ్రాబ్యాంకు ఎదుట వీధిదీపం వెలగడం లేదు. అధికారులు స్పందించి దీపాలకు మరమ్మతులు చేపట్టాలి.

**- ఎం.శ్రీనివాసరెడ్డి, స్థానికుడు.**



వెంకటచలపతి నగర్ రహదారికి అడ్డంగా వేసిన మట్టిదిబ్బ

◆ **సమస్య:** వెంకటాచలపతి నగర్‌లోని రహదారికి అడ్డంగా కొందరు వ్యక్తులు మట్టిపోశారు. రాకపోకలకు ఇబ్బంది ఏర్పడింది. వాహన చోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. సమస్యను పరిష్కరించాలి.

**- ప్రయాణికులు.**

◆ **సమస్య:** విజయదుర్గా కళాశాల వెనుకవైపు ఉన్న శ్రీనగర్ కాలనీలో దాదాపు అన్ని వీధుల్లో సీసీ రహదారులు నిర్మించారు. జనాభా ఎక్కువగా ఉన్న పలు వీధుల్లో వాటిని నిర్మించకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. త్వరితగతిన నిర్మించాలి. **- జోజిరెడ్డి, స్థానికుడు.**

◆ **సమాధానం :** నగరంలోని సమస్యలను పరిశీలించి సిబ్బందిని పంపి వాటి పరిష్కారానికి కృషి చేస్తాం.

**- హరినాథ్‌రెడ్డి, పురపాలక కమిషనర్**

## ప్రభుత్వ పథకాల సాధన ప్రజల హక్కు



మాట్లాడుతున్న ఎస్వీ మోహన్‌రెడ్డి

**కర్నూలు (నగరపాలక సంస్థ), న్యూస్‌టుడే:** ప్రభుత్వ పథకాల సాధన ప్రజల హక్కు అని శాసన సభ్యుడు ఎస్వీ మోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం నగరంలోని 4, 5, 6 డివిజన్లలో ఏర్పాటు చేసిన జన్మభూమిలో ఆయన పాల్గొన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా తెదేపా ప్రభుత్వం పథకాలను అమలు చేస్తోందని, వాటిని అర్హులైన ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సంక్షేమ పథకాల లబ్ధి, పౌరసేవలకు నయాపైసా చెల్లించవద్దని, ఎవరైనా లంచం అడిగితే వారి వివరాలను 1100 కు సమాచారం ఇవ్వాలని ఆయన సూచించారు. ఆంధ్రప్రదేశ్‌ను అవినీతి రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు గట్టి చర్యలు తీసుకుంటున్నారని, ఇందుకు ప్రజలు తమ వంతు తోడ్పాటు అందించాలని కోరారు. ఆరో డివిజన్‌లోని జమ్మిచెట్టు వద్ద జన్మభూమిలో పాల్గొన్న కలెక్టర్ సత్యనారాయణ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను అర్హులయిన ప్రతి ఒక్కరికి అందజేస్తామని.. స్థానిక అవసరాలు, సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే అందుకు అనుగుణంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. అన్నివర్గాల ప్రజలకు అవసరమైన పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందని వాటిని వినియోగించుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా గర్భిణులకు సీమంతం నిర్వహించి లబ్ధిదారులకు రేషన్‌కార్డులు అందజేశారు. కార్యక్రమంలో నగరపాలక ఉన్నతాధికారి హరినాథ్‌రెడ్డి, ఇంజినీరు రాజశేఖర్ పాల్గొన్నారు.

### నేటి జన్మభూమి- మాఊరు ఇలా

గురువారం నగరంలోని ఐదు ప్రాంతాల్లో జన్మభూమిని నిర్వహించనున్నారు. 7వ డివిజన్‌లోని నిమిషాంబ దేవాలయం, 8వ డివిజన్‌లోని పెదపడఖానా కమ్యూనిటీ భవనం, 9వ డివిజన్‌లోని చిన్నమార్కెట్ బహిరంగ ప్రదేశం, 27 డివిజన్‌లోని అబ్బాస్‌నగర్ నీళ్ల ట్యాంక్, 28 డివిజన్‌లోని ఉద్యోగనగర్ నీళ్ల ట్యాంక్ వద్ద ఉదయం 10 గంటల నుంచి 5 గంటల వరకు వీటిని నిర్వహించనున్నారు.


## తెలుగు సాహిత్యం అభివృద్ధికి తోడ్పాటు

**కర్నూలు విద్య, న్యూస్‌టుడే:** ఆధునిక శాస్త్ర సాంకేతిక విషయాలతో పాటు, వారసత్వంగా వస్తున్న సంస్కృతి సంప్రదాయాలను భావితరాలకు పరిచయం చేసి అభివృద్ధిపరిచే ఉద్దేశంతో భాషా సాహిత్యాంశాలకు సంబంధించిన విభాగాలను వివిధ స్థాయిల్లో నిర్వహిస్తున్నట్లు ఉపకులపతి వై. నరసింహులు అన్నారు. రాయల సాహిత్యపీఠ గ్రంథాలయాన్ని రాయలసీమ విశ్వవిద్యాలయ అనుబంధ పరిశోధన కేంద్రంగా అభివృద్ధిపరచడం లక్ష్యంగా తెలుగు భాషా వికాస ఉద్యమం రాష్ట్ర కార్యదర్శి జెఎస్‌ఆర్‌కె.శర్మ బుధవారం ఉపకులపతి వై.నరసింహులు, రిజిస్ట్రార్ అమర్‌నాథ్ సరస్వర అంగీకారంతో అవగాహన కుదుర్చుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు భాషా వికాస ఉద్యమం కర్నూలు నగరపాలక సహకారంతో తెలుగు భాషా సాహిత్యాల పరిరక్షణకు ఎంతో తోడ్పడుతుందని కొనియాడారు. తెలుగు భాష, సాహిత్యాలపై పరిశోధన చేయాలన్న ఆసక్తి ఉన్న పరిశోధకులకు మరింతగా ఉపయోగపడాలన్నది తమ ఆకాంక్ష అన్నారు.

## వీధుల్లో వెలుగులు

స్పందనకు వందనం

**కర్నూలు గ్రామీణ, న్యూస్‌టుడే:** నగరంలో ఐటీసీ సమీపంలోని రామచంద్రనగర్ రామాలయం వీధిలో శంకర్రావు ఇంటి ఎదుట వీధి దీపం వెలగడం లేదని డిసెంబరు 28న హలో ఈనాడులో సమస్య ప్రచురితమైంది. స్పందించిన పురపాలక సిబ్బంది బుధవారం ఆర్ఎస్-బీ9 స్తంభం వీధిదీపానికి మరమ్మతులు చేసి వెలిగేలా చర్యలు చేపట్టారు. దీంతో స్థానికులు ఓంకారప్ప, నవీన్, జ్యోతి తదితరులు హర్షం వ్యక్తం చేశారు.



మరమ్మతులు చేస్తున్న సిబ్బంది


# కర్నూలు

## ప్రభుత్వం తోడ్పాటు అందించాలి

**కర్నూలు పాతనగరం, న్యూస్‌టుడే:** సమాజంలో వెనుకబడిన సంచారజాతి అయిన పూసల కులస్థుల అభివృద్ధికి ప్రభుత్వం తోడ్పాటు అందించాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు నాయిని భాస్కర్ అన్నారు. నగరంలోని శిల్పకృష్ణకాంత్ ప్లాజాలో ఆయన బుధవారం సమావేశం నిర్వహించి మాట్లాడారు. కృష్ణబలిజ, పూసల ఫెడరేషన్ ద్వారా ప్రభుత్వ అందిస్తున్న రుణాలను పూసల కులస్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## 'జన్మభూమి దరఖాస్తులు అమ్ముతున్నారు'

**కర్నూలు పాతనగరం, న్యూస్‌టుడే:** జన్మభూమి కార్యక్రమాల్లో లబ్ధిదారులకు అవసరమైన దరఖాస్తులను దళారుల చేతికిచ్చి రూ.20లకు అమ్ముతున్నారని సీపీఎం నాయకుడు అబ్దుల్ దేశాయ్ ప్రకటనలో విమర్శించారు. గత జన్మభూమిలో ఇచ్చిన అర్జీలను పరిష్కరించకుండా కొత్తగా స్వీకరించడం విడ్డూరంగా ఉందని ఆరోపించారు. బుధవారం 4, 5, 6 వార్డుల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో ఇదేతంతు జరిగిందని ఆరోపించారు.



కల్లూరు జోన్ కబడ్డీ విజేత ముజఫర్ నగర్ ఉన్నత పాఠశాల జట్టు

## విజేతలకు అభినందన

**కర్నూలు క్రీడలు, న్యూస్‌టుడే:** కల్లూరు జోన్ కబడ్డీ పోటీల్లో అండర్-17 విభాగంలో ముజఫర్ నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జట్టు విజయం సాధించింది. జట్టును విజయం పథంలో నడిపించిన క్రీడాకారులను పాఠశాల ప్రధానపాధ్యాయిని ఎస్ఎంఏ జ్యోతి, పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు కృష్ణారెడ్డిని అభినందించారు.

**పతకాలతో తిరిగి రావాలి**

**కర్నూలు క్రీడలు:** ఈనెల 5 నుంచి 7 వరకు శ్రీకాకుళంలో జరిగే రాష్ట్రస్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో రాణించి జిల్లా క్రీడాకారులు పతకాలు తీసుకురావాలని టీజీ భరత్ ఆకాంక్షించారు. బుధవారం తన స్వగృహంలో క్రీడాకారులను ప్రత్యేకంగా అభినందించారు. మాస్టర్ అథ్లెట్ల సంక్షేమానికి కృషిచేస్తామని హామీ ఇచ్చారు.



మంత్రి గంటా నుంచి ధ్రువపత్రం అందుకుంటున్న వేములపాడు పాఠశాల ఉపాధ్యాయిని రాజేశ్వరి

## ఉపాధ్యాయులకు అభినందనలు

**కర్నూలు విద్య, న్యూస్‌టుడే:** సావిత్రి బాయి పూలే జయంతిని పురస్కరించుకుని బుధవారం ఉపాధ్యాయినులకు పురస్కారాలు ప్రదానం చేశారు. సర్వశిక్షా అభియాన్ సంస్థ ఆధ్వర్యంలో విశాఖపట్నంలో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో విద్యాశాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు చేతులు మీదుగా వాటిని అందించి అభినందించారు. జిల్లా నుంచి మొత్తంగా ఎనిమిది మంది ఉపాధ్యాయినులు ఎంపికయ్యారు. వీరికి ధ్రువపత్రంతో పాటు జ్ఞాపికగా రూ.10 బహుమతి అందజేశారు. ఉపాధ్యాయులను జిల్లా అధికారులు అభినందించారు.



మాట్లాడుతున్న యూటీఎఫ్ ప్రతినిధి విజయలక్ష్మి



నివాళి అర్పిస్తున్న గీతాంజలి నర్సింగ్ కళాశాల విద్యార్థులు



చిత్రపటానికి పూలమాల వేస్తున్న కేవీఆర్ జూనియర్ కళాశాల అధ్యాపకులు

## స్ఫూర్తి ప్రదాత సావిత్రిబాయి పూలే



నివాళి అర్పిస్తున్న ఎస్ఈ భార్గవ రాముడు, విద్యుత్తు సిబ్బంది

**కర్నూలు (నగరపాలక సంస్థ), న్యూస్‌టుడే:** వందేళ్ల క్రితమే మహిళల విద్యకు పెద్దపీట వేసి సమాజంలోని కట్టుబాట్లను ఎదురించి మహిళాభ్యున్నతికి కృషిచేసిన స్ఫూర్తి ప్రదాత సావిత్రిబాయి పూలే అని యూటీఎఫ్ ప్రతినిధి విజయలక్ష్మి అన్నారు. బుధవారం స్థానిక ఇందిరా గాంధీ స్మారక ఉన్నత పాఠశాలలో యూటీఎఫ్ ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ సమాజంలో మహిళలు నిరాదరణకు గురవుతున్న రోజుల్లో వారిలో చైతన్యాన్ని నింపి మూఢ విశ్వాసాలు, దురాచారాలకు చరమ గీతం పాడారని, ఆమె ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వర్లు, యూటీఎఫ్ ప్రతినిధులు సర్వేశ్వరరెడ్డి, ఇబ్రహీం, రఘునాథ్, రాజ్యలక్ష్మి ప్రేమావతి తదితరులు పాల్గొన్నారు. తెదేపా కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు సోమిశెట్టి వెంకటేశ్వర్లు, తిరుపాల్‌బాబు, శ్రీనివాసులు, నాగేష్, కృష్ణారావు, బీవీ రమణ తదితరులు పాల్గొన్నారు.

**కర్నూలు విద్య, న్యూస్‌టుడే:** సావిత్రి బాయి పూలే జయంతిని పురస్కరించుకుని బుధవారం నగరంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆమె చిత్రపటానికి ఉపాధ్యాయులు, యాజమాన్యం పూలమాల వేసి నివాళి అర్పించారు. సావిత్రిబాయి జీవిత చరిత్రను ఆదర్శంగా తీసుకోవాలని సూచిస్తూ విద్యార్థులు నాటిక ప్రదర్శించారు. సామాజికంగా మంచి సేవలు చేస్తున్న మహిళలను చిన్నారులకు పరిచయం చేశారు.

**కర్నూలు పాతనగరం, న్యూస్‌టుడే:** నగర ప్రజలు, వివిధ పార్టీ నాయకులు, ప్రజా సంఘాలు సావిత్రి బాయి పూలే జయంతిని బుధవారం నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. వైకాపా కార్యాలయంలో ఆ పార్టీ పార్లమెంటరీ అధ్యక్షుడు బీవై రామయ్య, ఇతర నేతలు నివాళి అర్పించారు. విద్యుత్తు భవన్‌లో ఎస్ఈ భార్గవ రాముడు, సిబ్బంది ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. బీసీ ఫెడరేషన్ నాయకులు ప్రభుత్వ సర్వజన అస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. 23వ వార్డులోని భగత్ సింగ్ గ్రంథాలయంలో కేవీపీఎస్ నాయకులు పాల్గొన్నారు.



కార్యాలయంలో నివాళి అర్పిస్తున్న వైకాపా నేతలు

## ముగ్గురేసి వెళ్తే బొమ్మ పడుద్ది

**కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే:** నగరంలో ద్విచక్ర వాహనంపై ముగ్గురేసి వెళ్లడాన్ని ట్రాఫిక్ పోలీసులు తీవ్రంగా పరిగణిస్తున్నారు. ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తున్నారు. డీఎస్పీ గంగయ్య ఆధ్వర్యంలో ఎస్సైలు, సిబ్బంది పలు కూడళ్లలో విస్తృతంగా దాడులు నిర్వహించి 69 బైకులు సీజ్ చేశారు. చోదకులను ట్రాఫిక్ పోలీసుస్టేషన్‌కు పిలిపించి బుధవారం మంత్రణం చేశారు. రహదారి ప్రమాదాల లఘుచిత్రాన్ని చూపించిన పిదప నిబంధనలు పాటించేలా తల్లిదండ్రులపై ప్రమాణం చేయించారు. శిరస్త్రాణం ఉన్నట్లు చూపిన తర్వాత మొదటి హెచ్చరికగా వాహనాలు ఇచ్చేశారు. మరో సారి తప్పిదానికి పాల్పడితే కేసులు నమోదు చేస్తామని డీఎస్పీ హెచ్చరించారు.



మంత్రణం చేస్తున్న ట్రాఫిక్ డీఎస్పీ గంగయ్య

## ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించాలి

**కర్నూలు విద్య, న్యూస్‌టుడే:** తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం 2018 కాలమానిని బుధవారం ఉపముఖ్యమంత్రి కేఈ కృష్ణమూర్తి స్థానిక కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో బడుగుబలహీన వర్గాలకు చెందిన విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారని, వారికి నాణ్యమైన విద్యను అందించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులకు ఉందని గుర్తుచేశారు. సీపీఎస్ విధానం రద్దు విషయం ప్రస్తావించగా ఉపాధ్యాయులకు ఆమోదయోగ్యంగా ఉండే విధంగా సాధించడానికి తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. రాష్ట్ర నాయకులు ఎంవీఎస్ రాజు, బి.విజయబాబు, జిల్లా అధ్యక్షుడు ఎం.బజారన్న, ప్రధాన కార్యదర్శి బి.సుభాన్‌సింగ్, హుసేన్, ప్రతాప్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



కాలమానిని ఆవిష్కరిస్తున్న ఉపముఖ్యమంత్రి కేఈ

## దోబీల ఖాళీలను భర్తీ చేయాలి

**కర్నూలు పాతనగరం, న్యూస్‌టుడే:** ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న దోబీ ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని రజక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భాస్కరయ్య డిమాండు చేశారు. స్థానిక కార్మిక కర్షక భవన్‌లో రజక వృత్తిదారుల సంఘం జిల్లా అధ్యక్షుడు నాగరాజు అధ్యక్షతన బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో 2018 కాలమానిని ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ రజకులకు స్థలాలు ఇచ్చి ఇళ్లు కట్టించి ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. ప్రతి జిల్లాలో ఆశ్రమ పాఠశాలలు ఏర్పాటు చేయాలని, ప్రత్యేక రక్షణ చట్టాన్ని ఏర్పాటుచేయాలని కోరారు. 50 సంవత్సరాలు నిండిన రజకులకు పించను మంజూరు చేయాలన్నారు. వృత్తిసంఘాల సమన్వయ కమిటీ కన్వీనరు జె.ఎన్.శేషయ్య మాట్లాడుతూ సమస్యలపై రాబోయే రోజుల్లో ఉద్యమాలు చేస్తామన్నారు. జిల్లా అధ్యక్షుడు గుణశేఖర్, కమిటీ కన్వీనర్ శేషయ్య, పి.మనోహరమ్మ, సి.జయమ్మ హనుమంతు, సి.హెచ్.శ్రీనివాసులు, శేఖర్‌బాబు, ముక్కన్న, వెంకటేశ్వర్లు, అంజనమ్మ, గురుస్వామి పాల్గొన్నారు.





మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు భాస్కరయ్య



పాల్గొన్న విద్యార్థులు

## కేవీఆర్ కళాశాలలో సైన్సు ప్రదర్శన

**కర్నూలు విద్య, న్యూస్‌టుడే:** స్థానిక కేవీఆర్ మహిళా కళాశాలలో బుధవారం జీవశాస్త్ర విభాగంలో ప్రిన్సిపల్ సీవీ రాజేశ్వరి అధ్యక్షతన సైన్సు ఎక్స్‌పో నిర్వహించారు. గతేడాదిలో వివిధ దిన, మాసపత్రికల్లో ప్రచురించిన సైన్సు, టెక్నాలజీకి సంబంధించిన అంశాలను ప్రదర్శనలో ఉంచారు. కల్తీ ఆహారం, క్యాన్సర్, పర్యావరణ పరిరక్షణ, భ్రూణహత్యలు, రక్తహీనత అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జీవసాంకేతిక శాఖ అధ్యాపకులు జి.ఇంద్రావతి, పి.సంగీత పాల్గొన్నారు.

## అనధికార నిర్మాణాలతో రద్దీ సమస్యలు

**కర్నూలు (నగరపాలక సంస్థ), న్యూస్‌టుడే:** పార్కింగ్ నిర్దేశించిన స్థలాల్లో దుకాణాలు నిర్మించి వ్యాపారాలు నిర్వహిస్తే బాధ్యులపై శాఖపరమైన చర్యలు తప్పవని నగర సహాయ ప్రణాళికాధికారి శాస్త్రి షబ్నన్ హెచ్చరించారు. బుధవారం అబ్దుల్లాఖాన్ ఎస్టేట్‌లోని పార్కింగ్ స్థలాల్లో ఏర్పాటు చేసిన దుకాణాలను తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్కింగ్ స్థలాలను నిబంధనలకు విరుద్ధంగా వ్యాపారాలకు వినియోగిస్తుండటంతో రద్దీ సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయని.. వ్యాపారులే స్వచ్ఛందంగా అనధికారిక దుకాణాలను తొలగించుకోవాలని లేనిపక్షంలో తామే కఠినంగా వ్యవహరించాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో నగరపాలక ఇంజినీరు రాజశేఖర్, టీపీఎస్ రాజేష్, ఉప ఇంజినీరు భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.



అబ్దుల్లా ఖాన్ ఎస్టేట్ పార్కింగ్ స్థలాల్లోని దుకాణాలను తొలగిస్తున్న నగరపాలక సిబ్బంది

# మంత్రాలయం

## ఇరవై ఆటోలు సీజ్

**మంత్రాలయం, న్యూస్‌టుడే:** మంత్రాలయంలో 20 ఆటోలను సీజ్ చేసి, 40 ఆటోలకు రూ.50వేలు జరిమానా విధించినట్లు ఎస్ఐ శ్రీనివాస నాయక్ బుధవారం తెలిపారు. పరిమితికి మించి ప్రయాణికులను తరలించడం, తాగి వాహనాలు నడిపిన వారిని గుర్తించి ఈ చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. తాగివాహనం నడుపుతున్న ఇద్దరు చోదకులను అరెస్టు చేసి కేసునమోదు చేసినట్లు తెలిపారు.

## తెరపై ఈనాడు

**ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే:** మినీశివ: ఎంసీఏ, శివప్రియ: ఒక క్షణం, రాఘవేంద్ర: 2 కంట్రీస్, అబ్బాస్: టెన్, లక్ష్మణ్ : రాజాదిగ్రేట్, శివ: ప్రాజెక్టు జెడ్(తెలుగు) మినీశ్రీనివాస : హలో.., శ్రీనివాస: జవాన్..

*మాంసం ధరలు (కిలో రూ.ల్లో)*

కోడి మాంసం (వెంకాబ్): 150 మాంసం : 480, డజన్ గుడ్లు: 56

## ఇన్‌ఛార్జి అబ్కారీ సీఐగా నాగసునీత



బాధ్యతలు చేపడుతున్న నాగసునీత


**కోసిగి, న్యూస్‌టుడే:** కోసిగి ఇన్‌ఛార్జి అబ్కారీ సీఐగా నాగసునీత బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆదోని విభాగంలోని పెద్ద హరివాణం నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చినట్లు తెలిపారు. కోసిగి అబ్కారీ సర్కిల్ పరిధిలో అక్రమ మద్యం అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు చేపడతామన్నారు. అలాగే నిత్యం గ్రామాల వారిగా తనిఖీలు చేస్తామన్నారు. తమకు ప్రజలు సైతం సహకరించాలని కోరారు. కార్యక్రమంలో అబ్కారీ ఎస్సై లక్ష్మీదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

## రాణా.. సమస్యల రికాన




పోలీసు గృహసముదాయంలో ప్రమాదకరంగా తేలిన విద్యుత్తు తీగలు

**మాధవరం(మంత్రాలయం), న్యూస్‌టుడే:** మండల పరిధిలోని మాధవరం పోలీసు రాణాలో పోలీసుల నివాస సముదాయం సమస్యల నిలయంగా మారింది. జిల్లా ఎస్పీ గోపినాథ్ జట్టి స్టేషన్ సందర్శించిన సందర్భంగా పలు సమస్యలను గుర్తించిన ఆయన పరిష్కరించాలని స్టేషన్ ఎస్ఐకి సూచించారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ముఖ్యంగా విద్యుత్తు స్విచ్‌బోర్డులు సక్రమంగా లేవు, ప్రమాదకరంగా తీగలు తేలడం, విద్యుత్తు దీపాలు లేకపోవడం, పాత ఎస్ఐ నివాస భవనం శిథిలావస్థలో ఉండడం తదితర సమస్యలను ఎస్పీ గుర్తించారు. భవనం తొలగించాలని ఆదేశించారు. నేటికి అవి అలాగే ఉండటంతో నివాసం ఉంటున్న సిబ్బంది కుటుంబాలకు ఇబ్బందికరంగా మారాయి. వీటితోపాటు పలు ఇతర సమస్యలు వేదిస్తున్నాయి. దీంతో పోలీసు సిబ్బంది కుటుంబాలు వివిధ ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు ప్రధాన కూడలిలో అమర్చిన నాలుగు కెమెరాల్లో ఒకటి పనిచేయడంలేదు.



శిథిలావస్థలో ఎస్ఐ భవనం



పనిచేయని ఒక సీసీ కెమెరా

## అనాథలను ఆదుకోవడం ఆర్డీటీ లక్ష్యం

**కోసిగి, న్యూస్‌టుడే:** అనాథలు, వృద్ధులను ఆదుకోవడమే ఆర్డీటీ లక్ష్యమని ఆ సంస్థ ప్రాంతీయ సంచాలకుడు షణ్ముకరావు అన్నారు. బుధవారం స్థానిక ఆర్డీటీ కార్యాలయంలో అనాథలు, వృద్ధులు 35 మందికి నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న స్థానిక ఎస్‌బీఐ మేనేజరు పురుషోత్తం మాట్లాడుతూ ఆర్డీటీ సంస్థ పేదలను ఆదుకునే పనులు చేయడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో సంస్థ అధికారులు బాషా, రామాంజి, శ్రీనివాసులు, నెట్టెకంఠయ్య, నాయక్ ఉన్నారు.



కోసిగిలో నిత్యావసర సరకులు పంపిణీ చేస్తున్న ఎస్బీఐ మేనేజరు, ఆర్డీటీ సంస్థ అధికారులు

## పరిమితి మించితే ప్రమాదం



ఆటో చోదకులకు సూచనలు చేస్తున్న సీఐ డి.రాము

**మంత్రాలయం, న్యూస్‌టుడే:** ఆటోల్లో ప్రయాణికుల సంఖ్య పరిమితికి మించితే ప్రమాదాలు జరిగే ముప్పు పెరుగుతుందని మంత్రాలయం సీఐ డి.రాము అన్నారు. ఎమ్మిగనూరు మండలంలో జరిగిన ఘోర రహదారి ప్రమాదాన్ని దృష్టిలో ఉంచుకొని మంత్రాలయం, మాధవరం పోలీసు స్టేషన్ పరిధిలోని ఆటో చోదకులకు బుధవారం మంత్రాంగం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. అందరూ ట్రాఫిక్ నిబంధనల ప్రకారం నడుచుకోవాలన్నారు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవడం, అతివేగం, గ్రామాల్లో రహదారులపై అడ్డదిడ్డంగా తిప్పడంతో ప్రమాదాలు జరుగుతాయని హెచ్చరించారు. ప్రమాదాలు ఎక్కువగా అతివేగం, పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవడంతోనే జరుగుతున్నాయన్నారు. పది రూపాయాల ఆశకు వెళ్తే కోట్లు ఇచ్చినా తిరిగిరాని ప్రాణాలు పోతాయన్నారు. ప్రయాణికుల ప్రాణాలను రక్షించాల్సిన బాధ్యత చోదకులదేనన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ శ్రీనివాసనాయక్, రాజారెడ్డి, ఏఎస్ఐ మూర్తి తదితరులు ఉన్నారు.



మాధవరంలో తనిఖీలు చేస్తున్న పోలీసులు

## వైభవంగా ప్రభావళి మహోత్సవము

**ఎమ్మిగనూరు వ్యవసాయం, న్యూస్‌టుడే:** శ్రీనీలకంఠేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు సందర్భంగా బుధవారం రాత్రి 9 గంటల నుంచి 12 గంటల వరకు ప్రభావళి మహోత్సవము వైభవంగా నిర్వహించారు. ఉత్సవమూర్తిని ప్రభపై ఉంచి బసవన్న దేవాలయం వరకు ఊరేగించారు. అక్కడ పూజలు చేసి మంగళహారతి ఇచ్చారు. ప్రభావళి ముందు నందికోలలు ఆడుతూ ముందుకు సాగారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ ఈవో రామాంజనేయులు, ఆలయ వంశపారంపర్య ధర్మకర్త మాచాని నీలకంఠప్ప నాగరాజు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



ప్రభోత్సవానికి ఊరేగింపుగా వెళ్తున్న ధర్మకర్త మండలి సభ్యులు

## అర్హులందరికి సంక్షేమ పథకాలు

➡ జన్మభూమి-మాఊరులో అధికారులు



52-బసాపురంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ మధుసూదన్‌రెడ్డి

**రాంపురం, బసాపురం(మంత్రాలయం), న్యూస్‌టుడే:** అర్హులందరికి సంక్షేమ పథకాలు అందివ్వడానికే జన్మభూమి-మా ఊరు కార్యక్రమం అని ఎంపీడీఓ మధుసూదన్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలో రాంపురం, బసాపురం గ్రామాల్లో జన్మభూమి మా ఊరు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో నోడల్ అధికారి బాలనాయక్, తహసీల్దార్ పద్మనాభరావు, భీమిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


**జుమ్మాలదిన్నె(కోసిగి), న్యూస్‌టుడే:** జన్మభూమి-మాఊరు కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యలు పరిష్కరించనున్నట్లు రాష్ట్ర వాల్మీకి సంఘాల సమాఖ్య అధ్యక్షుడు, కర్నూలు పార్లమెంటరీ నియోజకవర్గ తెదేపా బాధ్యుడు బీటీ నాయుడు అన్నారు. బుధవారం మండల పరిధిలోని జుమ్మాలదిన్నె, కామనదొడ్డి గ్రామాల్లో ప్రత్యేక అధికారి రవీంద్రనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఇందులో ఎంపీడీఓ వరలక్ష్మి, ఇన్‌ఛార్జి తహసీల్దారు రజనీకాంతరెడ్డి, ఈఓపీఆర్డీ అయ్యన్న, ఆయా శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



కల్లుకుంటలో మహిళలకు సీమంతాలు చేస్తున్న నియోజకవర్గ అభివృద్ధి అధికారి

**కల్లుకుంట(పెద్దకడబూరు), న్యూస్‌టుడే:** రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జన్మభూమి-మా ఊరు కార్యక్రమ నియోజకవర్గ అభివృద్ధి అధికారి సుధాకర్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన మండల పరిధిలోని కల్లుకుంట, మేకడోన గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో మండల నోడల్ అధికారి రమేష్‌రెడ్డి, తెదేపా జిల్లా కార్యదర్శి రమాకాంతరెడ్డి, సీడీపీఓ శాంతిదుర్గ, ఎంపీడీఓ వరప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

**కాత్రికి, లింగాలదిన్నె, బాపురం(కౌతాళం గ్రామీణ), న్యూస్‌టుడే:** మండలంలోని కాత్రికి, లింగాలదిన్నె, బాపురం గ్రామాల్లో బుధవారం జన్మభూమి-మా ఊరు నిర్వహించారు. కార్యక్రమంలో తెదేపా నాయకుడు శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర వాల్మీకి సంఘాల సమాఖ్య డైరెక్టరు హులిగయ్య, నోడల్ అధికారి సత్యనారాయణ చౌదరి మాట్లాడుతూ కాత్రికి గ్రామంలో ఎక్కువగా సీసీ రహదారులు, పించన్లు, ఇచ్చిన ఘనత తెదేపాదే అన్నారు. తెదేపా నాయకులు చెన్నబసప్ప, తహసీల్దారు శ్రీనివాసరావు, ఎంపీడీఓ బంగారమ్మ ఎస్సై సుబ్రహ్మణ్యం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కాత్రికి: రేషన్ కార్డులను పంపిణీ చేస్తున్న తెదేపా నాయకులు శ్రీనివాసరెడ్డి, హులిగయ్య

# మంత్రాలయం

## తుంగభద్రపై జలాశయం నిర్మించాలి

**మేళిగనూరు(కౌతాళం గ్రామీణ):** తుంగభద్ర నదిపై మేళిగనూరు వద్ద జలాశయం నిర్మించి కౌతాలం, కోసిగి, పెదకడబూరు మండలాలకు తాగు, సాగునీరందించాలని సీపీఎం నాయకులు మల్లయ్య, లింగన్న కోరారు. ఈ మేరకు వినతి పత్రాన్ని మండల నోడల్ అధికారి సత్యనారాయణచౌదరి, తెదేపా నాయకులు శ్రీనివాసరెడ్డి, హులిగయ్య, చన్నబస్సప్పలకు అందజేశారు.



# ఘనంగా సావిత్రిబాయి పూలె జయంతి



కౌతాళం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సావిత్రిబాయి పూలె చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఉపాధ్యాయులు



కోసిగిలో సావిత్రి పూలె చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

**కోసిగి, న్యూస్‌టుడే:** స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఆదర్శ పాఠశాల, మండల పరిధిలోని కందుకూరు, పల్లెపాడు తదితర పాఠశాలల్లో బుధవారం ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా సావిత్రి బాయి పూలె జయంతి వేడుకలు నిర్వహించారు. ముందుగా సావిత్రిబాయి పూలె చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.

స్త్రీ విద్య కోసం ఆమె ఎంతో కృషి చేశారన్నారు. కులవివక్ష, భేదాలను తొలగించేందుకు పోరాటాలు చేసినట్లు పేర్కొన్నారు. ప్రతి ఒక విద్యార్థిని ఆమెను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పశువైద్యశాఖ ఏడీ పార్థసారథి, వైస్ ప్రిన్సిపల్ శ్రీనివాసులు, ఆదర్శపాఠశాల ప్రిన్సిపల్ తిప్పయ్య, శోభారాణి, బాషా, భాస్కర్, యుగంధర్ ఉన్నారు.

◆ **పెద్దకడబూరు, న్యూస్‌టుడే:** సావిత్రిబాయి పూలె గొప్ప సంఘ సంస్కర్త అని యూటీఎఫ్ మండల అధ్యక్షులు రాజు పేర్కొన్నారు. పూలె జయంతి సందర్భంగా బుధవారం మండల పరిధిలోని కల్లుకుంట గ్రామ ప్రాథమికోన్నత పాఠశాలలో ఆమె చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పూలె కులవ్యవస్థ, బాలికవిద్య కోసం పోరాటం చేశారన్నారు. మహిళల, బాలికల హక్కుల కోసం ఉద్యమించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయకుమారి, ఉపాధ్యాయులు సువర్ణ, జయలక్ష్మి, సరోజ, ఈరన్న, మల్లికార్జున, శివకుమార్ పాల్గొన్నారు.

◆ **కౌతాళం, న్యూస్‌టుడే:** మండల కేంద్రమైన కౌతాళంలోని వివిధ పాఠశాలల్లో సావిత్రిబాయి పూలె జయంతి ఘనంగా నిర్వహించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు జగదీశ్వరయ్య ఆధ్వర్యంలో మహిళా ఉపాధ్యాయులు సావిత్రి బాయి పూలె చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రముఖ సంఘసంస్కర్త జ్యోతిరావు పూలే సతిమణిగా ఆయన అడుగుజాడల్లోను నడుస్తూ సమాజం కోసం పాటుపడిన ఆర్యమూర్తి అని కొనియాడారు. స్త్రీ విద్య కోసం ఉద్యయం చేసిన మొదటి ఉపాధ్యాయురాలని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు భాగ్యమ్మ, శివపార్వతి, విజయశాంతి, సలీం తదితరులు పాల్గొన్నారు. మరోవైపు స్థానిక ప్రైవేటు పాఠశాలలో నిర్వాహకులు దూద్‌బాషా, ప్రధానోపాధ్యాయురాలు జ్ఞానేశ్వరి ఆధ్వర్యంలో పూలె జయంతి నిర్వహించారు.



కల్లుకుంటలో...



పల్లెపాడులో....

## ఆ కేంద్రం మరోచోట నిర్మించాలి

### విద్యార్థులకు, ప్రజలు ఇబ్బందులు

**కోసిగి, న్యూస్‌టుడే:** స్థానిక సాంఘిక సంక్షేమ వసతిగృహం సమీపంలో చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రం నిర్మించొద్దని, దీంతో భవిష్యత్తులో విద్యార్థులకు, స్థానిక ప్రజలకు సమస్యలు వస్తాయని బుధవారం పీడీఎస్‌యూ నాయకుడు లోకరెడ్డి, ఏఐఎస్ఎఫ్ నాయకుడు రాజు ఆధ్వర్యంలో నిర్మాణ పనులు అడ్డుకొన్నారు. స్థానికులు కూడా ఇందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రం గ్రామం వెలుపల నిర్మించకుండా ప్రభుత్వ పాఠశాల, వసతిగృహం, అంగన్‌వాడీ కేంద్రం మధ్య నిర్మించడం ఏంటని ప్రశ్నించారు. దీని నుంచి వచ్చే కంపుతో విద్యార్థులు అనారోగ్యాల పలవుతారన్నారు. అలాగే సమీప కాలనీవాసులు ఇబ్బంది పడతారని తెలిపారు. సంబంధిత అధికారులు స్పందించి నిర్మాణ పనులు ఆపాలని కోరారు. అనంతరం పోలీసులు జోక్యం చేసుకొని సమస్యను శాంతియుతంగా పరిష్కరించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు కాళప్ప, రాంబాబు, ప్రకాష్, ప్రజలు ఉన్నారు.



కోసిగిలో నిర్మాణ పనులకు అడ్డుకొంటున్న పీడీఎస్‌యూ, ఏఐఎస్ఎఫ్ నాయకులు, ప్రజలు

## బాల్యవివాహం బాలికలకు ప్రమాదకరం

**హాల్వి(కౌతాళం గ్రామీణ), న్యూస్‌టుడే:** మండలంలోని హాల్వి గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాల్యవివాహాలు, ఆరోగ్య సమస్యలపై మహిళా సమతా సొసైటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. బాల్య వివాహాల వల్ల ఆరోగ్యం, బిడ్డలో ఎదుగుదలలో వచ్చే సమస్యలపై నాటిక రూపంలో వివరించారు. కార్యక్రమంలో సమన్వయకర్తలు జ్యోతి, గ్లోరి, రాణి, హసీనా, భాగ్యలక్ష్మి, శివమ్మ తదితరులు పాల్గొన్నారు.



హాల్వి: నాటికలో ఓ సన్నివేశం

## శ్రీమఠంలో నేటి పూజలు

**మంత్రాలయం, న్యూస్‌టుడే:** పుణ్యక్షేత్రమైన మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠంలో ధనుర్మాసం సందర్భంగా గురువారం వేకువజాము నుంచే ప్రహ్లాదరాయల పాదపూజ, కనకాభిషేకం, మూలబృందావనానికి పంచామృతాభిషేకం, కనకకవచ సమర్పణ, అలంకరణ, బంగారు పల్లకోత్సవం, అర్చన సహిత హస్తోదకం సేవలు నిర్వహించనున్నారు. తెల్లవారుజామున 4.30 గంటల నుంచి 8గంటలలోపు పూజలు పూర్తిచేస్తారు. సాయంత్రం ప్రాకారంలో కొయ్య, వెండి, బంగారు రథాల ఊరేగింపు, ఊంజల్‌సేవ జరపనున్నారు.

**దర్శన వేళలు:** తెల్లవారుజామున 4.30 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు, సాయంత్రం 4 నుంచి రాత్రి 9 గంటల వరకు దర్శనం చేసుకోవచ్చు.

**అన్నపూర్ణభోజనశాల:** ఉదయం 10.00 గంటల నుంచి 12.30 గంటల వరకు.సాయంత్రం 7.30గంటల నుంచి 9గంటల వరకు.

**వసతి గృహాల సమాచారం:** డీవీజీ(దీరేంద్ర), వ్యాస మందిరం, పంచముఖిదర్శన్, సర్వజ్ఞమందిరం, సుజయీంద్ర విశ్రాంతిభవన్, విజయ్‌విఠల్ మందిరం, వీవీజీ(వందగదులు), సుయతీంద్ర విశ్రాంతి నిలయం(200 గదులు).సీఆర్వో(ముఖ్య కార్యాలయం) ఫోన్ నంబరు: కోడ్ 08512-279 659, 279 495, ఎస్వీజీ: 85006 88990, బృందావన్‌గార్డెన్: 85006 88996, అంతర్జాలంలో ఎస్ఆర్ఎస్‌మఠ్.ఓఆర్‌జీ(వెబ్‌సైట్)లో గదులు నమోదుచేసుకోవచ్చు.50గదులు అందుబాటులో ఉన్నాయి.

**శ్రీమఠం మేనేజర్ కార్యాలయం:** 279 888, సెల్ 94400 77284, పీఆర్వో(పూజా సమాచారం కోసం) కార్యాలయం: 279 700.

**రవాణా సమాచారం:** మంత్రాలయం ఆర్టీసీ బస్టాండ్ విచారణ కేంద్రం: 279 477, తుంగభద్ర రైల్వేస్టేషన్(మంత్రాలయం రోడ్) విచారణ కేంద్రం: 259 930, మంత్రాలయం పోలీసు స్టేషన్ : 279 433.

## వైభవంగా రాఘవేంద్రస్వామి పూజలు

### పీఠాధిపతి ధార్మిక పర్యటన


**మంత్రాలయం, న్యూస్‌టుడే:** పుణ్యక్షేత్రమైన మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠంలో పీఠాధిపతి సుబుదేంద్రతీర్థుల ఆధ్వర్యంలో స్వామి మూలబృందావనానికి నిత్యపూజలు బుధవారం వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా పీఠాధిపతి మూలరాముల పూజలు, ప్రహ్లాదరాయలకు పాదపూజ, కనకాభిషేకం, ధూపదీప నైవేద్యం సమర్పించి హారతిచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులను ఫలమంత్రాక్షితలు ఇచ్చి ఆశీర్వదించారు. కాగా కర్ణాటకలో ధార్మిక కార్యక్రమాల్లో పాల్గొనేందుకు శిష్యులతో కలసి సాయంత్రం వెళ్లారు. పిఠాధిపతి రెండు రోజుల పాటు ధార్మిక పర్యటనలో ఉండనున్నట్లు అధికారులు తెలిపారు.



అలంకరణలో స్వామి బృందావనం

## భక్తుల సందడి

**ఉరుకుంద (కౌతాళం), న్యూస్‌టుడే:** ప్రముఖ పుణ్యక్షేత్రం ఉరుకుంద ఈరన్న స్వామి విశేషదినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం సాయంత్రం నుంచి విశేష సంఖ్యలో తరలి వచ్చారు. ముందురోజు రాత్రి స్వామి సన్నిధిలో నిద్రించడం భక్తుల ఆనవాయితీ. దీంతో భక్తులు విడిది గదుల్లోనే కాకుండా ఆలయ పరిసరాల్లో నిద్రకు ఉపక్రమించారు. ఆలయ అధికారులు కళామండపం వద్ద ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. అర్చకులు స్వామివారి మూలవిరాట్‌ను ప్రత్యేకంగా ముస్తాబు చేసి పూజలు నిర్వహించారు. బేతంచర్లకు చెందిన భక్తురాలు ధనలక్ష్మి శాశ్వత అన్నదాన సేవకు రూ.10 వేలు విరాళం అందజేశారు.



పూజలందుకుంటున్న ఈరన్న స్వామి



విరాళం ఇస్తున్న భక్తుడు

## ఈరన్న సన్నిధిలో నేటి పూజలు

**ఉరుకుంద(కౌతాళం), న్యూస్‌టుడే:** స్వామివారి విశేషరోజు గురువారాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు కొనసాగుతాయి.

◆ **అలంకరణ :** తెల్లవారుజామున 4 నుంచి 5 వరకు ఆలయ శుభ్రత, స్వామివారి మూలవిరాట్ అలంకరణ సేవ.

◆ **దర్శన వేళలు :** తెల్లవారుజాము 5 నుంచి రాత్రి 7.30కు మహా మంగళహారతి వరకు నిరంతర దర్శనాలు సాగుతాయి.

◆ **పూజలు :** సుప్రభాత సేవ, మంగళహారతి, నైవేద్యాలు, ఆకు పూజలు, నామార్చనలు నిర్వహిస్తారు.

◆ **ప్రత్యేక పూజలు :** విశేషదినోత్సవాన్ని పురస్కరించుకుని ఉదయం 8 నుంచి 11 గంటల వరకు అనివేటి మండపంలో పంచామృతాభిషేకాలు, సాయంత్రం 6 నుంచి 7 వరకు స్వామివారి పల్లకి సేవలు కొనసాగుతాయి. వీటిలో పాల్గొనదలచిన భక్తులు ప్రత్యేక రుసుము చెల్లించాల్సి ఉంటుంది.

◆ **భోజనాలు :** స్వామివారికి మధ్యాహ్నం 12.30కు నైవేద్యాలు సమర్పించాక అన్నదాన సత్రం భక్తులకు భోజనాలు ఏర్పాటు చేస్తారు. మధ్యాహ్నం 3 వరకు కొనసాగుతాయి.

◆ **వసతి :** ఆలయం తరుపున సామూహిక వసతి గృహాలతో పాటు భక్తులు నిర్మించిన విడిది గదులు ఉన్నాయి. ఇందుకోసం సంప్రదించాల్సిన చరవాణి సంఖ్య: **96529 84876.**

# నందికొట్కూరు

## ఉచిత సలహాలను సద్వినియోగం చేసుకోవాలి

**పగిడ్యాల, న్యూస్‌టుడే:** పారాలీగల్ వలంటీర్లు రాజ్యాంగ చట్టాలపై ఇస్తున్న సలహాలను గ్రామీణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని విశ్రాంత న్యాయవాది వెంకటరమణ అన్నారు. బుధవారం పగిడ్యాల పంచాయతీ కార్యాలయంలో పారాలీగల్ వలంటీర్లకు పలు చట్టాలపై అవగాహన కల్పించి శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి తారకేశ్వరీ, పారాలీగల్ వలంటీర్లు నాగన్న,శేషన్న, తదితరులు పాల్గొన్నారు.

## ఇస్కాల కబడ్డీ విజేతలు బండిఆత్మకూరు

**ఇస్కాల(పాములపాడు),న్యూస్‌టుడే:** ఇస్కాలలో జరుగుతున్న జిల్లా స్థాయి కబడ్డీ పోటీల ఫైనల్స్‌లో బండిఆత్మకూరు జట్టు విజేతగా నిలిచింది. సీఎస్ఐ సంఘం ఆధ్వర్యంలో జరిగిన పోటీల్లో మొత్తం 32 జట్లు పాల్గొన్నాయి. బుధవారం బండిఆత్మకూరు గొందిపర్ల జట్ల మధ్య ఫైనల్ పోటీలు జరిగాయి. బండిఆత్మకూరుకు రూ.20 వేలు, గొందిపర్లకు రూ.12 వేలు, తృతీయ బహుమతి నందికొట్కూరు జట్టుకు రూ.6 వేలు అందించారు.

# మహిళల్లో మరింత చైతన్యం

### ➠ సమాజంపై అవగాహనకు శిక్షణ తరగతులు ➠ డ్వాక్రా సంఘాల బలోపేతం దిశగా అడుగులు



లీడర్లకు శిక్షణ ఇస్తున్న వెలుగు సిబ్బంది

**పగిడ్యాల, న్యూస్‌టుడే:** డ్వాక్రా సంఘాలను మరింత బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం ప్రణాళికలను అమలు పరుస్తోంది. ఇందులో భాగంగా గ్రామాల్లోని చిన్న సంఘాలను అభివృద్ధిపథంలో నడిపించేందుకు సంఘాల లీడర్లకు ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహిస్తోంది. సమాజంపై అవగాహన, నాయకత్వ లక్షణాలు, యాజమాన్య విధానాలు, ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పిస్తే మహిళలు సమాజగతిని మార్చగలరనే ఉద్దేశంతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. గతంలో అధికారులు యానిమేటర్ల మాయాజాలంతో కొన్ని సంఘాల పేరిట బ్యాంకుల నుంచి రుణాలను పక్కదారి పట్టించారు. ఈరుణాలను చెల్లించాలని బ్యాంకుల వారు గ్రూపులకు వద్దకు వచ్చి నోటీసులు ఇస్తున్నారు. సంఘాల మహిళలు లబోదిబోమంటున్నారు. ఇలాంటి పరిస్థితులు తలెత్తకుండా సభ్యులు రుణాలు ఎలా పొందాలి, తర్వాత వారు పాటించాల్సిన బాధ్యతలను శిక్షణలో తెలియజేస్తున్నారు. నియోజకవర్గంలో 4690 పొదుపు సంఘాల లీడర్లకు శిక్షణను ప్రారంభించి పలు విడతలుగా ముగించారు. రెండో విడతగా జన్మభూమి అనంతరం నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఒక గ్రామంలో ఇరుగు పొరుగున నివసించే 10 నుంచి 15 మంది పేద మహిళలు ఒక స్వయం సహాయక సంఘంగా ఏర్పడి వారి సామాజిక, ఆర్థిక ఉన్నతి కోసం కృషి చేయడమే ఈ సంఘాల లక్ష్యంగా శిక్షణ ఇస్తున్నారు. సమావేశాలు, నిరంతర పొదుపు, అంతర్గత అప్పులు, ఖాతా పుస్తకాల నిర్వహణ, సంఘాల అభివృద్ధికి సభ్యులు పాటించాల్సిన పది సూత్రాలు, మంచి సంఘానికి ఉండాల్సిన లక్షణాలు, గ్రేడింగ్, తప్పక రాయల్సిన పుస్తకాలు, ప్రాజెక్టులో సిబ్బంది పాత్ర, డ్వాక్రా సంఘాలకు బ్యాంకులకు వడ్డీ లేని రుణాలు, చంద్రన్న పసుపు కుంకుమ, ఉన్నత జీవనోపాధులు, స్త్రీనిధి, మొక్కల పెంపకం, ఉపాధి తదితర అంశాలపై శిక్షణ అవగాహన కల్పిస్తున్నారు. సంఘం నిధి ఎలా ఉపయోగించుకోవాలి ? బ్యాంకుల్లో రుణాలు తీసుకునేటప్పుడు పాటించాల్సిన ముఖ్య అంశాలను చర్చిస్తున్నారు. ఇలా ఆయా నియోజకవర్గంలోని ఆరు మండలాల్లోని వెలుగు కార్యాలయాల్లో విడతల వారీగా చిన్న సంఘాల లీడర్లకు శిక్షణ ఇస్తున్నారు.

**నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో పొదుపు సంఘాలు మహిళల వివరాలు ఇలా ఉన్నాయి**

| మండలం | సంఘాలు | మహిళలు |
|---|---|---|
| పగిడ్యాల | 758 | 8200 |
| నందికొట్కూరు | 766 | 8430 |
| మిడ్తూరు | 788 | 8420 |
| కొత్తపల్లి | 681 | 7150 |
| జూపాడుబంగ్లా | 848 | 9200 |
| పాములపాడు | 849 | 9400 |
| మొత్తం | 4690 | 50,800 |



**కొత్త విషయాలు తెలిశాయి – ఉశేనమ్మ, పగిడ్యాల**

ఒక రోజు శిక్షణతో సంఘం లావాదేవీల గురించి అనేక అంశాలు తెలిశాయి. లావాదేవీలు, లెక్కలు చూడడం, ఖాతాలు సరిచూడటం, ఇలా అన్ని అంశాలు తెలుసుకుంటున్నాం. ఈశిక్షణ ద్వారా సంఘం ఎలా నిర్వహించాలో అవగాహన కల్గింది.



**అక్రమాలను ఎదుర్కోవడం ఎలాగో తెలిసింది**

– రమిజాబీ, ప్రాతకోట

చిన్న సంఘాల లీడర్లకు ప్రత్యేక శిక్షణ ఇవ్వడంతో నిర్వహణపై అవగాహన పెరుగుతోంది. గతంలో కొన్ని విషయాలే తెలిసేవి. శిక్షణ తర్వాత బ్యాంకుల వద్ద ఎలా కట్టాలి, ముఖ్యంగా బ్యాంకు రుణాల చెల్లింపుల్లో అవకతవకలను ఎలా ఎదుర్కోవాలో తెలిసింది.



**సంఘాలకు నేతృత్వం వహించేలా..**

– జిల్లా సమాఖ్య కార్యదర్శి సుమనశ్రీ

చిన్న సంఘాల బలోపేతానికి శిక్షణ పూర్తిస్థాయిలో దోహద పడుతుంది. సంఘాల నిర్వహణ ప్రభుత్వ కార్యక్రమాలపై అవగాహన, మహిళల జీవనోపాధి పెంపొందించుకుంటూ ఆర్థికాభివృద్ధి సాధిస్తారు. చిన్న సంఘాల్లో వచ్చే సమస్యలు, విజయాలు, లోపాలపై చర్చించుకోవడం గ్రామాల్లో నాయకత్వం వహించేలా శిక్షణ ఇస్తున్నాం.

## కేసీ కాల్వకు నీటి విడుదల నిలిపివేత

**నందికొట్కూరు, న్యూస్‌టుడే:** చివరి ఆయకట్టుకు నీరు అందించాలన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఆదేశానుసారం మల్యాల, ముచ్చుమర్రి పథకాల నుంచి కేసీకి నీటిని విడుదల చేశారు. రెండు రోజుల కిందట ముచ్చుమర్రి పథకం నుంచి సాంకేతిక కారణాలతో నీటి విడుదలను నిలిపివేశారు. మల్యాల వద్ద నుంచి రెండు మోటర్లతో విడుదల చేస్తున్న నీటిని ఒక్క పంపు ద్వారానే విడుదల చేస్తున్నారు. ఒక్క పంపు ద్వారా నీటిని విడుదల చేయడంతో జిల్లాలోని చివరి ఆయకట్టుకు నీరు అందడం లేదు. ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు. నీటి విడుదల విషయమై కలెక్టరేట్ కార్యాలయం వద్ద ధర్నా చేసేందుకు ఆయకట్టు రైతులు సమాయత్తమవుతున్నారు.



మల్యాల పథకం వద్ద కేసీ కాల్వకు నిలిచిన నీరు




క్యాలెండరు విడుదల చేస్తున్న ఉపాధ్యాయులు

## ఉపాధ్యాయ సమస్యలపై నిరంతర పోరాటం

**కొత్తపల్లి, న్యూస్‌టుడే:** ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంపై పీఆర్‌టీయూ నిరంతరం పోరాటం సాగిస్తుందని పీఆర్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఇబ్రహీం, ఇదురూస్‌లు పేర్కొన్నారు. జడ్పీటీసీ సభ్యులు పురుషోత్తంరెడ్డి చేతులమీదుగా క్యాలెండరు ఆవిష్కరించారు. పీఆర్‌టీయూ నాయకులు ఖాజామొహిద్దీన్, సాంబశివుడులు, సలీం, నూర్‌మహమ్మద్, చాంద్‌బాషలు పాల్గొన్నారు.

## సావిత్రిబాయి పూలేని ఆదర్శంగా తీసుకోవాలి

**నందికొట్కూరు, న్యూస్‌టుడే:** మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలుగా సావిత్రిబాయి పూలేను ఆదర్శంగా తీసుకుని ఆమె అడుగుజాడల్లో నడవాలని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు పుష్పలత పేర్కొన్నారు. పూలే జయంతి వేడుకల సందర్భంగా బుధవారం ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.

☛ పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో స్థానిక బాలికల వసతి గృహంలో సావిత్రిపూలే జయంతిని జరుపుకొన్నారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**పాములపాడు,న్యూస్‌టుడే:** సామాజిక విప్లవకారిణి సావిత్రీబాయి పూలే అని ప్రజాసంఘాల నాయకులు అన్నారు. బుధవారం పాములపాడులో సావిత్రిబాయిపూలే జయంతిని పురస్కరించుకొని ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ప్రజాసంఘాలు, స్వచ్ఛంద సంస్థ నాయకులు షర్ఫుద్దీన్, స్వాములు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో సావిత్రిపూలే జయంతి వేడుకలు

**కొత్తపల్లి, న్యూస్‌టుడే:** సావిత్రిపూలేబాయి జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయినులు రాజేశ్వరమ్మ, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయభారతి, వసంతలక్ష్మిలు పాల్గొన్నారు.

## వెంకటేశ్వరస్వామి ఆలయంలో దీపోత్సవం



ప్రత్యేక అలంకరణలో వెంకటేశ్వరస్వామి

**నందికొట్కూరు, న్యూస్‌టుడే:** పట్టణంలోని శ్రీవెంకటేశ్వర ఆలయంలో బుధవారం దీపోత్సవ కార్యక్రమం నిర్వహించారు. తెల్లవారు జామున వెంకటేశ్వరస్వామికి కృష్ణ శర్మ, శ్రీనివాస శర్మ ఆధ్వర్యంలో పంచామృతంతో అభిషేకం చేశారు. అనంతరం ప్రత్యేకంగా పూలతో అలంకరించారు. ధనుర్మాసం సందర్భంగా భక్తులు దీపోత్సవాన్ని నిర్వహించారు. అమ్మవారి చిత్రం ముగ్గుతో వేసి చుట్టూ దీపాలు ఉంచారు. మధ్యలో అమ్మవారు దీప కాంతులతో వెలుగొందారు. కార్యక్రమం అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.



జ్యోతులను వెలిగిస్తున్న భక్తులు

## బరక సంజీవరాయ స్వామి పల్లకీ ఊరేగింపు

**రోళ్లపాడు(మిడుతూరు), న్యూస్‌టుడే:** మండలంలోని రోళ్లపాడు సమీపంలో వెలసిన శ్రీ బరక సంజీవ రాయ స్వామి వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఊరూరా పల్లకీ సేవ నిర్వహిస్తున్నట్లు ధర్మకర్త మురళీమోహన్‌రెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని తలముడిపిలో బరక సంజీవరాయ స్వామిని పల్లకీలో ఉంచుకుని భక్తులు గ్రామంలో ఊరేగించారు. ఈ సందర్భంగా భక్తులు స్వామికి బియ్యం, కందిబేడలు, బెల్లం, తదితర నిత్యావసర సరకులను అందజేశారు. అనంతరం భక్తులు స్వామికి ప్రత్యేక పూజలు చేశారు.



తలముడిపిలో స్వామిని ఊరేగిస్తున్న భక్తులు

## పాఠశాలకు అదనపు తరగతి గదులు మంజూరు చేయండి

**పడమర ప్రాతకోట (పగిడ్యాల), న్యూస్‌టుడే:** మండలంలోని పడమర ప్రాతకోటలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో తరగతి గదులు శిథిలావస్థకు చేరుకున్నాయని నూతన భవనాలను మంజూరు చేయాలని మండల విద్యాధికారి సుభాన్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్ మండల ప్రత్యేక అధికారి వీరారెడ్డికి వినతిపత్రం సమర్పించారు.

# నందికొట్కూరు



## జన్మభూమి రుణం తీర్చుకోవాలి

- బాలికల ఉన్నత పాఠశాలను దత్తత తీసుకున్న పోలీసులు
- క్రీడాభివృద్ధికి పోలీసుల కృషి ఉంటుంది
- మైదానం అభివృద్ధి చేయాలని పోలీసులకు ఆదేశం

**నందికొట్కూరు, న్యూస్‌టుడే:** మనం పుట్టిన ఊరు, జిల్లా, రాష్ట్రం ఇలా జన్మభూమిపై ఉన్నందుకు రుణం తీర్చుకోవాలని, కుల, మతాలకు అతీతంగా ఉంటూ కలిసి మెలిసి జీవనం సాగించాలని, పరస్పర సహాయ సహకారాలతో ఉండాలని రాయలసీమ ఐజీ మహమ్మద్‌ఇక్బాల్ ప్రజలను కోరారు. బుధవారం నందికొట్కూరు మండలంలోని అల్లూరు, పురపాలకలోని 5, 6 వార్డుల్లో నందికొట్కూరు తెలుగుదేశం బాధ్యుడు మాండ్రశివానందరెడ్డితో కలిసి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న జన్మభూమి కార్యక్రమం వల్ల ప్రజలు, అధికారులు ఒక గొడుగు కిందికి వచ్చి చర్చించుకోవడం, సమస్యలను పరిష్కరించుకునేందుకు ఒక వేదికగా ఉంటున్నారు. అనంతరం మాండ్ర మాట్లాడుతూ మూడేళ్లుగా పురపాలకలో జరిగిన అభివృద్ధి గురించి వివరించారు. జడ్పీ ఛైర్మన్ రాజశేఖర్ అతిథులు కలిసి నూతనంగా మంజూరైన పింఛన్లు, రేషన్‌కార్డులను పంపిణీ చేశారు. అల్లూరులో ప్రత్యేక అధికారి సుదర్శన్‌కుమార్, ఎంపీపీ ప్రసాదరెడ్డి, వివిధ శాఖల అధికారులు, పురపాలకలో కమిషనర్ కేవీఎన్‌రెడ్డి, అధ్యక్షురాలు సుబ్బమ్మ, వివిధ శాఖల అధికారులు, డీఎస్పీ మహేంద్రరెడ్డి, నందికొట్కూరు సీఐ వెంకటరమణ, ఎస్సైలు, తదితరులు పాల్గొన్నారు.

**బడి రుణం తీర్చుకోవాలి-ఐజీ**

పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలను దత్తత తీసుకుని అభివృద్ధి చేస్తున్నట్లు రాయలసీమ ఐజీ మహమ్మద్‌ఇక్బాల్ చెప్పారు. బుధవారం నందికొట్కూరు బాలికల ఉన్నత పాఠశాలను సందర్శించిన ఆయన మైదానాన్ని, ప్రహరీని పరిశీలించారు. మైదానాన్ని పూర్తి స్థాయిలో మెరుగు పరచాలని, ప్రహరీ వద్ద ఉన్న పిచ్చి మొక్కలను తొలగించి శుభ్రంగా ఉంచాలని డీఎస్పీకి, నందికొట్కూరు సీఐ వెంకటరమణ, ఎస్సై లక్ష్మీనారాయణకు సూచించారు. మైదానంలో కంకర రాళ్లు ఉండకుండా తొలగించాలని చెబుతూ కొన్నింటిని పికాసీతో తొలగించి చూపించారు. అనంతరం క్రీడాకారులతో మాట్లాడారు. చివరగా మైదానంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాయలసీమ ఐజీ మహమ్మద్‌ఇక్బాల్

## ఇది ప్రచారవేదిక: ఎమ్మెల్యే

- సమస్యల పరిష్కారవేదిక: తెదేపా బాధ్యుడు మాండ్ర

**మిడుతూరు,న్యూస్‌టుడే:** తెదేపా ప్రభుత్వం నిర్వహిస్తున్న జన్మభూమి-మా ఊరు కార్యక్రమం ఆ పార్టీకి ఓ ప్రచార వేదికగా మారిందని నందికొట్కూరు ఎమ్మెల్యే ఐజయ్య ఆరోపించారు. బుధవారం మండలంలోని తలముడిపిలో జరిగిన జన్మభూమి కార్యక్రమానికి నియోజకవర్గ ఎమ్మెల్యే ఐజయ్య హాజరయ్యారు. కొద్దిసేపటికి నియోజకవర్గ తెదేపా బాధ్యుడు మాండ్ర శివానందరెడ్డి, జడ్పీ ఛైర్మన్ మల్లెల రాజశేఖర్, విపణి కేంద్రం అధ్యక్షుడు రమణారెడ్డి తదితరులు వచ్చారు. దీంతో సమావేశం ఒక్కసారిగా వేడెక్కింది. అధికారులు సంక్షేమ పథకాలపై మాట్లాడుతుండగా కల్పించుకున్న ఎమ్మెల్యే ఎన్ని దరఖాస్తులు వచ్చాయి, వాటిలో ఎన్నింటికి పరిష్కారం లభించింది, ఇంకా పరిష్కారం కాని దరఖాస్తులు ఎన్ని అన్న విషయాలపై సమాచారం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంతో ఆశతో వచ్చిన ప్రజలు నిరాశతో వెనుదిరగాల్సిందేనా, వారికి దిక్కెవరూ అంటూ ఎమ్మెల్యే ప్రశ్నించారు. తెదేపా నాయకులు కమీషన్లకు పాల్పడుతున్నారని ఎమ్మెల్యే ఆరోపిస్తుండగా పక్కనే ఉన్న మాండ్ర ఎమ్మెల్యే చేతుల్లోంచి మైకు లాక్కునేందుకు ప్రయత్నించగా ఇరువురి మధ్య కొంత ఘర్షణ వాతావరణం నెలకొంది. జడ్పీ ఛైర్మన్ మల్లెల రాజశేఖర్ జోక్యం చేసుకోవడంతో సమావేశంలో తీవ్ర గందరగోళం నెలకొంది. గ్రామస్థులు ఈ పరిణామంతో బిత్తర పోయారు. తెదేపా నాయకులు ఏది చెప్పినా ఎమ్మెల్యే వినే స్థితిలో లేక పోవడంతో ఛైర్మన్ తలపట్టుకుని కూర్చున్నారు. తమ అధినేత చేస్తున్న అభివృద్ధి పనులతో ఏ నాయకుడు పోటీ పడలేరని, జగన్‌లా తమ నేత ఆస్తులు బెట్టుకోలేదని మాండ్ర,జడ్పీ ఛైర్మన్ విమర్శలు గుప్పించారు. మల్లెల రాజశేఖర్ కల్పించుకుంటూ పింఛన్ల మంజూరు ప్రక్రియలో ప్రభుత్వం నిర్దిష్టంగా నియమ నిబంధనలు ఏర్పాటు చేసిందని, దీనిపై ఏమైనా అభ్యంతరాలుంటే అసెంబ్లీలో ప్రశ్నించాలని స్పష్టం చేశారు. అక్కడ ఉన్న ప్రజలు ఏం జరుగుతుందోనని తీవ్ర ఉత్కంఠకు గురయ్యారు . అనంతరం సమావేశం యథావిధిగా సాఫీగా కొనసాగింది.



ఎమ్మెల్యే ఐజయ్య , జడ్పీ ఛైర్మన్‌ల మధ్య వాగ్వాదం

**ఆరోపణలు నిరూపిస్తే రాజకీయాలకు స్వస్తి ... తెదేపా నాయకులు**

**తలముడిపి (మిడుతూరు), న్యూస్‌టుడే:** జన్మభూమి కమిటీ సభ్యులు పింఛన్ల మంజూరు కోసం వచ్చిన దరఖాస్తుదారుల నుంచి కమీషన్లు తీసుకుంటున్నారని నందికొట్కూరు ఎమ్మెల్యే ఐజయ్య ఆరోపించారు. ఎమ్మెల్యే ఆరోపణలను నిరూపిస్తే రాజకీయాలకు స్వస్తి చెప్పి గ్రామం విడిచి వెళతానని స్థానిక తెదేపా నాయకుడు శివరామిరెడ్డి సవాల్ విసిరారు. ఇరుపార్టీల నేతల మధ్య వాగ్వాదం కొనసాగింది. చివరకు జడ్పీ ఛైర్మన్ కల్పించుకుని గ్రామ సమస్యల పరిష్కారానికి ఏర్పాటు చేసిన జన్మభూమి సభలను పక్కదారి పట్టించవద్దని వారికి సూచించారు. అనంతరం రేషన్‌కార్డుల పంపిణీతో కార్యక్రమం ముగిసింది.



జన్మభూమి కార్యక్రమం వద్ద పాఠశాల గేట్లు వేసి నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

## స్వచ్ఛతతోనే అందరికీ ఆరోగ్యం

- ప్రభుత్వ విధానాలపై సీపీఎం నిరసన


**లింగాల(పాములపాడు),న్యూస్‌టుడే:** స్వచ్ఛతతోనే అందరికీ ఆరోగ్యం సిద్ధిస్తుందని నోడల్‌అధికారి మస్తాన్‌వలి అన్నారు. బుధవారం మండలంలోని లింగాల, చెలిమిల్ల గ్రామాల్లో జన్మభూమి-మాఊరు కార్యక్రమం నిర్వహించారు. లింగాలలో జరుగుతున్న కార్యక్రమంలో సీపీఎం పార్టీ నాయకుడు రామేశ్వరావు మాట్లాడుతూ రైతుల మూడో విడత రుణమాఫీ, ప్రభుత్వ విధానాలపై విమర్శించారు. రైతు సమస్యలను అడ్డుతగలడంతో పాఠశాల గేట్లు వేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నోడల్ అధికారి మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు అందరికీ అందేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు నృత్యం చేశారు. అనంతరం లబ్ధిదారులకు రేషన్, చంద్రన్నబీమా, రుణమాఫీ పత్రాలు అందించారు. లింగాల నుంచి 149, చెలిమిల్ల నుంచి 83 దరఖాస్తులు అందాయి. ఈకార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు ఆదినారాయణ, సుశీలమ్మ, తహసీల్దారు నాగేంద్రరావు, ఎంపీడీఓ దశరథరామయ్య, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

**నేడు నెహ్రూనగర్‌లో..**

**నెహ్రూనగర్ (పగిడ్యాల), న్యూస్‌టుడే:** ఈనెల 4న మండలంలోని నెహ్రూనగర్‌లో జన్మభూమి మా ఊరు కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ విజయలక్ష్మి తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజలు కావాల్సిన సంక్షేమ పథకాలపై దరఖాస్తులు ఇవ్వాలని సూచించారు. గత జన్మభూమిలో దరఖాస్తు చేసుకున్న వారికి సంక్షేమ పథకాలు మంజూరు చేసేలా జిల్లా ఉన్నత అధికారులకు నివేదికలు పంపుతామన్నారు. మండల స్థాయి అధికారులు ఆయా శాఖల వారిగా ప్రగతి నివేదికలు తెచ్చి ప్రజలకు వివరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండలస్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు హాజరయి విజయవంతం చేయాలని ఆమె కోరారు.

## రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు

**జూపాడుబంగ్లా, న్యూస్‌టుడే :** తెదేపా ప్రభుత్వం రాజకీయాలకు అతీతంగా ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అమలు చేయడమే చంద్రబాబు ధ్యేయమని తెదేపా జిల్లా ఉపాధ్యక్షుడు గిరీశ్వరరెడ్డి అన్నారు. మండలంలోని తరిగోపుల గ్రామంలో బుధవారం జన్మభూమి-మాఊరు సర్పంచి దీవెనమ్మ అధ్యక్షతన నిర్వహించారు. పొదుపు మహిళలకు బకాయి ఉన్న వడ్డీలను, మంజూరైన రేషన్‌కార్డులను అధికారులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నోడల్ అధికారి రమణయ్య, ఎంపీడీఓ సుబ్బారెడ్డి, తహసీల్దార్ జాకీర్‌హుసేన్, తెదేపా మండల నాయకులు మోహన్‌రెడ్డి, కృష్ణయ్య, శ్రీనివాసులు, రమణారెడ్డి, నారాయణరెడ్డి, రవికాంత్, రంగారెడ్డి, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రేషన్‌కార్డులను పంపిణీ చేస్తున్న తెదేపా జిల్లా ఉపాధ్యక్షుడు గిరీశ్వరరెడ్డి,అధికారులు

## ప్రజల వద్దకే అధికారులు

**పగిడ్యాల, న్యూస్‌టుడే:** ప్రజల వద్దకే సంక్షేమ పథకాలను తీసుకెళ్లడమే జన్మభూమి కార్యక్రమ లక్ష్యమని మండల ప్రత్యేక అధికారి వీరారెడ్డి అన్నారు. బుధవారం లక్ష్మాపురంలో సర్పంచి ధనలక్ష్మి అధ్యక్షతన జన్మభూమి మా ఊరు కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ పుల్యాల దివ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసే సంక్షేమ పథకాలను నిజమైన అర్హులకు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రత్యేక అధికారి మాట్లాడుతుండగా బుడగ జంగాలు తమ కులాన్ని ఎస్టీ జాబితాలో చేర్చాలని, రైతు రథం ట్రాక్టర్లు అర్హులకు లేకుండా ఉన్నత వర్గాలకు చెందిన వారికే ఇచ్చారని, ఎంపీడీఓ విజయలక్ష్మి, ఎంపీపీ సలహాదారుడు నాగిరెడ్డి, తహసీల్దార్ కుమార స్వామి, ఏఓ శ్రీనివాస రెడ్డి, ఐసీడీఎస్ పర్యవేక్షకురాలు వరలక్ష్మి, పద్మావతి, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



రైతు రథం ట్రాక్టర్ ఉన్నత వర్గాలకే ఇచ్చారని ఆరోపిస్తున్న యువరైతు రమణ



పౌష్టికాహార స్టాల్ పరిశీలిస్తున్న తహసీల్దారు

## ప్రజా సమస్యల పరిష్కారం

**కొత్తపల్లి, న్యూస్‌టుడే:** జన్మభూమి మా ఊరు కార్యక్రమంతోనే ప్రజా సమస్యలు పరిష్కారమవుతాయని తహసీల్దారు రామకృష్ణుడు పేర్కొన్నారు. జన్మభూమి మా ఊరు కార్యక్రమంలో భాగంగా బుధవారం ముసలిమడుగు గ్రామ సర్పంచి సవినాబీ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. వైద్యఆరోగ్యశాఖ, ఐసీడీఎస్ శాఖల ఆధ్వర్యంలో నిర్వహించిన స్టాళ్లను పరిశీలించారు. అనంతరం సామాజిక పింఛన్లు, రేషన్‌కార్డులు, పక్కా గృహాలు, వ్యక్తిగత మరుగుదొడ్లకు దరఖాస్తులు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ కమలాకర్, వ్యవసాయాధికారి నాగేంద్రప్రసాదు, ఎంఈఓ శ్రీరాములు, వైద్యాధికారి శిరీష, ఏపీఓ ఉషారాణి, ఏపీఎం మహేశ్వరమ్మ, వీఆర్‌ఓలు పాల్గొన్నారు

## తెరపై ఈనాడు

శివశంకర్ - 2 కంట్రీస్, మినీఅప్సర - ఆక్సిజన్, శ్రీకృష్ణ - హలో, శ్రీరామ - ఎంసీఏ, శాంతి - ఒక్క క్షణం

### కూరగాయల ధరలు (బుధవారం కిలో...రూ.ల్లో)

వంకాయలు - 30, ఆలుగడ్డ (తెల్లగడ్డలు) - 40, ఎర్రగడ్డలు - 40, మిరపకాయలు (సీడురకం) - 40, నాటుకరం - 40, దొండకాయలు - 60, దోసకాయలు - 40, బెండకాయలు - 40, ఉల్లిగడ్డలు - 30 నుంచి 50, టమోట - 5, బీరకాయ - 40, క్యాబేజి - 40,

### మాంసం ధరలు (కిలో...రూ.ల్లో)

పొట్టేలు, మేక - 440, బ్రాయిలర్ చికెన్ - 170, స్కిన్‌లెస్ చికెన్ - 190, నాటు చికెన్ - 400, గుడ్లు డజను - 60, హోల్‌సేల్ - 56, చేపలు - 120 నుంచి 150.

### పండ్ల ధరలు (కిలో...రూ.ల్లో)

యాపిల్ - 80 నుంచి 140, నల్ల ద్రాక్ష - 80, తెల్ల ద్రాక్ష - 60, దానిమ్మ - 60 నుంచి 100, అరటిపండు (డజను)- 50 నుంచి 70, సుగంధాలు అరటి (డజను) - 30 నుంచి 40, కమల పండ్లు - 40 నుంచి 60, జామ - 40, సీడు రేగు పండ్లు - 40,

### నిత్యావసర వస్తువుల ధరలు (కిలో...రూ.ల్లో)

రాయచూరు జొన్నలు - 42, మహేంద్ర జొన్నలు - 30, సోనా మసూరి బియ్యం - 40, కందిబేడలు (తాండూరు) - 80, సాధారణం - 70, శనగబేడలు - 70, పామాయిల్ - 78, వేరుశనగ నూనె - 90, సూర్యకాంతి నూనె - 85, మైదాపిండి - 30, వేరుశనగ విత్తనాలు - 85, చింతపండు - 160, ఎర్ర మిరపకాయ - 80, నువ్వులు - 100.

# నంద్యాల

## పొదుపుపై మహిళలకు అవగాహన

**సాంబవరం, పార్వతీపురం (గోస్పాడు):** మండలంలోని సాంబవరం, పార్వతీపురం గ్రామాల్లో జన్మభూమి వేడుకలు నిర్వహించారు. సాంబవరంలో ఏపీఎం ఎల్లయ్య ఆధ్వర్యంలో సాధికారమిత్రలు మహిళలకు పొదుపు చేసుకునే విధానంపై అవగాహన కల్పించారు. ఆరోగ్య కార్యకర్త సుజాత గర్భిణులు, బాలింతలు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. పార్వతీపురం ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు ఖోఖో పోటీలు నిర్వహించారు.

## రేషన్ దుకాణాలపై దాడులు

**నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే:** పట్టణంలోని వివిధ రేషన్ దుకాణాలపై తూనికలు, కొలతల శాఖ అధికారులు దాడులు నిర్వహించారు. నంద్యాల శాఖ పర్యవేక్షకుడు పరమేశ్వర్ బుధవారం సాయంత్రం దాడులు నిర్వహించి నాలుగు దుకాణాలపై కేసులు నమోదు చేశారు. తూనికలు, కొలతల్లో తేడాలు గుర్తించి కేసులు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. తదుపరి విచారణ నిమిత్తం దస్త్రాలు స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు.


మాట్లాడుతున్న సీఆర్పీ గౌరీశంకర్

## ఉపాధ్యాయులకు అవగాహన

**ఎం చింతకుంట్ల (గోస్పాడు), న్యూస్‌టుడే:** మండలంలోని ఎం చింతకుంట్లలో తరల్ శిక్షణపై ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. మండల అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్ గౌరీశంకర్ విద్యార్థులకు చేతిరాత, చదవడంపై చర్చించారు. విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే పద్ధతులను తెలిపారు. విద్యార్థులకు ఆటపాటలతో విద్యను నేర్పడం ఎంతో ప్రయోజనమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


ధర్నా చేస్తున్న కార్మికులు

## కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ధర్నా

నంద్యాల క్రీడా విభాగం, న్యూస్‌టుడే: నంద్యాల ఆర్టీసీ డిపోలో కార్మిక సమస్యలు పరిష్కరించాలని ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు డిపో ఎదుట బుధవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా డిపో అధ్యక్ష, కార్యదర్శులు శివారెడ్డి, ఆర్ఎస్ రావు మాట్లాడుతూ.. కార్మికులపై పని భారం పెంచుతున్నారని ఆరోపించారు. చిన్న తప్పిదాలకు అక్రమ సస్పెన్షన్లు చేస్తూ కార్మికులను ఒత్తిడి గురిచేస్తున్నారని పేర్కొన్నారు. ఇప్పటికైనా అధికారులు తమ వైఖరిని మార్చుకుని కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు కృష్ణయ్య, వెంకటేశ్వర్లు, మద్దిలేటి, లక్ష్మయ్య, తదితరులు పాల్గొన్నారు.


నిరాశ్రితులకు దుస్తులు అందజేస్తున్న ప్రతినిధులు

## సంఘమిత్ర ఆధ్వర్యంలో దుస్తుల పంపిణీ

**నంద్యాల క్రీడా విభాగం, న్యూస్‌టుడే:** సంఘమిత్ర సేవా సంఘం ద్వారా నిరాశ్రిత బాలుర ఆవాసంతోపాటు చెంచుగూడెంలో దుస్తుల పంపిణీ చేపడుతామని సంఘమిత్ర అధ్యక్షుడు నాగసుబ్బారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం పాతమడుగుల, నాగలూటీ, బైర్లూటీ, నల్వకాల్వ వంటి చెంచుగూడెంల్లో చీరలు, దుప్పట్లు, చిన్నపిల్లలకు పెద్దలకు దుస్తులు అందజేశామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి శ్రీనివాస్, విజయశ్రీ, వెంకటేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

# వ్యవసాయం.. 'భవనం' నిస్సాయం

### ❒ కలగా మారిన సొంత నిర్మాణాలు ❒ ఇతర శాఖ భవనాల్లో విధులు

**నంద్యాల వ్యవసాయం, న్యూస్‌టుడే:** నిత్యం అన్నదాతలతో మమేకమయ్యే వ్యవసాయ శాఖలో సొంత భవనాల కొరత వేధిస్తోంది. రోజురోజుకు పెరిగిన కార్యక్రమాలు, ఆన్‌లైన్ సేవలతో ఆ శాఖ సిబ్బంది తీరిక లేకుండా గడుపుతున్నారు. అయితే వ్యవసాయ శాఖలో పలుచోట్ల మండల వ్యవసాయాధికారి కార్యాలయాలకు భవనాల కొరత ఏర్పడింది. నంద్యాల వ్యవసాయ సబ్ డివిజన్‌లో నంద్యాల, మహానంది, గడివేముల మండలాలతోపాటు గోస్పాడు మండలంలో వ్యవసాయ కార్యాలయాల భవనాల నిర్మాణాలు కలగా మారాయి. ఉన్నతాధికారులకు వ్యవసాయ శాఖ సిబ్బంది పలుసార్లు విన్నవించినా ఫలితం లేదు. వ్యవసాయ శాఖకు సొంత భవనాలు లేకపోవడంతో సిబ్బంది విధులు నిర్వహించేందుకు అసౌకర్యానికి గురవుతున్నారు. కర్షకులు కార్యాలయాలకు వస్తే కనీసం కూర్చునే పరిస్థితి లేదు.

ఆయిల్ సీడ్స్ ప్రోగ్రాం నిధుల్లో 20 ఏళ్ల క్రితం నిర్మించిన నంద్యాల మండల వ్యవసాయ కార్యాలయ భవనం ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకుంది. విధులు నిర్వహించేందుకు అనువుగా లేకపోవడంతో కార్యాలయం ఆవరణలో ఆత్మ ప్రాజెక్టు భవనంలో విధులు నిర్వహిస్తున్నారు.


శిథిలావస్థకు చేరుకున్న నంద్యాల మండల వ్యవసాయ కార్యాలయం

మండల వ్యవసాయాధికారి మాత్రం భవనం పైగదిలో ఉంటున్నారు.

### గోస్పాడులో భవనమే లేదు..

**నివేదన**

గోస్పాడు మండలంలో వ్యవసాయ శాఖకు కార్యాలయ భవనమే లేదు. దాంతో సిబ్బంది ఎంపీడీవో కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్నారు. ఇరుకైన గదిలో విధుల నిర్వహణ ఇబ్బందిగా ఉండటంతో సిబ్బంది పలుసార్లు స్థలం కేటాయించాలని రెవెన్యూ అధికారులకు విన్నవించారు. భవన నిర్మాణం కోసం రూ.10 లక్షలు సిద్ధంగా ఉన్నాయి. అయితే స్థలాభావం కారణంగా అక్కడ భవన నిర్మాణం కావడం లేదు.

| మండలం | ఏఈవోలు | ఎంపీఈవోలు | రైతులు |
|---|---|---|---|
| నంద్యాల | ఆరుగురు | ఏడుగురు | 11,490 |
| గోస్పాడు | తొమ్మిది | ముగ్గురు | 11,413 |
| మహానంది | నలుగురు | నలుగురు | 7,452 |
| గడివేముల | ఐదుగురు | ఐదుగురు | 10,553 |

### మహానంది కార్యాలయం నంద్యాలలో..

మహానంది వ్యవసాయ శాఖ కార్యాలయం నంద్యాల ఆత్మ ప్రాజెక్టు భవనంలో కొనసాగుతుండటం గమనార్హం. అక్కడ కార్యాలయ భవనం లేకపోవడంతో ఇక్కడ విధులు నిర్వహిస్తున్నారు. 2008లో మహానందిలో వ్యవసాయ కార్యాలయ భవనానికి స్థల సేకరణ జరిగింది. అప్పట్లో భవన నిర్మాణానికి వ్యవసాయాధికారులు భూమిపూజ సైతం చేశారు. రాజకీయ కారణాలతో ఆ నిర్మాణం నోచుకోలేకపోయింది.


స్థలం కేటాయించాలని గోస్పాడు తహసీల్దార్ సుధాకర్‌కు వినతిపత్రం ఇస్తున్న గోస్పాడు ఏవో సుధాకర్ (పాతచిత్రం)

### ఒకే గదిలో రెండు కార్యాలయాలు

గడివేముల మండలంలో వ్యవసాయ కార్యాలయ భవనం లేదు. ఎంపీడీవో కార్యాలయంలోని ఓ గదిలో కొనసాగుతోంది. అయితే ఇదే గదిలో వయోజన విద్యా కార్యాలయం నిర్వహిస్తుండటంతో ఇబ్బందిగా మారింది.

### ఉన్నతాధికారులకు విన్నవిస్తాం

**- నర్సిరెడ్డి, ఏడీఏ, నంద్యాల**



నంద్యాల వ్యవసాయ సబ్ డివిజన్‌లో వ్యవసాయ కార్యాలయాలకు సొంత భవనాలు లేక సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. సొంత భవనాలకు కావాల్సిన నిధులు కేటాయించాలని ఉన్నతాధికారులకు విన్నవిస్తాం. ఈ ఏడాది నిధులు మంజూరయ్యే అవకాశాలు ఉన్నాయి.

## అంతర్జాతీయ సదస్సులో ప్రతిభ

**నంద్యాల క్రీడా విభాగం, న్యూస్‌టుడే:** 2017 డిసెంబరు 27 నుంచి 30 వరకు తిరుచునాపల్లిలో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ మేనేజ్‌మెంట్ ఏర్పాటు చేసిన ఐఎస్‌డీఎస్‌ఐ అంతర్జాతీయ పరిశోధన సదస్సులో నంద్యాల రామకృష్ణ విద్యాసంస్థల మేనేజ్‌మెంట్ సహాయ ఆచార్యుడు హేమంత్‌రెడ్డి ప్రతిభ సాధించారు. ఈ సందర్భంగా బుధవారం ఆయనకు కళాశాలలో సన్మానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విద్యా సంస్థల అధినేత రామకృష్ణారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా సహాయ ఆచార్యుడు మాట్లాడుతూ.. తమ వ్యాసం స్టూడెంట్ సిటీజన్‌షిప్ బిహేవియర్ అనే అంశంపై చేశానన్నారు. ఈ అంశాన్ని తయారు చేయడానికి నూతనమైన స్కేల్ తయారు చేసి సదస్సులో ప్రదర్శించానన్నారు. దీని తయారీకి 7 నెలలు పట్టిందన్నారు. ఈ అంతర్జాతీయ సదస్సులో మొత్తం 1200 పేపర్లు వచ్చాయని అందులో ఆంధ్రప్రదేశ్ తరపున ఎంపిక కావడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల సంచాలకుడు చంద్రశేఖర్‌రావు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.


హేమంత్‌రెడ్డిని సన్మానిస్తున్న ముఖ్య అతిథులు

## డీఎం బాధ్యతల స్వీకరణ

**నంద్యాల క్రీడావిభాగం, న్యూస్‌టుడే:** నంద్యాల ఆర్టీసీ డిపో మేనేజర్‌గా సర్దార్ ఉసేన్ బుధవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. కర్నూలులో పర్సనల్ ఆఫీసర్‌గా పని చేస్తున్న ఆయన బదిలీపై నంద్యాలకు వచ్చారు. ఇక్కడ పని డీఎంగా చేస్తున్న శ్యాంసుందర్ తెలంగాణకు బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా సర్దార్ ఉసేన్ మాట్లాడుతూ.. 2008, 09లో ఇక్కడ ఏడీఎంగా పని చేసిన అనుభవం ఉందన్నారు. నంద్యాల బస్టాండు అభివృద్ధిలో ఉంది, దీనిని అలాగే కొనసాగించి ప్రయాణికులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా మెరుగైన సేవలందించడానికి చర్యలు తీసుకుంటానన్నారు.

## నడిరోడ్డుపై ఆగిన లారీ

**నంద్యాల గ్రామీణం, న్యూస్‌టుడే:** కర్నూలు-చిత్తూరు జాతీయ రహదారిపై బుధవారం ఉదయం 6 గంటల సమయంలో నంద్యాల పట్టణంలోని నూనెపల్లె ఉపరితల వంతెన వద్ద కర్నూలు వైపు వెళ్తున్న లారీ మరమ్మతుకులోనే నడిరోడ్డుపై ఆగిపోయింది. దాంతో జాతీయ రహదారిపై వెళ్లే వాహనదారులు, ప్రయాణికులు ఐదు గంటలపాటు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. నడిరోడ్డు, జాతీయ రహదారి కావడంతో రెండువైపులా భారీగా వాహనాలు వచ్చి నిలిచాయి. పోలీసులు సకాలంలో స్పందించి ఘటనా స్థలానికి చేరుకుని ఒకవైపు ఉన్న వాహనాలను పంపుతూ రెండోవైపు వాహనాలను ఆపివేశారు. దీంతో కొద్దిసేపటికీ ట్రాఫిక్ పునరుద్ధరణ జరిగింది. కానీ లారీ 11 గంటల వరకు రహదారిపైనే ఉండటంతో అంత వరకు పోలీసులు నూనెపల్లె నుంచి అటు బొమ్మలసత్రం వరకు, నూనెపల్లె నుంచి చాబోలు రస్తా వరకు రోడ్డు మీదనే ఉండి ఎదురెదురుగా వాహనాలు రాకుండా చూశారు. ఆ తర్వాత 11 గంటలకు లారీకి మరమ్మతులు చేయడంతో అక్కడి నుంచి వెళ్లిపోయింది.


నూనెపల్లెలో రోడ్డు మధ్యలో ఆగిన లారీ

## రైతుబజారులో కూరగాయల ధరలు (కిలో రూ.లలో)

(నిన్నటివి)

టమోట 6, పోలూరు వంకాయ 26, బెండకాయ 32, పచ్చిమిర్చి 28, కాకరకాయ 38, బీరకాయ 40, క్యాబేజి 24, క్యారెట్ 42, దొండ 26, ఆలుగడ్డ 20, ఉల్లిగడ్డ 46, సొరకాయలు 20, మట్టికాయలు 24, దోసకాయ 24 ముల్లంగి 34 , బీట్‌రూట్ 34, అల్లం 80.

# నంద్యాల

24 గంటల అత్యవసర వైద్య సేవలకు 108కు ఫోన్ చేయండి



# రహదార్ల నిర్మాణంలో జాప్యం చేస్తే కఠిన చర్యలు

**నంద్యాల, న్యూస్‌టుడే:** పట్టణంలో రహదార్ల విస్తరణ పూర్తయిన తర్వాత నూతన రహదార్ల నిర్మాణం చాలా నత్త నడకన సాగుతోందని శాసన మండలి ఛైర్మన్ ఎన్ఎండీ ఫరూక్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణంలో మూడు వార్డుల్లో జరిగిన జన్మభూమిలో ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందారెడ్డితో కలసి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఫరూక్ మాట్లాడుతూ.. రహదార్ల నిర్మాణాన్ని ప్రారంభించి ఆరు నెలలు గడుస్తోందని, అయినా 10 శాతం కూడా పూర్తి కాలేదన్నారు. మళ్లీ ఎన్నికలు సమీపించే సమయం దగ్గర పడిందన్నారు. ఇంతవరకు నత్త నడకన సాగడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. త్వరలో పురపాలక కార్యాలయంలో అభివృద్ధి పనులపై సమీక్షిస్తామని, జాప్యం చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. త్వరలో జిల్లాలో పర్యటించే ముఖ్యమంత్రికి పనుల ప్రగతిపై ఫిర్యాదు చేయబోతున్నామన్నారు. ప్రభుత్వం హిజ్రాల సంక్షేమం కోసం నెలకు రూ.1500 పింఛన్‌ను అమల్లోకి తెచ్చిందన్నారు. ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ.. నంద్యాల పట్టణ ప్రజలకు 13 వేల గృహాలతో సొంతింటి కల తీరబోతుందన్నారు. ఈ సమావేశంలో కమిషనర్ సత్యనారాయణరావు, కౌన్సిలరు భీమనపల్లె వెంకటసుబ్బయ్య, నూర్జహాన్, శ్రీశైల దేవస్థానం మాజీ ఛైర్మన్ జయచంద్రారెడ్డి, కౌన్సిలర్లు కృపాకర్, కొండారెడ్డి, మెప్మా పీడీ రామాంజనేయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఫరూక్, బ్రహ్మానందరెడ్డి చంద్రన్న బీమా కార్డులు, రేషన్ కార్డులను, చంద్రన్న సంక్రాంతి కానుకలను అందజేశారు.



రేషన్ కార్డులను పంపిణీ చేస్తున్న ఫరూక్, బ్రహ్మానందరెడ్డి

### నంద్యాల మండలంలో...

**నంద్యాల గ్రామీణం, న్యూస్‌టుడే:** ప్రజల వద్దకు అధికారులను పంపించి వారి సమస్యలను పరిష్కరించేది ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడేనని, ఇందుకు జన్మభూమి చేపట్టారని ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందారెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని కొత్తపల్లె గ్రామంలోని తహసీల్దార్ జయరామిరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన జన్మభూమి కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. చంద్రబాబు నాయుడు ప్రజా సంక్షేమానికి కృషి చేస్తున్నారన్నారు. ప్రజా సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకు జన్మభూమి చేపట్టారన్నారు. సంక్షేమ పథకాలు అందని వారు ఉంటే వారికి అందజేసేందుకే ఈ కార్యక్రమమన్నారు. కార్యక్రమానికి ఎంపీపీ రామోజీ ప్రభాకర్, ఎంపీడీవో భాస్కర్, సీడీపీవో లీలావతిదేవి, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు. అనంతరం గ్రామంలోని గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. అనంతరం సాయంత్రం విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు.



కొత్తపల్లెలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి

### గోస్పాడు మండలంలో...

**సాంబవరం, ఎం కృష్ణాపురం (గోస్పాడు), న్యూస్‌టుడే:** జన్మభూమి-మన ఊరు ద్వారా సమస్యలు పరిష్కారమవుతాయని నియోజకవర్గం నోడల్ అధికారి జయకుమార్ పేర్కొన్నారు. బుధవారం ఎంపీడీవో సుగుణశ్రీ మండలంలోని సాంబవరంలో జన్మభూమి కార్యక్రమాన్ని సర్పంచి సోమా సరస్వతి ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథులుగా జయకుమార్‌తోపాటు మండల నోడల్ అధికారి నాగరాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా 111 మందికి చంద్రన్న బీమా కింద ఉపకార వేతనాలు పంపిణీ చేశారు. 170 అర్జీలు స్వీకరించారు. ముగ్గుల పోటీలు, వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. అంగన్‌వాడీల ఆధ్వర్యంలో మహిళలకు చీరసారెలు అందించారు. ఈ కార్యక్రమంలో ఏఈ సుగాలన్న, ఉప తహసీల్దార్ రామనాథరెడ్డి, ఎంఈవో అబ్దుల్ కరీం, ఏపీఎం ఎల్లయ్య పలువురు అధికారులు పాల్గొన్నారు.

### ఎం కృష్ణాపురంలో..

మండలంలోని ఎం కృష్ణాపురంలో తహసీల్దార్ సుధాకర్ జన్మభూమి కార్యక్రమాన్ని సర్పంచి కోటేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామసభ నిర్వహించి 8 మందికి కొత్త రేషన్ కార్డులు అందజేశారు. 65 మందికి ఉపకార వేతనాలు పంపిణీ చేశారు. సాధికారమిత్రలకు పుస్తకాలు పంపిణీ చేశారు. 51 మంది నుంచి అర్జీలు స్వీకరించారు. అన్నప్రాసన, ముగ్గుల పోటీలు జరిపారు. కార్యక్రమంలో ఏఈ భాస్కర్, ఏపీవో రామేశ్వరమ్మ, సీసీ శ్రీనివాసులు, పలువురు అధికారులు పాల్గొన్నారు.



సాంబవరంలో చంద్రన్న బీమా దస్త్రం అందజేస్తున్న నియోజకవర్గం నోడల్ అధికారి జయకుమార్



ధర్నా చేస్తున్న ఒప్పంద కార్మికులు

## సమస్యల పరిష్కారానికి ఒప్పంద కార్మికుల ధర్నా

**నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే:** తమ సమస్యల పరిష్కారం కోరుతూ ఏపీ విద్యుత్తు ఒప్పంద కార్మికుల ఐక్య వేదిక ఆధ్వర్యంలో బుధవారం ధర్నా చేపట్టారు. స్థానిక 220 కేవీ విద్యుత్తు కేంద్ర, డీఈ కార్యాలయం ఎదుట సంఘం డివిజన్ అధ్యక్షుడు చంద్రలాల్ మాట్లాడుతూ.. విద్యుత్తు రంగంలో పని చేస్తున్న ఒప్పంద కార్మికులందరినీ విద్యుత్తు సంస్థలో విలీనం చేసుకుని శాఖనే నేరుగా వేతనాలు చెల్లించాలని డిమాండు చేశారు. అనుభవాన్ని, వయస్సును పరిగణలోనికి తీసుకుని కార్మికులందరినీ దశల వారీగా క్రమబద్ధీకరించాలని కోరారు. అనంతరం ట్రాన్స్‌కో డీఈ మధుసూదనరావు, ఎస్పీడీసీఎల్ ఆపరేషన్ డీఈ ఓబులకొండారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సూరియాదవ్, శ్రీనివాసులు, సుధాకర్, చలపతి, విష్ణు, కరీం తదితరులు పాల్గొన్నారు.

## సీపీఎం జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

**నంద్యాల క్రీడా విభాగం, న్యూస్‌టుడే:** ఈ నెల 10, 11, 12 తేదీ ల్లో ఆలూరులో జరిగే సీపీఎం జిల్లా 21వ మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ బుధవారం సీపీఎం కార్యాలయంలో గోడ ప్రతులను ఆ పార్టీ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా నాయకులు మస్తాన్‌వలీ, పట్టణ కార్యదర్శి గౌస్, మండల కార్యదర్శి సద్దాంహుస్సేన్ మాట్లాడుతూ.. 10 నుంచి బహిరంగ సభతో మహాసభలు ప్రారంభమవుతాయని 11, 12 తేదీల్లో ప్రతినిధుల సభ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు మద్దులు, లక్ష్మణ్, నరసింహ, బంగారయ్య, తదితరులు పాల్గొన్నారు.

## అంధులకు క్రీడా పోటీలు ప్రారంభం

**నంద్యాల క్రీడా విభాగం, న్యూస్‌టుడే:** బ్రెయిలీ జయంతిని పురస్కరించుకుని సెయింట్ లూక్స్ అంధుల పాఠశాల ఆధ్వర్యంలో బుధవారం స్థానిక ఎస్పీజీ పాఠశాల మైదానంలో క్రికెట్ పోటీలు ప్రారంభించారు. దీనికి ముఖ్య అతిథులుగా ఆంధ్ర బ్యాంకు మేనేజర్లు హరీష్‌రావు, విశ్వరంజిత్, ఎస్పీజీ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జీవలత, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ దివాకర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. అనంతరం కళాశాల ప్రిన్సిపల్ మాట్లాడుతూ.. మొత్తం 150 మంది క్రీడాకారులు పాల్గొన్నట్లు తెలిపారు. రెండు రోజులు పాటు జరిగే ఈ పోటీలలో క్రికెట్, కబడ్డీ ఇతర ఆటలను నిర్వహస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పీడీ సాలమన్, అంధుల పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ముఖ్య అతిథులు

## రక్తదానం.. ప్రాణదానంతో సమానం



రక్తదానం చేస్తున్న నంది పైపుల ఎండీ శ్రీధర్‌రెడ్డి

**నంద్యాల గ్రామీణం, న్యూస్‌టుడే:** రక్తదానం.. ప్రాణదానంతో సమానమని రాష్ట్ర తెదేపా ప్రధాన కార్యదర్శి, నంది పైపుల ఎండీ సజ్జల శ్రీధర్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన పుట్టిన రోజు సందర్భంగా బొమ్మల సత్రంలోని నంది ఇండోర్ స్టేడియంలో నంది గ్రూప్ సంస్థల ఉద్యోగులు మెగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. దీనికి శ్రీధర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నంది గ్రూపు ఉద్యోగులు తెచ్చిన కేక్‌ను ఆయన కట్ చేశారు. అనంతరం నంది పైపుల ఉద్యోగులతోపాటు ఆయన రక్తదానం చేశారు. ఈ సందర్భంగా శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ.. మనం ఇచ్చే రక్తం మరొకరి ప్రాణం కాపాడుతుందన్నారు. రక్తదానంపై ఇంకా అవగాహన పెరగాల్సి ఉందన్నారు. పట్టణంలో యువతకు రక్తదానంపై అవగాహన బాగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నంద్యాల జిల్లా ఆసుపత్రి వైద్యుడు సుధాకర్ నంది గ్రూప్ ఉద్యోగుల నుంచి రక్తం సేకరించారు. ఈ కార్యక్రమంలో నంది పైపుల డైరెక్టర్ సుజల, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

### నిత్యావసర వస్తువుల పంపిణీ

మండలంలోని క్రాంతినగర్‌లో ఉన్న సెయింట్ ఆన్ మనో వికాస కేంద్రంలోని బాలురకు శ్రీధర్‌రెడ్డి నిత్యావసర సరకులు అందజేశారు. ఆయన కుటుంబ సభ్యులతో కలసి వెళ్లి నిర్వాహకులకు సరకులు పంపిణీ చేశారు. అలాగే మహానంది మండలం గోపవరం సమీపంలో ఉన్న మానసిక వికలాంగులకు శ్రీధర్‌రెడ్డి ప్రతినిధులు వెళ్లి నిత్యావసర సంకులు అందజేశారు.

## మట్కా బీటర్ అరెస్ట్

**నంద్యాల నేరవిభాగం, న్యూస్‌టుడే:** పట్టణంలోని బొమ్మలసత్రంలోని ఉపరితల వంతెన వద్ద మట్కా బీట్ రాస్తున్న వ్యక్తిని మూడో పట్టణ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి రూ. 11,400 స్వాధీనం చేసుకున్నట్లు మూడో పట్ట సీఐ దేవేంద్రకుమార్ తెలిపారు. బుధవారం రాత్రి మూడో పట్టణ పోలీసులు గస్తీ తిరుగుతుండగా, మహానంది మండల బుక్కాపురం గ్రామానికి చెందిన నాగేంద్రుడు బొమ్మలసత్రంలోని ఉపరితల వంతెన వద్ద అనుమానాస్పదంగా కనిపించాడు. దాంతో అతన్ని సోదా చేయగా మట్కా చీటీలు, నగదు ఉండటంతో అదుపులోకి తీసుకొని అతని వద్ద ఉన్న వాటిని స్వాధీనం చేసుకుని అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు.

## చదువు ఉద్యోగం కోసం కాదు

**నంద్యాల క్రీడా విభాగం, న్యూస్‌టుడే:** చదువు కేవలం ఉద్యోగం కోసం అనే భావన చాలా మందిలో ఉంది, చదువు అనేది జ్ఞానం కోసమని రామకృష్ణా విద్యాసంస్థల అధినేత డా.రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. బుధవారం రామకృష్ణ పీజీ కళాశాలలో మూడు రోజులపాటు ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఎంటర్‌ప్రెన్యూర్ అవగాహన శిబిరం ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రామకృష్ణా విద్యాసంస్థల అధినేత డా.రామకృష్ణారెడ్డి, రావుస్ విద్యా సంస్థల ఛైర్మన్ అప్పారావు, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మేనేజర్ ప్రతాప్‌రెడ్డి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ చంద్రశేఖర్‌రావు, హేమంత్‌రెడ్డి, ఎంబీఏ, ఎంకాం సమన్వయకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పాణ్యం





## 5న కుస్తీ పోటీలు

**కర్నూలు క్రీడలు, న్యూస్‌టుడే:** ఈ నెల 5న జిల్లా క్రీడాప్రాధికారిక సంస్థ మైదానంలో ఉదయం 9.00 గంటలకు జిల్లాస్థాయి కుస్తీ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు సంఘం కార్యదర్శి మల్లికార్జున తెలిపారు. ఈనెల 10 నుంచి ప్రకాశం జిల్లాలో జరిగే జూనియర్స్, 20 నుంచి 22వ తేదీ వరకు కడపలో జరిగే సబ్‌జూనియర్స్ రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని వెల్లడించారు. ఆసక్తిగల క్రీడాకారులు నేరుగా పాల్గొనాలని సూచించారు.

## నేడు ఉపాధ్యాయులకు ఒకరోజు శిక్షణ

**కర్నూలు విద్య:** జిల్లాలోని ప్రభుత్వ, జిల్లాపరిషత్, కేజీబీవీ, ఆదర్శ, ఎయిడెడ్ ఉన్నత పాఠశాలల్లో పదోతరగతి బోధించే ఉపాధ్యాయులకు గురువారం స్థానిక వాసవి మహిళా కళాశాలలో ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాధికారిణి తాహెరా సుల్తానా ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు శిక్షణ ఉంటుందని, తెలుగు ఉపాధ్యాయులు తప్పకుండా హాజరుకావాలని ఆదేశించారు.

## పరిశీలకులుగా ఇద్దరు ఐపీఎస్ అధికారులు

**కర్నూలు సచివాలయం:** ఐదో విడత జన్మభూమి-మాఊరు కార్యక్రమం నిర్వహణపై నియోజకవర్గాలకు ప్రత్యేక అధికారులను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వు జారీ చేసింది. శ్రీశైలం నియోజకవర్గానికి డీఐజీ కె.వి.వి గోపాలరావు (ఐపీఎస్) అధికారిని నియమించారు. డోన్ నియోజకవర్గానికి హోంశాఖ ప్రత్యేక కార్యదర్శి మొహమ్మద్ అషాన్ రెజా(ఐపీఎస్)ను నియమించారు. గోపాలరావు బుధవారం జన్మభూమి గ్రామసభల్లో పాల్గొన్నారు.

## యువతకు ఉచిత శిక్షణ

**కర్నూలు పాతనగరం:** నిరుద్యోగ యువకులకు కంప్యూటర్‌లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు నైస్ స్వచ్ఛంద సేవాసంస్థ అధ్యక్షుడు రాయిపాటి శ్రీనివాస్ ప్రకటనలో పేర్కొన్నారు. పదో తరగతి ఉత్తీర్ణత పొంది 18 నుంచి 35 సంవత్సరాలలోపు వయసున్న వారు 5వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. పూర్తి వివరాలకు నైస్ కంప్యూటర్స్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

## పట్టపగలు చోరీ

**కర్నూలు నేరవార్తలు న్యూస్‌టుడే:** కల్లూరు పోలీసుకాలనీలో బుధవారం పట్టపగలు చోరీ జరిగింది. వ్యాపారి జె.ప్రకాశ్ మధ్యాహ్నం బయటకు వెళ్లి సాయంత్రం తిరిగి వచ్చేలోపు దొంగలు ఇంటిని దోచేశారు. రూ.4లక్షల నగదు, ఆరు తులాల బంగారు ఆభరణాలు అపహరణకు గురైనట్లు తెలిసింది. కర్నూలు నాలుగో పట్టణ పోలీసుల కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## తెరపై ఈనాడు

**కర్నూలు బిక్యాంపు, న్యూస్‌టుడే:** ఐనాక్స్ కాంప్లెక్స్: టైగర్ జిందా హై, జ్యామాంజి 2, ప్రాజెక్ట్-జెడ్, ది గ్రేటెస్ట్ షో మ్యాన్, **వి సెల్యూలాయిడ్స్ ఆనంద్ కాంప్లెక్స్:** ఎంసీఏ మిడిల్ క్లాస్ అబ్బాయి, 2 కంట్రీస్, హలో, టైగర్ జిందా హై, జ్యామాంజి (తెలుగు, ఇంగ్లిష్), **భరత్ కాంప్లెక్స్:** ఒక క్షణం, ఎంసీఏ మిడిల్ క్లాస్ అబ్బాయి, 2 కంట్రీస్, **రాజ్:** మిడిల్ క్లాస్ అబ్బాయి, **శ్రీరామ:** హలో.

# ఆసుపత్రిలో ఎవరికివారే..!

**◆ పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణ కరవు ◆ ద్విచక్ర వాహనాలు, ఆటోలతో తీవ్ర ఇబ్బందులు ◆ నియంత్రణ చర్యలు అవసరం అంటున్న రోగులు**

**కర్నూలు వైద్యాలయం, న్యూస్‌టుడే:** సర్వజన వైద్యశాలలో వాహనాల రొద అధికమైంది. ద్విచక్ర వాహనాలు, ఇతర మోటారు వాహనాలకు సంబంధించి రద్దీ నియంత్రణ చర్యలు లేకపోవడంతో ఉదయం వేళల్లో రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఒక్కోసారి అత్యవసర విభాగానికి 108 వాహనాలు వెళ్లాలన్నా దారి ఉండటం లేదు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న రోగులతో వచ్చే ఈ వాహనాలకు ఉదయం 10 నుంచి 12 గంటల సమయంలో తీవ్ర ఆటంకాలు తప్పడం లేదు. రోగుల తాకిడి, ప్రధాన రహదారి వెంట ద్విచక్ర వాహనాలు ఆపడం, మరోవైపు ఆటోల రాకపోకలతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వాహనాలను ఓపీలు, అత్యవసర విభాగం ఎదుట అడ్డదిడ్డంగా పెడుతుండంతో రోగులు ఆసుపత్రిలోకి వెళ్లాలన్నా వీలుకావడం లేదు. ఆసుపత్రి కాపలా సిబ్బంది ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు వీటి నియంత్రణ చేసేవారు. వారికి నాలుగు నెలల నుంచి వేతనాలు చెల్లించకపోవడంతో ఆసుపత్రి అధికారులు వారిని ప్రశ్నించలేని పరిస్థితి.



ఆసుపత్రిలో ప్రధాన రహదారి ఎదుట ద్విచక్ర వాహనాలు

ప్రధానంగా పెద్దాసుపత్రికి సోమ, బుధ, శుక్ర వారాల్లో రోగుల సంఖ్య గణనీయంగా ఉంటుంది. దీనికితోడు భారీ ప్రమాదాలు జరిగినప్పుడు రోగుల బంధువులు, మీడియా ప్రతినిధులు, అధికారులు, ప్రజాప్రతినిధుల రాకతో గందరగోళం నెలకొంటుంది. ప్రాంగణంలో పార్కింగ్ స్థలం ఉన్నప్పటికీ అక్కడ వాహనాలు ఆపకపోవడం ప్రధాన సమస్యగా మారింది. కాపలా సిబ్బంది సేవలు సద్వినియోగం చేసుకోవడంతోపాటు వాహనాలు నిర్దేశిత ప్రాంతంలో ఆపడం, ప్రధాన ద్వారం వద్ద నియంత్రణ కోసం ఇరువైపులా సిబ్బందిని నియమించడం, ప్రధాన రహదారిలో వాహనాలు ఆపకుండా చూడటం వంటి చర్యలు ఆసుపత్రి అధికారులు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

## ఆసుపత్రి సమాచారం

**కర్నూలు వైద్యాలయం, న్యూస్‌టుడే :** సర్వజన వైద్యశాలకు బుధవారం సాయంత్రం వరకు ఓపీకి వచ్చిన వారు 2,350 మంది. వారిలో వివిధ వార్డుల్లో చికిత్సలకోసం చేరినవారు 235 మంది. గురువారం న్యూరోఫిజీషియన్, ప్లాస్టిక్ సర్జరీ, గ్యాస్ట్రో ఎంట్రాలజీతోపాటు అన్ని సాధారణ జబ్బులకు ఓపీ ఉంటుంది.

# మద్యంలో నీళ్ల కల్తీ

**అబ్కారీశాఖ దాడులు, 271 సీసాలు స్వాధీనం**

**కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే:** మద్యనిషేధ, అబ్కారీశాఖ రాష్ట్ర టాస్క్‌ఫోర్స్ కల్తీ మద్యం విక్రయిస్తున్న మద్య దుకాణం బాగోతాన్ని బట్టబయలు చేసింది. రాబడిన సమాచారం మేరకు కల్లూరు మండలం ఉల్లిందకొండ గ్రామంలోని కేసీఆర్ వైన్స్ దుకాణంపై ఆకస్మిక దాడి చేశారు. దుకాణంలో మద్యాన్ని నీళ్లతో కల్తీ చేస్తున్నట్లు గుర్తించారు. దుకాణంలో పనిచేసే లోకేష్‌రెడ్డి, శివశంకర్‌రెడ్డిలతో ఈ బాగోతం నడుపుతున్నట్లు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు. నీళ్ల కలిపిన 271 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. విశ్రాంత డీఎస్పీ కుమారుడు ఈ దుకాణాన్ని నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. ఎంతకాలం నుంచి కల్తీ మద్యం విక్రయిస్తున్నారన్న దానిపై విచారణ చేపట్టారు. దాడిలో ఎస్‌టీఎఫ్ సీఐ కృష్ణమూర్తి, లక్ష్మీనారాయణ, శంకర్, హెడ్ కానిస్టేబుల్ లీలామోహన్ పాల్గొన్నారు. కర్నూలు మండలం ఆర్.కొంతలపాడు గ్రామంలో గొలుసుదుకాణంపై మద్యనిషేధ, అబ్కారీశాఖ సీఐ పద్మావతి, సిబ్బంది దాడులు జరిపి తెలంగాణ రాష్ట్రానికి చెందిన 41 సీసాలు స్వాధీనం చేసుకున్నారు. వెంకటేశ్వరమ్మ అనే మహిళ నిర్వాహకురాలిని అరెస్టు చేశారు.

# ప్రభుత్వ పథకాల సాధన ప్రజల హక్కు

**కర్నూలు (నగరపాలక సంస్థ), న్యూస్‌టుడే:** ప్రభుత్వ పథకాల సాధన ప్రజల హక్కు అని శాసన సభ్యుడు ఎస్వీ మోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం నగరంలోని 4, 5, 6 డివిజన్లలో ఏర్పాటు చేసిన జన్మభూమిలో ఆయన పాల్గొన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా తెదేపా ప్రభుత్వం పథకాలను అమలు చేస్తోందని, వాటిని అర్హులైన ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సంక్షేమ పథకాల లబ్ధి, పౌరసేవలకు నయాపైసా చెల్లించవద్దని, ఎవరైనా లంచం అడిగితే వారి వివరాలను 1100 కు సమాచారం ఇవ్వాలని ఆయన సూచించారు. ఆంధ్రప్రదేశ్‌ను అవినీతి రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు గట్టి చర్యలు తీసుకుంటున్నారని, ఇందుకు ప్రజలు తమ వంతు తోడ్పాటు అందించాలని కోరారు. ఆరో డివిజన్‌లోని జమ్మిచెట్టు వద్ద జన్మభూమిలో పాల్గొన్న కలెక్టర్ సత్యనారాయణ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను అర్హులయిన ప్రతి ఒక్కరికి అందజేస్తామని.. స్థానిక అవసరాలు, సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే అందుకు అనుగుణంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. అన్నివర్గాల ప్రజలకు అవసరమైన పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందని వాటిని వినియోగించుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా గర్భిణులకు సీమంతం నిర్వహించి లబ్ధిదారులకు రేషన్‌కార్డులు అందజేశారు. కార్యక్రమంలో నగరపాలక ఉన్నతాధికారి హరినాథ్‌రెడ్డి, ఇంజినీరు రాజశేఖర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్వీ మోహన్‌రెడ్డి

***నేటి జన్మభూమి- మాఊరు ఇలా***

గురువారం నగరంలోని ఐదు ప్రాంతాల్లో జన్మభూమిని నిర్వహించనున్నారు. 7వ డివిజన్‌లోని నిమిషాంబ దేవాలయం, 8వ డివిజన్‌లోని పెదపడఖానా కమ్యూనిటీ భవనం, 9వ డివిజన్‌లోని చిన్నమార్కెట్ బహిరంగ ప్రదేశం, 27 డివిజన్‌లోని అబ్బాస్‌నగర్ నీళ్ల ట్యాంక్, 28 డివిజన్‌లోని ఉద్యోగనగర్ నీళ్ల ట్యాంక్ వద్ద ఉదయం 10 గంటల నుంచి 5 గంటల వరకు వీటిని నిర్వహించనున్నారు.

## తెలుగు సాహిత్యం అభివృద్ధికి తోడ్పాటు

**కర్నూలు విద్య, న్యూస్‌టుడే:** ఆధునిక శాస్త్ర సాంకేతిక విషయాలతో పాటు, వారసత్వంగా వస్తున్న సంస్కృతి సంప్రదాయాలను భావితరాలకు పరిచయం చేసి అభివృద్ధిపరిచే ఉద్దేశంతో భాషా సాహిత్యాంశాలకు సంబంధించిన విభాగాలను వివిధ స్థాయిల్లో నిర్వహిస్తున్నట్లు ఉపకులపతి వై.నరసింహులు అన్నారు. రాయల సాహిత్యపీఠ గ్రంథాలయాన్ని రాయలసీమ విశ్వవిద్యాలయ అనుబంధ పరిశోధన కేంద్రంగా అభివృద్ధిపరచడం లక్ష్యంగా తెలుగు భాషా వికాస ఉద్యమం రాష్ట్ర కార్యదర్శి జెఎస్ఆర్‌కె.శర్మ బుధవారం ఉపకులపతి వై.నరసింహులు, రిజిస్ట్రార్ అమర్‌నాథ్ సరస్వర అంగీకారంతో అవగాహన కుదుర్చుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు భాషా వికాస ఉద్యమం కర్నూలు నగరపాలక సహకారంతో తెలుగు భాషా సాహిత్యాల పరిరక్షణకు ఎంతో తోడ్పడుతోందని కొనియాడారు. తెలుగు భాష, సాహిత్యాలపై పరిశోధన చేయాలన్న ఆసక్తి ఉన్న పరిశోధకులకు మరింతగా ఉపయోగపడాలన్నది తమ ఆకాంక్ష అన్నారు.

# హలో ఈనాడు

**కర్నూలు గ్రామీణ, న్యూస్‌టుడే:** స్థానిక సమస్యలు పరిష్కారం కాక ఇబ్బందులు పడుతున్నారా? ఎవరికి చెప్పుకోవాలో తెలియక సతమతమవుతున్నారా? ఇక ఆ చింత వీడండి. హలో ఈనాడు చరవాణి: 97014 76343కి చేసి సమస్యను తెలియజేయండి. మీకు ఆసక్తి ఉంటే ఆ సమస్య చిత్రాన్ని తీసి, దానికి వివరణ రాసి ఇదే నెంబర్‌కు వాట్సప్ చేయండి. ఇలా వచ్చిన సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి సత్వరం పరిష్కరించేలా కృషి చేస్తాం. సత్వరమే స్పందించండి.. సమస్య పరిష్కారంలో మీవంతు సహకారం అందించండి.

◆ **సమస్య:** బళ్లారి చౌరస్తా సమీపంలోని దుర్గా హోటల్ వెనుకవైపు ఉన్న గణేష్ నగర్‌లో కాల్వల్లో మురుగు పేరుకుపోయింది. రాత్రివేళల్లో దోమల బెడద ఎక్కువైంది. స్థానికులు అనారోగ్యం బారిన పడుతున్నారు. అధికారులు చొరవ చూపాలి.

**- వీణా వెంకటరమణ, కాలనీవాసి**

◆ **సమస్య:** చౌరస్తా సమీపంలోని గురుబ్రహ్మ నగర్‌లో శంకర్ గౌడ్ ఆటో కన్సల్టింగ్ ఎదుట ఉన్న రెండు వీధి దీపాలు వెలగడం లేదు. రాత్రివేళల్లో కుక్కల బెడద అధికంగా ఉంది. దీపాలను ఏర్పాటు చేయాలి. **- పద్మనాభరావు, స్థానికుడు.**

◆ **సమస్య:** పాణ్యం మండలం సుబ్బరాయుడు కొత్తూరు గ్రామంలో నాలుగు రోజులుగా ట్యాంకులకు నీరు రావడం లేదు. గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తాగునీటి సమస్యను పరిష్కరించగలరు. **- రాముసుబ్బయ్య, గ్రామస్థుడు**

◆ **సమస్య:** నగరంలోని అమ్మ ఆసుపత్రి సమీపంలో కిసాన్ నగర్‌లో ఉన్న ఆంధ్రాబ్యాంకు ఎదుట వీధిదీపం వెలగడం లేదు. అధికారులు స్పందించి దీపాలకు మరమ్మతులు చేపట్టాలి.

**- ఎం.శ్రీనివాసరెడ్డి, స్థానికుడు.**

◆ **సమస్య:** వెంకటాచలపతి నగర్‌లోని రహదారికి అడ్డంగా కొందరు వ్యక్తులు మట్టిపోశారు. రాకపోకలకు ఇబ్బంది ఏర్పడింది. వాహన చోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. సమస్యను పరిష్కరించాలి.



వెంకటచలపతి నగర్ రహదారికి అడ్డంగా వేసిన మట్టిదిబ్బ

**- ప్రయాణికులు.**

◆ **సమస్య:** విజయదుర్గా కళాశాల వెనుకవైపు ఉన్న శ్రీనగర్ కాలనీలో దాదాపు అన్ని వీధుల్లో సీసీ రహదారులు నిర్మించారు. జనాభా ఎక్కువగా ఉన్న పలు వీధుల్లో వాటిని నిర్మించకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. త్వరితగతిన నిర్మించాలి. **- జోజిరెడ్డి, స్థానికుడు.**


◆ **సమాధానం :** నగరంలోని సమస్యలను పరిశీలించి సిబ్బందిని పంపి వాటి పరిష్కారానికి కృషి చేస్తాం.

**- హరినాథ్‌రెడ్డి, పురపాలక కమిషనర్**

## వీధుల్లో వెలుగులు

స్పందనకు వందనం

**కర్నూలు గ్రామీణ, న్యూస్‌టుడే:** నగరంలో ఐటీసీ సమీపంలోని రాఘవేంద్రనగర్ రామాలయం వీధిలో శంకర్రావు ఇంటి ఎదుట వీధి దీపం వెలగడం లేదని డిసెంబరు 28న హలో ఈనాడులో సమస్య ప్రచురితమైంది. స్పందించిన పురపాలక సిబ్బంది బుధవారం ఆర్ఎస్-బి9 స్తంభం వీధిదీపానికి మరమ్మతులు చేసి వెలిగేలా చర్యలు చేపట్టారు. దీంతో స్థానికులు ఓంకారప్ప, నవీన్, జ్యోతి తదితరులు హర్షం వ్యక్తం చేశారు.



మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

# పాణ్యం

## విద్యార్థులు క్రీడల్లో పాల్గొనాలి

**గోరుకల్లు (పాణ్యం గ్రామీణం):** విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో పాల్గొనాలని తహసీల్దార్ అనురాధ అన్నారు. బుధవారం మండలంలోని గోరుకల్లు గ్రామంలో పర్యటించి విద్యార్థులు, గ్రామస్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. గ్రామస్థులకు ఆరోగ్యంపై అవగాహన కల్పించి ప్రభుత్వం చేపడుతున్న పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో శంకర్, పంచాయతీ కార్యదర్శి మహేశ్వరయ్య పాల్గొన్నారు.

## ఎద్దుల బీభత్సం

**గడివేముల, న్యూస్‌టుడే:** గడివేములలో ఎద్దులు బీభత్సం సృష్టించాయి. పాత బస్టాండు నుంచి కొర్రపోలూరుకు చెందిన ఎద్దుల బండి వెళ్తుండగా వెనుక నుంచి కారు హారన్ శబ్దం వినపడటంతో అవి బెదిరిపోయాయి. దీంతో దుకాణాల మీదుకు పోయాయి. పండ్లు, పూల దుకాణాలు, రెండు ద్విచక్ర వాహనాలు ధ్వంసమయ్యాయి. ఇద్దరు గాయపడ్డారు. గ్రామస్థులు ఎద్దులను అదుపు చేసేందుకు తీవ్రంగా శ్రమించారు. గంట తర్వాత అదుపులోకి వచ్చాయి.



డీఈకి వినతిపత్రం అందజేస్తున్న ఒప్పంద కార్మికులు

## ఒప్పంద కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో విఫలం

**ఓర్వకల్లు, న్యూస్‌టుడే:** ఏపీ విద్యుత్తు రంగంలోని పలు కంపెనీల్లో రెండు దశాబ్దాలుగా పని చేస్తున్న ఒప్పంద కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని ఏపీ విద్యుత్తు ఒప్పంద కార్మికుల అసోసియేషన్ ఛైర్మన్ కాశీ మధుబాబు అన్నారు. బుధవారం ఒప్పంద కార్మికుల ఐక్య వేదిక రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నన్నూరు విద్యుత్తు కార్యాలయంలో డీఈ గోపాలకృష్ణకు ముందస్తు సమాచార వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఈ నెల 27 నుంచి నిరవధిక సమ్మెలో పాల్గొంటారన్నారు. ఈ సందర్భంగా కార్మికులందరు నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో భరత్‌కుమార్, ప్రసాద్, పోలయ్య, మునీశ్వరరెడ్డి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## బ్యాంకు సేవలపై అవగాహన పెంచుకోవాలి

**సుగాలిమెట్ట (పాణ్యం గ్రామీణం), న్యూస్‌టుడే:** బ్యాంక్ సేవలపై ప్రతి విద్యార్థి అవగాహన పెంచుకోవాలని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ మేనేజర్ లక్ష్మీనారాయణ అన్నారు. బుధవారం మండలంలోని సుగాలిమెట్ట సమీపంలోని ఆదర్శ పాఠశాలలో ఒకేషనల్ విద్యార్థులకు బ్యాంక్ సేవలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బ్యాంకులో జరిగే లావాదేవీలు, రుణాలు, మొబైల్ బ్యాంకింగ్, నెట్‌బ్యాంకింగ్, సేవింగ్ అకౌంట్ తదితర వాటిపై వివరించామన్నారు. ప్రతి విద్యార్థి బ్యాంక్‌లో ఖాతాను తెరచి డబ్బులు దాచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ షంసున్నీసాబేగం, ఒకేషనల్ శిక్షకుడు రాముడు, అధ్యాపకులు పాల్గొన్నారు.

## మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

**దూపాడు (కల్లూరు గ్రామీణం), న్యూస్‌టుడే:** మహిళలు అన్ని రంగాల్లో రాణించాలంటే తప్పకుండా చదువుకోవాలని డా. కేవీ సుబ్బారెడ్డి మహిళా ఇంజినీరింగ్ కళాశాల యాజమాన్యం తెలిపింది. ఆ కళాశాలలో బుధవారం సావిత్రిబాయి పూలే జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డా. ఈవీఎస్ రెడ్డి మాట్లాడుతూ.. పూలే మహిళల హక్కుల కోసం కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో విభాగాధిపతులు, మహిళా అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

☛ స్థానిక బృందావన్ ఇంజినీరింగ్ కళాశాలలో ఎంఎస్ పెడిలిస్ గ్రూప్ ఆధ్వర్యంలో నాలుగో సంవత్సరం చదువుతున్న ఇంజినీరింగ్ విద్యార్థులకు ప్రాంగణ ఎంపికలు నిర్వహించారు. విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకుంటే ఉపాధి అవకాశాలు లభిస్తాయని కళాశాల ప్రిన్సిపల్ డా. ఎ.శ్రీకాంత్‌గౌడ్, సంస్థ సీనియర్ హెచ్ఆర్ కె.ఉదయ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బృందావన్ కళాశాలలో విద్యార్థులతో కళాశాల బృందం

# ప్రజా సంక్షేమానికి పెద్ద పీట

**పర్ల, సల్కాపురం (కల్లూరు గ్రామీణం), న్యూస్‌టుడే:** మండలంలోని పర్ల, సల్కాపురం గ్రామాలలో బుధవారం జన్మభూమి-మా ఊరు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమాల్లో ప్రజల ఎదుట అధికారులు తమ ప్రగతి నివేదికలను చదివారు. రెండు గ్రామాల్లో 91 రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ప్రజలు ఇంటి స్థలాలు, రేషన్ కార్డులు తదితర వాటి కోసం దరఖాస్తులను అధికారులకు అందజేశారు. సల్కాపురంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, జేసీ ప్రసన్న వెంకటేశం, ఎంపీపీ మాధవి హాజరయ్యారు. ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి మాట్లాడుతూ.. గ్రామాల్లో ప్రజా సమస్యలు పరిష్కరించాలన్నారు. జేసీ ప్రసన్న వెంకటేశం గ్రామస్థులతో మాట్లాడారు. ప్రాథమిక ఆసుపత్రుల్లో ప్రజలకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. అనంతరం విద్యార్థులకు నిర్వహించిన ఆటల



మాట్లాడుతున్న జేసీ ప్రసన్న వెంకటేశం



మాట్లాడుతున్న ఏరాసు ప్రతాపరెడ్డి

పోటీలలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు నరేంద్రనాథ్‌రెడ్డి, ఈవోఆర్డీ నూర్జహాన్, మండల స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

● ప్రజా సంక్షేమానికి చంద్రబాబు నాయుడు పెద్ద పీట వేశారని తెదేపా పాణ్యం నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఏరాసు ప్రతాపరెడ్డి అన్నారు. కల్లూరు పట్టణ పరిధి 21వ డివిజన్ డాక్టర్స్ కాలనీ, 26వ డివిజన్ విఠల్‌నగర్‌లో జన్మభూమి నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడుతూ.. గత జన్మభూమిలో ఇచ్చిన అర్జీలకు పరిష్కారం లభిస్తుందన్నారు. కల్లూరు పట్టణ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నగర పాలక పర్యవేక్షక ఇంజినీర్ శివరామిరెడ్డి, ఇంజినీర్ రమణమూర్తి, తెదేపా నాయకులు బాబురాజు, వెంకటస్వామి, శింగారం రంగా తదితరులు పాల్గొన్నారు.

## తెదేపాతోనే రాష్ట్రాభివృద్ధి

**ఓర్వకల్లు, న్యూస్‌టుడే:** తెదేపాతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని కేడీసీసీబీ ఛైర్మన్ మల్లికార్జునరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని పూడిచర్ల, కేతవరం గ్రామాల్లో సర్పంచులు సరోజమ్మ, పాపన్న అధ్యక్షతన జన్మభూమి-మా ఊరు నిర్వహించారు. పూడిచర్లలో మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ.. మహిళా సాధికారితలో భాగంగా మండలంలోని పొదుపు మహిళలకు తమ బ్యాంక్ ద్వారా రూ.10 కోట్లు మంజూరు చేశామన్నారు. 20 శాతం రాయితీ, 30 శాతం వడ్డీ లేని రుణం, 50 శాతం స్వల్ప వడ్డీతో తిరిగి చెల్లించాలన్నారు. పారిశ్రామిక హబ్ శంకుస్థాపనలో భాగంగా సీఎం చంద్రబాబు నాయుడు గ్రామాన్ని సందర్శించి రూ.50 లక్షలు కేటాయించారని పేర్కొన్నారు.



జన్మభూమిలో అధికారులతో వాగ్వాదానికి దిగిన సీపీఎం కార్యకర్తలు

కేతవరంలో జరిగిన జన్మభూమిలో సీపీఎం నాయకులు, కార్యకర్తలు నాగన్న ఆధ్వర్యంలో గార్గేయపురం నుంచి కేతవరం వరకు రహదారి అధ్వానంగా ఉందని చాలాసార్లు వినతిపత్రాలు అందజేసినా అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని అధికారులతో వాగ్వాదానికి దిగారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ప్రత్యేకాధికారి గోపీనాథ్, జడ్పీ సీఈవో ఈశ్వర్, డీఈవో తహెరా సుల్తానా, తహసీల్దార్ రజనీకుమారి, ఎంపీడీవో మాధవీలత, జిల్లా తెదేపా ఉపాధ్యక్షుడు మోహన్‌రెడ్డి, మండల కన్వీనర్ గోవిందరెడ్డి, ఈవోఆర్డీ తిమ్మక్క తదితరులు పాల్గొన్నారు.

## అందరి సహకారంతోనే అభివృద్ధి సాధ్యం

**భూపనపాడు (పాణ్యం), న్యూస్‌టుడే:** అందరి సహకారంతో గ్రామాభివృద్ధి సాధ్యమని మండల నోడల్ అధికారి ఫిరోజ్‌ఖాన్ అన్నారు. బుధవారం మండలంలోని



విద్యార్థులకు ఉపకార వేతనాలు అందిస్తున్న తహసీల్దార్ అనురాధ

భూపనపాడు గ్రామంలో జన్మభూమి-మా ఊరు కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులకు ఉపకార వేతనాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై శాఖల వారీగా అధికారులు వివరిస్తారన్నారు. ప్రతి ఇంటికి వ్యక్తిగత మరుగుదొడ్డి నిర్మించుకుని గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఎస్సీ కాలనీలో ఆలయ నిర్మాణ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ అనురాధ, ఎంపీటీసీ సభ్యురాలు సువర్ణ, సర్పంచి సులోచన, ఈవోఆర్డీ రమణ తదితరులు పాల్గొన్నారు.

## జన్మభూమి సమస్యల పరిష్కార వేదిక

**పెసరవాయి (గడివేముల), న్యూస్‌టుడే:** జన్మభూమి-మా ఊరు సమస్యల పరిష్కార వేదిక అని జిల్లా సహకార సంఘం డైరెక్టర్ ప్రతాపరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని పెసరవాయి గ్రామంలో జరిగిన జన్మభూమి కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ఈ కార్యక్రమంలో వచ్చిన సమస్యలను అధికారులు వెంటనే పరిష్కరిస్తారని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను గ్రామానికే పంపారని, వారికి సమస్యలు చెప్పుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా సర్పంచి నాగేశ్వరరెడ్డి ఆదర్శ రైతు శ్రీనివాసులు, పొదుపు సంఘం అధ్యక్షురాలు సుంకమ్మ, వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాల కార్మికులకు పతకాలు బహూకరించారు. గ్రామంలో 66 మందికి రేషన్ కార్డులు పంపిణీ చేశారు. 112 మందికి ఉపకార వేతనాల కింద రూ.1.34 లక్షల మంజూరు పత్రాలు అందజేశారు. చంద్రన్న బీమా కింద రూ.6 లక్షల అనుమతి పత్రాలు పంపిణీ చేశారు. జన్మభూమిలో



పెసరవాయిలో ఆదర్శ రైతుకు పతకాన్ని బహూకరిస్తున్న ప్రతినిధులు

177 దరఖాస్తులు వచ్చినట్లు ప్రత్యేకాధికారి అంజద్ అలీ తెలిపారు. పెసరవాయిలో మండల ఉపాధ్యక్షుడు ఈశ్వరరెడ్డి ఆధ్వర్యంలో తహసీల్దారు వెంకటేష్‌నాయక్ ప్రభుత్వ పథకాలను వివరించారు. 240 దరఖాస్తులు వచ్చినట్లు చెప్పారు. 157 మందికి ఉపకార వేతనాల కింద రూ.1.88 లక్షల నిధుల మంజూరు పత్రాలు పంపిణీ చేసినట్లు తెలిపారు. కబడ్డీ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసులు, ఎంపీటీసీ నాగేశ్వరరెడ్డి డీఈ ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# బహిర్భూమికి వెళ్తే కఠిన చర్యలు

**బుజునూరు (గడివేముల), న్యూస్‌టుడే:** గ్రామంలోని పాఠశాల ఆవరణలో బహిర్భూమికి వెళ్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై రామాంజనేయరెడ్డి తెలిపారు. బుధవారం జరిగిన జన్మభూమిలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాఠశాల ఆవరణలో మలవిసర్జన చేయడం వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు అధికారులకు ఫిర్యాదు చేశారు. సమస్యను జిల్లా రక్షణాధికారి దృష్టికి తీసుకెళ్లారు. దాంతో ఎస్పీ ఆదేశాల మేరకు ఎస్సై గ్రామస్థులతో సమావేశమయ్యారు. గ్రామంలో ప్రతి ఇంటికీ వ్యక్తిగత మరుగుదొడ్డి ఉందన్నారు. అయినా బహిరంగ మలవిసర్జన చేయడం తగదన్నారు. పాఠశాల ఆవరణలో మీ పిల్లలే చదువుకుంటున్నారు వారికే ఇబ్బంది కలిగిస్తున్నారని



గ్రామస్థులతో సమావేశమైన ఎస్సై రామాంజనేయరెడ్డి

చెప్పారు. వ్యక్తిగత మరుగుదొడ్లు వినియోగించుకోవాలన్నారు. పాఠశాల ఆవరణలో బహిర్భూమికి వెళ్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

## పింఛన్లు గ్రామంలోనే పంపిణీ చేయాలి

**పిన్నాపురం (పాణ్యం గ్రామీణం), న్యూస్‌టుడే:** ఎన్టీఆర్ భరోసా పథకం ద్వారా అందిస్తున్న పింఛన్లను గ్రామంలోనే అందజేయాలని అధికారులను గ్రామస్థులు కోరారు. బుధవారం మండలంలోని పిన్నాపురం గ్రామంలో జన్మభూమి-మా ఊరు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో చంద్రశేఖరరావు మాట్లాడుతూ.. గ్రామంలో 6 పింఛన్లు, 8 రేషన్ కార్డులను అందజేశామన్నారు. గ్రామానికి ఉదయం, సాయంత్రం మాత్రమే బస్సు వస్తుందని ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్థులు ఆయన దృష్టికి తెచ్చారన్నారు. పింఛన్ తీసుకోవడానికి మండల కేంద్రం పాణ్యం రావాల్సి ఉండటంతో వృద్ధులు, వికలాంగులు ఇబ్బందులు పడుతున్నారని అధికారులకు గ్రామస్థులు విన్నవించారు.

# పత్తికొండ

## కూరగాయల ధరలు- నిన్నటివి (కిలో రూ.లలో)

**పత్తికొండ గ్రామీణ:** టమోటా 10, ఉల్లిగడ్డలు 40, పచ్చిమిర్చి 20, వంకాయలు 30, బీర 20, చౌళెకాయలు 30, క్యాబేజీ, 30 క్యారెట్ 30, ఆలూ 20, బెండ 30, బీన్స్ 40

*మాంసం, చికెన్ ధరలు (కిలో రూ.లలో)*

మాంసం 440, చికెన్ 150

## నేడు జన్మభూమి మాఊరు

**కృష్ణగిరి, న్యూస్‌టుడే:** మండల పరిధిలోని లక్కసాగరం, చుంచుయర్రగుడి గ్రామాల్లో గురువారం జన్మభూమి మాఊరు కార్యక్రమం ఉంటుందని ఎంపీడీవో మురళీమోహనమూర్తి తెలిపారు. గ్రామస్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మండలస్థాయి, గ్రామ స్థాయి అధికారులు వాటికి తప్పక హాజరు కావాలని కోరారు.

## తెరపై ఈనాడు

**పత్తికొండ- లక్ష్మి:** హలో
**వెల్దుర్తి- గౌరి:** ఎమ్‌సీఏ

## హలో... ఈనాడు

**పత్తికొండ గ్రామీణ, న్యూస్‌టుడే:** మేజర్ గ్రామ పంచాయతీ, నియోజకవర్గ కేంద్రమైన పత్తికొండతో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లో సమస్యలు పరిష్కారం కాక ఇబ్బందులు పడుతున్నారా? ఇళ్ల ముంగిట సమస్యలతో పాటు పరిసర ప్రాంతాల్లోని సమస్యలను ఎవ్వరికి చెప్పుకోవాలో తెలియక సతమతమవుతున్నారా? ఇక ఆ చింత వీడండి. హలో ఈనాడు చరవాణి: 70939 81612కి చేసి సమస్యను తెలియజేయండి. మీకు ఆసక్తి ఉంటే ఆ సమస్య చిత్రాన్ని తీసి, దానికి వివరణ రాసి ఇదే నెంబర్‌కు వాట్సప్ చేయండి. ఇలా వచ్చిన సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి సత్వరం పరిష్కరించేలా కృషి చేస్తాం.



**కల్లుపెంట వీధిలో ఉన్న సామూహిక మరుగుదొడ్డి**

**సమస్య:** పత్తికొండ పట్టణంలోని కల్లుపెంట వీధిలో సామూహిక మరుగుదొడ్డి వల్ల చుట్టుపక్కల ఉన్న నివాస గృహాల వారికి తీవ్ర ఇబ్బందిగా ఉంది. దుర్గంధం భరించలేకపోతున్నాం. వాటిని తొలగించాలి.

**-సుధాకర్, కల్లుపెంట వీధి**

**సమాధానం:** సామూహిక మరుగుదొడ్లు ఉండ కూడదని, ప్రతి ఒక్కరూ వ్యక్తి గత మరుగుదొడ్లు నిర్మించుకోవాలని జిల్లా కలెక్టరు ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు పట్టణంలో ఉన్న సామూహిక మరుగుదొడ్లను కూల్చివేస్తాం. **-వెంకటేశ్వర్లు, శానిటరీ అధికారి**

**సమస్య:** బండిగేరి వీధిలో వారంతా ఇళ్ల సమీపంలోనే చెత్తా చెదారాన్ని పడేస్తున్నారు. దీంతో పందుల బెడద అధికమైంది. అంటువ్యాధులు ప్రబలుతాయనే భయం పట్టుకొంది. చెత్త సేకరణకు ఏర్పాటు చేసిన రిక్షాలు తమ వీధిలోకి రావటం లేదు. తక్షణమే చెత్త రిక్షాలను ఏర్పాటు చేయాలి. **-ఇస్మాయిల్, బండిగేరి వీధి**

**సమాధానం:** పత్తికొండ గ్రామ పంచాయతీలో మూడు నాలుగు చెత్త సేకరణ రిక్షాలు మాత్రమే ఉన్నాయి. అవీ ఇరుకు సందుల్లోకి వెళ్లడానికి అవకాశం లేదు. పారిశుద్ధ్య సిబ్బంది కొరత కారణంగా అక్కడక్కడా కొంత చెత్త పేరుకుపోతోంది. త్వరల్లో రిక్షాలు, సిబ్బంది సంఖ్యను పెంచి సమస్య పరిష్కారానికి కృషి చేస్తాం. ఈలోపు చెత్తను తొలగించే పనులు చేపడతాం.

***-వెంకటేశ్వర్లు, శానిటరీ అధికారి***

**సమస్య:** పట్టణంలోని చక్కరాళ్ల రోడ్డు దారిలో కాలువల్లో మురుగునీరు, బురద పేరుకుపోయింది. దీంతో సమీప ఇళ్ల వారు దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నారు. కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలి.

***-హుసేని, కాలనీ వాసి***

**సమాధానం:** కాలువల్లో పేరుకుపోయిన మట్టిని ఎప్పటికప్పుడు తొలగిస్తున్నాం. అక్కడక్కడా కొన్ని ప్రాంతాల్లోని కాలువల్లో పూడుకుపోయిన మట్టిని తొలగించి మురుగునీరు బయటకు వెళ్లేలా చర్యలు తీసుకొంటాం.

***-కృష్ణకుమార్, ఈవో, పత్తికొండ***

# ఖాళీ జాగా.. వేసేయ్ పాగా

- ☛ ఆర్‌అండ్‌బీ రహదారినీ వదల్లేదు
- ☛ రూ.కోటికి పైగా విలువైన స్థలం కబ్జా
- ☛ దురాక్రమణలో విలువైన 50 సెంట్ల స్థలం

**మద్దికెర, న్యూస్‌టుడే:** అది నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగించే ప్రధాన రహదారి. ఇదే దారిలోనే రైల్వే స్టేషన్‌లో ఉంది. మద్దికెర నుంచి బురుజుల, హోసూరు మీదుగా పత్తికొండ చేరే దారి. అయితే ఇటీవలే రైల్వే అధికారులు ఈ దారిలో ఉన్న లెవెల్ క్రాసింగ్ స్థానంలో భూగర్భ వంతెన నిర్మించారు. దీంతో ఈ గేటును మూసివేశారు. అదే అదునుగా గ్రామానికి చెందిన కొందరు వారికి తోచినంత స్థలాన్ని ఆక్రమించి బండలు పాతేశారు. తమ ఆధీనంలోకి తెచ్చుకునేందుకు షెడ్లు వేసేందుకు చర్యలు చేపట్టారు. దురాక్రమణకు గురైన స్థలం విలువ కనీసంగా రూ.కోటి ఉంటుంది.

ఈ ప్రాంతంలో రామనగర్ కాలనీ, సాయినగర్ కాలనీతో పాటు పక్కనే రైల్వే స్టేషన్, సాయిబాబా ఆలయం, కళాశాలలు, పాఠశాలలు ఉండడంతో స్థలం విలువ అధికంగా ఉంది. సెంటు స్థలం రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల వరకూ ధర పలుకుతోంది. ఇదే అదునుగా గ్రామానికి చెందిన కొందరు ఈ స్థలాన్ని మొత్తంగా 200 మీటర్ల పొడవు, 10 మీటర్ల వెడల్పుతో ఆక్రమించేసి నిర్మాణాలు చేపట్టారు. అయినా సంబంధిత అధికారులకు చీమకుట్టినట్లు లేదంటూ స్థానికులు ఆరోపిస్తున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండానే ఈ స్థలాన్ని ఆక్రమించారంటూ స్థానిక సాయినగర్ కాలనీ వాసులు మురళీ, చలం, వెంకప్ప, అంజి, లక్ష్మినారాయణ తదితరులు ఆరోపిస్తున్నారు.

స్థలాన్ని ఆక్రమించిన వారు షెడ్లు వేసేందుకు ఇప్పటికే బండలు ఏర్పాటు చేశారు. ఇలాగే వదిలేస్తే ఎంతో విలువైన ప్రభుత్వ స్థలం కాస్త అక్రమార్కుల చేతుల్లోకి వెళతుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎంతో విలువైన ఇలాంటి స్థలాలు కళ్లెదుటే దురాక్రమణకు గురవుతున్నా అటు రహదారులు భవనాల శాఖ అధికారులు కాని,



**మద్దికెరలో భూగర్భ వంతెన నిర్మాణంతో మూసివేసిన లెవెల్ క్రాసింగ్ గేటు**

రెవెన్యూ అధికారులు కాని, కనీసం పంచాయతీ సైతం అడ్డుకోక పోవడంతో యథేచ్ఛగా ఇలాంటి విలువైన ప్రభుత్వ స్థలాలు కబ్జాకు గురవుతున్నాయి. ఆక్రమణకు గురైన స్థలం విలువ మార్కెట్ ధర ప్రకారం కనీసంగా రూ.కోటికి పైగా ఉంటుందని స్థానికులు ఆరోపిస్తున్నారు. గ్రామంలో శ్మశానాలను సైతం ఆక్రమించారని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు గ్రామంలో విలువైన స్థలాలు ఆక్రమణకు గురికాకుండా కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని అంటున్నారు.

*స్థలం ఆక్రమించేశారు: చంద్రహరి*


కళ్లెదుటే విలువైన స్థలాలను ఆక్రమిస్తున్నా అధికారులు చూస్తూ ఉన్నారే తప్ప అడ్డుకోవడం లేదు. ప్రధాన రహదారులనే ఆక్రమిస్తే పట్టించుకోకపోతే ఇక భవిష్యత్తు అవసరాలకు అడుగు భూమి దొరకని దుస్థితి ఏర్పడుతుంది. పంచాయతీ వెంటనే ఆక్రమణలను తొలగించాలి. విలువైన స్థలాలను కాపాడాల్సిన బాధ్యత ప్రతి అధికారిపై ఉంది. పంచాయతీ, రెవెన్యూ అధికారులు స్పందించకుంటే కలెక్టరు దృష్టికి తీసుకువెళతాం.



ఈ చిత్రంలో కనిపిస్తున్న రాళ్లు, బండల నిర్మాణాలు మద్దికెరలోని బాలుర ఉన్నత పాఠశాల ప్రహరీని ఆనుకుని ఉన్న మద్దికెర- బురుజుల ప్రధాన రహదారిలోవి. ఈ దారిలో ఉన్న రైల్వే లెవెల్ క్రాసింగ్ స్థానంలో భూగర్భ వంతెన నిర్మించడంతో ఈ గేటును రైల్వే అధికారులు మూసివేశారు. దీంతో రహదారి పక్కన ఉన్న స్థలం మొత్తం కబ్జాకు గురైంది. 50 సెంట్లకు పైగా ఉన్న ఈ స్థలాన్ని ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారు.

### బస్సు షెల్టరు నిర్మాణానికి స్థలం చూపడం లేదు

**-శ్రీనివాసులు, ఎంపీటీసీ సభ్యుడు**



ప్రస్తుతం ఆక్రమణకు గురైన స్థలం వద్ద బస్సు షెల్టరు నిర్మాణం కోసం ఎంపీ బుట్టా రేణుక రూ.4.80 లక్షలు మంజూరు చేశారు. ఈ నిధులతో కాలనీ వాసుల సౌకర్యార్థం బస్సు షెల్టరు నిర్మాణం చేపడతామని, స్థలం చూపాలంటూ ఏడాదిగా పంచాయతీ వారికి విన్నవిస్తున్నా పట్టించుకోవడం లేదు. వారి అనుమతి లేకుండానే ఆక్రమణలు జరిగాయంటే నమ్మలేని నిజం. ఇలా విలువైన స్థలాలను ఆక్రమిస్తే అధికారులెవరూ పట్టించుకోవడం లేదు. శ్మశానాలను, రహదారులనూ వదలకుండా ఆక్రమిస్తున్నారు.

### రహదారిని వదల్లేదు

**-మల్లేష్, సాయినగర్ కాలనీ**



స్థానిక సాయినగర్ కాలనీలోని ప్రధాన రహదారిని ఆనుకుని ఉన్న విలువైన స్థలాన్ని కొందరు యథేచ్ఛగా ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారు. ఈ విషయమై రెవెన్యూ, పంచాయతీ అధికారులకు పలుమార్లు మొరపెట్టుకున్నాం. అయినా వారు స్పందించడం లేదు. ఇలాంటి అక్రమాలను అడ్డుకోక పోతే రూ.లక్షల విలువైన స్థలాలు ఆక్రమణకు గురవుతాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించాలి.

### పరిశీలించి.. చర్యలు తీసుకుంటాం

**-వేణుగోపాల్, తహసీల్దారు**



సాయినగర్ కాలనీలో రహదారులు భవనాల శాఖకు చెందిన స్థలంతో పాటు పాఠశాల ఆవరణను ఆనుకుని ఉన్న విలువైన స్థలం ఆక్రమణకు గురైనట్లు మా దృష్టికి వచ్చింది. వెంటనే ఆ స్థలాన్ని పరిశీలించి ఆక్రమణల తొలగింపునకు చర్యలు తీసుకుంటాం. ఈ విషయాన్ని జిల్లా కలెక్టరు దృష్టికి తీసుకువెళతాం. స్థానిక హిందూ శ్మశాన వాటికలో ఆక్రమణల విషయమై ఇప్పటికే చర్యలు తీసుకొన్నాం. ఆక్రమణల తొలగింపు చేపట్టాం. ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమిస్తే చర్యలు తప్పవు.

## ఘనంగా గ్రామదేవర ఉత్సవాలు

**పెరవలి (మద్దికెర), న్యూస్‌టుడే:** మండలంలోని పెరవలి, అగ్రహారం గ్రామాల్లో గ్రామదేవర వేడుకలు ఘనంగా జరిగాయి. మంగళవారం రాత్రి బోనాల ఉత్సవం ప్రారంభం కాగా బుధవారం సుంకలమ్మకు విశేష పూజలు నిర్వహించారు. ఇరు గ్రామాల్లో మేళతాళాలతో గ్రామస్థులంతా అమ్మవారి ఆలయాలకు వెళ్లి దర్శించుకున్నారు. తెదేపా నాయకులు కేశవ శ్యాంబాబు, పలువురు నాయకులు వచ్చి అమ్మవారిని దర్శించుకొన్నారు.



**పూజలందుకొంటున్న అమ్మవారు**



**విజేతలతో ఉపాధ్యాయులు**

## ఫుట్‌బాల్ విజేతలుగా పుచ్చకాయలమడ విద్యార్థినులు

**పుచ్చకాయలమడ (పత్తికొండ గ్రామీణ), న్యూస్‌టుడే:** గత నెల 28 నుంచి 30వ తేదీ వరకు మంత్రాలయంలో జరిగిన ఆదోని డివిజన్ స్థాయి జోనల్ పోటీల్లో పుచ్చకాయలమడ విద్యార్థినులు ప్రతిభ కనబర్చారు. 17 ఏళ్ల విభాగంలో జరిగిన ఫుట్‌బాల్ పోటీలో అసమాన ప్రతిభ చూపి విజేతలుగా నిలిచారు. విజయం సాధించిన జట్టును పాఠశాల ప్రధానోపాధ్యాయుడు హనుమంతనాయుడు బుధవారం అభినందించారు. పాఠశాల ప్రాంగణంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ జోనల్ పోటీల్లో పాల్గొన్న తొలి పోటీల్లోనే విజేతలుగా నిలవటం హర్షణీయమన్నారు. వ్యాయామ ఉపాధ్యాయుడు రంగస్వామిని ఆయన ప్రత్యేకంగా అభినందించారు.

## పదిగంటలు నిలిచి పోయిన విద్యుత్తు సరఫరా

**పత్తికొండ పట్టణం, న్యూస్‌టుడే:** ఒకటి కాదు రెండు కాదు ఏకంగా పదిగంటల పాటు పత్తికొండలో విద్యుత్తు సరఫరా నిలిచిపోయింది. దీంతో వినియోగదారులు తీవ్ర అసహనం వ్యక్తంచేశారు. ఇబ్బందులు పాలయ్యారు. విద్యుత్తు నిలిచిపోవడానికి కారణాల అన్వేషణలో సిబ్బంది గంటల తరబడి కాలం గడిపారు. చివరకు స్థానిక యశోదా గార్డెన్ కాలనీ సమీపంలోని నియంత్రిక కాలిపోయినట్లు తెలుసుకున్నారు. సాయంత్రం ఉపకేంద్రంలో ఉన్న కొత్త నియంత్రికను తీసుకెళ్లి అక్కడ అమర్చి సరఫరాను పునరుద్ధరించారు.

# పత్తికొండ

## గ్రామాలలో ఘనంగా దేవర

**తుగ్గలి:** మండల పరిధిలోని జొన్నగిరి, రాంపురం గ్రామాలలో బుధవారం నెల్లూరమ్మ, పెద్దమ్మ దేవరను ప్రజలు ఘనంగా జరిపారు. మహిళలు బోనాలతో వెళ్లి గ్రామ దేవతలకు మొక్కులు తీర్చుకొన్నారు. మాజీ కేంద్రమంత్రి కోట్ల జయసూర్యప్రకాష్‌రెడ్డి, తెదేపా నియోజకవర్గ బాధ్యుడు కేఈ శ్యాంబాబు, వైకాపా నియోజకవర్గ బాధ్యురాలు కంగాటి శ్రీదేవి వచ్చి జొన్నగిరిలోని దేవతను పూజించుకొన్నారు.



## తెదేపాతోనే సర్వతోముఖాభివృద్ధి



బసినేపల్లి గ్రామసభలో మాట్లాడుతున్న ఉపముఖ్యమంత్రి కేఈ కృష్ణమూర్తి

**బసినేపల్లి (మద్దికెర), న్యూస్‌టుడే:** తెదేపా ప్రభుత్వం ద్వారానే రాష్ట్రం అన్ని రంగాల్లో సర్వతోముఖాభివృద్ధి సాధించగలుగుతోందని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కేఈ కృష్ణమూర్తి అన్నారు. మండలంలోని బసినేపల్లి గ్రామంలో బుధవారం జరిగిన జన్మభూమి-మా ఊరు గ్రామ సభలో ఆయన మాట్లాడారు. రేషన్ కార్డులు లేని ప్రతి కుటుంబానికి జన్మభూమి గ్రామసభల్లో పంపిణీ చేస్తున్నామన్నారు. అనంతరం గ్రామానికి చెందిన 48 మందికి ఇళ్ల స్థలాలను పంపిణీ చేశారు. 43 మందికి ఫిజుబులిటీ ధ్రువపత్రాలను అందజేశారు. స్ప్రేయర్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ కలెక్టరు సుబ్బారెడ్డి, కేఈ శ్యాంబాబు, గ్రామసర్పంచి లక్ష్మి, జడ్పీటీసీ సభ్యుడు పురుషోత్తమచౌదరి, ఎంపీపీ పద్మావతి, ఎంపీటీసీ సభ్యురాలు లింగమ్మ తదితరులు పాల్గొన్నారు. బసినేపల్లి గ్రామంలో ఎస్‌డీపీ నిధులు రూ.40 లక్షలు వెచ్చించి నిర్మించిన సిమెంటు రహదారిని ఉప ముఖ్యమంత్రి కేఈ కృష్ణమూర్తి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో సిమెంటు రహదారులను నిర్మించేందుకు ప్రభుత్వం నిధులను విరివిగా మంజూరు చేసిందన్నారు. నోడల్ అధికారి నారాయణనాయక్, తహసీల్దారు వేణుగోపాల్, ఎంపీడీఓ సుధాకరరాజు, విద్యుత్తు ఏడీఈ వెంకటరంగయ్య, తెదేపా నాయకులు అంకం విజయ, చందోలి తిరుపాల్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

**చక్కరాళ్ల (పత్తికొండ గ్రామీణ):** ప్రజా ప్రయోజనం కోసమే ప్రభుత్వం జన్మభూమి-మా ఊరు కార్యక్రమాన్ని చేపట్టిందని పత్తికొండ మండల నోడల్ అధికారి సుభాషణ్‌రావు అన్నారు. మండలంలోని చక్కరాళ్లలో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ దీన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా పలువురు లబ్ధిదారులకు చంద్రన్న సంక్రాంతి కానుకలు, రేషన్‌కార్డులు, పింఛన్లు పంపిణీ చేశారు. గ్రామ సర్పంచి శ్రీరాములు అధ్యక్షతన జరిగిన దీనిలో ఎమ్పీపీ కేఈ రాజేశ్వరి, జడ్పీటీసీ సభ్యురాలు సుకన్య, ఎమ్పీడీవో శ్రీదేవి, తహసీల్దారు రమణరావు, ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

**తుగ్గలి:** రాష్ట్రంలో సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలో ప్రజా సంక్షేమ ప్రభుత్వం అమలులో ఉందని జెడ్పీటీసీ సభ్యురాలు వరలక్ష్మి అన్నారు. బుధవారం ముక్కెళ్ల, మారెళ్ల గ్రామాలలో జన్మభూమి మన ఊరు కార్యక్రమం జరిగింది. ముక్కెళ్లలో జెడ్పీటీసీ సభ్యురాలు, గ్రామ సర్పంచి వెంకటేష్, మారెళ్లలో గ్రామ సర్పంచి జయరంగయ్య, ఎంపీటీసీ సభ్యులు వెంకటరాముడు చేతుల మీదుగా రేషన్ కార్డులు పంపిణీ చేశారు. అంగన్‌వాడీల ఆధ్వర్యంలో సామూహిక సీమంతాలు జరిగాయి. ఆయా గ్రామాలలో నిర్వహించిన వైద్య శిబిరాలలో తుగ్గలి, పగిడిరాయి గ్రామాల వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

**వెల్దుర్తి:** రైతులను ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి చేస్తున్నారని జిల్లా తెదేపా నాయకులు సుబ్బరాయుడు అన్నారు. మండలంలోని బొమ్మిరెడ్డిపల్లి, నార్లాపురం, చెరుకులపాడు గ్రామాలలో జన్మభూమి- మాఊరు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన పంటలను ప్రభుత్వ కొనుగోలు చేసి గిట్టుబాటు ధర అందించేలా చర్యలు తీసుకుందన్నారు. చెరుకులపాడు గ్రామంలో ఐసీడీఎస్ పీడీ జుబేదాబేగం మాట్లాడుతూ వ్యక్తిగత మరుగుదొడ్లు లేనివారు వెంటనే నిర్మించుకోవాలన్నారు. ఆపై రైతులకు టార్పాలిన్లను పంపిణీ చేశారు. నార్లాపురం గ్రామంలో జన్మభూమి కార్యక్రమం నిర్వహణకు సరైన వసతులు ఏర్పాటుచేయకపోవడంపై తెదేపా నాయకులు సుబ్బరాయుడు అసహనం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో అబ్దుల్‌వహిద్, తహసీల్దారు రామాంజులునాయక్, తెదేపా నాయకులు కేఈ పెద్దయ్య, లక్ష్మిరెడ్డి, అమర్‌నాథ్, బొమ్మిరెడ్డిపల్లి, చెరుకులపాడు సర్పంచులు సురేష్, అపర్ణ తదితరులు పాల్గొన్నారు.

**అమకతాడు (కృష్ణగిరి):** జన్మభూమి మాఊరు కార్యక్రమంతో ప్రభుత్వం అందిస్తున్న ప్రజాసంక్షేమపథకాలు అర్హులందరికీఅందుతున్నాయని మండల ప్రత్యేకాధికారి రఘునాథరెడ్డి, మండల జన్మభూమి కమిటీ ఛైర్మన్ కేఈ జయన్న తెలిపారు. బుధవారం వారు మండల పరిధిలోని అమకతాడు గ్రామంలో గ్రామ సర్పంచి లక్ష్మీదేవి అధ్యక్షతన జరిగిన ఆ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామపంచాయతీ పరిధిలోని నాలుగు గ్రామాలకు 105 కొత్త రేషన్ కార్డులు మంజూరయ్యాయన్నారు. అనంతరం గర్భిణులకు సీమంతం చేశారు. ప్రజల నుంచి వినతులు తీసుకున్నారు. కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు, ఎంపీటీసీ సభ్యుడు మధుసూదన్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.



ముక్కెల్లలో రేషన్ కార్డులు పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ సభ్యురాలు వరలక్ష్మి

## బాలికల విద్యకు ఆద్యురాలు సావిత్రిబాయి పూలే

**వెల్దుర్తి, న్యూస్‌టుడే:** బాలికల విద్యకు సావిత్రిబాయి పూలే ఆద్యురాలని ప్రధానోపాధ్యాయురాలు ప్రభావతి అన్నారు. మండలంలోని సూదేపల్లి గ్రామంలో ఆమె జయంతిని బుధవారం నిర్వహించారు. ముందుగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ 1848లో దేశంలోనే మొదటి బాలిక విద్యాలయాన్ని ఆమె ప్రారంభించారన్నారు.

**దేవనబండ (పత్తికొండ గ్రామీణ):** పత్తికొండ మండలంలోని దేవనబండ ఉన్నత పాఠశాలలో సావిత్రిబాయి పూలే జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రమేష్‌నాయుడు మాట్లాడుతూ దేశంలోనే తొలి మహిళా ఉపాధ్యాయురాలిగా పనిచేసిన ఘనత పూలేకే దక్కిందన్నారు. ఆపై ఉపాధ్యాయినులు విజయలక్ష్మి, అనసూయమ్మ, నిర్మలాదేవిలను సత్కరించారు.

**పత్తికొండ పట్టణం:** స్త్రీలు విద్యనభ్యసించిన నాడే సమాజ అభ్యున్నతి, ఆరోగ్యవంత సమాజం ఏర్పడుతుందని, ఈ దిశగా సావిత్రిబాయి పూలేను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలని కనీస వేతనాల బోర్డు రాష్ట్ర డైరక్టర్ అశోక్‌కుమార్ అన్నారు. స్థానిక బీసీ సంక్షేమ సంఘం మండల కన్వీనరు మహానంది ఆధ్వర్యంలో ఆమె జయంతిని నిర్వహించారు. అశోక్‌కుమార్ తొలుత సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. సెంట్రల్ స్కూల్‌లో లోక్‌సత్తా నాయకుడు రామ్మోహన్ ఆధ్వర్యంలోనూ, శాంతిటాలెంట్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి ఆధ్వర్యంలోనూ ఈ కార్యక్రమాలు జరిగాయి.

**మద్దికెర:** సావిత్రిబాయిపూలే జయంతిని మద్దికెరలో బుధవారం నిర్వహించారు. స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలోనూ, ప్రత్యేక ప్రాథమిక పాఠశాలల్లో ఆమె చిత్రపటాలకు పూలమాల వేసి నివాళి అర్పించారు.

## నలుగురికి తీవ్ర గాయాలు -ఆటో, ద్విచక్రవాహనం ఢీ


**పత్తికొండ గ్రామీణ, మద్దికెర, న్యూస్‌టుడే:** పత్తికొండ నియోజకవర్గంలోని మద్దికెర మండల పరిధిలో పెరవలి-తుగ్గలి గ్రామాల మధ్య బుధవారం జరిగిన రహదారి ప్రమాదంలో నలుగురికి తీవ్రగాయాలయ్యాయి. ఎదురెదురుగా వస్తున్న ఆటో, ద్విచక్రవాహనం ఢీకొనటంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో తుగ్గలి మండలం గుడిసెగుప్పి రాళ్ల గ్రామానికి చెందిన సుధాకర్, రంగస్వామి, మల్లికార్జున, ఎద్దులదొడ్డి గ్రామానికి చెందిన గోపాల్ తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులు తెలిపిన వివరాల మేరకు పెరవలిలో జరుగుతున్న దేవర ఉత్సవాల్లో పాల్గొని తిరిగి వస్తున్న సమయంలో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. తీవ్రంగా గాయపడిన వీరిని బంధువులు చికిత్స కోసం హుటాహుటిన పత్తికొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం కర్నూలుకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు మద్దికెర పోలీసులు తెలిపారు.

## నల్లవాగు వంతెనకు నేడు శంకుస్థాపన

■ ఫలిస్తున్న నలకదొడ్డి వాసుల సుదీర్ఘ కల

**పత్తికొండ పట్టణం, న్యూస్‌టుడే:** నల్లవాగు వంతెనకు గురువారం శంకుస్థాపన చేయనున్నారు. ఈ మేరకు అక్కడ ఏర్పాట్లు ఊపందుకొన్నాయి. ఉప ముఖ్యమంత్రి కేఈ కృష్ణమూర్తి ఈ పనులను ప్రారంభిస్తారు. దీన్ని నిర్మాణం పూర్తయితే.. నలకదొడ్డి వాసుల సుదీర్ఘకల ఫలించినట్లే.

వర్షాలు వస్తే జిల్లాలో పలు రహదారులు మూసుకుపోతాయి. రోడ్లపై ఐదారు అడుగుల వరకు నీరు పరవళ్లు తొక్కుతూ ప్రవహిస్తుంది. ప్రవాహ వేగం తగ్గిందన్న భావనతో ముందుకెళితే ఆ వేగంలో కొట్టుకుని పోవాల్సిందే. బస్సులు, లారీలు, ద్విచక్రవాహన చోదకులు అదుపుతప్పి పడిపోయిన ఘటనలు పత్తికొండ మండలం చిన్న హుల్తి- నలకదొడ్డి రహదారుల్లో ఏటా వర్షాకాలంలో చోటుచేసుకొంటున్నాయి. ఈ వాగులపై కష్టాల గూర్చి గత ఏడాది జూన్ 4వ తేదీ 'ఈనాడు'లో 'కష్టాల వాగులు.. పాలకుల 'వంకలు' శీర్షికతో వంతెనలు లేక స్తంభించిపోతున్న రహదారుల... ప్రతిపాదనలతోనే సరి.. అన్న ఉపశీర్షికలతో కథనం ప్రచురించింది. దీంతో ఉపముఖ్యమంత్రి కేఈ కృష్ణమూర్తి, జిల్లా యంత్రాంగం స్పందించడంతో ప్రభుత్వ యంత్రాంగంపై వత్తిడి పెరిగింది. వెంటనే అధికార యంత్రాంగం అంచనాలు రూపొందించి ఆమోదానికి పంపారు. ఎట్టకేలకు నిధులు మంజూరయ్యాయి. నల్లవాగు వంతెనకు రూ.6.85 కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ప్రధానమంత్రి సడక్ యోజన పథకం కింద ఈ పనులు చేపట్టనున్నారు.



ఏర్పాటుచేస్తున్న శిలాఫలకం

### 'ఈనాడు' సహకారం.. ప్రజల కలలకు సాకారం

**– బత్తిన లోక్‌నాథ్, నలకదొడ్డి సర్పంచి**

ఈ వాగుపై వంతెన నిర్మాణలకు చొరవ చూపాలంటూ ఓ వైపు ఉపముఖ్యమంత్రి కేఈ కృష్ణమూర్తికి చేసిన వినతులు, మరోవైపు 'ఈనాడు' కథనాల క్లిప్పింగ్‌ల మూలంగా ప్రభుత్వం స్పందించింది. వంతెనకు నిధులు మంజూరయ్యాయి. ఇది పూర్తయితే కొన్నేళ్లుగా ఈ మార్గాల్లో ప్రయాణికులు, పలు గ్రామాల ప్రజలు ఎదుర్కొంటున్న కష్టాల నుంచి గట్టెక్కినట్లే.